
సాహిత్య మాసపత్రిక

భారతి

డిసెంబరు
1985

కీ.శే. నిడదవోలు వెంకటరావుగారి
సంస్మరణ సంచిక



సప్తస్వర సుందరశివ - డా॥ ఇంగువ కార్తికేయశర్


నాకు తెలిసిన నిడుదవోలు వారు - డా. ముదిగొండ వీరేశలింగము

అన్వేషణ జ్యోతి అస్తమించింది - శ్రీ తిరుమల రామచంద్ర

మరపురాని జ్ఞాపకాలు - శ్రీ బులుసు వేంకటరమణయ్య

ఆదా చేయండి రు.11లు!

పోస్టుద్వారా భారతి తెప్పించుకోండి!



ఆఫ్‌సెట్ ముద్రణలో భారతి !

భారతి <u>సంవత్సర చందా</u> (పోస్టు ద్వారా రు. 51/–లు) ఒకేసారి చెల్లించే వారికి రు. 11/–ల '<u>ముదరా</u>' వుంటుంది.

అంటే మీరు కేవలం రు. 40/–లు చెల్లిస్తే ప్రతినెలా భారతి పోస్టు ద్వారా మీ ఇంటికే అందుతుంది.

చందా పైకమును ఆంధ్రపత్రిక, గాంధినగరం, విజయవాడ–3కి మనియార్డరు లేదా డిమాండు డ్రాఫ్టు ద్వారా పంపుతూ ఈ దిగువ కూపను జతపర్చ కోరుతాము.

నేను 'భారతి' మాసపత్రికకు చందాదారునిగా చేరదలుచుకున్నాను చందా పైకము రు. 40/– డి.డి. / ఎం. ఒ. ద్వారా పంపుతున్నాను.

పేరు : ____________________

ఊరు : ____________________

చందాదారుని సంతకం

సంపుటము : 62
సంచిక : 12

డిసెంబరు
1985

భారతి

*

సాహిత్య మాసపత్రిక

*

సంస్థాపకుడు : కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

*

సంపాదకుడు: శివలెంక శంభుప్రసాద్

*

(1938-1972)

*

విషయానుక్రమణిక

*

ముఖచిత్రం : మాండొలిన్ శ్రీనివాస్

*

స్వవిషయం

ఈ నెల భారతి సంచిక కీ. శే. నిడుదవోలు వెంకటరావుగారి సంస్మరణ సంచికగా వెలువడుతోంది. వెంకటరావు గారిని గురించి ఇక్కడ ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఈ సంచికలోని కొన్ని రచనలలో కావలసినంత సమాచారం ఉంది. ఆయన మరణించిన పిదప కొందరు సహృదయులు నిడుదవోలు వెంకటరావు గారి, స్మృత్యర్థం ఒక గ్రంథాన్ని వెలువరించాలని అనుకున్నారు.భారతికి మొదటి నుంచీ రాస్తూ వచ్చిన వారిలో వారు ఒకరు. కనుక ఈ ప్రయత్నంలో భారతి పాలుగొనాలన్న సూచన వెలువడింది. వేరే గ్రంథాన్ని వెలువరించే బదులు భారతి సంచికలలో ఒక దానిని ఆయన సంస్మరణ సంచికగా తీసుకువస్తే బాగా ఉంటుందని చివరికి అందరూ అనుకున్నారు. నిడుదవోలు వెంకటరావుగారి సంస్మరణ సంచికకి తమ రచనలు పంపిన వారందరికీ మా కృతజ్ఞత తెలుపుకుంటున్నాము.

భారతికి రాసినవారి సంస్మరణ సంచికలలో ఇది మొదటిదీ, చివరిదీ కాబోదు. త్వరలోనే మరికొందరి సంస్మరణ సంచికలు కూడా వెలువడగలవని ఆశిస్తున్నాము. వీటి ప్రచురణ విషయంలో అందరి సహాయ సహకారాలూ లభించగలవని అనుకుంటున్నాము.

★ ★ ★ ★ ★ ★

కొంతకాలంగా భారతి ముఖచిత్రాలుగా ప్రఖ్యాత సంగీత విద్వాంసుల, నృత్య కళాకారుల బొమ్మలు వేస్తూనే ఉన్నాము. అలాగే ఈ సంచిక ముఖచిత్రంగా ప్రఖ్యాత మాండొలిన్ వాద్య విద్వాంసుడు చి. యు. శ్రీనివాస్ బొమ్మ వేసాము. వయసులో చిన్నవాడే అయినా మాండొలిన్ వాద్య వాదనంలో ఈ బాలవిద్వాంసుడు జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించుకున్నాడు. మాండొలిన్ శ్రీనివాస్‌తో ప్రఖ్యాత నేపథ్య గాయకుడు శ్రీ పి. బి. శ్రీనివాస్ ఇంటర్వ్యూని ఈ సంచికలో వేసాము.



పరిచయాలు

శ్రీ తిరుమల రామచంద్రగారు ప్రస్తుతం హైదరబాదులోనే ఉంటున్నారు. కొందరు మిత్రులతోపాటు "ప్రాకృత - తెలుగు పదకోశా"న్ని తయారు చేస్తున్నారు.

"తెలుగు నాట ప్రాకృత శాసనాలు, ప్రాకృత వాచకం. కుతూహల కవి లీలా ఈ కహా తెలుగు వచనానువాదం, తెలుగు ప్రాకృతాల సంబంధం" ముద్రణకి సిద్ధ పరుస్తున్నారు.

"నేడు యూరోప్‌లోనూ ఆసియాలో అఫ్ఘనిస్తాన్-ఈరాన్-భారత్-పాకిస్తాన్-బంగ్లాదేష్-లంక-టిబెట్-అజర్బైజాన్-భోటాన్ మున్నగు దేశాలలోనూ ప్రజలు మాట్లాడేభాషలకు మూలమైన పలుకు ప్రాకృతం. అది ఇటు బర్మానుంచి అటు పశ్చిమాన బ్రిటన్ వరకు వ్యాపించి ఉండేదని, క్రమంగా వివిధ రూపాలు పొంది భారతదేశంలో సంస్కృతమై వేదాలను తొలిసారిగా పలికిందని నా ప్రగాఢ విశ్వాసం" అని ఆయన అంటారు.

"భగవంతుడు అనుగ్రహిస్తే హరప్పా లిపిని చదవాలనే పేరాస ఉంది. ఇది పేరాశ శ్రేష్ఠమైన ఆశగా పరిణమిస్తే అదృష్టం. "అని కూడా ఆయన అంటారు.

శ్రీరామ చంద్రగారు 1913లో జన్మించారు. ఇంకా "పట్టుమని పదిగంటలు పనిచెయ్య గలిగే శరీరపాటవాన్ని భగవంతుడు ప్రసాదించాడు." అని ఆయన రాశారు. ఆయన స్వాతంత్ర్య యుద్ధంలో పాలుగొన్నారు. స్వతంత్ర సైనిక సమ్మాన్ పెన్షన్ పొందుతున్నారు.

శ్రీ తిరుమల రామచంద్ర

స్వగ్రామం : వరంగల్లు. ఉద్యోగం : తెలుగు శాఖలో ఉపన్యాసకత్వం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీం నగరము.

అనుభవం : 17 సంవత్సరాల ఆంధ్రోపన్యాసకత్వం - అనేక డిగ్రీ కళాశాలల్లో పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని జైమిని భారతం-సంశోధనాత్మక పరిశీలనం - అనే అంశాన్ని గూర్చిన పరిశోధనకు 1978 జనవరిలో ఉస్మానియావారి పి.హెచ్.డి పొందడం ఆ గ్రంథం 1983లో ముద్రించబడింది.

1984లో ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడెమి వారిచే ముద్రించబడిన పిన వీరభద్రుని జైమిని భారత పద్యకావ్యానికి సంపాదకత్వం వహించి, మదరాసు, తంజావూరులోని తాళపత్ర ప్రతులతో సరిచూసి పరిష్కరించడం-శుద్ధప్రతి సిద్ధం చేయడం, జరిగింది.

1966లో యు. జి. సి. - ఉస్మానియా తెలుగు శాఖ ఆచార్య ఖండవల్లి వారి నేతృత్వంలోని ఆంధ్రమహాభారతం ప్రాజెక్టులో కొల్లేటర్‌గా ఉండడం. 1979 ఎ. పి. ఓరియంటల్ కాన్ఫరెన్సులో సభ్యత్వం - విశాఖలో పాల్గొనడం 1980, 1982లలో ఆలిండియా ఓరియంటల్ కాన్ఫరేన్సు సభ్యత్వం-శాంతి నికేతన్, జైపూర్‌లలో పాల్గొనడం, ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యత్వం-

పరిశోధనయే అభివృద్ధికి మార్గం అని భావించడమూ, మరిన్ని వ్యాసాలు, గ్రంథాలు వ్రాయాలని ఉత్సాహము.

డా॥ ముదిగొండ వీరేశలింగము

పేరు : వంతరాం రామకృష్ణారావు. కలము పేరు: "గాండీవి" ఉద్యోగము: ఆంధ్ర భాషోపాధ్యాయుడు, ప్రభుత్వ 'డిగ్రీ' కళాశాల నిడదవోలు (ప. గో. జిల్లా)

ముద్రిత గ్రంథములు

1. బాలవ్యాకరణ ఘంటా పథము 2. ప్రౌఢవ్యాకరణ ఘంటాపథము 3. ముక్తలక్షణకౌముది (బాలవ్యాకరణ పూరణగ్రంథము) 4. వ్యాస మంజరి 5. శేషశైలాధిపశతకము వ్యాసములు : శతాధిక వ్యాసములు వ్యాసవిషయములు : (1) నిఘంటు పరామర్శములు (2) పదకోశ పరిశీలనములు (3) సాధుపాఠ నిర్ణయములు (4) సిద్ధాంత వ్యాస సమీక్షలు (5) వ్యాఖ్యాన సమాలోచనములు (6) ఛందోవ్యాకరణ విశేషాంశములు (7) కావ్యవిమర్శలు (8) చారిత్రక నిర్ణయములు మొ॥ ముద్రణలో నున్న గ్రంథము : పాండురంగమాహాత్మ్య సంజీవనీ వ్యాఖ్య (5 భాగములు) తల పెట్టుచున్న గ్రంథము; త్రిలింగ శబ్దార్ణవ నిఘంటువు.

శ్రీ వంతరాం రామకృష్ణారావు

పుట్టిపెరిగింది గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాలోగల పేటేరులో. 1964 లో రేపల్లెలోని అప్పటి హయ్యర్ సెకండరీ అండ్ మల్టిపర్పస్ హైస్కూలులో సెవెంత్ ఫారం పాసయి తిరుపతిలోని కాలేజి ఆఫ్ వెటరినరి సైన్సులో చేరి 1969 లో బి. వి. యస్సి డిగ్రీ పూర్తి చేశాను. నా చేత కలం పట్టించి వ్రాయించి, నా మొదటి రచనను అచ్చులో చూపించింది. "భారతి" మాసపత్రికే. 1972లో చిత్తూరు జిల్లాలోని కాణిపాకం గ్రామంలో ఉద్యోగరీత్యా ఉన్నప్పుడు అక్కడి శ్రీ వరసిద్ధి వినాయకదేవస్థానం వారి సహకారంతో శ్రీ విఘ్నేశ్వర చరిత్రము అను అముద్రిత ప్రాచీన పద్యకావ్యాన్ని పరిష్కరించి ప్రచురించగలిగాను. దానికి నేను సమకూర్చిన పీఠికకు తగిన ప్రణాళికను ఏర్పరచుకోవటంలో "భారతి"లోని రచనలు ముఖ్యంగా శ్రీ నిడుదవోలు వేంకటరావు గారి వ్యాసాలు నాకు ఆదర్శమైనాయి. 1974లో సినిమాపాటల మీద నేను వ్రాసిన కొన్నివ్యాసాలు ప్రకటించబడ్డాయి. ప్రాచీనాంధ్ర సాహిత్యం, చరిత్ర అంటే అభిమానం. మనుమంచిభట్టు వ్రాసిన "హయలక్షణ విలాసము" అనే అశ్వశాస్త్రాన్ని తిరుపతిలోని ఓరియంటల్ లైబ్రరీలో గల తాళపత్రప్రతులాధారంగా. పరిష్కరించాను ప్రాచీన, ఆధునిక పశువైద్య శాస్త్ర విషయాలను తులనాత్మకంగా పరిశీలించాలని కోరిక. పశువైద్యునిగా ప్రస్తుతం గుంటూరుజిల్లా కొల్లూరులో ఉంటున్నాను.

డా॥ సూర్యదేవర రవికుమార్

పేరు : డా. పి. వి పరబ్రహ్మశాస్త్రి ఎం. ఎ. పిహెచ్‌డి.,
ఊరు : హైదరాబాదు 3-1-5141 ఎ నల్లకుంట హైదరాబాదు 500044
ఉద్యోగం: రిటైర్డు డిప్యూటి డైరెక్టరు (ఎపిగ్రఫి) పురావస్తుశాఖ. ఆంధ్రప్రదేశ్.

చేస్తున్నపని : 1. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసర్చి న్యూఢిల్లీ ఐ. సి హెచ్. ఆర్ వారి సహాయముతో 'సోషియో ఎకనమిక్ గ్రోత్ ఇన్ ఎర్లీ ఆంధ్రను గూర్చి పరిశోధన-పూర్తికానున్నది. 2. ఐ. సి. హెచ్ ఆర్. వారి ప్రోత్సాహముతో 'కాకతీయ శాసనసంపుటి తయారు చేయుచుంటిని,

డా॥ పి. వి. పరబ్రహ్మశాస్త్రి

నేను మహబూబ్‌నగర్ జిల్లావాడిని. అచ్చంపేట తాలూకాలోని జినకుంటలో క్రీ. శ. 1927లో జనించినాను. మాణిక్యాంబ వెంకటాచలంగారలు నా తలిదండ్రులు. రెండేండ్ల వయస్సులోనే నాకు పితృవియోగం కలిగింది. అదే తాలూకాలోని అమరాబాదులో మేనమామగారి యింటిలో పెరిగి అక్కడనే చదువుకున్నాను.

పెదతండ్రి వీరయ్యగారు నాకు జ్యోతిషం నేర్పి కొంత స్మార్తం చెప్పినారు. మేనమామ చేపూరు పెద్ద లక్ష్మయ్యగారి దగ్గర సాహిత్యం చదువుకొని కవిత్వం నేర్చుకున్నాను. నా ఎఱుకలో నేను పన్నెండు పదమూడు ఏండ్లనుండే పద్యాలల్లుతున్నాను.

క్రీ. శ. 1954లో నాకు నాగర్ కర్నూలులోని జాతీయోన్నత పాఠశాలలో పండితపదవి దొరికింది. అక్కడినుండి 1972లో పాలెంలోని ఓరియంటల్ కాలేజీకి వెళ్ళి చరిత్రాధ్యాపకునిగా 1988లో విశ్రాంతినందినాను.

కవిత్వం చిత్రలేఖనం నా అభిమాన కళలు. కావ్యపరిశీలన-చరిత్ర పరిశోధన కార్యరంగాలు. స్వీయ రచనలకంటె నేను సంపాదించి ప్రకటించే వానికే ఎక్కువ ప్రాముఖ్యమిస్తాను. చరిత్రలో స్థానిక విషయాలపై మక్కువ ఎక్కువ. ప్రతి గ్రామంలో అక్కడి గుడికో, కోటకో లేదా ఊరికో ఒక కథ ఉంటుంది. ఒక్కొకపుడు వానిలో చక్కని కావ్యవస్తువులు కథలకు ప్లాట్లుగూడ లభిస్తవి. అట్టివి సేకరించవలెనని నా అభిప్రాయం. వానిలో స్థానిక చరిత్రలు పరిపుష్టమవుతవి. ఈ దృష్టిలో నేను మా జిల్లాలో చాలా గ్రామాలు చూచి వాని చరిత్రలు సేకరించినాను. అవి కొన్ని మాత్రమే పత్రికలలో వచ్చినవి.

ఇంతవరకు నేను చూతపురీవిలాసం, శ్రీమద్భాగవత మహాత్మ్యం, రామోదాహరణం, పరమహంస శతకం, సాలగ్రామ శాస్త్రం సంపాదించి ప్రకటించినాను.

పాండురంగ-తిరుమలేశ-అర్యా-దుర్గా భర్గ శతకాలు, చక్రతీర్థమహాత్మ్యం శ్రీ మత్ప్రతాప గిరిఖండం అనే కావ్యాలు, మహాక్షేత్రం మామిళ్ళపల్లి ఉప్పునూతలకథ అనే చరిత్రలు రచించినాను, ఇవన్ని ముద్రితాలు. కంకణగ్రహణం కుటుంబగీత, పాలమూరు జిల్లాలోని కవిపండిత వంశాలు అముద్రితాలు.

నేను పాలెంవెళ్ళిన పిమ్మట అక్కడనాకు శ్రీరంగా చార్యగారితో పరిచయం ఏర్పడింది. ప్రస్తుతం యిద్దరిలో ఎవరం ఏకావ్యం పరిష్కరిస్తున్నా పరస్పరం చేదోడువాదోడుగా ఉంటాము.

శ్రీ కపిలవాయి లింగమూర్తి

పేరు : తీర్థం శ్రీధరమూర్తి. అభిజనము : ఆంధ్రప్రదేశ్, చిత్తూరు జిల్లా, పలమనేరు తాలూకా, తీర్థం గ్రామము. పుట్టినతేది: 12-9-1927. విద్యాభ్యాసము తిరుపతి, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య విద్యాలయములో సంస్కృతాంధ్రములు విద్యార్హతలు : మద్రాసు విశ్వవిద్యాలయము నుండి 1950 సం॥లో తెలుగు విద్వాన్ పట్టపరీక్షలో సర్వ ప్రథమము. బంగారు పతకము పారితోషికము. తిరుపతి కవితాసమితి వారిచే "సరసకవి" బిరుదప్రదానము ఉద్యోగము : మదరాసు, ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయములో 30సం॥గా తెలుగు పండితపదవి. గత సెప్టెంబరు మాసమున పదవీ విరమణము. అభిరుచులు : అముద్రిత గ్రంథ పరిష్కరణము, సాహిత్యోపన్యాసములు వ్యాసములు తులనాత్మకముగా సంస్కృత కర్ణాటాంధ్ర సాహిత్య పరిశీలనము. అప్తులు : 1. కవి శేఖరమల్లంపల్లి శరభయ్యగారు2. విమర్శ వినోదులు, డా. డి. చిన్నికృష్ణయ్యగారు. అభిలాష : సత్కవితా నిషేవణము

శ్రీ తీర్థం శ్రీధరమూర్తి

సాహిత్య కళాసాగర్ డాక్టర్ వక్కలంక లక్ష్మీపతిరావు అమలాపురంలో శ్రీకోనసీమా భానోజీరామర్సు కళాశాలలో దేశభాషాశాఖాధిపతిగా ఉన్నారు. వీరి కలము నుండి పారిజాత సౌరభం, వీరభారతము వగైరా కావ్యాలూ, ఆదర్శ శిఖరాలు, పారిజాతము మొదలైన నవలలూ, సుమాంజలి, కవితాలోకము. జలద గీతి, కవితావసంతము. రాధికా ప్రణయము, స్వతంత్రభారతి మొదలైన గేయ కావ్యాలూ, వెన్నెల కన్నెలు స్వాతంత్ర్యలక్ష్మి పూలతోరణం, వెన్నెల పండుగ మొదలైన రేడియో నాటికలూ, నర్తనశాల, అనార్కలి మొదలైన సంగీతరూపకాలూ, అసంఖ్యాక లలిత గీతాలూ వెలువడ్డాయి. "ఆంధ్ర పుణ్యక్షేత్రాలు" అనే వీరి రచన గ్రామ ఫోను రికార్డుగా వెలువడింది. కాంతిజలపాతం, అక్షరదీపాలు వెలుగులోనికి రానున్న వీరి కొత్తరచనలు. "పారిజాతాపహరణ సౌందర్యసమీక్ష" అనే పరిశోధన గ్రంథానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం వీరికి డాక్టరేటు పట్ట ప్రదానం చేసింది. విశ్వనాథ, దాశరథి వంటి వారి ప్రశంసలందిన కవి లక్ష్మీపతి రావు సాహిత్యపరంగా ఎన్నో కేంద్ర ప్రభుత్వబహుమానాలందిన ఈ కవిని విశాఖనగర సాహితీ మహాసంస్థలు ఇటీవల "సాహిత్య కళాసాగర" బిరుదముతో సత్కరించాయి.

డాక్టర్ వక్కలంక లక్ష్మీపతిరావు

శ్రీ చీమకుర్తి శేషగిరిరావుగారు 14-6-1913న జన్మించారు. స్వస్థలం : ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి-గత 29 ఏండ్లుగా హైదరాబాదున నివాసం-స్వాతంత్ర్యోద్యమమున పాల్గొని, తర్వాత కాంగ్రెసును 1948లో వదలి సోషలిస్టుపార్టీలో పనిచేసి, కడకు రాజకీయాలకు స్వస్తిచెప్పి 1954 నుండి సాహిత్యకృషిని మొదలిడితిని-తెలుగుభాషా సమితిలో తొలుత (1955) విజ్ఞాన సర్వస్వ సహాయసంగ్రాహకుడుగ చేరి, ప్రధాన సంగ్రాహకుడను (1969) అయితిని-ఆ పదవిలోనే 1973 వరకు ఉండి, వయోధిక్యమువలన ఉద్యోగ విరమణ చేసియు, గౌరవభృతిపై ఆ పదవిలోనే పనిచేయుచున్నాను; ఇప్పటికి ఆ విజ్ఞాన సర్వస్వమున 14 సంపుటములు ప్రచురితములు.

1. దాదాపుగ నా కృషియంతయు విజ్ఞాన సర్వస్వ పరిధిలోనే సాగినది. అందు నేను రచించిన అనేక వ్యాసములలో పరిమాణమురీత్యా ప్రత్యేక గ్రంథములుగ పేర్కొన దగినవి రెండు : 1. ప్రపంచ చరిత్ర (విజ్ఞాన సర్వస్వ ప్రథమ సంపుటమున రమారమి 200 పుటలు); 2. లలిత కళా వికసన చరిత్ర (విజ్ఞాన సర్వస్వపు 14వ సంపుటమున రమారమి 250 పుటలు) -ఇక వివిధ విషయములపై పరిమిత విస్తృతిలో వ్రాసిన రచనలు 200కు పైబడియున్నవి.

2 అదిగాక, ఆంధ్ర సారస్వత పరిషత్తు (హైదరాబాదు) వారి అభ్యర్థనపై ప్రపంచరాజ్యసర్వస్వము అను బృహద్ గ్రంథమును వ్రాసి ఇచ్చితిని. (దాదాపు 1200 అచ్చుపుటలు); అది ప్రచురితము.

3. లలితకళా అకాడెమీ (హైదరాబాదు) వారి అభ్యర్థనపై 'శిల్ప' చిత్రకళా పదకోశమునకు సహసంపాదకత్వము వహించి ఆ పనిని పూర్తిచేసితిని. ఆ అకాడెమీ తెలుగు విజ్ఞాన పీఠమున సంలీనమగుట వలన, ఆ విజ్ఞాన పీఠమువారే దానిని ముద్రింపజేయుచున్నారు. ఆ గ్రంథపువిస్తృతి దాదాపు 700 పుటలు అచ్చున ఉండగలదు.

4. ఇక రచించదలచి కృషిని సాగించుచున్నవి.

1. భారత సంస్కృతి చరిత్ర

2. తెలుగు భాషా పరిణామము, తొలిదశలో ప్రాకృతభాషల ప్రముఖపాత్ర

శ్రీ చీమకుర్తి శేషగిరిరావు

జననము 1937. స్వగ్రామము నెల్లూరు జిల్లా. తాలూకాలోని పల్లిపాడు గ్రామము. ప్రస్తుతము పుద్యోగరీత్యా నాగపూరులో వాసము. భారత ప్రభుత్వ పురావస్తు సర్వేక్షణలోని ఉత్ఖనన శాఖాధ్యక్షులుగా నాగపూరున పరిశ్రమ. డా. నేలటూరు వేంకటరమణయ్య, డా. రావిప్రోలు సుబ్రహ్మణ్యంగార్లు గురువులు. వారి యాశీర్వాద బలము, మరియు పూనా – నాగపూరు విశ్వవిద్యాలయ ఆచార్యులు ప్రొఫెసర్స్ సంకాలియా, ఫాలచంద్రదేవ్ గార్ల కృపా ఆశీస్సులు. ఉన్నత విద్య – ఆంధ్ర , నాగపూరు, పూనా విశ్వవిద్యాలయములందు జరిగినది. స్కూల్ ఆఫ్ ఆర్కియాలజీ, నూఢిల్లీ యందు పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా, పురావస్తు పరిశోధనలు – ప్రాచీన చరిత్ర, సంస్కృతి, నాణెములు, లిపి పుట్టుపూర్వోత్తరాదులు. మున్నగు అంశములపై యేబదికి పైగా అంగ్ల వ్యాసములు దేశవిదేశ గ్రంథములలో ప్రచురితములు. వీరు రచించిన ప్రామాణిక గ్రంథములు – ది కాయినేజి ఆఫ్ ది సాతవాహనా ఎంపయిర్ (1980) ది డెవలప్‌మెంట్ ఆఫ్ ఎర్లీ శైవ ఆర్ట్ ఎండ్ ఆర్కిటెక్చర్ (1982) మరియు భారత ప్రభుత్వ పంపున సాంస్కృతిక ప్రతినిధిగా చైనా దర్శించిన తరువాయి రచించిన ప్రామాణికగ్రంథము బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ అఫ్ చీనా ఎండ్ సౌత్ ఈస్ట్ ఇండియా (1985) ఆగస్టు నెలలో విడుదలయినది. వీరు నాగార్జున కొండ, అమరావతి, గుంటుపల్లి, గుడిమల్లము యను ఖ్యాతిగన్న ప్రదేశముల పురావస్తు పరిశోధనల జరిపి ప్రకటించి యున్నారు. వీరి గ్రంథములు (1) శివా టెంపుల్ ఎట్ గుడిమల్లం ఎప్రోచ్ ఇంటు ఇట్స్ ఒరిజనల్ (2) ఆంటిక్యొరిషన్ రిమెయిన్స్ ఇన్ ది సబ్‌మెర్సిబుల్ ఏరియా ఆఫ్ శ్రీశైలమ్ (3)ఆర్కిటెక్చరల్ సర్వే ఆఫ్ ది టెంపిల్స్ ఆఫ్ ది గంగాస్ ఆఫ్ కర్నాటక, భారత పురావస్తు శాఖ ప్రచురణలో నున్నవి. వీరి గ్రంథములు తెలుగున ఆచార్య నాగార్జున (1977), మరియు 20 – పైగా తెలుగున వ్యాసములు భారతిలో నే ప్రచురితములు. త్వరలో శ్రీశైల ఆనకట్ట క్రింద మునిగిన ప్రాచీన దేవాలయములపై ప్రామాణిక గ్రంథమును – ప్రజలకు సులువుగా తెలిపేందుకు ఒక్కొక్క దేవాలయముపై సచిత్రిత వ్యాసములు తెలుగున సంకల్పించి యున్నారు. ఎం.ఎ., పి.హెచ్.డి., డిప్ ఆర్క్.

డా. ఇంగువ కార్తికేయశర్మ

శ్రీ పి. బి. శ్రీనివాస్

మాస్టర్ మేండొలిన్ మాష్టర్

పరమాత్ముడి సృష్టిలో యుగ యుగాలుగా ఎన్నెన్నో విచిత్రాలూ, అద్భుతాలూ సంభవించి, జనులందర్నీ విస్మయ చకితులుగా చేయడం వింటున్నాం! విన్నవి కొన్ని నమ్మకపోయినా కన్నవన్నీ నమ్మవలసి వస్తుంది.

ఇటీవల ఒక బాలుడి కీర్తిని వినిన పిదప మూర్తిని కని సంగీతాన్ని విని విస్తుపోయాను. పారవశ్యం పొందాను. నా ఆశ్చర్యానికీ, పారవశ్యానికీ కారణం నేటి వినూత్న వీక్షణ బాల మహామేధావి "మాండొలిన్ మాష్టర్" మాష్టర్ యు. శ్రీనివాస్. ఇలాంటి బాల మహామేధావుల అనూహ్య కళాసంపత్తిని కనులార కని, వీనుల విందుగా విని మహానందానుభూతిని పొందిన కళాప్రియులు ఎవరైనా "పునర్జన్మ"ని నమ్మి తీరుతారు. పూర్వజన్మలో అఖండసాధనచేసి, కళాకల్పవృక్ష శాఖాధికారియై పండిన ప్రతిభాశాలిగా అవతారం దాలించిన మహానుభావులు, మఱుజన్మలో బాల మహామేధావులుగా, రూపొంది, బాల్యంలోనే అనే కాద్భుత విజయాలు సాధిస్తారనే విషయాన్ని మఱొకసారి నిరూపిస్తున్న కళా ధీమంత శ్రీమంతుడు ఈ చిరంజీవి యు. శ్రీనివాస్. నేటి మేటి సంగీత మహా పండితులెందరి సమక్షాననో తన విశిష్ట వాద్య వాదన ప్రతిభా ప్రభావాలచేత మెప్పులూ, ఆశీర్వాదాలూ పొందుతూ దిన దినాభివృద్ధి గడిస్తూ అంతర్జాతీయ ఖ్యాతిని అతి చిన్న ప్రాయంలోనే ఆర్జిస్తున్న చి॥ శ్రీనివాస్ కారణ జన్ముడనక తప్పదు. ఫిలిం సంగీతంపైన పెరిగిన మోజు వలన, శాస్త్రీయసంగీతంపట్ల తరుగుతున్న అభిలాషని తిరిగి పలురెట్లు పెంచుటకై పుట్టిన దిట్ట అనడం ఎంతమాత్రం అతిశయోక్తి అనిపించుకోదు.

వీణా గాయత్రి ఎంతో ప్రశంసించి, మాష్టర్ శ్రీనివాస్ కచ్చేరీ తప్పక వినమని చెప్పినప్పుడు, ఒక అరగంటసేపు విని వెడదామనుకుని శంకరదాస్ ఆడిటోరియంలో ఇండియన్ ఫైన్ ఆర్ట్సువారి ఆధ్వర్యంలో జరుగుతున్న అతని కచ్చేరీకి హాజరైన నేను అతను వాయించిన ఖరహర ప్రియ వినేసరికి, మతిపోయి ఆ కచేరీ ముగిసేదాక సీటుకి అంటిపెట్టుకుని కూర్చుండిపోయాను. నా కన్నుల్నీ చెవుల్నీ నమ్మలేని పరిస్థితిలో పడ్డాను. మధ్యలో ప్రసిద్ధ వీణా విద్వాంసుడు యస్. బాలచందర్ ఆవేశపూరితులై "ఇవనా వాసిక్కిరాన్? అవనల్లహా వాసిక్కిరాన్; అని ఆకాశంవైపు చెయ్యెత్తి చూపించారు. "ఇతనా వాయిస్తున్నవాడు? ఆ భగవంతుడు ఇతని రూపంలో వాయిస్తున్నాడు అని ఆయనన్న మాటలకి అర్థం శ్రోతలందరూ ఆ ప్రశంస విని మిన్నుముట్టేలా చప్పట్లు కొట్టారు.

నేటి యువగాయక శిరోమణి అని పేరొందిన శేష గోపాలన్ ఆనంద భరితులై, శ్రీనివాస్‌కి తన చేతినున్న ఉంగరాన్ని తీసియిచ్చి బహూకరించారు. ఇలాంటి మెచ్చుకోలు సన్నివేశాలు ఎన్నెన్నో శ్రీనివాస్ సంగీత కచేరీలలో జరుగుతుండడం ఈనాడు పరిపాటి. ఈ బాల విద్వాంసుడికి మున్ముందు ఎన్నెన్ని ఎలాంటి సన్మానాలూ, బిరుదులూ, ఎవార్డులూ, రివార్డులూ, వచ్చినా ఆశ్చర్యపడవలసిన అవసరం ఏమీలేదు. ఇతడిది అనన్య సామాన్య ప్రతిభ. అది దైవదత్తమైన అతి విశిష్టవరం. ఈస్థెటిక్ సెన్సూ, రిలీఫ్ నోట్స్ పరిజ్ఞానమూ, అనంత కల్పనాశక్తీ, అఖండ ప్రచండ పాండిత్యమూ, నిత్య నూతన ప్రక్రియామోఘ ప్రయోగ ప్రాభవమూ ఇతనిలో మూర్తీభవించాయని గుర్తించిన నేను, తీరిక చిక్కినప్పుడల్లా, ఇతని కచ్చేరీ ఎంత దూరాన జరుగుతున్నా తప్పక విని వస్తాను ఎందుచేతనంటే ప్రతి కచేరీలోనూ, క్రొత్త ప్రత్యేకతలు కొన్నైనా లభిస్తాయి అనే నమ్మకం నాకు కలగజేసిన త్రివిక్రముడు ఈ యు. శ్రీనివాస్. "యు" అనే దానికి యూనివర్సల్ అని అర్థం చెప్పుకుంటే 'యూనివర్సు' అనగా "విశ్వం" అంతటా వ్యాపించగల ప్రతిభాప్రభ ఇతనిదని మనకి అనిపించక తప్పదు. కచ్చేరీలు చెయ్యడం ప్రారంభించిన కొన్ని సంవత్సరాలలోనే, "మేండొలిన్ సామ్రాట్టుగా ప్రశంసింపబడి, విదేశాలలోకూడా కీర్తిని వ్యాపింపజేసుకోగల ప్రతిభాకీర్తి భాగ్యాలుగల శ్రీనివాస్ ఎంతైనా అదృష్టవంతుడూ, అభినందనీయుడూ.



వేదిక (స్టేజి) పైకి ఎక్కేముందూ, కచేరీ ముగించి దిగిన వెనకా, అందరితోనూ అతి సామాన్య బాలుడుగా మసలుకునే శ్రీనివాస్ స్టేజీమీద వాయిస్తున్నంతసేపూ అసామాన్య సంగీతకళా మహామనీషిగా వెలుగొందే వైనాన్ని తిలకిస్తే భగవల్లీల ఎంతటి విచిత్రమైనదో అనిపిస్తుంది. వాద్యం పైపైనా చూడకుండా తన్మయత్వం పొంది, అవలీలగా మేండొలిన్ వాద్య తంత్రుల్ని వివిధగతులలో విభిన్న రీతులలో మీటి రాగతాళ లయ భావ సంభరిత సంగీతపు సంగతులని పలికించే శ్రీనివాసుడి దివ్యాంగుళుల మనో మోహన నృత్యాన్ని ఎంత ప్రశంసించినా చాలదు. బాలచందర్ నుడివినట్లు, ఈ శ్రీనివాసుడిలో ఆ తిరుమల తిరుపతి శ్రీనివాసుడే నిండి అపూర్వ దివ్య సంగీతాన్ని వినిపిస్తున్నాడా అని విస్మయానంద

పారవశ్యానుభూతి ఎవరికైనా కలుగుతుంది. ఎల్లరి హృదయమందిరాలలోనూ శ్రీనివాస్‌పట్ల ప్రీతికాంతి వెలుగుతుంది. ఇదంతా ఈబాలుడు సంతరించుకొనిన పూర్వ సమగ్ర పుణ్యఫలం అనడం సమంజసం.

మద్రాసులోనేకాక, ఎక్కడ ఎప్పుడు శ్రీనివాస్ మేండోలిన్ కచ్చేరీ ఏర్పాటైనా జనంతో కిటకిటలాడుతున్నాయి ఆడిటోరియాలు. రోజు రోజుకీ ఇతనివలన గూడా కర్ణాటక శాస్త్రీయ సంగీతంపట్ల మక్కువ ఎక్కువౌతున్నది జనానికి అనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం. శాస్త్రీయ సంగీతాన్ని వినిపించదగిన విధాన వినిపిస్తే సంగీతాభిమానుల్ని ఎలా ఆకర్షించి ఆకట్టుకోవచ్చునో తన వాద్య వాదన వైదుష్యంతో నిరూపించి చూపిస్తున్న ఈ చిరంజీవి మేధావులకే మేధావి.

ఇటీవల శ్రీనివాసులం ఇద్దరం కలుసుకున్నప్పుడు కొన్ని విషయాలు ముచ్చటించాం. మాతోకూడ అతని తండ్రి శ్రీ సత్యనారాయణగారూ, అతని గురువు శ్రీ ఆర్. సుబ్బరాజుగారూ మొదటినుంచీ వీరి కుటుంబమిత్రుడూ, హితైషీ మంచి సలహాదారుడూ అయిన శ్రీ సి. ఎస్. రావుగారూ సమావేశమయ్యారు. మేం కలిసినచోటు రమణీయ ప్రకృతి దృశ్యాలతో నిండిన చిన్నపార్కు.

నేను : శ్రీనివాస్! మీ నాన్నగారివద్ద వారి ఆర్కెస్ట్రాకి సంబంధించిన ఎన్నో వాద్యాలు కళ్ళ కెదురుగా అమరివుండగా, నీకు ఈ మేండోలిన్‌పట్ల ప్రత్యేక ఆసక్తి ఎలా కలిగింది?

శ్రీనివాస్ అన్నీ అలా అలా మీటుతూవుండేవాణ్ణి. కాని ఈ వాద్యనాదం నన్నెంతో ఆకర్షించింది. మొదట్లో చిన్న సినిమా పాటలూ ఇతర గీతాలు కొద్ది కొద్దిగా వాయించేవాడిని. క్రమేణా గురువుగారే నా దృష్టిని కర్నాటక శాస్త్రీయ సంగీతంవైపు మరలించారు. స్వతహాగా కర్నాటక శాస్త్రీయ సంగీతం నాకు ఎంతైనా నచ్చేది కనక, ఆ బాణీని సంపూర్ణంగా అలవరచుకున్నాను.

నేను : మరి నీకు వాద్య నిపుణుల్లో స్ఫూర్తిని కలిగించినవారు ఎవరు?

నేను : నాదస్వర మహావిద్వాంసులైన టి. ఎన్. రాజరత్నంపిళ్ళైగారి వాద్య వాదనం నాలో ఏదో నవచైతన్యాన్ని మేల్కొలుపుతూ వుండేది. మైమరచి వినేవాడిని ఆయన బాణీలో సంగీతం అలవరచుకున్న కొత్తనులుపులని.

నేను : మొదట్లో కొన్ని సినిమాలకి కూడా నువ్వు వా యి ం చా వ ని విన్నాను.

శీను : అవును. మద్రాసు వచ్చిన కొత్తలో శ్రీ ఎస్. రాజేశ్వరావుగారి వాద్య బృందంతో పాటు సన్నిహితమైత్రి అబ్బింది. ఆయన కుమారుడు వాసు నాకు మంచి స్నేహితులయ్యారు. అతనితో పాటు ఒకసారి మలేషియా సింగపూర్ ట్రిప్పు వెళ్లి మధ్యమధ్య కర్ణాటక శాస్త్రీయ సంగీతం వినిపించాను. శ్రీ రాజేశ్వరావుగారి సంగీతంలో కూడా నాకొన్ని అవకాశాలు లభించాయి.

నేను : ఈ మేండొలిన్ విదేశీవాద్యంగదా! మన కర్ణాటక గమకాలని పలికించేందు కేమైనా మార్పులు చేసేవా !

శీను : అసలు ఎనిమిది తీగలు వుంటాయి ఈ వాద్యానికి. గమకాలకి అనువుగా మూడు తీగలు తగ్గించి ప్రయోగించి చూడగా మంచి ఫలితం లభించింది.

నేను : రాగమాలిక వాయించే సందర్భాన రాగాలు ఎన్నుకోవడంలో ఏమైనా ప్రత్యేకమైన విధానాన్ని అవలంబిస్తావా ! లేక తోచినరీతిగా రాగాలని మార్చుకుంటూ వాయిస్తావా సంగీతకచ్చేరీలలో !

శీను : సాధారణంగా మనోభావానికి అనువుగా, ఏ రాగంతరవాత ఏ రాగం వాయిస్తే వెరైటీ లభిస్తుందో ఏఏరాగాల మధ్య పొంతనం కుదురుతుందో ఆయాక్షణాల్లోనే తట్టుతూవుంటుంది. ఒక్కొక్కప్పుడు ఒక ప్లాను ప్రకారం రాగాల ఎంపిక చేసుకోవడంకద్దు.

నేను : ఏది ఏమైనా, నీ ప్రతీ సంగీతకచ్చేరీలోనూ తప్పకుండా రాగమాలిక మాత్రం వాయిస్తూ వుండాలని నా అభిమతం. ఆ రాగాల ఎంపిక వలననూ, నీ కల్పనా శక్తి విస్తీర్ణం వలననూ, సంగీతజ్ఞులు నీ అభిరుచి స్థాయిని ఇట్టే అవగాహన చేసుకోగలుగుతారు. అదీగాక రాగమాలికలో మంచి వెరైటీకి ఎంతైనా స్కోప్ లభిస్తుంది.

శీను : ఔను నాకూ అలాగనే అనిపిస్తుంది.

నేను : నీకు ఏవైపు సినిమాలు నచ్చుతాయి. సాధారణంగా.

శీను : స్టంటు చిత్రాలంటే నాకు చాలా యిష్టం. ఏదో థ్రిల్లు కలుగుతుంది చూస్తూంటే. జానపదాలు, పౌరాణికాలూ కూడా యిష్టమే. సాంఘికాల్లో మరీ మంచివి నచ్చుతాయి.

నేను : నీ ప్రోగ్రామ్సులో కర్ణాటక సంగీతంతో హిందూస్తానీ బాణీని కూడా మేళవించడం నీకు సమ్మతమేనా !

శీను : రాగధర్మాన్ని అనుసరించి రంజకంగా సమకూరినప్పుడల్లా ఈ రెండు బాణీలసమ్మేళనానికి నేను ఇష్టపడతాను. సంగీతానికి పరిధులు లేవనేది నా నమ్మకం.

నేను : నీ విదేశపర్యటనలలో, నీ కచ్చేరీలకి వచ్చే ఇండియన్లతో బాటు ఫారినర్సు కూడా వచ్చేవారా !

శీను : చాలామంది ఫారినర్సు నా కచ్చేరీలకి హాజరై ఎంతగానో అభినందించారు. వాళ్లకి మన సంగీతం పట్ల ఆసక్తి అనుదినము పెరుగుతుంది అని నిరూపిస్తున్నారు.

నేను : అక్కడ జరిగిన సంఘటనలలో నీకు మరపురానిదేది.

శీను : (వెస్ట్ జర్మనీలో నేను మైకులేకుండా వాయించిన కచ్చేరీని సాంతం శాంతంగా నిశ్శబ్దంగా అనేక వేల మంది ఆడియన్సువిని, తమరసజ్ఞత ఎంత గొప్పదో తెలియబరచి ప్రశంసావర్షం కురిపించిన సన్నివేశం నాకు సదా జ్ఞాపకంలో వుండిపోయే సంభవం.

నేను : నీకు ఇంత చిన్నవయస్సులోనే ఎంతో కీర్తిప్రతిష్ఠల్నీ ఐశ్వర్యాన్ని గడించి ఇస్తున్న ఈ ప్రత్యేక వాద్యానికి మరింత ప్రాబల్యం చేకూర్చేందుకు ఏమైనా ఆశయం వుందా !

శీను : కాలక్రమేణ, ఈ వాద్యం పట్ల ఆసక్తి గల సంగీత విద్యార్థులకి సహాయకరంగా ఒక కళాశాలవంటిది నిర్మించి, ఈ వాద్యానికి శాశ్వతమైన ప్రాముఖ్యత కలిగించడం నా ధ్యేయం, దానికోసం సర్వదాకృషి చేస్తాను.

నేను : ఆకృషిని నేను మరీమరీ అభినందిస్తాను, నీ కృతజ్ఞతాభావానికి నీవు చేసే ఆ అమోఘకృషి నిలువుటద్దం. భగవంతుడు నీ కృషికీ, అద్వితీయ ప్రతిభకీ ఇతోధికదిగ్విజయాలు సమకూర్చాలని నేను సదా ప్రార్థిస్తాను,

ఇదీ ఆనాటి మాసంభాషణ సారాంశం.

ఈ బాల మహామేధావి ఆంధ్రుడవడం తెలుగు వారందరికీ గర్వకారణం, తూర్పుగోదావరిజిల్లాకి చెందిన వెల్దుర్తి అనే గ్రామంలో జన్మించి పశ్చిమగోదావరి జిల్లాకి చెందిన పాలకొల్లులో పెరిగి ఈనాడు చెన్నపురి (మద్రాసు)లో సెటిలై ఖండఖండాంతరాలలో తన ప్రతిభాసంపన్నతని చాటి విజయఢంకా మోగిస్తున్న ఈ పధ్నాలుగేళ్ల చిన్నవాడు నిజానికి ఎందరెందరో పెద్దవాళ్ల కన్న పెద్దవాడనదగినవాడు. సంగీత విద్యలో, అతిక్లిష్టమైన రాగాలనీ సంగతులనీ అతి సుళువుగా పలికించి నిర్దుష్టమైన కార్యక్రమాన్ని గంటలతరబడిగా సాగించగల సంగీత పండితుడు అపూర్వ ప్రజ్ఞామండితుడు.

ఈ బాలుడి తల్లి పేరు కాంతమ్మగారు, ఆ తల్లి పేరులోగల అయస్కాంతపు ఆకర్షణశక్తిని పుణికి పుచ్చుకుని ఈనాడు పండిపోయిన సంగీత మహామేధావులని సైతం మెప్పిస్తున్న సహజ ధీమంతుడు చి॥ యు. శ్రీనివాస్. తండ్రి సత్యనారాయణ మంచి క్లారినెట్ విద్వాంసులు. శ్రీనివాస్ గురు పుంగవులైన ఆర్. సుబ్బరాజు గారు స్వతహాగొప్పగాయకులు. ప్రఖ్యాత విద్వన్మణి చెంబై వైద్యనాథ భాగవతారు గారి శిష్యులు. ఈ చిన్నవాడిగొప్పవిద్యని గుర్తించి పాలకొల్లు నించి, మద్రాసుకి ఇతని కుటుంబాన్నంతటినీ తరలించి, సకలసదుపాయాలు సమకూర్చి విద్య

నేర్పుతూ, ఇతడి ఉజ్జ్వల భవిష్యత్తుకి గట్టి పునాదిని వేసిన ఘనత వారిదే స్టేజిపైన శ్రీనివాస్ ప్రక్కన ఒక వైపు తండ్రి మరో వైపు గురువు ఆసీనులై ఈ చిరంజీవి కనబరిచే ప్రతీ వైశిష్ట్యాన్నీ కనివిని, మనసారా ఆనందిస్తూ దీవించేదృశ్యం శ్రోతృగణాల కన్నులకి చక్కని విందు. శ్రీనివాస్ మేండొలిన్‌వాయిస్తూ మధ్య మధ్య తండ్రివైపూ గురువు వైపూ తిరిగి చూస్తూ స్ఫూర్తిని పెంపొందించుకొనే విధానం ప్రత్యేకంగా ప్రశంసనీయం.

'వాద్యంకేసి చూడకుండా, తాళం రవ్వంతైనా తప్పకుండా, మంచి సంతులనం (బేలెన్సు)తో ప్రతీ అంశాన్నీ విశదంగా విలక్షణంగా వినూతనంగా ప్రదర్శించగలిగే ఈ బాలుడి ప్రతిభని మహామహోపాధ్యాయ పద్మశ్రీ డా॥ ఈమని శంకరశాస్త్రి అంతటి మహామనిషి మెచ్చుకొని, నా వద్ద పదిమార్లు ప్రశంసించారంటే ఈ శ్రీనివాస్ ఎంతటి ప్రతిభావంతుడో ఎంతటి అదృష్టశాలి యో విదితమౌతుంది. శ్రీనివాస్‌కచేరీని నేను మొదటిసారిగా విన్నదాదిగా, ఇతడి ప్రోగ్రాం అతి త్వరలో టి. వి. లో టెలీకాస్ట్ అయితే సత్ఫలితంతప్పక లభిస్తుందని నా మనస్సులో ఆలోచనరేకెత్తింది. శ్రీనివాసశాస్త్రి హాల్లో శ్రీనివాస్ కచ్చేరీ వాయిస్తున్న సమయాన నా మిత్రుడూ, ప్రఖ్యాత చలనచిత్ర నిర్మాత, దర్శకుడు, సంగీత దర్శకుడు మాత్రమేకాక మంచివైణికుడు అయిన ఎం. ఎస్. శ్రీరాంని, భోజనంచేసి నిద్రకి ఉపక్రమించే సమయాన పట్టుపట్టి పిలిచి లాక్కొని తీసుకు వెళ్లాను! శ్రీరాం శ్రీనివాస్ ప్రతిభని ఆశ్చర్యానందాలతో ఎంతైనా మెచ్చుకుని, టి. వి లో ఇతని ప్రోగ్రాం జరిపించేవరకూ విశ్రమించలేదు. పాతుకునివున్న కొన్ని పద్ధతుల్ని కూడా అతిక్రమించి, శ్రీరాం ఆ ప్రోగ్రాంని జరిపించినప్పుడు నేను శ్రీ ఈమని శంకరశాస్త్రిగారిని కూడా ఆహ్వానించాను. ఆయన సహృదయతతో వెంటనే వచ్చి ఆడియన్సులో ప్రముఖస్థానం వహించి, ఆనందించి, అభినందించారు. ఆ ప్రోగ్రాం విని, ఆశ్చర్యచకితులయిన తమిళనాడు ముఖ్యమంత్రి తిరు. ఎమ్. జి. రామచంద్రన్ తాను గొప్ప కళాకారులూ, కళా రసజ్ఞులూ కావడంవల్ల అత్యంత ప్రభావితులై ఆ టేపు తెప్పించుకుని మళ్ళీ మళ్ళీ విని, తదుపరి జరిగిన విశిష్టసభలు కొన్నిటిలో శ్రీనివాస్ కచేరి ఏర్పాటు చేయవలసిందిగా సలహాయిచ్చారంటే శ్రీనివాస్ ప్రతిభకి సుయోగానికి వేరే నిదర్శనం ఏంకావాలి?

శ్రీ ఎం. జి. ఆర్‌కి ఈబాల మేధావిపై కలిగిన మేటి సదభిప్రాయం, అతి త్వరలో తమిళరాష్ట్ర సంగీత విద్వాంసుడుగా ఇతడికి లభించిన గౌరవానికి దారితీసింది. ఈ బాలుడు ఇలాటి గౌరవాలకీ, సన్మానాలకీ, అవార్డులకీ, బిరుదాలకీ, గౌరవ డాక్టరేటుకీ ఎంతైనా అర్హుడని అనడం ఎంతయినా సమంజసం. చిత్రరంగంలోనూ, రాజకీయరంగంలోనూ తనకి తను మాత్రమే సాటి అని నిరూపిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి తిరు ఎం. జి. ఆర్. తనకి అందిస్తున్న ప్రోత్సాహానికెంతైనా ఋణపడి ఉన్నాను అంటాడీ శ్రీనివాస్. తనకి లభిస్తున్న ఘన విజయ ప్రోత్సాహాల వలన శ్రీనివాస్ తన విద్యని బహుగుణీకృతంగా పెంపొందించుకుని. ఎంతటి ఔన్నత్య శిఖరాలని అందుకున్నా, వినయ ధనాన్ని పోగొట్టుకోకుండా సంతత ప్రగతి సాధించ గలగాలని ఇతని శ్రేయోభిలాషులలో ఒకడినైన నేను సంతతం కలిగివుండే సదాశయం.

28వ తేదీన 1971 ఫిబ్రవరి మాసంలో జన్మించిన శ్రీనివాస్ ఈనాడు పద్నాలుగేళ్ళ సంగీతమహాజ్ఞానఖని. తాతగారైన సింహాచలం పేరొందిన నాదస్వర విద్వాంసులు. తల్లి కాంతమ్మగారి స్వస్థలమైన వెల్దుర్తిలోపుట్టి తండ్రి ఉప్పలపు సత్యనారాయణగారి స్వస్థలమైన పాలకొల్లులో పెరిగి, 6వతరగతి వరకూ విద్యాభ్యాసం సాగించాడు. ఆరేళ్ళ చిన్నప్రాయంలోనే అక్కడి ఆర్కెస్ట్రాలోని మేండొలిన్‌వాద్యం ఇతన్ని మిగిలిన వాద్యాలన్నిటికన్నా అధికంగా, అమితంగా ఆకర్షించింది. అది నిస్సందేహంగా దైవసంకల్పం. ఆ చిన్న వాద్యంపైన మొదట్లో లైట్ మ్యూజిక్ వాయిస్తూ వచ్చిన శ్రీనివాస్ దృష్టి క్రమేపి కర్నాటక శాస్త్రీయ సంగీతంవైపుకి మళ్ళింది. దానికి ముఖ్య కారకులు గురువుగారయిన శ్రీ రుద్రరాజు సుబ్బరాజుగారూ, తండ్రిగారయిన సత్యనారాయణగారూ. లైటు మ్యూజిక్ పోగొట్టుకున్న మహామేధావిని కర్ణాటక శాస్త్రీయ సంగీతం తనకోసమనే ప్రత్యేకించుకుంది. గురువుగారు పాలకొల్లునుండి మద్రాసుకి 1979లో మకాం మార్చారు. 1981లో తన శిష్యులైన సత్యనారాయణగారి కుటుంబాన్నికూడా రప్పించి తన యింట్లోనే వసతి కల్పించి యిచ్చారు. చెంబై శిష్యులయిన సుబ్బరాజుగారి శిష్యుడయిన శ్రీనివాస్ చక్కని క్రమశిక్షణపొంది అతి త్వరలోనే గొప్ప విద్వాంసుడు కాగలిగాడు.

మొదట్లో యస్. రాజేశ్వరరావుగారి ఆర్కెస్ట్రాలో పాల్గొంటూ ఆయన పుత్రుడయిన వాసుతో మలేషియా సింగపూర్ వెళ్ళివచ్చాడు.

ఎ, వి. యం. వారి "హంపాంచ్" చిత్రానికై లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీత దర్శకత్వంలో రీ రికార్డింగులోకూడా శ్రీనివాస్ మెండొలిన్ బిట్లు వాయించి మెప్పులందుకున్నాడు.

ఇతని ప్రతిభని విని, పిదపకని, ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటి ప్రెసిడెంట్ అయిన శ్రీ వి. ఎం. పెరుమానార్‌చెట్టి తమ సంస్థద్వారా శ్రీనివాస్‌కి ఇచ్చిన ప్రోత్సాహం ఇంతా అంతాకాదు. ఐ. ఎఫ్. ఎ. ఎస్. అధ్వర్యాన జరిగిన కచేరిలోనే నేనుకూడా వినడం తటస్థించింది. ఒక పట్టాన ఎవర్నీ అతిగా పొగడని సంగీత విమర్శక చక్రవర్తులైన సుబ్బుడు, ఎన్. ఎం. ఎస్ (ది హిందూ క్రిటిక్) వంటి వారుకూడా శ్రీనివాస్ సంగీతాన్ని గురించి వ్రాసిన పొగడ్తలు శ్రీనివాస్ ప్రతిభకి విశిష్టనిరూపణలు. డా. బాలమురళీకృష్ణవంటి మహామేధావీ, మహావిద్వాంసుడూ, సభాముఖంగా శ్రీనివాస్ విద్యకిచ్చిన మెచ్చికోళ్లూ, దీవెనలూ ఇన్నీ అన్నీ కావు.

అలా అలా ఎందరెందరో మహానుభావులందరి మెప్పులూ, ఆశీస్సులూ అందుకుంటూ ఈ శ్రీనివాస్ త్రివిక్రముడు ఎంతో ఎత్తుకి ఎదిగాడు. ముక్కుపచ్చలారని ముద్దువయస్సులోనే హద్దులే లేని సంగీత పరిజ్ఞాన వైదుష్యం గడించుకుంటూ.

1983 అక్టోబరు 29వ తేదీన పశ్చిమజర్మనీ "బెర్లిన్"లో జరిగిన జాజ్ ఫెస్టివల్ సందర్భంలో శ్రీనివాస్ ఆహ్వానింపబడ్డాడు. పాశ్చాత్య శ్రోతృగణాలతో కిక్కిరిసిపోయినహాల్లో ఏజంటూ, గొంతూ లేకుండా 1½ గంటల పర్యంతం అద్భుతంగా వాయించి వినిపించిన సంగీతం ఆడియన్సుని మంత్రముగ్ధుల్నిచేసి కూర్చోపెట్టింది. శ్రీనివాస్ ప్రోగ్రాం 2వ పర్యాయం శ్రోతల కోరికపైన లైవ్ టెలీకాస్ట్‌గా సమర్పించబడటం మరో మహా వైశిష్ట్యం. అపూర్వగౌరవం. శ్రోతలు మరీ మరీ వినగోరడం వలన మళ్ళీ రాత్రి 9-30 గంటలనుండి చాలా పొద్దువరకూ సంగీత రసజ్ఞులయిన శ్రోతలందర్నీ ఓలలాడించింది శ్రీనివాస్‌సంగీతం. పారవశ్య పారావారంలో మరో విశేషం మృదంగం లేకుండా వినాయక్‌రాం ఘటం మాత్రమే వాయిస్తుండగా శ్రీనివాస్ అందర్నీ మెప్పించినవైనం.

ఆ ప్రోగ్రాం టెలీకాస్ట్ కావడంతో మర్నాడు బెర్లిన్‌లో షాపింగ్‌కివెళ్ళినప్పుడెందరో సంగీతప్రియులు శ్రీనివాస్‌ని ఇట్టే ఆనవాలు పట్టేసి, అభినందనల వర్షం ఆప్యాయంగా కురిపించారు. ఆది కమలాలా కన్న గురువుగారి ఆనందానికి అవధుల్లేవు

అలా అలా శ్రీనివాస్ కీర్తి పెరగడం ప్రారంభించగా, 1983 డిసెంబరు సంగీతసభల సందర్భాన ఏడు రోజులు వరసగా ఏడు విభిన్నసభలలో వాయించిన ఘనత చిరంజీవి శ్రీనివాస్‌కే దక్కింది. అన్నీ హౌస్‌ఫుల్ కచేరీలే. ఆర్. ఆర్. సభలో మరో ప్రత్యేకత. రెండు తవిళ్ళు (తాళ వాద్య విశేషాలు) అమర్చుకుని అద్భుతంగా వాయించడం. 1984లో మే, జూన్ మాసాలలో ఆస్ట్రేలియా, ఇండోనీషియా, మలేషియా సింగపూర్‌లలో శ్రీనివాస్ తన ప్రతిభని అతోధికంగా చాటి వచ్చాడు.

1984 సెప్టెంబరు నెలాఖరునుంచి నవంబరు నెలాఖరుదాకా, అమెరికా, కెనడా దేశాల్లో పర్యటించి దిగ్విజయభేరి మ్రోగించి వచ్చేదారిలో మస్కట్, బెహరన్, దుబాయ్‌వంటి గల్ఫ్‌దేశాలలో కూడా తన జెండాను నాటి మరీ స్వదేశం చేరుకున్నాడు. విదేశాలలో మొత్తం 45 రోజులలో 34 సంగీత కార్యక్రమాలు జరిపిన మేటి. అనిపించుకున్న శ్రీనివాస్ తన కీర్తికిరీటంలో మరికొన్ని మహోజ్జ్వల మణులు పొదిగించుకున్నాడు.

గ్యాంబ్లింగ్

డా॥ తంగిరాల వెంకటసుబ్బారావు

కాలం కర్పూరంలా కనబడకుండా కరిగిపోతోంది
శ్వాసకోశాలు నిర్విరామంగా శ్రమిస్తూంటే,
జీవి చావువైపు పరుగుపెడుతోంది
ఉత్తర క్షణాలో ఏం జరుగుతుందో తెలియని అయోమయం
పొగమంచులాక్రమ్మి దారికనబడడం లేదు
నిన్నటి అనుభవం నేటికీ రేపటికీ పనికిరావడంలేదని.
అంతాఅదృష్టంమీద ఆధారపడివుంది
నిస్సహాయ నిద్రలో మత్తుగా తూగుతోంది
జీవితం పెద్దపెద్దస్టేక్స్‌తో ఆడుతున్న పేకాటలా
ముందుకు సాగుతోంది..........

ప్రవర శాలీనులు

శ్రీ కె. కిశోరుబాబు
శ్రీ కె.అశోకంబాబు

నవనవోన్మేషం"
తుచ్ఛమని
తిరస్కరిస్తున్నారు
కొందరు
"పురాణ సౌరభం"
పూతి గంధమయమని
తొలగద్రోస్తున్నారు

మరికొందరు!
బహుళమయిన
సాహిత్యప్రపంచంలో
ఎందుకూ
కొరగానివాళ్లు
దేనికీ ఉపయోగపడనివాళ్ళు
ప్రవర,శాలీనులు వీళ్ళు !!

1984 డిసెంబరు సంగీతోత్సవాలలో రమారమి అన్ని సభల అధ్వర్యం లోనూ అత్యుత్తమ కర్ణాటక సంగీత కార్యక్రమాలు జరిపి శ్రీనివాస్ తనపేరును ఇనుమడింపజేసుకున్నాడు. తమిళ ఇశై సంఘానికై ప్రత్యేకమయిన తమిళ కీర్తనలు వినిపించి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశాడు.

1985 సెప్టెంబరులో 24–28 తేదీల మధ్య అయిదు కాన్సర్టులు జరిపి ఫ్రాన్సుదేశంలో పారిస్ నగరంలో జరిగిన భారతదేశ సంగీతోత్సవాల సందర్భాన మన్ననలుపొంది తిరిగి వచ్చాడు.

1986 మార్చి ప్రాంతంలో మళ్ళీ యు. ఎస్. ఎ. కి బుక్కై ఉన్నాడు. మన యు. ఎస్. ఎ అనగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాని, యూనివర్సల్ శ్రీనివాస్ అనే ఆర్టిస్టు, తన అసాధారణ సంగీత ప్రతిభతో మరోసారి ఉర్రూత లూగించి రానున్నాడు.

ఇటీవల మరో బాలమహామేధావి వీణావిరించి, చిట్టిబాబు ఒక పత్రికా విలేఖరి. సలిపిన సంభాషణలో చిట్టిబాబు ఈ చిరంజీవికి ఇచ్చిన కాంప్లిమెంటు సంగీత ప్రియులందరూ మెచ్చదగినది. "కర్ణాటక సంగీతం క్రమంగా జనాదర ణని పోగొట్టుకుని క్షీణించిపోతుందేమోననే భయం ఎంతమాత్రంపడవలసిన అవ సరం ఇప్పుడు లేదు, ఎన్నడూ కలగదు. యు. శ్రీనివాస్ వంటి కర్ణాటక సంగీ తాభిమానులూ, బాలమేధావులూ, విద్వాంసులూ ఈ సత్యాన్ని చాటేందుకే వస్తూ వుంటాను.

ఇలాంటి సంగీత పండితులవలన ఈనాడు కూడా కర్ణాటక సంగీత సభలు నిండి క్రిక్కిరిసిన జనంతో కిటకిటలాడుతున్నాయి.

అని శ్రీ చిట్టిబాబు ప్రశంసించి తన హృదయ వైశాల్యాన్ని నిరూపించు కున్నారు

కె. కె నగర్. శంకరమఠ్‌లో ప్రఖ్యాత సంగీత విదుషీమణి శ్రీమతి ఎం. ఎస్. సుబ్బులక్ష్మి బాలాభాస్కర బిరుదాన్ని అందించారు.

శ్రీకృష్ణగాన సభలో వాయులీన విద్వన్మణి శ్రీలాల్‌గుడి జయరామన్ "సంగీత చూడామణి" బిరుదాన్ని బహూకరించారు. ఆసభలో శ్రీ సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ శ్రీనివాస్ గురించి ఆవేశంతో భాషించి ఇతడు మున్ముందు కర్ణాటక సంగీతం పట్ల నవయువకళాకారులకి ఆదర్శప్రాయుడై సదావిరాజిల్లగలడు అని అభినందించి ఆశీర్వదించారు పాలకొల్లు(స్వస్థలం)లో "మేండొలిన్ సామ్రాట్" అనే బిరుదాన్ని అందుకున్న ఈ చిరంజీవి మహా అదృష్టశాలి. తిరుచ్చిలో "గాన. కళాభారతి" అనే టైటిలు లభించింది.

1985 జూన్‌లో జరిగిన టి. వి. ప్రోగ్రాంవిని మహానందం పొందిన తిరు. ఎం. జి. రామచంద్రన్, అణ్ణాఅవార్డులపైశై ఎవార్డుల సందర్భంగా కమలహాసన్‌కి అవార్డు అందించేసభలో $1\frac{1}{2}$ గంటల కచ్చేరీ ఏర్పాటు చేయించి, శ్రీనివాస్ వాయించిన విధానాన్ని చాలా మెచ్చుకుని ఉపన్యసించారు. శ్రీమతి పి. భానుమతి అతి ప్రభా వితురాలై వెయ్యిన్నొక్క రూపాయలు బహూకరించి భాషించారు.

తమిళనాడు ప్రభుత్వాస్థాన విద్వాంసుడుగా ఇంత పిన్నవయస్సులోనే ఎన్నుకోబడడం శ్రీనివాస్‌కి ఎన్నడూ మరిచిపోలేని మహాగౌరవం !

ఇలా ఇలా అలా అలా వటుడింతై, అంతై, ఎంతెంతగానో విజృంభించి. విక్రమించి విశ్వవిఖ్యాతిని పెంపొందించు కుంటూ ఈ చిరంజీవి యు. శ్రీనివాస్. చిరంజీవియై ఆయురారోగ్యైశ్వర్య సమస్త భోగభాగ్యాలతోనూ సదా వెలుగొంది వెలుగిచ్చి తన విశిష్ట జన్మని సార్థక పరచుకుని, ధన్యత నీ, చరితార్థతనీ, సాధి చ కోవాలని సంగీతాభిమానులైన మనం అందరం ఆశిద్దాం. ఆశీర్వదిద్దాం, చి॥ శ్రీనివాస్ సంగీత ప్రతిభాప్రాభవయుత ఘనతాగంగానది ఆగని మహాప్రవాహమై సాగుతూ సంగీత ప్రియులందర్నీ సంతోషసాగర తరంగాలలో ముంచెత్తి, శాస్త్రీయ సంగీత రసజ్ఞతని దినదినాభివృద్ధి పొందించాలని శుభాకాంక్షిద్దాం.—తథాస్తు—

తే॥ గీ॥ మాలిక

శ్రీశకరుణా ప్రదత్త కళేశుడైన
తిరుమలేశ భక్తుండు మహాదృష్టలబ్ధ
రుచిరబహుదిశావ్యాప్తకీర్తి చిరజీవి !
మధురసప్తస్వర కళారమాలయాబ్ధి ! !
లలిత భావభరితరాగలయ విరించి,
తిమిర విచ్ఛేదకర భానుతేజమంది,
రుచులమేటిదౌ తీపికి రూపమిచ్చి,
పలురసజ్ఞులుంబొగడంగ ప్రతిభ మెచ్చి,
తీరునెఱిఁగినజ్ఞాన సిధియనఁదగుచు,
శక్తి వర్ధక సాధనారక్తుఁడగుచు,
కృతసుకృతుడై మీటుచు తియ్యతముగ
పలుకఁజేయుచు మేండొలిన్ భవ్యవాద్య
యాజమాన్యము తనదంచుభోజనహిత
పాకశాస్త్రపండితుఁడట్లు భావరాగ
లయల క్రొంగ్రొత్తరుచులెంచి స్వయముఁగఁని
యతులరీతిని బంచెడు నతులితమతి ! □

శ్రీ తిరుమల రామచంద్ర

"అన్వేషణ జ్యోతి అస్తమించింది"

ప్రతి మానవుని జీవితమూ మలుపులు తిరుగుతూ ఉంటుంది. మతిమంతులు తమ సంస్కారాన్ని బట్టి, పరిస్థితులకు అనుగుణంగా ఆ మలుపులను మంచిగా మలుచుకుని తమ భవిష్యత్తుకు బంగారుబాటలు తీర్చుకుంటారు. మరికొందరు డోలాయమాన మానసులు వాటిని చేజేతులా జారవిడుచుకుని చేటు తెచ్చుకుంటారు. కాని కొందరి జీవితాలలో ఈ మలుపులు వారి ప్రమేయం లేకనే వారిని వారి అభీష్టానికి చేరువ చేస్తాయి. అలాటిది అరుదుగా జరుగుతుంది. అది వారికేకాక వారి ఇష్టులకో, దేశానికో, సాహిత్యానికో లాభకరమూ, కీర్తికరమూ అవుతుంది. వారు మాత్రం దీపంలాగా వెలిగి కాలిపోతూ, సామాన్యులు అనుకునే సుఖాలకు దూరంగా కష్టాల నీడలోనే వుంటారు. దీనికి తార్కాణాలు ఎన్నైనా చూపవచ్చు చరిత్రలో. బుద్ధుని జీవితంలో మలుపే రాకవుంటే, అతడూ తక్కిన శాక్య రాజకుమారులలాగే ఉండేవాడు. గాంధీజీ ఆఫ్రికాకు వెళ్ళడమే సంభవించకపోయివుంటే స్వాతంత్ర్యోద్యమం ఏరూపంలో ఉండేదో! తులసీదాసు ఏరుదాటకపోతే రామచరిత మానసం అవతరించేదా ?

అలాటి అదృష్టపు మలుపే తిరిగింది 'అన్వేషణ జ్యోతి' నిడుదవోలు వేంకటరావు గారికి, ఆయన ప్రమేయమేమీ లేకుండానే ఆయన తన అదృష్టాన్ని ఈవిధంగా అరమరికలు లేకుండానే వర్ణించారు :- "నలుబదేండ్లనాటి ముచ్చట. నా జీవితమునకొక మలుపు నా సాహిత్యమునకొక వెలుగు నిలిపినది. పుష్కర కాలము బ్యాంకు గుమాస్తాగా పనిచేయు కాలములో హఠాత్తుగా ఒకనాడు ఆంధ్ర భోజులు పిఠాపురం మహారాజావారు వర్తమాన మంపగా వారిని దర్శించుటకు వెళ్ళినాను. అపరకృష్ణ రాయలైన ఆయనను ఆముక్తమాల్యద పద్యము "ఖనటత్పయోబ్ధివీక్ష్య రసాతలాన్యోన్య పిండీ కృతాంగ భీతాండజములు"తో ఆశీర్వదించాను. "మీరు చదివిన పద్యములో చటులఝంపా అనియున్నది. ఝంపా శబ్దమున కర్థమేమి?" అని ప్రశ్నించినారు. నేను వెంటనే "ఇంగ్లీషులో జంప్ అనే మాటయే దాని అర్థము" అన్నాను. "తెలుగు మాటకు ఇంగ్లీషు అర్థమా?" అన్నారు. .... అంతటితో వదలలేదు. ఆ పద్యానికి అర్థం చెప్పమన్నారు. ఆముక్తమాల్యద పద్యాలు ఇనుప గుగ్గిళ్లు. నన్ను పరీక్షించదలచి అడిగినారేమో నాకు తెలియదు. పద్యార్థము వివరముగా విశేషములతో వినిపించినాను. మహారాజావారు "మేము నన్నెచోడుని కుమారసంభవము చదువుచున్నాము. కాని అది కాళిదాసు కృతికంటే భిన్నముగా ఉన్నదే. కారణమేమి ?" అన్నారు. కాళిదాసుని కుమారసంభవము కావ్యకళాదృష్టితో పరాంకోటి కెక్కినది. కాని, నన్నెచోడుని కృతియందు కావ్యదృష్టితోపాటు వీరశైవ సంప్రదాయకమగు ఆధ్యాత్మిక మతవిషయాలు నిండియున్నవి." అని బదులు చెప్పినాను. వారు "ఇదియేమి ? కేవలము రసవిషయకమగు కావ్యమున మతసంప్రదాయ ప్రవేశమెట్లు ?" అని ప్రశ్నించినారు. నేను "రాయలవారు రసైకమగు గోదా శ్రీరంగనాయకుల ఉదంతమున విశిష్టాద్వైత మత సంప్రదాయమును నిబంధించి యున్నారుకదా ?" అన్నాను. ఇంతలో ఆస్థాన కవి ఓలేటి వేంకటశాస్త్రిగారు వచ్చినారు. "దబ్బాటు" అనే పదమునకు ప్రయోగమున్నదా ?" అని రాజా వారడిగినారు. వారు స్ఫురణలో లేదన్నారు. నేను వెంటనే అప్పటికి ఇరువదేండ్ల క్రిందటివారు రచించిన పద్యమును చదివి ప్రయోగము తెలిపినాను. పదినిమిషము లనుజ్ఞగొని వచ్చిననేను వారితో పన్నెండుపదుల నిముసములు (రెండుగంటలు) గడిపినాను. అవే నా జీవితములో అమృతగడియలు. ఆనాడే వారు నన్ను అంకెలనుండి తప్పించి అక్షరములలో ప్రవేశపెట్టవలెనని తీర్మానించుకున్నారు. సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యస్థానమున పండితునిగా నియమించినారు..........పిఠాపురం రాజావారు నాకు నిత్యస్మరణీయులు"

అప్పుడే అదే వేంకటరావుగారి జీవితంలో మలుపు; ఆయనే అన్నట్టు ఆయన సాహిత్యంలో వెలుగు నిలిపింది. ఆ ఆనందం అగ్గలంకాగా ఆయన:-


"అంకెల బారులం బడి యహర్నిశ మిట్టటు గొట్టుకొంచు నే
వంకయు బుద్ధి కెన్నడ రవంతయు లేకను సాహితీ రసం
బింకగ నున్నవేళ నను నెంతయు ప్రీతిదెలుంగు వారిధి
వ్యాంకము నందు నిల్పిన మహాప్రభు నెన్నద సూర్యరాడ్విభున్"

అని పిఠాపురం రాజావారిని స్తుతించారు. నిజమే పాపం! ఎంత అంకెల గారడీని ఆకళించుకొన్నా, ఉక్కు కటకటాల వెనుక, ఉక్కు తెరలమధ్య ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేయడం సాహిత్యలుబ్ధులైన ఆయనకు ఎంతో విసుగు పుట్టించి ఉంటుంది!

"చనియెన్ ద్వాదశహాయనంబులనయున్
షణ్మాసకాలంబు బ్యాం
కునకే దేహపు టస్థిచర్మములు రెం
డున్ ధారగా బోసి జీ
వనమున్ బుచ్చితి సేవజేసితి మనో
వాక్కాయ కర్మంబులన్
వినియోగించితి నాదు దీపటిమ వ
న్నెందెచ్చు నెద్దానిలోన్!"

అని ఆ విసుగులోను ఆత్మవిశ్వాసం ప్రకటించారు. అలాటి పరిస్థితిలో తమను సాహిత్య పథంలో పయనింపజేసిన పెద్దమనిషిని ప్రశంసించడం, ఆశువుగా పద్యాలు చెప్పడం సహజం.

నిడుదవోలు వేంకటరావుగారు 1903 జనవరి 7వ తేదీన విజయనగరంలో జన్మించారు. నాయనగారిపేరు సుందరం పంతులుగారు, తల్లిగారిపేరు జోగమ్మగారు. నిడుదవోలు వారిది కూనలమ్మ కమనీయంగా చెప్పిన "కవితారసపుజల్లు, ఖడ్గాలగలగల్లు చెల్లిన ఆరువేల నియోగి కరణాలవంశం. ఆ వంశంలో ఏడుతరాలకు పైన కవిపండితులున్నారు. ఆవంశంవారిది పూర్వం పశ్చిమగోదావరిజిల్లాలోని నిడుదవోలు సమీపంలో వున్న నరేంద్రపురం. వేంకటరావుగారి తాతముత్తాతలు విజయనగరానికి పదిమైళ్ళలోని అమగాము రావివలస అనే గ్రామానికి వలసవచ్చి కరణీకం సంపాదించారు. తండ్రి సుందరం పంతులుగారు స్వయం కవిపండితులు. ఆయనకు బసవపురాణ, పండితారాధ్య చరిత్రాలు, వాచోవిధేయాలు. ప్రాచీన సాహిత్యంపై ముఖ్యంగా వీరశైవ సాహిత్యంపై ఆదరం ఉన్నవారు గనుక వేంకటరావుగారు జన్మించడానికి ముందే దాదాపు ఆరువేల ముద్రితాముద్రిత గ్రంథాలుండేవి. "మా నాయనగారు నిడుదవోలు సుందరం పంతులుగారు క్రిందటి శతాబ్దంలోనే తెలుగు దేశంలో మొట్టమొదటిసారిగా, గ్రంథాలయం నిర్వహించారు. అనేక తాళపత్ర గ్రంథాలు సేకరించి సంరక్షించేవారు. ఆ కాలంలో కవులూ, పండితులూ తమ ముద్రిత గ్రంథాలను ఆయనకు గౌరవాభిమాన పురస్సరంగా పంపుతూ ఉండేవారు. 1914లో మా తండ్రిగారు పండితారాధ్య చరిత్ర అచ్చు వేయించారు. అంతకు ముందెవరూ ఈ మహోద్గ్రంథాన్ని అచ్చువేయలేదు. రోజూ బసవపురాణం నుంచి గాథలూ, ఇతర శివపారమ్య ప్రబోధక కథలూ మా నాన్నగారు చదివి వినిపి



స్తూండేవారు, కుటుంబంలోని మమ్మల్నందరినీ కూర్చోబెట్టుకొని. ఎటు చూసినా మా ఇంట్లో పుస్తకాలే కనబడుతూ ఉండేవి. ఎటుచూచినా మా ఇంట్లో పుస్తకాలే. మా ఇల్లు స్వయంగా గ్రంథాలయం కాబట్టి నాకు ఎటుచూచినా సాహిత్య వాతావరణమే. నాకు పదమూడు పద్నాలుగేళ్ళప్పుడు మా ఇంటికి మానవల్లి రామకృష్ణకవిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు విచ్చేశారు. తాళపత్ర గ్రంథాలను సేకరించడానికిగాను. అప్పుడే ఆ మహోదయుల దర్శనం లభించింది. ప్రభాకరశాస్త్రిగారు మా ఇంట్లో నెలరోజులపాటు ఉన్నారు. అప్పుడే పరిశోధనాభిలాష నాలో ప్రవేశించింది కాబోలు" అన్నారు ఒక సందర్భంలో వెంకటరావుగారు.

"మనజేసె తెలుగునాటను
పనుపడ ప్రథమాంధ్ర పుస్తభాండారము నా
జనకుడగు సుందరమ్మను
ననవరతము సంస్మరింతు"

అని ఆయన తమ నాయనగారిని ఇటీవలకూడా స్మరించారు.

వెంకటరావుగారి చిన్ననాటి చదువు, ఉన్నత పాఠశాల చదువు విజయనగరంలో జరిగాయి. విజయనగరం పండిత ప్రకాండుల పుట్టినిల్లు గనుక, ఇల్లుకూడ సరస్వతీ దేవాలయం గనుక చిన్ననాటినుండే ఆయనపై సాహిత్య సురభి సమీరాలు వీచడంలో ఆశ్చర్యంలేదు. పద్యాలు కంఠస్థంచేయడం, చక్కగా చదువడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య. కంఠస్థం చేయడం అనడం పొరపాటు. ఆయనచూచిన రసవంతమైన ప్రతిపద్యమూ కనులద్వారా మెదడులో ముద్రపడిపోయేది. ఆయన పద్యాలు చక్కగా చదవడం, జ్ఞాపకం పెట్టుకోడం ఒకమారు ఆయనను చిక్కులో పెట్టాయి. విజయనగరంలో హరిశ్చంద్రనాటకం వేస్తున్నారు. లోహితాస్యుని పాత్రధారి బాలుడు రాలేదు. వెంకటరావుగారిని ఆవేషం వేయమని లాక్కుపోయారు. నాటకం బాగానే రక్తికట్టించారు బాల వెంకటరావుగారు. ఇంటికి తిరిగివచ్చిన పిదప నాయన గారు సుందరం పంతులుగారు తెగచీవాట్లు పెట్టారట "నీకు మతుందా? చచ్చిపోయేవాడి వేషం కడతారా ఎక్కడైనా?" అని. ఇంటర్మీడియట్ విశాఖపట్నంలోని ఎ. వి. ఎన్. (అంకితం నరసింగరావు సతీమణి) కాలేజీలో చదివారు.

అప్పుడు సుందరం పంతులుగారు విశాఖపట్నం జిల్లా బోర్డు ఆఫీసులో సీనియర్ అకౌంటెంటుగా వుండేవారు. వెంకటరావుగారు బి. ఎ. మళ్ళీ విజయనగరం మహారాజా కళాశాలలో చదివి ఉత్తీర్ణులయ్యారు. బి. ఎ. చదువుతున్నప్పుడు రసపుత్ర విజయం నాటకకర్త అయిన ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణగారు ఆ కళాశాలలో అధ్యాపకులు. ఆ నాటకంలోని సమాస బహుళాలైన పద్యాలను చాలవాటిని కొండలయందు నుద్దండులై యున్నట్టు దండి మరాఠీలదండు--వంటి గడబిడప్రాస పద్యాలను వెంకటరావుగారు రచించారు.

బి. ఎ. చదివేకాలంలో తండ్రిగారు విజయనగరం సంస్థానంలో కొలువులో వున్నారు. ఆర్థికపరిస్థితి అంత బాగున్నట్టులేదు. బి. ఎ. పరీక్షకు కట్టడానికి డబ్బు లేదు ఏమిచేద్దామా ఆలోచిస్తుండగా వెంకటరావుగారికొక చక్కని ఆలోచన తోచింది. అప్పటికే వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ అనే పుస్తక ప్రచురణసంస్థ సుప్రసిద్ధమైంది. రామస్వామిశాస్త్రిగారి కుమారుడు వెంకటేశ్వరశాస్త్రిగారు నిర్వహిస్తున్నారు ఆ సంస్థను. ఆ సంస్థ ప్రచురించిన పెక్కు పుస్తకాలు తమ యింట్లో వున్నాయి. అంతటి ప్రచురణకర్త సహాయం చేయకపోతారా అనే ధీమాతో "విద్యార్థి విన్నపము" అనే పేర పద్యాలలో వేంకటేశ్వరశాస్త్రిగారికొక ఉత్తరం వ్రాశారు వేంకటరావుగారు. దానిలోని కొన్ని పద్యాలను ఉదహరించడం 20 ఏండ్ల ప్రాయానికే ఆయన కవితాధార ఎంత చక్కగా కుదిరిందో తెలుసుకొనడానికి సహకరిస్తుంది.

"అవధరింపుము నిడుదవోలాన్వయుండు
వేంకటామాత్యు డత్యంత వినయమెసగ
శతసహస్రమ్ములను నమస్కృతులొనర్చి
నమ్రుడై చేయునట్టి విజ్ఞాపనములు.

"అక్షరాభ్యాసంబునందిన దాదిగా
చదువు నందెప్పుడు శ్రద్ధ గలిగి

ప్రతి తరగతియందు బహుమానముల్గొని
ఒక యేడు తప్పక నొంది జయము
దేశ చరిత్రంబు తెలుగు భాషయు నాకు
నభిమాన పాత్రము లై చెలంగ
ప్రథమ శాస్త్ర పరీక్ష ప్రథమంబు తరగతి
జయమొంది పట్టప్రశస్తి జెంద
విజయనగర మహారాజ విశ్రుతాంగ్ల
సత్కళాశాల నిప్పుడు చదువు వాడ
ఈ పరీక్షకు గట్టుట కింక కొన్ని
దినములే గడువయ్య సుధీంద్ర చంద.

"ధనసహాయము నొనరింపు డనుచుమిమ్ము
వేరుగా గోర నిద్దియె విప్పిచెప్ప
నా యవస్థకు మారు విజ్ఞాపనంబు
చేతనైనంత యుపకృతిచేయవయ్య

"దానములలోన నుత్తమ
దానంబులు రెండు నన్నదానము విద్యా
దానంబని ధౌమ్యుడు యమ
సూనునితో బలికెసుమ్మి సుగుణాధారా!

"ఇదివర కెన్నడేనొకరి యీవికినై చెయిచాపలేదికన్
కుదిరిన దానిలోన సమ కూర్చి పఠించితి నింతదాక ముం
దది యును చాలదన్న భయమల్లన బుట్టి కడంక దొట్టి మీ
పదముల బట్టినాడ నదుపాయ మొనర్చుము దేశబాంధవా!"

వాస్తవానికి వెంకటరావుగారి సాహిత్య జీవితం అంతకు ఐదారేండ్ల ముందే ప్రారంభమయింది. 1919 అక్టోబరు 2న గాంధీజీ 50వ జన్మదినోత్సవం జరిగింది విజయనగంలో. అప్పుడాయన గాంధీజీపై పద్యాలు వ్రాసి సభలో చదివారు.

అంతకు ముందు 1918లో పరవస్తు రంగాచార్యులకు దేశంలోనే తొలిసారిగా మహా మహోపాధ్యాయ బిరుదం ఇచ్చినప్పుడుకాబోలు ఆయనను ప్రశంసిస్తూ పద్యాలు చదివారు. గాంధీజీపైన చెప్పిన పద్యాలు 1919-10-2న స్థానిక వార పత్రిక "భారతమాత" లో ప్రచురితమయాయి. గాంధీ సాహిత్యానికి వెంకటరావు గారి పద్యాలతోనే తెలుగుదేశంలో నాంది ప్రస్తావన జరిగింది. (రాయప్రోలు సుబ్బరావుగారి "మోహనదాసకరమచంద్ర కరుణాసాంద్ర" అనే శీర్షికగల వ్యాసం తెలుగునాట గాంధీ సాహిత్యానికి శ్రీకారం అని ఒకప్పుడు వ్రాశాను, అంతకు ముందే 1919 లోనే వేంకటరావుగారు శ్రీకారం చుట్టారు) ఆయన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని 'విద్యార్థి వీరుడూ అనే ఖ్యాతినిగూడ పొందారు.

వేంకటరావుగారు పరవస్తువారిపైన చెప్పిన తొలి పద్యాలలో భావుకతకు, కల్పనకు అంతగా తావులేదు గనుక, ఆ సంవత్సరమే చెప్పిన మరి రెండు ఖండికలనే నేను తొలి కవితగా పరిగణిస్తాను. ప్రథమ ప్రపంచయుద్ధం కొనసాగుతున్నసమయం, అప్పుడు 1918 అక్టోబర్ రెండవ తేదీన విశాఖపట్నం సముద్ర తీరానికి ఒక యుద్ధ నౌక వచ్చింది. అది పట్టణంమీద అన్వేషణజ్యోతిని (సెర్చ్ లైట్‌ను) ప్రసారంచేసింది. దానిని చూచి పులకించిన యువకవి వేంకటరావుగారు 'అన్వేషణజ్యోతి' అనే శీర్షికతో కొన్ని పద్యాలు చెప్పారు. అవి తర్వాత 1921 అక్టోబర్ 30 న ఆంధ్రపత్రిక సారస్వతాను బంధంలో ప్రచురితమయ్యాయి. ఆ పద్యాలలో నవకవి ప్రబంధ ధోరణి పరుగులువారింది.

"దివ్యతరకాంతి జాలము తేజరిల్ల
పాంథుర గభస్తి చయములు పరిఢవిల్ల
చంద్రిక నడంచి సకలదిశల్ వెలింగె
యుద్ధ నౌకాగ్రమునుండి యొక్క జ్యోతి.
ఒకసారి పురసౌధ నికరాగ్రములనుండి
నిండారు వెన్నెల నీటుజూపు

ఒకమాటు పర్వత నికటోర్విపైనున్న
కటిక చీకటి వెల్గుగా నొనర్చు
ఒకతేప దూరమౌ నుత్తరాంబోనిధి
స్థలభాగమంత విస్పష్టపఱచు
ఒకపాలి సంద్రంపు టొడ్డున నిలుచున్న
చూపరులకు వింత చూరఖుచ్చు
మింటిపైకెక్కు మన్నిటిమీద నక్కు
నల్లనలమెల్ల తెల్లగా నడగ్రదొక్కు
పొడవుదేనిక్కు నొక్కట నిడుపుతక్కు
దానివర్ణింప నలవియె మానవులకు!

ద్యుతిదే నెంతటి సూక్ష్మవస్తువును విద్యుత్కాంత సంవ్యాప్తమై
యతి దూరంబున జూడగల్గుటను దా'నన్వేషణ జ్యోతి'యై
క్షితిపై గ్రాలెను దృష్టిమార్గమును గాంక్షించగ దా జూపు నం
చిత పాశ్చాత్య కళా ప్రభావమును సూచించున్ మనోజ్ఞంబుగాన్."

అన్వేషణజ్యోతిని చూచిన పిదపే కలిగిందో, అంతకుముందే కలిగిందో కాని, విశాఖపట్నం లైట్‌హౌస్ పయినకూడ పద్యాలుచెప్పే బుద్ధి కలిగింది ఆయనకు. 'సముద్రదీపస్తంభ గృహము' అనే శీర్షికతో ఆయన కొన్ని పద్యాలు చెప్పారు. అవీ 1918 నాటివే గనుక కొన్ని ఉదహరించడం ఉచితం.

"పొలుచును విశాఖపురిని సముద్రతీర
మునను సంద్రంబులో చొచ్చుకొనుచు ముక్కు
లాగు నొకకొండ నిలుచు నాగ్గమున నదియు
పేరుదాల్చెను నచట 'డాల్ఫినుసు నోసు'
ఇట్టి చిత్రము వేరొకరేవు పట్టణముల
నెచ్చటను గానరాదది మెచ్చుగొలుపు.
కొండపైనను నొక స్తంభముండు దాని
పైన చెలగును నొక్కదీపంబు నదియు
పెద్దలాంతరుపెట్టిన యుద్దినుండు
అద్దముల మధ్యలో కడు నిద్దముగను."

వెంకటరావుగారు 1924 లో విజయనగర కళాశాలలో విద్యార్థిగా వున్నప్పుడు జరిగిన సంఘటనలు రెండింటితో విద్వత్కవివరులకు సన్నిహితులయ్యారు. 1924 లో తణుకులో వేలూరి శివరామశాస్త్రిగారి అధ్యక్షతన ఆంధ్ర సాహిత్య పరిషత్తు 13 వ విద్వత్సభ జరిగింది. అప్పటి విద్వత్సభలంటే, ఇప్పటి లాగ ఎవరో ప్రసంగించడం, తక్కినవారు వినడం, వక్త ఏ అవాకులు చెవాకులు వాడినా, మనకెందుకులే అని ఊరుకుండడంకాదు. వక్త ఏతప్పుచెప్పినా, వెంటనే శ్రోతలలోని పండితులు నిగ్గదీసేవారు. చర్చలు, వాద ప్రతివాదాలు, సమస్యాపూరణాలు, ఆశుకవితార్భటులు ఉండేవి. తణుకు సభలో "రాణికి పాదముల్‌పట్టు రాణ విధించెన్" అనే సమస్యనిచ్చారు ఎవరో. వెంకటరావుగారు దానిని

ప్రాణికి నాయువు పట్టును,
వాణికి సరసమ్ముపట్టు, వరకంకణ సు
శ్రేణికి కైపట్టును, పా
రాణికి పాదములు పట్టు రాణ విధించెన్.

అని పూరించారు. తక్కిన పురాణాలను ఈ పురాణంతోసి రాజన్నది. పండితులు తలలెగురవేశారు. 1924 లో మద్రాసులో ఆలిండియా ఓరియంటల్ కాన్ఫరెన్సు తృతీయ వార్షిక సమావేశం జరిగింది. దానిలో వెంకటరావుగారు 'నన్నెచోడనికాలం అనే శీర్షికతో ఒక పరిశోధనావ్యాసం చదివారు. ఆ వ్యాసంలో ఆయన చరిత్రాంశాలు క్షుణ్ణంగా చర్చించారు. పండితులు తలలూపారు. ఈ రెండు సంఘటనలతో నిడుదవోలువారిపై విద్వత్కవుల, పరిశోధకుల చూపు పడింది. కాని చూపు కుదరలేదు. ఆ చూపు కుదరడం—ప్రమాణబుద్ధి ఏర్పడడం తర్వాత పది సంవత్సరాలకుగాని జరుగలేదు.

ఈ పది సంవత్సరాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. 1925 లో పట్టభద్రులయ్యారు: ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గుమాస్తాగా చేరారు. విచిత్రమైన సంఘటనలు పెక్కు. వెంకటరావుగారి మాటలలోనే రెండు సంఘటనలను ఇక్కడ ఉదాహరిస్తాను—"గాంధీజీ 1929 లో భారతదేశ పర్యటనచేస్తూ విజయనగరం వచ్చారు. చాలమంది ఆయనను చూడడానికే వెళ్ళారు. మా నాన్నగారితోపాటు నేనూ వెళ్ళాను. గాంధీజీ హిందీలో ప్రసంగిస్తూ, హిందీని ఎవరైనా మాట్లాడగలరా!—అని ప్రశ్నించారు. వెంటనే మా నాయనగారు ఆయనతో హిందీ భాషలో మొదట నమస్కరిస్తూ, ధారాళంగా సంభాషించారు. ఆయన హిందీ వాగ్ధోరణికి మహాత్ముడు చాలా మెచ్చుకొన్నారు. మా నాన్నగారు ఆ సందర్భంలో 'చర్ఖాపంచకం' అనే పద్యాలు చెప్పారు. గాంధీజీ ప్రసంగాన్ని నాన్నగారు తెలుగులోకి అనువదించారు. ప్రసక్తాను ప్రసక్తంగా ఆయన హిందీపైన ఒక పద్యం చెప్పారు.

"హిందూభూమిని భిన్నభాషలకు దా నేకత్వమున్ గూర్చుచున్
పొందించున్ సమతైక్య భావమును భిన్నులైన దేశస్థులన్
హిందూరాజ్య రమా సుభాషితమునై హేలాగతి న్వెల్గగా
హిందీభాషను నేర్వగా వలయు జుండీ భారతీయ ప్రజల్.

మా తండ్రిగారికి హిందీభాష వచ్చునని నాకుకూడ అంతకు ముందు తెలియదు. నా పెదతండ్రి జోగిరాజుగారు హిందీ భాషలో పండితులు. ఆయన ప్రతిదినమూ తులసీదాసు రామాయణమును పారాయణం చేసెడివారు.

విజయనగరంలో కాంగ్రెస్ స్వర్ణోత్సవ సభ జరిగింది. కాంగ్రెస్ సంస్థపై పద్యాలు చదివాను. నన్ను ఖద్దరు శాలువాతో సత్కరించారు. ఆఫీసులో నాకు మరో సత్కారం జరిగింది. పై అధికారులు ఇలాటి పనులలో పాల్గొనవద్దని వార్నింగు ఇచ్చారు. శృంగారగ్రంథమాల సంపాదకులు గంటి సూర్యనారాయణ శాస్త్రి గారి 'కల్యాణి' పత్రికలో తరచు పద్యాలు, పరిశోధనవ్యాసాలు వ్రాసే వాడిని.

అప్పూ సప్పూ చేయక గడవని సంసారం. బ్యాంకి ఉద్యోగం, నిత్యకృత్యాలకు కూడ నియమబద్ధమైన కాలపరిమితి, తండ్రిగారు సుందరం పంతులుగారి నుంచి సంక్రమించిన 'తాళిదళ సంపుటప్రకరకాంతారం'లో నిర్నిద్ర పరిశ్రమ-వీటివల్ల ఆయన ధారణ పదునెక్కింది. ఏక సంథతోనే గ్రహించిన విషయాలు మెదడులోని అరలలో చేరి, అవసరమైనప్పుడు గూళ్ళనుంచి గునగునమంటూ వచ్చే పావురాలవలె వెలికి రాఫడం మొదలుపెట్టాయి. 1934లో జరిగాయి ఆయన రావిపాటి త్రిపురాంతకుడు రచించిన (13-14 శతాబ్ది) త్రిపురాంతకోదాహరణాన్ని గొప్ప పీఠికతో ప్రచురించడం 1935లో నందికేశ్వరశాస్త్రి రచితమైన వీరశైవ సిద్ధాంతప్రతిపాదకమైన వీరశైవ ప్రమాణాష్టకాభరము అనే గ్రంథానికి ప్రామాణికమైన పీఠికను రచించడమూను. త్రిపురాంతకోదాహరణాన్ని సుగృహీతనామధేయులు మానవల్లి రామకృష్ణ కవిగారు 1912లో 'విస్మృతకవులు' శీర్షికతో అదివరకే ప్రకటించారు. కాని, వెంకటరావుగారు కవి కాలనిర్ణయాదులతోపాటు కావ్యస్థానం నిర్ణయించడంతో అప్పటి గొప్ప పరిశోధకుల సరసన నిలబడ్డారు. ఈ రెండు పీఠికలూ ఆయనకు గొప్ప కీర్తిని తెచ్చాయి. ఇంతలో ఆయనకు విజయనగరం నుంచి కాకినాడకు తబాదలా అయింది. ఈ తబాదలా జీవితంలోనూ గొప్ప మార్పు తెచ్చింది. ఇలాటి విద్వాంసులు బ్యాంకిలో అంకెలసంకెళ్లలో పడడం సమంజసం కాదనుకున్నారు పిఠాపురంరాజా సూర్యారావు బహద్దరువారు. గుమాస్తాపనికి ఇస్తీఫా ఇప్పించి తమకళాశాలలో తెలుగు ట్యూటరుగానియమించారు. 1928తో ప్రారంభమైన బ్యాంకి జీవితం 1939తో సమాప్తమైంది. సంవత్సరం అక్కడపని చేసిన పిదప సూర్యారాయాంధ్రనిఘంటువులో పదసంగ్రాహకులుగా చేరారు వెంకటరావు గారు.

ఈయనకు ఇప్పటికి సరియైన పని దొరికింది చేతినిండా! పని. నోటినిండా పని, మెదడునిండా పని. ఈయన ధారణకు నిఘంటు ప్రధాన సంపాదకులైన జయంతి రామయ్యపంతులుగారు, పండితులు వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు విస్తుపోయేవారు. నిడుదవోలువారి దృష్టికి పడిన ప్రతిపదానికి ప్రయోగం వెంటనే స్ఫురించవలసిందే నేనూ చదివాను— అన్నట్టుకాక, ఈయనకు కంటబడ్డ ప్రతి విషయమూ ఒంటబట్టిపోవలసిందే. ఆయా గ్రంథాల ముద్రణాది వివరాలతో సహా ఏ విషయమైనా అడిగిందే తడవుగా చెప్పడంలో ఈయనకు ఈయనే సాటి. తీగ కదిలిస్తే డొంకంతా కదులుతుందన్న సామెతగా, ఒక్క పదం ప్రస్తావిస్తే, నన్నయ మొదలు నేటిదాక అన్ని గ్రంథాలలోని ఆ పదప్రయోగసరళి నిర్ఝరపాతంగా మన పై కురవలసిందే, ఝంఝామారుతంగా మనపై వీచవలసిందే. అందుకనే ఎవరో 'ఈయనకు' "ప్రయోగమూషికమార్జాల" అనే బిరుదమూ ప్రసాదించారు. ఈయన తెలుగు సాహిత్యంలో మరచిందిలేదు, ఒదలు మరచి చదవందిలేదు. తెలుగు భాషలో ఏ మూల ఏమున్నదో చూపగల జగాదీవిటీ ఈయన. కనుక, త్వరలో సూర్యారాయాంధ్ర నిఘంటువులో అసమగ్రమైన మూడవ సంపుటి సమాప్తి కావడానికి, నాల్గవసంపుటి సిద్ధంకావడానికి కృషిచేశారు. ఆ సమయంలోనే 1941లో మద్రాసు విశ్వవిద్యాలయం ఎం. ఎ.లో సర్వప్రథములుగా వచ్చి సువర్ణపతకం పొందారు, పిదప మరల పిఠాపురం రాజాకాలేజీలో సంవత్సరం పాటు పనిచేశారు. తర్వాత 1944లో మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో సహాయోపన్యాసకులుగా చేరి, 1949 నుంచి తెలుగుశాఖాధ్యక్షులై, 1964లో రీడరుగా పదవినుంచి విరమించారు. అనంతరం మద్రాసు నుంచి హైదరాబాదుకు తరలి వచ్చి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ గ్రాంట్స్‌కమిషన్ ప్రొఫెసర్‌గా నాలుగేళ్లుపని చేశారు. 1982 అక్టోబర్ 15 రాత్రి కన్నుమూశారు.

వెంకటరావుగారి ప్రతిభ, పరిశోధన రచనా వ్యాసంగాల ప్రజ్ఞావాహిని 1940 నుంచి 1982 అక్టోబర్ 10 వరకు అవిచ్ఛిన్నంగా నాలుగు దశాబ్దాల పాటు పెక్కుపాయలుగాప్రవహించింది. ఈ ప్రజ్ఞావాహినిలో 'అనర్ఘరత్నాలు ఎన్నో కొట్టుకొని వచ్చి ఆంధ్రావళికి అందాయి. చివరి ఐదురోజులు మాత్రమే ఆయన ఏమీ వ్రాయలేదు. నన్నయభట్టు మొదలు నేటిదాకా ప్రముఖులైన వివిధరంగాల వారిని కీర్తిస్తూ మనిషికొక పద్యంచొప్పున 2000 పద్యాలు చెప్పారు, "వేంకటేశ్వరా" అన్నమకుటంతో. ఇటీవల కీర్తిశేషుడైన పార్లమెంటు సభ్యుడు హెచ్. వి. కామత్‌కు పార్లమెంటులో అత్యధిక సంఖ్యాకులతో సన్నిహితమైనసంబంధం వుండేదట. వెంకటరావు గారి సమకాలిక కవిపండిత పరిశోధన రచయితలలో వేలమంది సన్నిహితంగా తెలుసు, కనుకనే మనిషికొకపద్యం వ్రాశారు. చివరకు నా మీద కూడ ఒక పద్యం ఉన్నట్టు ఆయన జ్యేష్ఠపుత్రుడు శివసుందరేశ్వరరావు చూపించారు, నేను పరామర్శకు వెళ్లినప్పుడు. నేను ఆశ్చర్యపోయాను !

ఆయన పెక్కు సభలలో సన్మానాలు పొందారు. ఆయనను షష్టి పూర్తి సందర్భంలో 'జంగమ విజ్ఞానసర్వస్వం' 'ఏకసంథాగ్రాహి' అనే బిరుదాలతో గౌరవించారు. ఉదాహరణ వాఙ్మయ చరిత్రచూచి ముగ్ధులై కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు ప్రబంధ పరమేశ్వర బిరుదంతో సత్కరించారు. వీరశైవ వాఙ్మయానికి ఆయన చేసిన సేవకు కానుకగా వరంగల్ వీరశైవులు ఆయనకు సువర్ణఘంటా కంకణాలు బహూకరించారు. వీటన్నిటికీ మకుటాయమానంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం.

అరయగ ప్రాకృతంబు నను నందితరీతిని సంస్కృతంబునన్
గురుమతితోడ తెల్గునను కోవిదుడై తగు రీతినెంతయున్
పరుపడి వ్యాసరాజము ల పారముగా రచియించె నద్దిరా
తిరుమల రామచంద్రయును దీప్తిని మించెను వేంకటేశ్వరా

1978లో ప్రత్యేకస్నాతకోత్సవంలో కళాప్రపూర్ణ బిరుదంతో సన్మానించింది. ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఛాన్సలర్ సమక్షంలో 1978 అక్టోబర్ 23న ఈ బిరుద ప్రదానసందర్భంలో పి. జగదీశ్వరరావు గారు వెంకటరావుగారి ప్రశస్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి 1976 జనవరి 18న విశిష్టసభత్వంతో గౌరవించింది. త్రిపురాంతకోదాహరణానికి తెలుగు భాషా సమితి (మద్రాసు) బహుమతి 1949లో లభించింది. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ సమ్మానం పొందిన తొలి తెలుగు గ్రంథం ఇదే. ఆంధ్ర వచనవాఙ్మయము అనే వచనవాఙ్మయ చరిత్రకు 1958లో తెలుగుభాషా సమితి బహుమతి లభించింది. "కర్ణాటాంధ్రముల పరస్పర భావము-అనే గ్రంథానికి 1962లోను, విజయనగర సంస్థానము-సాహిత్యపోషణ -అనే గ్రంథానికి 1963లోను రాష్ట్ర సాహిత్య అకాడెమి బహుమతులు వచ్చాయి. ఒక విద్వత్సభలో విద్యారత్న బిరుదప్రదానం చేశారు. కళాప్రపూర్ణ బిరుదప్రదాన సందర్భంగా అభిమానులు చెన్నపురిలో జరిపిన సభలో.

"ప్రథిత వేదమువేంకటరాయశాస్త్రి
పొందగా బుట్టిన కళాప్రపూర్ణ బిరుదు
సార్థకంబయ్యె సాహిత్య జగతినేడు
నిడుదవోల్వేంకటరాణ్మనీషి వలన"

అని పండితులు పద్యాలతో ప్రశంసించారు. అరబ్బీ, పారసీక సంస్కృతాంగ్లాదిభాషలలో ఉద్దండపండితులు. ఖురాన్‌షరీఫ్‌ను సంస్కృతీకరించిన వారు, సెషన్స్ జడ్జిగావుండినవారు అయిన గుండేరావు హర్కారేగారు వేంకటరావుగారి ప్రతిభకు ముగ్ధులై చెప్పిన శ్లోకాన్నికూడా ఉదాహరించడం అవసరం.

నక్షత్రేషు యదా శశీ నిడదవోల్ శ్రీవేంకట శాస్త్రవిత్
సంసత్స్వద్భుత తత్త్వశోధన కలా పూర్ణః సతాం వల్లభః,
అజ్ఞానం హరతి క్షణాత్ హృదయుగం జ్యోత్స్నం కిరన్ చిన్మయీం
జీయాద్దివ్య శరత్ శతం భగవతో విష్ణోర్దయా వేశతః."

ఛాయాగ్రహణ యంత్ర సదృశమైన ధారణతో గ్రహించిందంతా ఒంట

ఖట్టించుకొని, ఒంటబట్టిన దంతా తరచిచూచి క్రొత్త విషయాలు కనుగొని, కనుగొన్నదానినంతా కనిపించిన వారికల్లా అందజేయాలనే ఉత్కంఠాపారవశ్యంతో గద్గదనదగ్గోదావరిలా పారిన వేంకటరావుగారి ప్రజ్ఞావాహినిని ప్రధానంగా పన్నెండు పాయలుగా నింగడించవచ్చు : (1) కవితలు – ఖండకావ్యాలు, చాటువులు, (2) మౌలికపరిశోధన గ్రంథాలు, (3) మౌలిక పరిశోధన వ్యాసాలు, (4) ప్రాచీన గ్రంథ పరిష్కరణం, (5) మెకంజీరికార్డుల ఆంగ్లానువాదాలు, (6) పీఠికలు, (7) సమీక్షలు, (8) ఆంగ్లరచనలు, (9) రేడియో ప్రసంగాలు, (10) సభా ప్రసంగాలు, (11) అప్రకటిత రచనలు, (12) సభ్యత్వాలు.

(1) కవితలు – ఖండకావ్యాలు :

1918 లో అన్వేషణ జ్యోతితో ఆరంభమైన వెంకటరావుగారి కవిత నిడుదవోలు వెంకటరమణ అనే పేరుతో సమకాలిక పత్రికలన్నింటినీ అలంకరించింది; మించుపల్లి – తెలుగుపొలుపు – (1959) లో

"జిలిబిలిసేత లొంటిపదు సిగ్గులు తగ్గలు పేరజంపుట
గ్గలికలు నింత సింత నెరగారవము ల్నెర జవ్వనంబునన్
కలుకు మెరుంగు జూపు తఱ కుల్కెడు కార తెలుంగు కబ్బముల్
పొలపములైన క్రొత్తవల పుల్ తలపుల్ పొలపుల్ వెలార్చెడిన్."

అని ఆయనే అన్నట్టు నాలుగు దశాబ్దాలకు క్రొత్త వలపులు, తలపులు, పొలపులు వెలార్చింది. ఆయన మించుపల్లెలో


"గాదెయు బోదెయు గేదెయు
వేదనినాదంబు హోమవేదిక యాప్వం
బూదయు బాదును బామక
లేదని కన్పట్టు గృహము లేదచ్చోటన్."

జాతీయాలు, నుడికారాలూ తొణికిసలాడే ఈ ఖండకావ్యం–కావ్యమనే అందాము–ప్రాచ్యపరీక్షకు పాఠ్యగ్రంథంగాను ఉంది. ఆయనే దానికి చిన్న గద్యవ్యాఖ్య కూడ వ్రాశారు. పలువురు విద్వత్కవుల ప్రశంసలు పొందిందీ కావ్యం. పానగల్లు రాజా శ్రీ పార్థసారథి రాయణంవారు స్వయంగా వ్రాసిన ప్రశంసాలేఖవల్ల అప్పటి రాజకీయ నాయకులు గూడ దీని ఎడల ఎంతగా ఆకృష్టులయ్యారో తెలుస్తుంది.

శ్రీశ్రీ నిడుదవోలు వేంకటరావుగారికి వందనములు.

ఆర్యా, మీరు ప్రీతితో బంపిన గ్రంథములు రెండును చేరినవి. చాల సంతోషమైనది. కృతజ్ఞుడను.

చాల కష్టించి, శోధించి త్రిపురాంతకోదాహరణమును గురించి వ్రాసినారు. గ్రంథశోధనాసక్తులగు పండితులకు మిక్కిలి యుపయోగకరముగానున్నది.



మించుపల్లి కేవలము శుద్ధాంధ్రమని తలంచితి. ఆవల జూడగా, సంస్కృత పదములనుగూడ నుపయోగించి యున్నారు. అదియే మేలు. ఉప్పును బులుసు గలసిన రుచిగానుండునుగాని, ఒక్కొక్కటియేయైన రుచిగానుండవు. మించుపల్లె చదువరులకు జక్కని తెలుగుపలుకుల దెలిసి కొనుటకు దోడ్పడుచున్నది.

'దినుసులందెల్ల మెత్తనివి పూలు' భావము మిక్కిలి చక్కగా నున్నది. చదువరుల మేలుకై ఇట్టి గ్రంథముల నింకను వ్రాయుదురని వేడెద.

పానగల్ మహల్ — బుధజన విధేయుడు

పానగల్లు — పా. పార్థసారథి వ్రాలు

11-5-47

గుడివాడలోని ఆంధ్ర నలందా అనే సంస్థ వెంకటరావుగారిని 1959 లో తృతీయ వార్షికోత్సవంలో సన్మానించింది. అప్పుడాయన 'ఆంధ్రనలందా' అనే మకుటంతో 'కందపద్య శతకం రచించారు. ఇది ప్రాచీన నవీనాంధ్ర కవులస్తుతి రూపమై ధారాళంగా సాగుతుంది.

"శృంగారాధ్యాత్మిక స
త్సంగతి వేవేలు చేసే సంకీర్తనలన్
రంగుగ దిరువెంకట విభు
నంగణమున నన్నమయ్య ఆంధ్ర నలందా!"

భాషారాష్ట్రోద్యమానికి ప్రాణాలు పణం పెట్టిన పొట్టి శ్రీరాములుగారిపై ఉదాహరణకావ్యం. పొట్టి శ్రీరామోదాహరణము రచించారు. కళికోత్కళికా విరహితమైన ఈ లఘుకావ్యానికి ఉదాహరణ వాఙ్మయంలో విశిష్టస్థానం వుంది.

ఆయన చాటువులు, ప్రాసంగిక పద్యాలు వేలకొలది చెప్పారు. అవి చాల వరకు గ్రంథరూపం కాకపోయినా, ప్రచురిత మయ్యాయి. చిన్ననాటి సమస్యాపూరణం ఒకటి ఇది వరకే ఉదాహరించాను. ఒక చాటువు వర్తమాన దేశాల పరిస్థితులను తెలిపేదిది.

"మంత్ర యుగంబునందు నన మానము దివ్యము యోగదృష్టియున్
తంత్ర యుగంబునందు బహుధా ప్రతిభాంచిత లౌక్యదృష్టియున్
యంత్రితమయ్యె నప్పు (డల) నంతట భారతదేశమందు నా
యంత్ర యుగంబు మించె ధనయంత్రమె రేబవలున్ భ్రమించెడున్."

నవీనులంతా చిన్నయసూరిపై కత్తికట్టారు. చిన్నయసూరి నియంత అని సాహిత్య స్టాలిన్ అని ఆరుద్రగారు రుద్రులయ్యారు. దానికి జవాబుగా వెంకటరావుగారు వచన కవితలో ఒక ఖండిక వ్రాసిపెట్టుకున్నారు. (ఎందుకు ప్రచురించలేదో!

"షేక్ మియాకి గోకులాష్టమికి
ఎంత సంబంధమో
సినీ రైటరుకి చిన్నయ సూరికి
అంతే సంబంధం
కుర్చీలో కూనిరాగాలు తీసినా,
కుక్కమీద కవిత్వం కట్టినా,
సినీ వాలిగా నిసిలో సుగ్రీవుండై
ఆరడీలు, గారడీలు పేరడీలు చేసినా
అన్నీ తెలిసిందనడం
చిన్న యయోగ్యత్వం
సాహిత్యానికి స్టాలిన్‌గారికి
చాలా దూరం చాలా దూరం
దూరం దూరం.
ఆరుద్రలకు సాహిత్యానికి
అంతకంటె ఎక్కువదూరం

ఆ అంగడిలో దూరడానికి
సరుకెక్కడిది పరువెక్కడిది !"

రెండు దశాబ్దాల క్రితం గురజాడ అప్పారావుగారి జననతిథి గురించి పెద్ద దుమారంరేగింది. వెంకటరావుగారు 'గురజాడ జననతిథి' అనే శీర్షికతో గేయకవిత వ్రాసిపెట్టుకున్నారు. (దీనిని కూడ ప్రచురించినట్టు లేదు.)

నీ పుట్టిన దినమేదో
నీ కొడుకుకు తెలియదంట
దిన చర్యను వ్రాసికొన్న
పుట్టు తేది మరచినావె
అప్పరావు చెప్పరావ !
ఆందోళన పడుచుండగ !
అవసరాలకెట్లయితే
అ మరినదీ ఒక్కతేది
నీ వ్రాతల కలదో లేదో

మా వ్రాతల కెక్కినది
నిజమేమొ ఎవ్వడెరుగు ?

నిన్న మొన్న నీ రూపము
కన్నులెదుట నున్న నీదు
పుట్టు తేది తెలియలేదు
పూర్వమున్న కవుల గూర్చి
కాల నిర్ణయము చర్యలు
కలము వెంట ప్రవహించెను
కాకితములు నిండెనన్న
ఆశ్చర్యం బేమి కలదు !
ఆంధ్రులకు నున్నదంత
ఆర్భాటము కాక ఏమి ?
అప్పరావు చెప్పరావ !
ఆందోళన పడుచుండగ !


నవకవిత్వం ఇలాగే కొనసాగించివుంటే బాగుండేదేమో :- అనిపిస్తుంది ఈ గేయాలూ, వచన కవిత చూస్తూంటే.

2) మౌలిక పరిశోధనగ్రంథాలు :- (అ) తెలుగు కవుల చరిత్ర: ఇంత వరకు వచ్చిన కవిచరిత్రలలో ఇది సమగ్రం సాటిలేనిదని. అజ్ఞాతయుగంనుంచి క్రీస్తుశకం 1250 వరకు వున్న కవుల చరిత్ర, సాహిత్యచరిత్రతోపాటువుంది. శాసన పద్యరచయితలను కూడ ఈయన కవులతోచేర్చి తెలుగులో నూతన సంప్రదాయం సృష్టించారు. ఇది తెలుగు బోధించే దేశవిదేశ విశ్వవిద్యాలయాలలో ప్రామాణికంగా గ్రహింపబడింది ఆ. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము:- నాయక రాజులకాలంలోను, మహారాష్ట్రరాజుల కాలంలోను తమిళ, కర్నాటక ప్రాంతాలలో వెలసిన వాఙ్మయ చరిత్ర ఇది. తంజావూర్, మధుర, పుదుక్కోటాది వివిధ రాజ్యాలలో విరబూసిన వివిధ సాహిత్యశాఖలను సమగ్రంగా వర్ణించిన గ్రంథం. అది వరకు తంజావూరు ఆంధ్ర నాయకులను గురించి, సాహిత్యం గురించి, వేటూరి ప్రభాకరశాస్త్రి గారు, కురుగంటి సీతారామయ్యగారు మొదలయినవారు వ్రాసినవి చాల సంగ్రహాలు-800 పుటల ఈ ఉద్గ్రంథం దక్షిణాంధ్రయుగ సాహిత్యానికి అద్దంపట్టి, తర్వాతి పరిశోధనకు మార్గదర్శకం కావడమేకాక, యక్షగానాది దేశి రచనల ప్రత్యేక పరిశోధనలకూ దారిచూపింది. ఇవి రెండూ మద్రాసు విశ్వవిద్యాలయ ప్రచురణలు సుప్రసిద్ధ నాటకకర్త, మద్రాసు హైకోర్టు మాజీప్రధాన న్యాయమూర్తి 1962 అగస్టు 29న ఆకాశవాణి మద్రాసు కేంద్రం నుంచి ప్రసంగిస్తూ, దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయాన్ని బహుధా కీర్తించారు. "వెంకటరావుగారి గ్రంథంపై సమీక్ష—వారి విశాల దృష్టికి, పరిశోధన ప్రజ్ఞకు, సాహిత్యజ్ఞానానికి తార్కాణమిది. దక్షిణాంధ్ర రచనలతో అసభ్యశృంగారం ఎక్కువగా వున్నదన్న అపనింద పూర్తిగా తొలగించారు. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయమును గురించి ఇంత అమూల్యగ్రంథము రచించిన నిడుదవోలు వెంకటరావుగారిని, సాహిత్య ప్రియులందరు కొనియాడవలెను. ఇట్టి ఉత్కృష్టగ్రంథాన్ని ప్రకటించిన మద్రాసు విశ్వవిద్యాలయం వారూ ప్రశంసార్హులు."

మధురై విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం. వరదరాజనార్ ఈ గ్రంథాన్ని ఇలా కొనియాడినారు. 17-6-1971

ది సదరన్ స్కూల్ ఇన్ ది తెలుగు లిటరేచర్ - అనే మీ అమూల్యమయిన ప్రచురణ నేను ఎరిగినదే. అది తెలుగు పండితులకే కాకుండా తమిళనాడు చరిత్ర కారులకుకూడా ఉపయోగకరంగా ఉంటుంది. అది తెలుగు విశ్వవిద్యాలయాలన్నిటిలోనూ వాడబడటం, రెండు పరిష్కరణలు వెలువడటం నాకు సంతోషాన్ని కలిగిస్తోంది."

ఇ. ఆంధ్రవచన వాఙ్మయము :— తొలి తెలుగు శాసనం మొదలు 1900 వరకు వున్న వచనవాఙ్మయ చరిత్ర దీనికి 1958లో తెలుగు భాషా సమితి బహుమతి లభించింది. ఈ కర్నాటాంధ్రముల పరస్పర ప్రభావము : ఇది కన్నడ, తెలుగు భాషాసాహిత్య సంస్కృతుల పరస్పర సంబంధాన్ని, నన్నయకు పూర్వంనుంచి జరిగిన ఆదానప్రదానాలను తెలిపి ఉభయ ప్రజలకు సమైక్యం సాధించే ఉత్తమగ్రంథం. ఇది ఈ 1962లో రాష్ట్రసాహిత్య అకాడెమీ బహుమతిని అందుకుంది. ఉ. విజయనగర సంస్థానము సాహిత్యపోషణ ఇది విజయనగర సంస్థానాధీశులైన ఆనందగజపతి మున్నగు సాహిత్యాభిమానులు. పోషకులు చేసిన సాహిత్య సేవను వర్ణిస్తుంది. వెంకటరావు గారు విజయనగరం వారు గనుక, ఆయన నాన్నగారు గురుజాడఅప్పారావు గారితోపాటు సంస్థానంలో పనిచేసిన వారు గనుక, పెక్కు ఆసక్తికర విషయాలు తెలిపారు. దీనికి కూడ రాష్ట్ర సాహిత్య అకాడెమీ బహుమతి 1963లో లభించింది. ఊ. భాషా పరిశోధన-ప్రయోగవిశేషాలు : నిఘంటువుల కెక్కని అపూర్వ ప్రయోగాల అమూల్యగ్రంథమిది. మహావైయాకరణులు వర్ధులచిన సీతారామస్వామిశాస్త్రిగారు దీనిని ప్రశంసిస్తూ కాల్డ్వెల్ను విమర్శించుచు నొకద్రావిడవ్యాకరణమును వ్రాయ గుతూహలముగలదు. దానికి మీతోగూడి మీవంటివారొకరును, విద్వాన్ వెంకటరాజులు రెడ్డి గారి వంటివారల సహకారాలుండవలయును." అని 1951 ఫిబ్రవరి 26న ఒక పుత్రరం వ్రాశారు. ఋ. చిన్నయసూరి జీవితము-హిందూధర్మశాస్త్ర సంగ్రహము: చిన్నయసూరి శతజయంతి సందర్భగా రచించిన చిన్నయసూరి జీవిత చరిత్రఇది. దీనితోపాటే, ఇదివరకు ప్రచురితం కాని, హిందూ ధర్మశాస్త్ర సంగ్రహమనే చిన్నయసూరి అనువాదగ్రంథాన్ని ప్రచురించారు. ఈ అనువాదం లండన్లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉండగా, దాని మైక్రోఫిలింనకలు తెప్పించి, ప్రచురించారు. చిన్నయసూరి వచనరచన మరొకటి వున్నట్టు ఎవరికీ తెలియదు. చిన్నయసూరికీ, వేంకటరావుగారికీ కాకతాళీయంగా విశ్వ



విద్యాలయ సేవాకాలంలో పోలికలున్నాయి. చిన్నయసూరి 1845 నుంచి 1862 వరకు పనిచేయగా, వేంకటరావుగారు 1944 నుంచి 1964 వరకు చేశారు. (ఋ) ఉదాహరణ వాఙ్మయచరిత్ర; 1965 లో త్రిపురాంతకోదాహరణానికి పీఠిక వ్రాసిన అనుభవంతో ఉదాహరణ వాఙ్మయచరిత్రను పూనుకొని, యావదాంధ్రావని ప్రశంసాపాత్రంగా రచించారు. ఉదాహరణ కావ్యాలు తెలుగులోనే ఈ గ్రంథం ఉదాహరణ వాఙ్మయ క్రమాభివృద్ధిని వర్ణిస్తుంది. వెంకటరావుగారి రచనలన్నీ ఒక ఎత్తు ఉదాహరణ వాఙ్మయం ఒక ఎత్తు అని అన్నా అనుచితం కాదు. రెండు దశాబ్దాలుగా మరుగపడిన ఉదాహరణ వాఙ్మయశాఖను ఈయన పునరుద్ధరించి విశ్వనాథసత్యనారాయణగారువంటివారు ఈ శాఖనుచేపట్టే విధంగా ఉదాహరణ వాఙ్మయ చరిత్రమూలంగా ప్రవర్తింపజేశారు. నాటినుంచి ఈనాటి వరకు దాదాపు 40 మంది కవులు ఈ శాఖలో రచనలు సాగించి ఈయనను ఉదాహరణ వాఙ్మయోద్ధారక అని కీర్తించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రథమ కులపతి డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి ఇది గొప్ప చారిత్రక పరిశోధన. సాహిత్య విమర్శ అని ముక్తకంఠంతో ప్రశంసించారు. (ఎ) పోతన-దీనిని నేషనల్ బుక్ట్రస్టువారు ప్రచురించారు—1961. (ఏ) నియోగి సర్వస్వము; నియోగిశాఖ పుట్టుపూర్వోల వివరాలున్న గ్రంథం. దీనిని హైదరాబాద్ నియోగి మహాసభవారు ప్రచురించారు. (ఐ) కొప్పరపు కవుల చరిత్ర : ఆశుకవితకు, శతావధానానికి పేరుపొందిన కొప్పరపుసోదరుల చరిత్ర ఇది, దీనిని నియోగిమహాసభ ప్రచురించింది.

(3) మౌలికపరిశోధన వ్యాసాలు :

వెంకటరావుగారు దేశంలోని భారతి, సాహితి, త్రిలింగ, ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధం, కళ్యాణి, నా సంపాదకత్వంలో వెలువడిన పరిశోధన మున్నగు పత్రికలకేగాక, మద్రాసు విశ్వవిద్యాలయంవారి అన్నల్స్ ఆఫ్ ఓరియంటల్ రీసెర్చ్‌వంటి సంచికలకు, కళింగసంచిక, కాకతీయసంచిక, రెడ్డిసంచిక వంటి చరిత్రాత్మక సంచికలకు, పెద్దల సన్మాన సంచికలకు దాదాపు ఐదారు వందల వ్యాసాలువ్రాసి వుంచారు. ఇవి చాలవరకు భాషావాఙ్మయ, కవిచరిత, దేశగ్రామ, ప్రజాచరిత్రలకు సంబంధించినవే. పదప్రయోగాలను గురించి చర్చ విశేషంగా చేశారు. కవిచరిత్రలలోలేని పలువురు పెద్దలను గురించిన పెక్కు విశేషాలు వీటివల్ల తెలుస్తాయి. వ్యాసాల్లో సంస్కృత వాఙ్మయానికి సంబంధించిన మౌలిక వ్యాసాలూవున్నాయి. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వానికి పెక్కు వ్యాసాలు వ్రాశారు. తమిళకజగం ప్రచురించిన తమిళ్‌కలైకలంజానికి (తమిళ విజ్ఞాన సర్వస్వానికి) తెలుగుసాహిత్య, చరిత్ర, భాషాసంస్కృతులను గురించి చాలా వ్యాసాలు వ్రాశారు. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశానికికూడ పెక్కువ్యాసాలు వ్రాశారు. ఇన్ని వ్యాసాలు వ్రాసినవారు మరే పరిశోధకులూ లేరు.

భారతి మాసపత్రికతో ఆయనకుగల సంబంధం ప్రత్యేకంగా పేర్కొనదగ్గది. వేంకటరావుగారు వ్రాసిన ప్రతి అక్షరాన్నీ భారతి ఉగాది సంచిక, ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధం ప్రచురించాయి. కేవలం ప్రయోగాలేకాక, ప్రజలకు ఆసక్తి కలిగించే అవకాశాలు వేంకటరావుగారి లేఖినినుంచి రావాలని అప్పటి సంపాదకులు శ్రీ శివలెంక శంభుప్రసాదుగారికోరిక. ఆ విషయాన్నే ఆయన వేంకటరావుగారికి వ్రాసిన లేఖలో తెలియజేశారు.

భారతి కార్యాలయం
మద్రాసు, 30-6-64

శ్రీ వేంకటరావుగారికి
నమస్కారాలు

మీరు నాకు హైదరాబాదులో స్వయంగా ఇచ్చిన వ్యాసం జులై నెల భారతిలో రాగలదు.

ఒక మనవి. ఇలాటి వ్యాసాలుకాక సాహిత్యంలో ప్రజలకు అభిరుచి కలిగించే వ్యాసాలు వ్రాసిన మంచిది. పదప్రయోగాలు, యతిప్రాసలు మొదలైన వాటిని గురించి వ్రాయవద్దని మనవి.

చిత్తగించవలెను.
శంభుప్రసాదు

ఇలా వ్రాయడంలో ఉద్దేశం ప్రజలకు వేంకటరావుగారు దగ్గరగావుండాలనే. మరొక ఉత్తరం శంభుప్రసాదుగారి సౌజన్యం, గౌరవం వేంకటరావుగారి ఎడల ఎంత నిండు వున్నాయో తెలుపుతుంది.

మద్రాసు,
11-6-71

శ్రీ వేంకటరావుగారికి
నమస్కారములు

అ. భా. తెలుగు రచయితల మహాసభవారు తమకు సన్మానం చేయుట ఎంతో సమంజసముగా నున్నది శ్రీ నాగేశ్వరరావు పంతులుగారిని ఆసందర్భంలో తమరు స్మరించుట సమంజసముగానే యున్నది. కాని నాకు మీరు ఋణపడియున్నా ననుట ఏమాత్రమూ సమంజసముగాలేదు. మీరే నాకూ, భారతికికూడ పెద్ద అండ. మీ సద్భావమున్నచాలు.

చిత్తగించవలెను
శివలెంక శంభుప్రసాదు

(4) ప్రాచీనగ్రంథ పరిష్కరణ :

ప్రాచీనగ్రంథ పరిష్కరణలో మానవల్లి రామకృష్ణకవి వేటూరి ప్రభాకర శాస్త్రిగార్లకు దీటైన వేంకటరావుగారు విపుల పీఠికతో పరిష్కరించిన ప్రాచీన గ్రంథాలు కోకొల్లలు. పీఠికలు వ్రాయడం మనకు పాశ్చాత్యులనుంచి సంక్రమించిన పద్ధతి. బెర్నార్డ్‌షా పీఠికలు సుప్రసిద్ధాలు. ఆయన మిరాక్యులస్ బర్త్ ఆఫ్ ఎ లాంగ్వేజ్" అనే పుస్తకానికి వ్రాసిన పీఠిక పుస్తకాన్ని మించిపోయింది. వెంకటరావుగారు బెర్నార్డ్‌షాలాగ మొదట్లో బ్యాంకులో పనిచేశారు. పీఠికలూ పెద్దవి వ్రాశారు. కనుక ఆంధ్ర బెర్నార్డ్‌షా అని ఆప్తులు అనడంకద్దు. ఆయన బృహత్పీఠికలతో పరిష్కరించిన ప్రబంధాలను మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భండాగారం, తంజావూర్ సరస్వతీ మహల్ లైబ్రరీ, వావిళ్ళ రామస్వామి శాస్త్రి అండ్ సన్స్, ఆంధ్ర గ్రంథమాల మున్నగు సంస్థలు ప్రచురించాయి. పరిష్కరించిన పుస్తకాలు కొన్ని : (అ) ఖడ్గలక్షణ శిరోమణి, ఇదొక అపూర్వ శాస్త్రగ్రంథం. ప్రచురణ మ.ప్రా. (ఆ) విద్యావతీ దండకం. మ.ప్రా. (ఇ) కట్టా వరదరాజు రామాయణం. నాలుగు సంపుటాలు త.స. (ఈ) రాజగోపాలవిలాసం కాళాకవి రచించిన ఈ ప్రబంధం ఏకైక ప్రతిలభించింది. పీఠిక పెక్కు చరిత్ర కాంశాలతో అపూర్వమైంది. త. స. (ఉ) శివతత్త్వసారము - మల్లికార్జున పండితారాధ్యుడు. కృష్ణాపత్రిక ప్రచురణ (ఊ)అన్యవాదకోలాహలం-ఏకామ్రనాథుడు. వా.రా. (ఋ) నన్నిచోదని కుమారసంభవము. వా.రా. (ౠ) పాల్కురికి సోమనాథుని బసవపురాణము. ఆంధ్రగ్రంథమాల. (ఎ) నాచనసోముని ఉత్తర హరివంశము వా.రా. (ఏ) ఉత్తరహరి వంశం తృతీయాశ్వాసం సవ్యాఖ్యానం. విజయ భాస్కర పబ్లికేషన్స్. (ఐ) భాస్కర రామాయణము. వా.రా. (ఒ) ఆంధ్ర మహాభాగవతము. వా. రా. (ఓ) విప్రనారాయణ చరిత్ర-చదలవాడమల్లన ఆంధ్ర సాహిత్య పరిషత్తు. (ఔ) నాదింద్ల గోపకవి కృష్ణార్జున సంవాదము. వా.రా. (అం) వసుచరిత్ర వా.రా. (అః) ధనాభిరామము (క) వాల్మీకి చరిత్ర- తంజావూరు రఘునాథరాయలు. ఆంధ్ర విజ్ఞానసమితి. (ఖ) కదిరీపతిశుక సప్తతి. వా.రా. (గ) యాజ్ఞవల్క్య చరిత్ర (ఘ)సత్యభామాసాంత్వనము శృంగార కావ్య మండలి. (ఙ) రాధామాధవసంవాదము. ఆం.వి. స. (చ) సీతారామాచరిత్ర ఆ. సా. ప. (ఛ) భగవద్గీత వా.రా. (జ) అమరుకం-శిష్టుసర్వ శాస్త్రి (ఝ) సకల నీతి సమ్మతము రాష్ట్ర సాహిత్య అకాడెమీ (ఞ) ప్రబంధమణి భూషణము. రా.సా.అ. (ట) చారుచర్య- వా. రా. (ఠ) శ్రీ వేంకటేశశతకము— తాళ్లపాక అన్నమయ్య వా.రా. (డ) శతక

సంపుటం. రా. సా. అ. (థ) కవి జనాశ్రయం వా. రా, ఛందో దర్పణం. వా.రా. (ణ) లక్షణ సారసంగ్రహం ఆ.సా.వ. అప్పకవీయం వా.రా. (త) కవి సంశయ విచ్ఛేదం వా. రా. వ్యాకరణాలు-(థ) పట్టాభిరామ పండితీయము. (ద) రావిపాటి గురిమూర్తి శాస్త్రి వ్యాకరణం(ధ) ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణం వ. లఘువ్యాకరణం. (ప) ప్రౌఢవ్యాకరణం వా.రా. (ఫ) ఉద్భటారాధ్య చరిత్ర (బ) బసవోదాహరణం (సంస్కృతం-పాల్కురికి సోమనాథుడు.) ఆ. సా.ప. (భ) శబ్దరత్నాకరం బహు జనపల్లి సీతారామాచార్యులని ఘంటును. అదనంగా పదివేలపదాలను లనుబంధంగా ఇచ్చారు.

వెంకటరావుగారి గ్రంథ పరిష్కరణ పద్ధతి ఎలా వుంటుందో మిత్రులు మన్నవ ఉపేంద్రరావు గారు చక్కగా తెలిపారు. దానిలోని ముఖ్యాంశాలు తెలియ జేస్తాను. "శ్రీ నిడుదవోలు వారి పరిశోధన తీరు ఎలా వుంటుందని ఆసక్తికలగటం సహజం. అది వివరంగా తెలుగుకోవాలంటే ఆ గ్రంథాలన్నీ చదవాలి. ఆ గ్రంథాలంత గ్రంథం వ్రాయాలి. ఐతే ఒక మెతుకు పట్టి చూచినట్టుగా, వారు శివతత్త్వ సారమునకు వ్రాసినపీఠికను అతిక్లుప్తంగా చూద్దాం :- శివతత్త్వ సారమనేది ముందు ఏ రూపంలో ఎవరికి దొరికింది. తాళపత్రప్రతి. దానికాలం. వ్రాతప్రతి, ముద్రితప్రతులు:- ఇప్పటికెన్ని, ఎవరెవరివలన ఏయే కాలాల్లో, కన్నడ శివతత్త్వసారం ఎప్పుడు, ఎవరు బయటపెట్టారు. దానివల్ల కలిగినమేళ్లు. నష్టభాగ పూరణము, అర్థసంస్కరణ, యతి సంస్కరణము, గ్రంథ కర్తృత్వము, పండితారాధ్యుల కాలనిర్ణయము, దానికాధారభూతమైన కథలు, శాసనాలు, వానివాని సమన్వయము, పండితారాధ్యుల జీవిత చరిత్ర, వారిసంతతి, శివతత్త్వసారకృతికర్త, నన్నెచోడుని కృతిభర్త ఒక్కరేయని నిరూపణ, పండితుని మిగిలినకృతులు, అక్షరాంకగద్యం, (ఇది అముద్రితం గనుక మొత్తం వ్రాశారు) ఇలాగేస్తుతి శ్లోక పంచకం, పర్వతాష్టకం, శివశరణపదము మొత్తం ఇచ్చారు. అలభ్యకృతుల జాబితా, శివతత్త్వసార కావ్యత్వచర్చ, కందపద్య రచన శివతత్త్వసారానికి అనుకరణలు, సంస్కృతసాహిత్యంలో శివతత్త్వసారము, శివ భక్తులుగా సంస్కృత మహాకవులు, పండితత్రయము, బసవవాఙ్మయము, భక్తులకథలు, ఛందోవిశేషాలు, వలపలగిలిక, వ్యాకరణ విశేషాలు, పండితారాధ్యుని ప్రశస్తి, సాహిత్యము, మత సంప్రదాయాలు :— ఇలా వరదనీరులాగ బంధనముంచి, అడ్డమొచ్చిన దాన్ని, చుట్టుపక్కలదాన్ని అంతా లాక్కుంటూ, నురుగులతో ఉరుకుతూ పారుతుంది. అసలు విషయం కంటే చుట్టుపట్ల విషయం ఎక్కువగా వున్నదే అనిపిస్తుంది. కాని నిజంకాదు. ప్రసక్తాను ప్రసక్తంగా వచ్చిన చుట్టుపట్ల విషయాలకంటె అసలు విషయమే అత్యధికం. అర్థసంస్కరణము- అనే వి... కింద 'అన్నడు' అన్న దానిని గూర్చి పూర్వపీఠికలో వున్నపొరపాటును గూర్చి దాని అర్థనిర్ణయంలో శ్రీ వేంకటరావుగారి బహుభాషావేత్తృత్వము, పరిశోధకసామర్థ్యము తెలియడమే గాక సంప్రదాయ విజ్ఞతకూడ స్పష్టమౌతుంది. పూర్వముద్రణలో

నిన్నెరుగుచు దన్నెరుగని
యన్నడు శివయోగమగ్నుడనబడుమదిలో
నిన్నును దన్ను నెరింగెడి
యన్నడు శివయోగమగ్నుడన బడును శివా

అని ఉన్నదనీ, దాని పీఠికలో అనాడు అనుటకు అన్నడు, మలహడు అనుటకు మలహు అను మారు రూపములు కానవచ్చుచున్నవి. అనువాక్యము కలదని, ఆ అభిప్రాయం పొరపాటని "కన్నడభాషలో అన్నన్, అన్నళ్ అనగా అలాటివాడు, అలాటిస్త్రీ, అను నర్థములు కిట్టెలో నిఘంటువులో నున్నవి. కన్నడమున అన్నన్ తెలుగున అన్నం 'డు' అన్నడు అని రూపాంతరము చెందినది." అని వ్రాశారు నిడుదవోలువారు. అద్వైతయోగులు తమ్ము మరచి బ్రహ్మనమాత్ర మెరుగుదురు. ఆవిధంగా నిజస్థితిని తెలుసుకోరు. అది సరిగాదు. శివయోగులు శివుని తన్ను కూడ యోగస్థితిలోగూడ తెలిసివుంటారు. కనుక పై పద్యం

నిన్నెరుగుచు దన్నెరుగని
యన్నడు శివయోగమగ్నుడనబడ డెపుడున్
నిన్నును దన్ను నెరింగెడి
నన్నడు శివయోగమగ్న డనబడును శివా

అని ఉండాలని తీర్మానించారు. వారి రచనలు మొత్తం చూస్తే ఇలాటి అధికార నిర్ణయాలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి...." (1973-11-8 కృష్ణాపత్రిక)

(5) మెకంజీ రికార్డులు :

గడచిన శతాబ్దంలో సర్వేయర్ జనరల్‌గావున్న కర్నల్ కాలిన్ మెకంజీ నారాయణరావు వెంకటరావు అనే మహామేధావులను నియమించి దక్షిణాపథంలోని ముఖ్యంగా తెలుగుదేశంలోని మారుమూల పల్లెల వివరాలు సేకరించారు.వీటిని లోకల్ రికార్డ్స్ అంటారు. వీటిలో అనాటివరకువున్న తెలుగుజాతి సర్వస్వం నిక్షిప్తమై వుంది.ఇవి 200 సంపుటాలలో వున్నాయి. ఇవే దక్షిణభారత చరిత్రకు, ముఖ్యంగా తెలుగునాడుచరిత్రకు మూలాధారం. ఈ రికార్డులలో ఎక్కువభాగం తెలుగులో వుంది. వెంకటరావుగారు చరిత్రలోను, తెలుగులోను నిష్ణాతులుగనుక వాటిని ఆంగ్లంలోకి అనువదించేపనిని మద్రాసు విశ్వవిద్యాలయంలో జూనియర్ లెక్చరర్‌గా వున్నప్పుడు స్వీకరించారు. ఆయన 96 సంపుటాల విషయాలను దాదాపు సగం సంపుటాల విషయాలను- ఆంగ్లంలో సంక్షేపించారు. దీనివల్ల చరిత్రకు మహోపకారమైంది.

6. పీఠికలు :

ఆధునికుల పెక్కు గ్రంథాలకు వెంకటరావుగారు పీఠికలువ్రాసి వాటి శోభను ఇనుమడింపజేశారు. (అ) వీరభద్ర సముచ్చయం-వీరభద్ర సంప్రదాయానికి చెందిన గ్రంథం-భాస్కరలింగశాస్త్రి (ఆ) మూలస్థానేశ్వరస్తుతి శతకం-తిరుపతి వేంకటకవులు సంస్కృతం, (ఇ) ఆంధ్ర వాఙ్మయ చరిత్ర - వంగూరు సుబ్బారావు (ఈ) శతకకవుల చరిత్ర-వంగూరి సుబ్బారావు, (ఉ) దుర్గాధిపరులు-

కె. వెంకటరాయశర్మ, (ఊ) అష్ట దిగ్గజ కవులు - కె. ఎస్. కోదండరామయ్య (మాజీ మద్రాసు ఎం. ఎల్. ఎ.), (ఋ) అడిదము సూరకవి - ఎ. ఎస్. రామారావు, (ౠ) చిత్ర రత్నాకరం - జి. శ్రీరామమూర్తి, (ఎ) ఛందోరీతులు- రావూరి దొరస్వామిశర్మ, (ఏ) కఠోపనిషత్ - వి. వరలక్ష్మి, (ఐ) ఇదంతా- కె. హనుమంతరావు, (ఒ) మా మహారాజా వారితో దూరతీరాలు - కె. వెంకటరావు, ఇది పిఠాపురం మహారాజుగారి విదేశ యాత్రాచరిత్ర (ఓ) జానుతెనుగు- డాక్టర్ వర్లమూడి గోపాలకృష్ణయ్య. (ఔ) మానవల్లి రచనలు-డాక్టర్ పి. ఎస్. ఆర్. అప్పారావు సంకలనం, (అం) అమరుకం - ఎ. వెంకటేశ్వరశర్మ (అః) పుష్పబాణ విలాసము - భట్టారం మల్లికార్జున. (క) దీపసభ-డాక్టర్ బోయిభీమన్న (ఖ) గణేశ్వరీయం - కె. యస్. రఘురామస్వామి. ఈ పీఠికలో గణాపత్యానికి సంబంధించిన అమూల్య విషయాలు చెప్పారు. (గ) దాశరధీశతకం - డాక్టర్ దాశరధి కృష్ణమాచార్యులు, (ఘ) షట్పదీమేఘసందేశం - జి. వీరయ్య 17 వ శతాబ్దమునుంచి వున్న మేఘ సందేశాల అనువాద చరిత్రను వివరించారు. (ఙ) గోవింద రామాయణము - ఆత్మకూరి గోవిందాచార్యులు. ఈ పీఠిక తెలుగులోని రామాయ సాహిత్య సమీక్ష (చ) గిడుగు వంశవృక్షము - గిడుగు లక్ష్మీకాంతమ్మ (ఛ) వీరభారతం - వి. లక్ష్మీపతిరావు (జ) పారాశరీయ హోర - విజయరామ గజపతి. (ఝ) తిక్కన - వూమారు సుబ్బారావు (ఞ) ఎస్తేరు (నాటకం) - బి. పురుషోత్తం.

(7) సమీక్షలు :

వెంకటరావుగారు వివిధ పత్రికలవారు పంపిన గ్రంథాలను (వందలకొలది) సమీక్షించారు. ఎక్కువగా భారతి మాసపత్రికలో సమీక్షలు వెలువడ్డాయి. తెలుగు దేశంలో గ్రంథ సమీక్ష అంటే ప్రత్యక్ష విరోధమే. విమర్శను సహించని తెలుగు జాతి లోపమది. వెంకటరావుగారు ప్రతి విషయంలోను ప్రామాణికత్వం కోరేవారు గనుక సమీక్షలను కొంత కరకుగానే జేసేవారు. దానివల్ల ఆయనకు పలువురు శత్రువులయ్యారు. సత్యంబ్రూయాత్ ప్రియంబ్రూ యాత్- అనే స్వభావం కాదు వారిది. సత్యం ఎప్పుడూ నిష్ఫ గనుక, పరుషంగావుంటే ఏం? - అన్నది వారి భావం.

(8) ఆంగ్ల రచనలు :

వెంకటరావుగారు చక్కని విక్టోరియన్ ఇంగ్లీషు వ్రాసేవారు. జర్నల్ ఆఫ్ ది మద్రాసు యూనివర్శిటీకి, ఓరియంటల్ కాన్ఫరెన్సులకు ఆయన ఆంగ్లంలో అమూల్యమైన మౌలికవ్యాసాలు వ్రాసి ఆంధ్రేతరులకు తెలుగు గొప్పదనాన్ని వారికి తెలియని వారి భాషల విషయాన్ని తెలిపారు.

(అ) కులశేఖర ఇన్ తెలుగు (ఆ) ది లిటరరీ అండ్ ఫిలసాఫికల్ వర్క్స్ ఆఫ్ తరిగొండ వెంగమాంబ (ఇ) తెలుగు లిటరేచర్ అండర్ మైసూర్ రూలర్స్ (ఈ) డినరేషన్ ఆఫ్ తెలుగు లాంగ్వేజి బయి ఎల్లిస్ (ఉ) హిస్టరీ ఆఫ్ తెలుగు లింగ్విస్టిక్స్ (ఊ) త్రీ డికేడ్స్ ఆఫ్ తెలుగు ప్రోజ్ (ఋ) స్టడీస్ ఇన్ ది హిస్టరీ ఆఫ్ తెలుగు లింగ్విస్టిక్స్. (ౠ) పయనీర్స్ ఆఫ్ ఇంగ్లీష్ రయిటింగ్ ఇన్ ఇండియా, (ఎ) ది డేట్ ఆఫ్ నన్నెచోడదేవ. (ఏ) ఏజ్ ఆఫ్ శ్రీనాథ ఇన్ తెలుగు లిటర్‌నర్. (ఐ) ఆంధ్రభోజ ఎ, త్యాగరాజ మొదలియార్ (ఒ) తమిళయన్స్ కంట్రిబ్యూషన్ టు తెలుగు లిటరేచర్ (ఔ) తెలుగు ఇన్‌ఫ్లుయన్స్ ఇన్ ది సౌత్ (అం) ఎల్లిస్ కంట్రిబ్యూషన్ టు ద్రవిడియన్ ఫయి- లాంజీ. (అః) తెలుగు అండ్ కన్నడ లిటరేచర్, (క) విచిత్ర రామాయణ ఇన్ తెలుగు ఇంటర్‌నేషనల్ ఓరియంటలిస్టస్ కాన్ఫరెన్స్‌కి పంపిన వ్యాసాలు: (ఖ) జీనియస్ ఆఫ్ తెలుగు లాంగ్వేజి ఎండ్ లిటరేచర్, (గ) మయూరాస్ సూర్య శతక ఇన్ తెలుగు లిటరేచర్ (ఘ) తెలుగు లెక్సికోగ్రపీ ఆలిండియా లింగ్విస్టిక్స్ కాన్ఫరెన్స్, (ఙ) రామాయణ ఇన్ తెలుగు లిటరేచర్ (ఆల్ ఇండియా పి. ఇ. ఎన్. కాన్ఫరెన్స్) (చ) త్రీ డికేడ్స్ ఆఫ్ తెలుగు ప్రోజ్ (ఆకాశవాణి సాహిత్య సమ్మేళన్) (ఛ) ఎ సర్వే ఆఫ్ గ్రామాటికల్ లిటరేచర్ ఇన్ తెలుగు. (జ) తెలుగు స్క్రిప్ట్ రిఫార్మ్ సెమినార్ (ఝ) వసంతరాజీయం - కె. బి. పాఠక్ కమ్మెమొరేషన్ వాల్యూమ్. (ఞ) కృష్ణ దేవరాయ ఎండ్ హిస్ లిటరరీ సర్కిల్ - విజయనగర సెక్సెంటినరీ వాల్యూమ్. (ట) మయూర శతక- కె. వి. రంగస్వామి అయ్యంగార్ కమ్మెమొరేషన్‌వాల్యూమ్ (ఠ) తమిళ పోయెట్స్ ఎండ్ పాట్రన్స్ ఆఫ్ తెలుగు లిటరేచర్-ప్రొఫెసర్ ఆర్. సేతుపిళ్ళయి కమ్మెమొరేషన్ వాల్యూమ్. (డ) లిటరరీ జర్నలిస్మ్ (తెలుగు) వి. ఆర్. నార్ల షష్ట్యబ్దిపూర్తి కమ్మెమొరేషన్ వాల్యూమ్. (ఢ) తెలుగు ఎ లింక్ బిట్వీన్ నార్త్ ఎండ్ సౌత్ - ఆంధ్ర సావనీర్ న్యూఢిల్లీ. (ణ) వర్క్స్ రిలేటింగ్ టు దత్తాత్రేయ కల్ట్ ఇన్ తెలుగు లిటరేచర్ ప్రొఫెసర్ టి. ఎమ్. పి. మహదేవన్ 60త్ బర్త్‌డే వాల్యూమ్. (త) తెలుగు లిటరేచర్ అండర్ నేషనల్ గవర్నమెంట్ మదరాస్ గవర్నమెంట్ సావనీర్ (థ) గిరిజన్ ఎండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలుగు డ్రామా-మదరాస్ నాటక అకాడమీ. (ద) తెలుగు కంట్రీ -లాండ్ ఆఫ్ డాన్స్ రొమాన్స్ జుబిలీ వాల్యూమ్ ఆప్ మదరాస్ ఆర్యవైశ్య సమాజ్ (ధ) తెలుగు లిటరేచర్ అండ్ మధుర నాయక్స్ జర్నల్ ఆప్ ఆంధ్ర హిస్టారికల్ సొసయిటీ రాజమండ్రి.

(9) రేడియో ప్రసంగాలు :

వేంకటరావుగారు మద్రాసులో ఆకాశవాణి కేంద్రం పెట్టినప్పటినుంచి రేడియో ప్రసంగాలు చేశారు. తర్వాత హైద్రాబాద్ కేంద్రంలోను చేశారు వందకు పైగా వుంటాయి ఆ ప్రసంగాలు. రేడియో ప్రసంగాలు సామాన్య ప్రజలకు ఉద్దేశించినట్టివి గనుక వాటితో సారళ్యం తప్పదు. వెంకటరావుగారు (అ) తమిళ సంస్కృతిపైన 12, (ఆ) ఆర్య సంస్కృతిపైన 15, (ఇ) చరిత్రపైన 10, (ఈ) సాహిత్యచరిత్ర, కావ్యాలు 40, (ఉ) భాషాశాస్త్రం 10, (ఊ) కళావిజ్ఞానాది శాస్త్రాలు 25, వెంకటరావుగారి మొట్టమొదటి రేడియోప్రసంగం దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి ఊర్వశి కావ్యంపైన-పాటపాడించు సఖీ ఊర్వశి-19-7-1944.

(10) సభా ప్రసంగాలు :

వెంకటరావుగారు గొప్ప వక్త అని అనను. కాని, ఆయన ప్రసంగాలు విషయగర్భితాలు, పరిశోధన పరిమళ భరితాలనే దృష్టితోనే వినేవారు. ఆమేరకు శ్రోతలకు సంతృప్తిగా ఉండేది. ఆయన పెక్కు సభలలో ప్రసంగించారు. వాటిలో కొన్ని పేర్కొంటాను. (అ) తెలుగునాటక సాహిత్యానికి కోలాచలం శ్రీనివాసరావుగారి సేవ - కోలాచలం శ్రీనివాసరావు 20 వ వర్ధంతి, బళ్ళారి, 1944. (ఆ) వీరేశలింగం సమకాలికులు-వీరేశలింగం 105వ జయంతి రాజమండ్రి 1953. (ఇ) గుడివాడ - పరిసర బౌద్ధ శిథిలాలు - ప్రథమాంధ్ర పరిశోధక మహాసభ అధ్యక్షోపన్యాసం, గుడివాడ, 1959. (ఈ) హైస్కూలు, కాలేజి తెలుగుపండితుల పుట్టు పూర్వాలు - అఖిలాంధ్ర ఉపాధ్యాయ పండిత పరిషత్తు, పంచమసమావేశం అనంతపురం, 1930. (ఉ) పాల్కురి సోమన, అతని కృతులు - పాల్కురికి సోమన జయంతి, వరంగల్లు, 1960. వెంకటరావుగారికి బసవపురాణం 'శ్రీ గురుదేవునంచితగుణోత్తంసు' అని ప్రారంభించి, 'అనుపమంబుగ సప్తమాశ్వాసమయ్యె' అనే చివరి చరణం వరకు కంఠపాఠం. అలాగే పండితారాధ్య చరిత్రకూడ. కనుక ఆ సభలో అరగంటసేపు వాటిలోని కొన్ని ఘట్టాలు ఒప్పజెప్పారు. సువర్ణహస్త కంకణంతో సన్మానం జరిగింది. (ఊ) మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి గ్రంథాల సమీక్ష - ఆంధ్రనలంద తృతీయ వార్షికోత్సవం, గుడివాడ, 1961. (ౠ) బోయి భిమన్న కావ్యాలు - ఆంధ్ర నలంద చతుర్థ వార్షికోత్సవం, గుడివాడ, 1962.

11. సభ్యత్వాలు :

వెంకటరావుగారు విశ్వవిద్యాలయంలో స్థానాపన్నులుగాను, (ఎక్స్ అఫిషియో), సమర్థతతోను పెక్కు సంఘాలలో సభ్యులుగా వున్నారు. 1957 లో మద్రాసు విశ్వవిద్యాలయం శతజయంతి జరిగినప్పుడు తెలుగుశాఖ పుస్తక ప్రదర్శనం ఏర్పాటుచేశారు. దానిలో అందరినీ ఆకర్షించింది 1869 నాటి మద్రాసు విశ్వవిద్యాలయం మెట్రిక్యులేషన్ పరీక్ష ఇంగ్లీషు వాచకం, దాని ప్రమాణం

ఇప్పటి ఎం. ఎ. తో సమానమని తర్వాత జరిగిన గోష్ఠిలో పలువురు అభిప్రాయ పడ్డారు. ఆయన సభ్యులుగావున్న సంఘాలు కొన్ని:- (అ) కందుకూరి వీరేశలింగం పంతులు శతజయంతి సంఘం, (ఆ) గురజాడ శతజయంతి సంఘం, (ఇ) అచంట వేంకట సాంఖ్యాయనశర్మ శతజయంతి సంఘం, (ఈ) ఆదిభట్ల నారాయణదాసు శతజయంతి సంఘం, (ఉ) దక్షిణ రైల్వేమండలం అనువాదసంఘం, (ఊ) లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా, (ఋ) ఫిలిం సెన్సార్‌షిప్ ప్రాంతీయబోర్డు, (ౠ) రాష్ట్ర సాహిత్య అకాడెమీ (ఎ) ప్రాచ్య లిఖిత పుస్తక విక్రయసంఘం అధ్యక్షత, (ఎ) మద్రాసు విశ్వవిద్యాలయం అన్నల్స్ ఆఫ్ ఓరియంటల్ రీసెర్చ్. సంపాదకత్వం, (ఐ) జాయింట్ కంపయిలర్, కంపారిటివ్ ద్రవిడియన్, వొకాబులరీ, (అం) సాటి సామెతలు - దక్షిణభారత బుక్‌ట్రస్ట్

(12) అప్రకటిత రచనలు :


వేంకటరావుగారి అప్రకటిత రచనలు చాల ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి [అ] తెలుగు కవుల చరిత్ర రెండవ భాగం. [ఆ] అచంట వెంకట సాంఖ్యాయనశర్మ జీవితం. [ఇ] గాంధీ సాహిత్యం, [ఈ] శ్రీరామగీతామృతం, [ఉ] చాటుపద్య మణిహారం. దీనిలో ఆయన అప్పుడప్పుడు వ్రాసిన చాటువులు ప్రకటితాలు, అప్రకటితాలూ వున్నాయి. [ఊ] శ్రీరామగీతామృతం, [ఋ] వేంకటేశ్వరశతకం - ఇది నన్నయ మొదలు నేటివరకువున్న కవులు, ప్రముఖులపై చెరి ఒక పద్యంగా వ్రాసింది. 2000 పద్యాలు. [ఋ] శబ్ద రత్నాకరానుబంధం - ఇది చాల ముఖ్యమైనది. ఇదివరకు ఏ తెలుగుకోశంలోనూ చేరని 10 వేల పదాలను కార్డులపై ఎక్కించివుంచారు. ఉదాహరణకు ఒక కార్డు వివరణ ఒరవడి - ఇది తప్పు. వఱువడి, వరువడి, వరివడి. సరైన రూపాలు. తమిళలో వరివళిమ, వరివు. కన్నడంలో బరదెదొడ, వరువడి మలయాళం - బరిముళి, వడిపాలీలోవుంది [ఎ కొమర్రాజు లక్ష్మణరావుగారి జీవితచరిత్ర ఆంధ్రాంగ్లాలలో. [ఏ] ఆంధ్ర వాఙ్మయచరిత్ర. ఆరు సంపుటాలు.

విచిత్ర వ్యక్తిత్వం :

వెంకటరావుగారిది విచిత్రమైన వ్యక్తిత్వం. అమాయికత, ఆగ్రహం ఆవేశం కలబోసిన స్వభావం. సాహిత్యంతప్ప లౌకిక విషయాలు తెలియవు. అకారణంగానే ఉద్రేకపడే ప్రకృతి. సాహిత్యంలోలాగే వ్యక్తిగత విషయాలలోను శాఖాచంక్రమణం ఎక్కువ. కాని ఎంత శత్రువైనా ఎదుటబడితే కౌగలించుకొనే సరళత. 1966 లో కాటోలు వేలూరి శివరామశాస్త్రిగారి స్మారక సభలో వెంకటరావుగారు ప్రసంగించారు. కాటూరి వేంకటేశ్వరరావుగారు అధ్యక్షులు. ఆయన వేంకటరావుగారిని పరిచయంచేస్తూ "బందరులో ఒక నాదస్వర విద్వాంసుడుండేవాడు. ఆయన ఆలాపన గంటసేపు వాయించేవాడు. కృతి ప్రారంభమయ్యేవేళకు తెల్లవారేది. అలాగే వెంకటరావుగారి ప్రసంగంలో పీఠికాభాగం ఎక్కువ" అన్నారు. ఎవరేది చెప్పినా, నమ్మి, విరుచుకు పడేవారు. చిన్నసంఘటన నాకు సంబంధించింది మరువలేను. అది వేంకటరావుగారి పరప్రత్య యనేయస్వభావానికి సంబంధించింది. ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంగా ఆంధ్రప్రభ పెద్దప్రత్యేక సంచిక వేయదలచింది. అప్పుడు నేను ఆంధ్ర ప్రభలో పనిచేస్తున్నాను. నార్లగారి తరపున ఆయనను కలుసుకొని ఆధునిక సాహిత్యంపై ఒక వ్యాసం వ్రాయండని కోరాను. సరే ఒప్పుకొన్నారు. పత్రిక పక్షాన ఉత్తరం కూడ తర్వాత ఆయనకు అందింది. ఇంతలో తెలుగుభాషా సమితిలో పనిచేసే వారొకరు ఆయనను రెచ్చగొట్టారు. "మాస్టారూ, మీతో ప్రాచీన సాహిత్యం పైన వ్రాయించకుండా ఆధునిక సాహిత్యంపై వ్రాయమనడం మిమ్మల్ని అవమానం చేయడానికే." అని ఆయన చెవిలో వేశాడు. దానితో వెంకటరావుగారు రెచ్చిపోయారు. ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవం సమీపిస్తున్నది పత్రిక చాల వరకు పూర్తయింది. వెంకటరావుగారి వ్యాసంకోసం పదిసార్లు తిరిగాను. (ఆయన వద్దకు 'పరిశోధన పత్రికకై వ్యాసాలకోసం తిరిగేవాణ్ని. దానికి వ్యాసయాత్ర అని పేరు పెట్టాను) మరి పదిసార్లు వ్యాసయాత్రచేశాను. నార్లగారు ఇంకారాలేదే వ్యాసం ? అని పదే పదే అడుగుతున్నారు. వెంకటరావుగారు ఏదో నాకు చెబుతున్నారు. చివరిసారిగా అడిగాను- అప్పుడు నా మీద విరుచుకుపడ్డారు. మీ పత్రికవాళ్లకసలు బుద్ధుందా ? నన్ను అవమానం చేస్తారా ? అసలంసలు పైసలు చాన్సలరు గూడ నాకు లెక్కలేదు. మీ పత్రిక ఒక లెక్కా ? ఆయన సభలసలు చెప్పాడు నన్ను అవమానించడానికే అసలీ సబ్జక్టిచ్చారట "అని ఆయనకు కోపంవచ్చినప్పుడు అసలు ఆసులోకందెలాగ మాటల మధ్య, సమాసాల మధ్య దొర్లడి నాకు ఆశ్చర్యమయింది. "ఎవరండీ ఆయన ?" అనడిగాను. చెప్పారు. నాకు మరింత ఆశ్చర్యమయింది. "నేను మీ వద్దకు ఇరవైసార్లు తిరిగాను. ఎడిటర్ నుంచి మీకు ఉత్తరం వచ్చింది. మీరు ఏ విషయమైనా గొప్పగా వ్రాయగలరనే కదా, ఉత్తరం వ్రాయడం. ఇలా వుండగా, ఆయనెవరండీ ? పత్రికకూ ఆయనకూ, ఏమి సంబంధం ? ఆయన చెబితే మీరు వినడమేమిటి ! మిమ్మల్ని అవమానించదలచుకుంటే ఇన్నిసార్లు మీ వద్దకు తిరుగుతానా ?" అన్నాను. నాదంతా అరణ్యరోదనమయింది. ఆయన ససేమిరా వినలేదు. ఆయన వ్యాసం లేకనే ప్రత్యేక సంచిక వెలువడింది. వారం తర్వాత. నేను ఆయనను కలుసుకొన్నాను. "మీ అమూల్యమైన వ్యాసం లేనందుకు విచారంగా వుంది సార్. మీరు ఎవరిమాటోవిని కోపగించుకొన్నారు, మీ సరళతను వాళ్లు దుర్వినియోగం చేసుకుని మిమ్మల్ని రెచ్చగొట్టారు. అన్నాను అటు తర్వాత కొన్నాళ్లకు గాని ఆయన కుదుటపడలేదు.

ఇంతయినా ఆయన ప్రేమగౌరవార్హులుగానే వుండేవారు. ఆయన వ్యక్తిగతలోపాలను కప్పిపుచ్చే గొప్పగుణాలు అసాధారణమైనధారణ, నిరంతర పరిశ్రమ. ఆంధ్ర సాహిత్యంలోని ప్రయోగాలన్నీ నాలుకచివర నాట్యమాడేవి. ఆంధ్రదేశచరిత్ర, వాఙ్మయాలేకాక తక్కిన అనేక విషయాలు, ధర్మశాస్త్రం న్యాయశాస్త్రం విషయాలు వాచోవిధేయాలు. పలువురు విశ్వవిద్యాలయాధ్యాపకులకు గీర చాల వుంటుంది. వెంకటరావుగారికి ఏకోశనాలేమ. ఒక స్థానంలో వున్నవారు సామాన్యంగా ఇతరులను గుర్తించరు. ఏదో వాత్సల్య దృష్టితో చూస్తారు. వెంకటరావుగారు ఏకొద్ది యోగ్యతవున్నా సరే, ఏలాంటి అరమరలూలేక తమతో సాటిగా గౌరవించేవారు. పలువురు సంఘ సంస్కారవాదులేకాని, సంస్కర్తలుకారు. వెంకటరావు తమపెద్దకొమార్తె సౌ. జోగాబాయికి శాస్త్రోక్తంగా వర్ణాంతర వివాహం చేశారు.

తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవ ప్రభావం ముప్పేటగా పడిందని నా నమ్మకం. 1. ఉదాహరణ వాఙ్మయ చరిత్రను ఆయన వెలువరించిన పిదప,



శఙ్కరజయన్తి

శ్రీ కోట సుందరరామశర్మ

కనపడని విహాయసంలో
వినపడింది ఋచారోచి
పరంబ్రహ్మ పెద్దగీతి
యాయజూకమాడుకొంది;
సామగీతి పాడుమంది;
ఆధర్వణం వాడుకొంది
నలుపక్కల చూస్తున్నా
కలిపురుషుడు వానివంక
చూడకుండ ఉండలేక
పోయినాడు; వాని నవ్వు
ఈనాటికి ఫక్కుమంది
వేచియున్న తనకాలం
వచ్చిందని మరపిస్తే,
అస్తమాన సూర్యరశ్మి
నాకాశం మింగేస్తే,
చీకట్లో చిందులాట
పుణ్యాత్ములు వెలిగించిన
దీపం కొడిగట్టుతోంది
నిద్రాణ దరిద్రాణపు
దీపకాంతిలో కనపడు
రంగు లసలు వౌతాయా?

విగ్రహాలు వెలిసినాయి,
అగ్రహాలు బలిసినాయి.

'ఉండం, డాగం, ఢిదిగో'
నంటూ మునుముప్పక్కల
గర్జించిన సింహాలకు
చీకట్లవి తెల్లవెల్ల
బారినాయి, దాగినాయి

కాఫీ గత ప్రాణాలకు
శక్తి చచ్చిపోతుంటే
పూలన్నీ సజ్జలోంచి
జారి జారి పోయినాయి

చేసుకొనే జయంతుల్లో
ఒకటి ఆది శంకరులది
దీర్ఘోపోద్ఘాతానికి
సంగ్రహాతి సంగ్రహంగ
సాయముపన్యాసంలో
సన్న్యాసులు గొంతుచించు
కొంటూంటే అస్మదాది
'సన్నాసుల' చెవుల బడ్డ
దెందాకా అర్థమైందో!
వేదాంతం చెవిటిసంకు;
అర్థమవని దద్వైతం

'మామేకం శరణం వ్రజ'
అని గీతలు చివరకన్న
దింకా ధ్రువపరిచిందని
'అన్నం బ్రహ్మేతి' అనే
మాటొక్కటి ముడిపడింది.
కడుపులోని ఎలుకమూక
కదలాడిన సందడైంది.
రెండో సినిమా ఆటకు—
(ఒక్కో ఒక్కసంతానం
మూడుసార్లఎస్సెస్సీ
పై ఇంటరురెండో సం॥
అట్టెండెన్సొక మోసం;
తహతహ ఫలితంకోసం)
వచ్చేకొడుకెదురైతే
"అన్నంలోకేమిట్రా
అమ్మచేసిపెట్టి"ందని
ఆకలి ప్రశ్నించకుండ
ఉండలేక పోయిందేం!
ఉపన్యాస సారాంశం:
శంకరమాయావాదం,
బుర్రంతా తిరుగుతోంది,
మాయాత్మల సంయోగం;
త్రిగుణమ్ముల సాంకర్యం,
సర్వజగత్ సృష్టిగాథ.
'అన్నాద్ భవన్తి భూతాని;'
కనకదార కలవరింత
అయ్యగారి వస్తుధ్వని
అమ్మగారి భూషాధ్వని
హాల్లో అబ్బాయిగారి
వాచ్య మవని సరసధ్వని.
'ఆనందో వర్ధతాం;' ప
రీక్షాప్లవతే తరాం;
'సత్యమేవ జయతే' అని
ఎవరో మరి అంటున్నది?
ఆనందో బ్రహ్మ' అన్న
ప్రాజదువును పోషించే
ఆచార్యుల పటంమీాది
పూలమాల వాడడాని
కెన్నాళ్లో పట్టదుగా

దాని ప్రభావం కవులపై పడి, దాదాపు 40 ఉదాహరణ కావ్యాలు వెలువడ్డాయి. బడాబడాకవులే దానికి పూనుకున్నారు. దానితో ఆయన ఉదాహరణ వాఙ్మయోద్ధారకులయ్యారు. ఆయన దక్షిణదేశీయాంధ్రవాఙ్మయం దక్షిణాంధ్రంలోని వివిధ దేశి రచనాశాఖల సమగ్రవిస్తృత పరిశోధనకు కారణమయింది. ఆ మహాగ్రంథం తన ప్రభావాన్ని తర్వాతి పరిశోధనలపై పూర్తిగా నెరపింది. 2. వీరశైవవాఙ్మయ ప్రచారం ఆదివరకు వీరశైవ వాఙ్మయ సంవృతద్వారం. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు బసవపురాణానికి గొప్ప ప్రామాణికమైన పీఠిక వ్రాసి ఆ సాహిత్యభండారం తలుపులు తెరిచారు. వెంకటరావుగారికి వారి నాన్నగారి నుంచి సంక్రమించిన వీరశైవ సాహిత్యం ఎంతోమేలు చేకూర్చింది. దాని సహాయంతో ఆయన ఆ సాహిత్య ద్వారాలు బార్లాతెరిచి, గొప్పప్రచారం చేశారు. చేతికందినవి అందినట్టు సాహితీవల్లభులకు చూరవిచ్చారు. అన్వేషణ జ్యోతితో ఆరంభమయిన అన్వేషణ జ్యోతి 15-10 1982 రాత్రి ఆరిపోయింది.

వెంకటరావుగారికి ఐదుగురు కుమారులు. శివసుందరేశ్వరరావు, పార్వతీశ్వరరావు, జగ్గారావు, సర్వేశ్వరరావు, సూర్యనారాయణరావు, కుమార్తెలు సౌ జోగాబాయి, సౌ॥ లక్ష్మి. కుమారులలో శివసుందరేశ్వరరావు, సర్వేశ్వరరావు సాహిత్యంలో వున్నారు. శివసుందరేశ్వరరావు తండ్రికి దీటయినవాడు వెంకటరావుగారు ఆయనను గురించి.

"ఆరయ నామ సాహితికి నంతయునేకము నైనరీతిగా
వారసుడయ్యె నాకు నలవాదగు తోడును చేతితోడుగా
ఆరయనాదుసేవలను నంచిత రీతిని చేయుశ్రద్ధతో
పేరిమి వాని బ్రోవుమురవేరుగలాడవు వేంకటేశ్వరా"

అని అవసానకాలంలో కోరారు. తండ్రిగారు మిగిలించిపోయిన పనులన్నీ ఆయన చేయాలి, ప్రచురించే బాధ్యత నెత్తిపై వేసుకోవాలి.

"ప్రతి పదానికి ప్రయోగముచూపి ప్రామాణికమైన గొప్ప నిఘంటువును అదన్నీ అనుకూలసాధన సాహాయసంపత్తి లభించిన, ఒకే సంపుటమున పదునైదు వందలు, లేక 2000 పుటలతో రచించి ఆంధ్రమహాజనులకు అందజేయగలను – అని నాతో 1961జనవరిలో అన్నారు. అనంతరం శబ్దరత్నాకరాన్ని అనుబంధంతో క్రిస్టియన్ లిటరేచర్ సొసైటీకోసం ప్రచురించారు. 1975 లో కలుసుకొన్నప్పుడు దానిని సంస్కరించడం 35 వేల పదాలతో నాప్రతిజ్ఞమేరకు సిద్ధపరిచాను" అన్నారు. దానిని వెలుగులోకి రావడానికి, తక్కిన వాఙ్మయ చరిత్రాదులు ప్రచురణ కావడానికి శివసుందరేశ్వరరావు, సాహిత్యాభిమానులు ప్రయత్నించాలి.

తెలుగుభాష వెలుగుతున్నంతవరకు, తెలుగు వాఙ్మయం ప్రవహిస్తున్నంతవరకు తెలుగులో పరిశోధన పరిఢవిల్లుతున్నంతవరకు నిడుదవోలు వేంకటరావు గారు విద్యుత్కాంతులు వెలార్చుతూనే వుంటారు. □

డాక్టర్ ముదిగొండ వీరేశలింగము

నాకు తెలిసిన నిడుదవోలువారు

భగవంతుని సృష్టి అవిచార్య మూలకము. ఇందులో మనకు అనేక వస్తువులు కనబడుతున్నాయి. అందులో జ్ఞానదృష్టి కలిగిన మానవ జన్మ ఉత్తమమని చెప్పపని లేదు.

1933 ప్రాంతంలో మా నాన్నగారు బ్ర.శ్రీ ముదిగొండ శంకరశాస్త్రిగారు విజయనగరం సంస్కృత కళాశాలలో రాయుడుశాస్త్రిగారి వద్ద చదువుతుండేవారు. ఆ రోజుల్లో వారు ఎదుర్కొన్న యిబ్బందులను తీర్చినవారు కీ. శే. నిడుదవోలు వేంకటరావుగారు. మా నాన్నగారికి ఆయనతో సన్నిహిత సంబంధం ఉండేది. ఆనాటి నుండి మా కుటుంబానికి ఆయనతో సంబంధం ఉన్నదని చెప్పవచ్చును. తరువాత వారు మద్రాసులో ఆచార్య పదవి నిర్వహించడమూ, మా నాన్నగారు వరంగల్లులో సంస్కృతాంధ్ర కళాశాలలు స్థాపించడమూ జరిగినవి.

శైవులగు ఆరాధ్యులతో ముఖ్యంగా శివపూజా వ్రతస్థులతో వారికి బాగా సంబంధం ఉన్నది. "ఏమండీ! మీరు మీ తండ్రిగారు కీ. శే. సుందరం పంతులు గారిలా శివపూజ చేయడం లేదే" అని ఎవరైనా అడిగితే "శివపూజ లేదు కాని నాకు సాహిత్యపూజ ఉన్నది" అంటూండే వారు.

ఆ పిమ్మట 1964 మే జూన్‌లలో మద్రాసు విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవీ నిర్వహణను వదలిన పిమ్మట, మేము ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం. ఏ. ఫైనలు క్లాసు చదువుతుండగా వారు స్పెషల్ ఆథర్‌గా ఎఱ్ఱాప్రెగడను గూర్చి చెప్పేవారు. వరంగల్లులో శైవ సభలుగాని, గణపతి ఉత్సవాలు గాని జరిగితే శ్రీ చాగంటి భాస్కరలింగశాస్త్రిగారు ఆహ్వానిస్తే వచ్చేవారు.

పద్యాలు చదివే పద్ధతి

ఆయన పద్యాలు చదివే ధోరణి విలక్షణంగా ఉండేది. ఏ విషయాన్ని గూర్చి చెప్పాల్సి వచ్చినా సంస్కృత శ్లోకాలు, పద్యాలు, చదివి – పోల్చి చెప్పడం వారికి బాగా అలవాటు. పద్యాన్ని ఎక్కడ విరిచి చదవాలో, కంద పద్యం, సీసపద్యం ఎట్లా చదవాలో వారు వివరించే వారు ఒక ఊగు – లయతో – చక్కని గొంతుతో పద్యం చదవడం యిప్పటికీ నాకు మనస్సులో మెదుల్తూ ఉంటుంది.

ఉపన్యాస ధోరణి.

గంట – గంటన్నర దాకా చెప్పే ఉపన్యాసంలో విసుగు కనబడదు. విషయాన్ని వదలి పోయే తత్త్వం. దాంట్లో ఉండదు. విషయానికి మూలం ఎక్కడుందో అక్కడ నుండి ప్రారంభించే వారు మనం ఆయన చెప్పే అంశాలు చూసుకోవాల్సి వస్తే ఒక పుస్తకం చాలదు. సమగ్రత్వం కనబడేది. ఆయనకు అభిమానాలు – కవిత్రయం, పాల్కురికి, నన్నెచోడుని కుమార సంభవం, హరవిలాసము, శ్రీనాధుని గ్రంథాలు, ధూర్జటి, దక్షిణాంధ్ర వాఙ్మయంలోని కవులు – ఒకరేమిటి? దాదాపు ఆయన ఏ కవి కవిత్వాన్నైనా పుక్కిట బట్టగలరు. ఆయన ఉపన్యాసంలో – ఫలానా పుస్తకంలో, ఫలానా పేజీలో, ఫలానా పంక్తి – అని చెప్పితే – మనం సరిగా అ విధంగానే ఆ పంక్తిని చూడగలం. దీన్ని బట్టే, ఆయనకు వాకింగ్ లైబ్రరీ (జంగమ గ్రంథాలయము) అని పేరువచ్చి ఉంటుంది. ప్రతి ఉపన్యాసంలో ఆయనకు "అసలేమో" అనే ఊత పదం ఉండేది.


ఆయన బహుశః సాహిత్యంలోని అన్ని అంశాలూ అభిమానించినా తాను కొన్ని అంశాలంటే, పులకరించి, తదుపరి తన. గ్రంథాలను వ్రాసి ఆ అంశాలను విస్తృత పరచి ఉంటారని భావించవచ్చును.

ఆయన గ్రంథాలను, పరిశోధక వ్యాసాలను, పీఠికలను చూచి కీ. శే. కవి సామ్రాట్ శ్రీవిశ్వనాథ అయన్ను "పరిశోధనా పరమేశ్వరు"లని పిలిచారని చాలమంది అంటూంటారు.

మదరాసులో దాదాపు యిరవై సంవత్సరాలున్నా సంభాషణలో – తమిళం గాని, కన్నడం గాని ఒక్క పదమూ మనకు వినిపించేది కాదు.

సంభాషణా సరళి

ఎవరైనా యింటికి వస్తే వారికి తగు మర్యాద యివ్వడం మనకు అధికార్లలో చాలా తక్కువ మంది వద్ద కనబడుతుంది. ఇంటికి వచ్చిన వాళ్ళ అంతస్తుని బట్టి వారికి మర్యాదలు చేయడం ఈనాటి సంప్రదాయం! కాని వేంకటరావుగారిలో యిట్లాంటిది లేదు. ప్రతి మనిషిలో ఏదో ఒక విశేషాన్ని వారు చూస్తారు. ఒకమారు వారింటికి మా పినతల్లి కుమారుని తీసుకొని వెళ్ళాను. బహుశః అతనికి యిరవై ఏళ్ళుంటాయి. కనీసం రెండు గంటలు మాట్లాడితే గాని వారికి తృప్తి ఉండదు. రాత్రి తొమ్మిదయింది. ఆయనకు అది భోజన సమయము "ఇంక వెళ్ళొస్తా సయ్యా" అని లోపలికి వెళ్ళారు. మా వాణ్ణి అడిగితే "అబ్బ! ఎన్ని విషయాలు చెప్పారు." అన్నాడు. ఆనాడు శైవమతాన్ని గూర్చి మాట్లాడాము. అందులో ఎన్నో అమూల్యమైన విషయాలున్నాయి. సామాన్యంగా ఎంతో మంది పరిశోధకులకు, విద్యార్థులకు ఆ విషయాలు దృష్టిలోనికి రానే రావు.



రచనా రామణీయకత

విమర్శనా గ్రంథాలు వ్రాయాలన్నా, పీఠికలు వ్రాయాలన్నా, వ్యాసాలు వ్రాయడమన్నా వారికి ఎంతో ఉత్సాహం. విషయ సమగ్రత – వివరణ అందులో నిండి ఉంటుంది. దీనికి 'భారతి' పత్రికలో కొన్ని సంవత్సరాల నుండి పుంఖాను పుంఖంగా ప్రచురించబడిన వ్యాసాలే నిదర్శనము. పీఠికలు, – అసలు గ్రంథాన్ని మించిన పుటలుగా ఉండేవి. కృష్ణా పత్రిక వారు ప్రచురించిన "శివ తత్త్వసారము" దీనికి సాక్ష్యము. అయితే సమగ్రత కారణంగా – ఒక్కొక్కపుడు "యింత పీఠిక" ఈ గ్రంథానికి అవసరమా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. కాని వెంటనే "అవసరము" అనే ఖచ్చితమైన నిర్ణయము మనకు కనుపిస్తుంది. ఇక సమీక్షల వర్గానికి వస్తే – ఈనాటి సమీక్షలకు – వారి సమీక్షలకు చాలా భేదం ఉంటుంది. వారి సమీక్షను చూస్తే "ఇది పరిశోధనా వ్యాసమా లేక "సమీక్షా" అని అనుమానం వస్తుంది.

ఆయన జీవిత విధానమూ క్రమమైనది. సమయం వృధా చేయరు. భోజనం గాని ఫలహారం గాని ఒక క్రమమైన సమయానికి తీసికోవడం అలవాటు.

జీవితంలోని చివరి దశలో కూడ ఒక మారు ఆయన్ను చూడటానికి వెళ్తే – "వేంకటేశ్వర స్వామి పైన పద్య ధార విపరీతంగా వస్తుందయ్యా" అని తాను వ్రాసిన పద్యాలు ఎన్నో చదివి వినిపించారు.

వారి పరిశోధనా దృష్టికి, వారి రచనలే సాక్ష్యం ... ఎంతో మంది ఆయన వద్ద పరిశోధనలు చేశారు. ఎంతో మంది పరిశోధకులకు ఆయన పరీక్షకులుగా కూడా ఉన్నారు.

చరిత్ర – శాసనాలూ మహాప్రీతి.

ఫిలిం సెన్సారు బోర్డు మెంబరుగా యూనియన్ పబ్లిక్ సర్వీసు కమీషన్ ఎక్స్‌పర్టుగా కూడ ఉన్నారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం వారికి "కళా ప్రపూర్ణ" బిరుదు యిచ్చి సత్కరించారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వారికి సన్మానం జరిగింది. ఇట్లా ఎన్నో సన్మానాలు తమ జీవితంలో పొందారు. నవంబరు 12 – 1982 న ఆయన తనువును చాలించి, పరిశోధనను తరువాతి తరాల భుజస్కంధాలపై ఉంచి వెళ్ళిపోయారు. □

శ్రీ వంతరాం రామకృష్ణారావు

నిడదవోలువారి భాషాసేవ

పరిశోధనా పరమేశ్వరులు నిడదవోలు వేంకట రావుగారు, మాసశివరాత్రి నాటి అర్ధనిశాసమయమున [15 - 10 - 82] శివైక్యము నందినారు. వారి జననము 0 - 1 - 1904. జన్మ స్థానము విజయనగరము.

డిగ్రీ సంపాదనేచ్ఛ, ఉద్యోగలాభము లక్ష్యములుగా కాక స్వతస్సిద్ధమయిన అభిరుచితో చిరుత ప్రాయము నుండి, ఆంధ్ర సాహిత్యమును అధ్యయనము చేసిన వారిలో నిడదవోలు వారొకరు. ముద్రిత గ్రంథములనే కాక, తాళపత్రప్రతులను శాసనములను గూడ పరిశీలించిన పరిశోధకులాయన బహు గ్రంథ కర్తగా, పీఠికా కర్తగా, వ్యాసకర్తగా ఆయన ప్రసిద్ధులు.

తెనుగు కవుల చరిత్ర దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము, 'ఆంధ్ర వచన వాఙ్మయ చరిత్ర, ఉదాహరణ వాఙ్మయ చరిత్ర - అనునవి వాఙ్మయ చరిత్రకారులుగా ఆయనకు సముచిత స్థానమును కల్పించుచున్నవి. ఉద్భటారాధ్య చరిత్రలోనగు కావ్యములకు ఆయన విపుల పీఠికలు రచించినారు. భారతి మున్నగు పత్రికలలో వారి వ్యాసములు పెక్కు ప్రకటింపబడినవి. వానిలో మాండలిక వృత్తి పదకోశము [వాస్తువు], సమగ్రాంధ్ర సాహిత్యము, ఆంధ్రదేశ చరిత్ర - భూగోళ సర్వస్వము - అనువాని పయి రచించిన సమీక్షలు కలవు. ఇంతేకాక పాఠ పరిష్కరణకు సంబంధించిన వ్యాసములు కలవు. వానిలో - శివతత్వసార పాఠాల మార్పు తగునా ? శృంగార నైషధము - పాఠభేదములు, శృంగార నైషధము: సుపరిష్కృత ముద్రణము, సాహిత్య అకాడమీ వారి భాగవతము - అనునవి పేర్కొనదగినవి. వ్యాసములన్నింటిలో ఆయన విషయసేకరణకయి చేసిన కృషి అడుగడుగున గోచరించును. బాల వ్యాకరణము - షట్టు పూర్వోత్తరాలు, తెలుగులో ఆకర గ్రంథాలు ఆధునిక యుగము - గాంధీ సాహిత్యము మొదలయిన వ్యాసము లిందుకు నిదర్శనములు. ఆయన ప్రయోగాన్వేషణశీలి "కవి ప్రయోగ పరిశీలన" "ప్రయోగ విశేషములు - పాఠభేదములు" - అను వ్యాసములు వారి ప్రయోగ దృష్టికి తార్కాణములు. పాల్కురికి సోమనాథుని చతుర్వేద సారము, పాల్కురికి సోమనాథుని లఘు కృతులు, సంశోధిత మహాభారత ముద్రణములోనగు వ్యాసములు ప్రశంసనీయములు

నిడదవోలు వారు చిన్నయ సూరి రచించిన హిందూ ధర్మశాస్త్ర సంగ్రహమునకు బ్రిటిష్ మ్యూజియము గ్రంథాలయము నుండి ఛాయా గ్రహణ ప్రతిని తెప్పించి, చిన్నయ సూరి జీవిత చరిత్రతో పాటు ప్రకటించినారు. "విజయనగర సంస్థానము - ఆంధ్ర వాఙ్మయ పోషణ" - అను గ్రంథమునకు సాహిత్య అకాడమీ పారితోషికమును పొందినారు.

శబ్ద రత్నాకరమునకు నిడదవోలు వారు చక్కని అనుబంధమును చేర్చినారు. ఈ అనుబంధములో తత్సమ పదములకు కూడ ప్రయోగములు చూపించినారు. శబ్ద రత్నాకర సూర్యరాయాంధ్ర నిఘంటువులు, సంస్కృత నిఘంటువుల నుండి శబ్దములు గ్రహించి, వ్యాకరణాను గుణముగా వానిని సంస్కృత సమములు చేసి, ఉదాహరించెను. తెలుగు కావ్యములలో వాడిన సంస్కృత శబ్దములనే గ్రహించి నిఘంటు రచన చేయుట ఆవశ్యకము. ఈ విషయమును గుర్తించి నిడదవోలు వారు తమ అనుబంధములో తత్సమ పదములకు ప్రయోగ ప్రదర్శన చేసినారు.

నిడదవోలు వారి మనస్సు, నవ్యనవనీత సమానము. వ్రాత, దారుణాఖండల శస్త్రతుల్యము వార్ధక్యము చేతనో, జాలి చేతనో ఇటీవలి సమీక్షలు మాత్రము వాడిగా వేడిగా కాక, ఉదాసీన వైఖరిలో సాగినవి.

నిడదవోలు వారితో రెండు దశాబ్దముల నుండి పరిచయమున్నను, రెండు మూడు సారులు కంటే కలిసికొన్నది లేదు. 1976లో వారి లేఖను పురస్కరించుకొని, నేను వ్రాసిన, ముక్తలక్షణ కౌముదిని, [బాలవ్యాకరణ గ్రంథము] ప్రబోధ చంద్రోదయము పయి, నేను ప్రకటించిన వ్యాసమును వారికి పంపుట జరిగినది. తాము పరిష్కరించి విపుల పీఠికతో ప్రకటింపజేసిన ఉద్భటారాధ్య చరిత్రము పయి, నా అభిప్రాయములను భారతిలో సమీక్షా రూపమున వెల్లడించినచో బాగుండునని సూచింపగా, నేను వ్రాసిన సమీక్ష భారతిలో వెలువడినది. [భారతి - మార్చి 1977 సంచిక] (75వ పేజీ చూడండి)

కుముదబాల

నిలువునకు మీరు మావాగు జలమునడుమ
విగత పరిధానవై చలి వేళకూడ
నిలచి తపమొనరించెడు నెలత పగిది
క్రమము తప్పక వెలుగొందు కుముదబాల
అలసుధాంశుని కిరణాళికన్న మిగుల
చక్కనైనట్టిసుకుమార సంపదలకు
భాజనంబైన యీలేత వయసునందె
లభ్యమెట్లయ్యె నీకింత లక్ష్య సిద్ధి.

నీ మనో వీధి నుదయించి నెగడువాంఛ
లేను ఊహించి తెలియగా లేను, కాని:
నిరత మీ రీతి పొలమున కరుగు వేళ
మాత్రమరయుదు నీ యందు మార్పు కొంత

సర్వదానేను వేకువ జాము నందు
పశులకొట్టము చేరునప్పటికెనీవు
కులుకుచుందువు క్రొంబైడి దళములందు
దొరలు చుండెడు తుహిన బిందువులతోడ.

దిన కరుండొగి ప్రాగ్దిశాంగణము చేర
నీడ జుంబులు నెలవులువీడుతరిని
సృష్టిసర్వము సానంద వృష్టిమునుగ
కాన వత్తువు ముకుళితా కారవగుచు.

ఒకరి పక్షము చేరి వేరొకరిపైన
కొండెములు చెప్పి బ్రతికెడు కోవవారు
అళికుమారులు నీచెవి యందు లోక
బాంధవుని గూర్చి చాడీలు పలికినారొ?

అబ్బురంబౌను మిట్టమధ్యాహ్న వేళ
ఖర కరుని తీవ్ర కిరణ సంఘమునకైన
చలన మెరుగవు సహజనిర్మల పవిత్ర
చిత్తమాదర్శనుత తపోవృత్తి మునుగ.
గగన వీధిని పదియారు కళలతోడ
వచ్చు చుండగ తారకా వల్లభుండు
నీ మనోహర సుకుమార కోమలతను
తిరిగి వెలయింప జేతు వచ్చెరువుగాను

సహజ ముకుళిత వికసన సరణి యందు
ఖేద మోదాలు లోకమర్యాదలెల్ల
తూచి చూపుచు నున్నావు తుహిన కరుని
సాక్షిగా నిత్యమీ ధరాచక్రమునకు.

శ్రీ పెన్మెత్స రాజంరాజు

తమసోమా

శ్రీ రాళ్ల బండి కవితాప్రసాద్

ఈ రాత్రేమిటి చెప్పు—
ఇలా సంఘర్షించుకొంటోంది - ?
తొలిసారి భారతంలో అడుగుపెట్టిన 'నెగ్రిటో జాతి'
పదాల ప్రతిధ్వనులా అవి - !
చరిత్రలో సమాధి' చేయబడ్డ 'మొహంజిదారో' శిధిలాలు
హిరోషిమా'తో ముచ్చటిస్తున్నదేమిటి ?!

ఇంతవరకు "డిసైఫర్" చెయ్యలేని పురాతన శిలాశాసనాలు
ఎపిగ్రఫీ'ని తల్లక్రిందులు చేసి మాట్లాడుతున్నాయి-
అలెగ్జాండర్ 'అశ్వరింఖా' పదఘట్టన-
పురుషోత్తముని వెన్నులోదిగిన 'చీకటిబాణం'-
వ్యవస్థమీద ఆధిపత్యం కోసం వ్యక్తులు విప్పిన
"చీకటి గొంతుల ఘోష"

సంరక్షణ లేని సామాన్యుడి 'రక్తస్వరం'
పలాయన వాదంలో చిక్కుకున్న మేధావుల తలక్రిందుల తపన్సు-
సార్వభౌమత్వాన్ని కాంక్షిస్తూ రగిలించబడే యుద్ధాల శగలు'-
'స్వార్థం కొరకంచు'తో తలగోక్కుంటున్న రాజరికం—
అదనుచూసి కబళించడానికి కాచుక్కూర్చున్న 'ఆకాశపు పిడికిళ్లు'-
పశుత్వంనుంచి ప్రయాణిస్తున్న 'చెంఘిజ్' పాదాల నెత్తుటిమరకలు!
"ధాత్రి దద్దరిల్లేలా ఏడుస్తున్న భారత చరిత్ర !!"
అహో—

"ఈ రాత్రి రబ్బరు బెలూన్‌లా ఉబ్బుతోంది"—
చటుక్కున "కలల బుడగ" చిట్లింది
చుట్టూ చెల్లాచెదరైన "చీకటి పెంకులు !"
చనిపోయిన 'చీకటి శవం' మీద కప్పిన
కాషాయవస్త్రంలా ఉంది ఉషస్సు-!!
మళ్ళీ జ్ఞానోదయం కోసం బయల్దేరిన
బుద్ధుని "మహాభినిష్క్రమణ" మార్గంలా ఉంది అభస్సు !!



పెద్దకథ

సుప్రభాతం

కే. శే. వాసుదేవరావు

"అట్లయిన నీవు నా మాట వినవు?"

"ఎన్నిసారులు చెప్పవలెను. నా మనోరథము, నా మనోగతము. ఇదివర కెన్నిసార్లు చెప్పి యుండునో. ఇంకను నట్లే యడిగిన నేమి చెప్ప దును?" అని కమల కనుబొమలు ముడివడ నసూయతో ననెను.

"అదికాదు; కమలా! మూర్ఖపుఁ బట్టుదల వలన, అవివేకమున సాధారణముగాఁ జేయుపను లనాలోచిత కృత్యములై పోవును. ముందుగానే ముందు వెనుక లాలోచింపకున్నఁ బిదపఁ బశ్చాత్తాపమునకుఁ బాలుకావలసివచ్చును. కావున, నీ విషయమున నట్లు కానీక పూర్ణముగా విచారణ చేసియే - ఆలోచించియే - చేసి—"

"లేదు-లేదు. కృష్ణారావు, నేఁ జేసినది పూర్ణాలోచనానంతరముననే; పశ్చాత్తాపమునకుఁ గారణ ముండదు" అని కమల నిశ్చయాత్మక స్వరమున ననెను.

"నీ కట్లు తోఁచుచుండును; కాని, నీ యీ యవిచార కృత్యమువలనఁ దప్పక నీకుఁ బశ్చాత్తాపము కలుగక మానదు. నీవు గొప్పవారి యింటి బిడ్డవు; విద్యావతివి; జ్ఞానవతివి; సురూపవతివి. ఇట్టి నీవు కాసుకుఁగొఱగాని బిచ్చగాని— పొట్టకూటికై పరులకొంపల నాశ్రయించు గర్భ దరిద్రుని— ప్రేమించి వరించుట యన—"

"ఇదుగో, కృష్ణరావూ, పవిత్రమగు ప్రేమ కుచ్ఛనీచ భావములు లేవు. అది శ్రీమంతుల కడనే యుండవలయునని నియమము లేదు. పటాటోపము నవలంబించి యుండదు. గొప్ప వంశములోనే పుట్టవలయు ననుటను బట్టియు నుండదు. కాని దానికిఁ బరస్పర గుణ స్వభావ ప్రియతమే ముఖ్యము. విపులధనముండియు, గొప్పవంశమునఁ బుట్టియుండియు, భార్యాభర్తల గుణ స్వభావములలో భూమ్యాకాశముల కున్నంత యంతరమున్న నేమి లాభము? ఇట్టియెడ నిద్దఱకు సుఖ మొదవుట యరుదు. అరు దేటికి? - సౌఖ్యమే లేదు. కావున, నేనా ధనమును, వంశమును బట్టికొని కూర్చుండుటలో నర్థము లేదు. అవి నాకనవసరములు."

"నీకు నాపైఁ బ్రేమ లేనేలేదు?"

"మరల మరల నా మాటయే యుచ్చరించుటకు నాకే సిగ్గగుచున్నది."

"కమలా, యింక నొకమారు నొక్కి చెప్పుచున్నాను. బాగుగా నాలోచింపుము; పిదప నేని ప్రత్యుత్తరమిచ్చెదవో యిమ్ము."

"అవసరము లేదు. ఇంకను నేనాలోచింప వలసిన యవసరము లేదు; నా యీ నిశ్చయము నిశ్చలము."

కృష్ణరావున కధిక సంతాప మొదవెను. ఆ క్రోధ భరమున నాతఁడిట్లని పలికెను:

"నీ నిశ్చయము చలింపదు కదా? చాలును. నీ తండ్రి యీ దరిద్రునకు నిన్నిచ్చి వివాహము సేయ నెట్లంగీకరించునో చూచెద. మీ తండ్రి వలననే నీ యీ దృఢ నిశ్చయమును మార్పింప కున్న నన్ను మారుపేరునఁ బిలువుము."

కమల కిప్పు డధికతరకోప ముదయించెను. ఆమెయు నట్లే గంభీరముగ నీకిట్లని పలికెను.

"నీ యీ బెదిరింపుల నే నణుమాత్రమును లెక్కసేయను. బాబాదగ్గర నీ యాటలు సాగవు. నా యీ దృఢ నిశ్చయము నాన్నగారికిఁ దెలియకుండలేదు. బాబాయు నందున కంగీకరించియే యున్నారు. కావున, నిప్పుడు నీవు వచ్చిన త్రోవఁ బట్టి పోయెదవా, బాబాను బిలువవలెనా?"

"ఏమి? ఇంత పరాభవమా? నీ వలననా?"

"ఔనౌను. నా వలననే! నీవే మనుష్యుఁడవై యుండిన, మరలమరల నిట్లు సిగ్గులేక యిక్కడకు వచ్చుచుండవు!"

"ఏమి? నీ వీమాట లెవరికిఁ జెప్పుచుంటివి? ఈ కృష్ణరావుకే?"

"అవును అవును. నా కన్నెదుట నిలిచియున్న యీ కృష్ణరావునకే నా యీ గదిలోనికి వచ్చుటకు నీ కెట్టి కార్యములును లేవు. ఎవరును నిన్నిక్కడికి రమ్మని పిలువలేదు. వచ్చినట్లే తిరిగి పోయెదవా లేక——" అని కమల సంతాపోద్రేకమున ననెను.

"ఇటు చూడు, కమలా! అయినదేమో యైపోయినది. ఇట్లు కోపింపకుము. నా యీ యొక్క మాట — కాదు విన్నపము— మన్నింపుము. నా విన్నప మాలించి మన్నించితివా, నా ప్రాణము లున్నంతవఱకు— అటుపై సైతము నీకెట్టిలోటు నొదవ నీయను. ఇంకను నధికముగాఁ జెప్పనేటికి? నీవు నా శరీరమందలి మాంసముఁ బిడికెడు గోరినను విచారింపకయే యీయఁగలను. నీపై నాకెంత ప్రేమకలదో మాటలతోఁ జెప్పనలవి కాకున్నది. నా యీ హృదయ కవాటమును తెఱచి చూచిన, నచట నీ యందలి ప్రేమతక్క వేఱొకటి నీకుఁ గానఁరాబోదు. నీవు నన్ను నిరాకరించితివా; నా జీవితము పాషాణ ప్రాయమగును. నీ వంగడమును, మా వంగడమును గూర్చి పోల్చి చూడుము; ఆలోచింపుము. ఇరువంగడములను సమానముగాఁ దులదూచి చూడుము. ఆహా! ఇట్టియెడ నీ మెదడున నీ భ్రమ యెట్లు చొచ్చెనో కదా! నీవు నేను నొక్కచోట నాటలాడుచుంటిమి; ఒక్కచోటఁ బెరిగితిమి. అప్పటినుండియు నిన్నే తీరునఁ బ్రేమించుచుంటినే యాలోచింపుము. నన్ను భగ్నాశునిఁ జేయుట నీ యట్టి సుశీలకు, సద్గుణరాశికి, వివేకవతికి ఉచితమగునా?

తన పలుకు లెట్టి పరిణామ మొదవించునో చూడఁగోరి కృష్ణరా వీవిధముగ శాంతముతోఁ బలుకుచుండెను. కాని, యిద్దానఁ గమలహృదయము కరఁగదయ్యెను; సమాధానము కాక పోయెను. కాని యితని యీ లజ్జారహిత వర్తనమున కామె కధిక కోపము, నసూయ కలిగెను. ఆమె తుద కసూయతో నిట్టులనెను:

"కృష్ణరావూ, నీకుఁ జెప్పవలసిన దేదియో యొక్కమారే చెప్పి వేసితిని. ఇంక నూరకే నా కాయాసము కలిగించుటలో - చెప్పినదానినే మరల మరల చెప్పించుటలో - లాభ మేమున్నది? ఇట్టి యవివేకపుఁ బలుకులు, ఆచరణము నీకుఁదగునా? ఇఁకనైన నాయందుఁ గృపయుంచి నన్ను వీడిపొమ్ము."

"ఏమి? నిను వీడి పొమ్మనుచున్నావా? ఇదిగో పోవుచున్నాను. మదినుంపుము."

"చక్కఁగా నుంతును!"


కృష్ణరావు తన తీక్ష్ణకటాక్షము లామెపైఁ బరపి మీసము దువ్వి, పండ్లు పటపటమని

కొలుకుచుఁ గోపావేశముతో వెడలిపోయెను.

* * *

అప్పాజీపంతు పునహా మండల న్యాయ స్థానమున నొక్క సుప్రసిద్ధ న్యాయవాది. ఇతనికి వృత్తిలో విపుల ధనము లభించుచుండెను. అంతయే కాక పునహా నగరమున నితని కొక పెద్ద యిల్లును, మిక్కుటమగు చరాస్తియు నుండెను. అతని కేకొఱంతయును లేదు; కాని, తన యనంతర మీ విపులసంపదకుఁ దగినవారసుడు లేకపోయెనను విచారముమాత్ర మాతని విడువక యుండెను. అయినను నాతని కొక్క పుత్రిక మాత్ర మున్నది. ఆమెయే మనము ప్రథమ ప్రకరణమునఁ జూచిన కమల. అప్పాజీ పంతునకు వయసు నట్టే ముదిరియుండలేదు. నలువదైదు నలువ దాటేండ్లుఁడును. కాని, కమల కనంతరము పదేను పదాఱు వత్సరముల వఱకు నే సంతానముఁ గలుగ కునికి, నికఁ గలుగునను నాసయే లేదు. కావున నాతఁడును, నాతని భార్య లక్ష్మీబాయియు, నాతని తల్లి రమాబాయియు నీయొక్క బాలిక కమల నత్యంత ప్రేమతోఁ బెంచుచుండిరి. ఈ బాలికయం దనేక సద్గుణము లుండెను. అతుల రూపవతి. రూపమున కనుగుణ్యముగనే యామె విద్యను నార్జించి సుసంస్కృతయై యుండెను. లక్ష్మీబాయి యీ బాలికను గృహకృత్య నిర్వహణము నందును సుశిక్షితను జేసియుండెను. ఇట్టి యాసుత పరగృహవాసమున కరుగునుగదా యని తోఁచి నపుడెల్ల నా యింట నందఱకు మిగుల వ్యాకులమగు చుండెను. కాఁబట్టి యా బాలికకుఁ బదియా ఱేఁడులు వచ్చినను బెండ్లిమాటయే యెవ్వరును దలపెట్టరైరి. అప్పాజీపంతు నూతనాచారపరులలోఁ బ్రముఖుఁడు. మాటలచే మాత్రమే కాదు; క్రియా రూపముననను నట్టివాఁడె! ఇంట నితని కెదురాఁడు వారెవ్వరును లేరు. కావుననే యతని తల్లియు, భార్యయు నతనికి వ్యతిరేకమ గాఁ బలుకరైరి. అయినను, బదియే నేఁడులు వచ్చినప్పటి నుండియుఁ దల్లియుఁ, బత్నియు నీతని వెంటఁబడిరి. "ఇఁకనైనను బెండ్లి సేయకున్న నెట్లు? ఇంక నెంతకాల మీడేరిన పిల్లనింట నుంచుకొనవచ్చును! లోకమునకు వెఱవకపోయినను, సంఘమునకు వెఱవకపోయినను, బుద్ధి తెలిసిన పిల్ల —— ——" ఇంక నేమేమియో యనుచుందురు. అన్నిటికిని మన యప్పాజీపంతు తల నూపుచు "ఆఁ, త్వరలోనే చేసెద. నేను నా విచారముననె యున్నానని" సమాధాన పఱచుచుఁ గొంతకాలము గడపెను. యదృష్ట వశమున నప్పాజీపంతునకుఁ గమలకై వరుని వెదక వలసిన యవసరము కలుగలేదు. తన మనసున కెక్కిన వరునొక్కని నాతఁడు మనసున నిర్ణయించి యుండెను.

అప్పాజీపంతు నాశ్రయమున వినాయకుఁడను యువకుఁడు విద్యాభ్యాస మొనర్చుచుండెను. ఈ యువకుఁడు పసితనముననే తండ్రికి దూరమై పోయి, దిక్కరియుండ, నప్పాజీ మిత్రు లొక కొందఱీ బాలుని నీతని యింట నుంచుకొనఁ బ్రార్థించిరి. పంతు నందున కంగీకరించి, యా బాలున కాశ్రయ మొసంగి పుత్రునివలెఁ బెంచుచుండెను. ఈ బాలుని చాకచక్యము, విద్యార్జనాపేక్ష, వినయశీలస్వభావముఁ గని యా యింట నందఱకు నాతనిపై నధికానురాగ ముదయించెను. ఈ కుఱ్ఱఁడును దన సుగుణ సంపదలచే నెల్లర డెందముల నాకర్షించికొనెను. ఈ విధముగా వినాయకుఁ డుత్తమ విద్యావంతుఁ డయ్యెను. చిరపరిచయము మూలముునను, నేక స్థాన నివాసము మూలముునను చిన్ననాఁటినుండియే కమలా వినాయకు లమితానురాగ బద్ధులై మెలఁగుచుండిరి. వయసు పైఁబడిన కొలఁది ఆ యనురాగము దృఢమై ప్రేమగమారి, యా యిరువురను లోలోనన యనేక విధముల నువ్విళు లూరుచుండిరి. చాణాక్షుఁడగు నప్పాజీ పంతున కెట్లో యీ విధము తెలిసెను. అతఁడును లోలోననె యానందించుచు మిన్నకుండెను. ఇఁక వర శోధనావశ్యకత లేకపోయినందుకు మిక్కిలి సంతసించెను. ఇట్లు కొంత కాలముఁ గడువ నీ రహస్యమింటను దెలిసెను. అందఱు నిందున కనుకూలురై యుండిరి.



అప్పాజీపంతు నింటి పొరుగింట సదాశివరావను గృహస్థుఁడు నివసించుచుండెను. ఈ గృహస్థుఁడు మాది వర్తకమున మిగుల ధనవంతుఁడై యుండెను.

ఈతనికిఁ గృష్ణరావను పుత్త్రుఁ డొకఁడుండెను. కృష్ణరా వీలోకమున నవతరించిన వెంటనె తల్లి పరలోకముఁ జేరెను. తల్లిలేని బిడ్డఁడని తండ్రి మిగుల గారాబమున నీ బాలునిఁ బెంచెను. అతఁడు పోయినదే త్రోవ! పలికినదే పలుకు! ఈ విధమునఁ బెరుగుచుండెను. ఆంగ్ల విద్యలో నాలుగైదు తరగతులు చదివి పాఠశాల వదలివేసెను. పగటివేళల ద్యూత క్రీడలందును, రాత్రి వేళల నాటకములు, ఉత్సవములు, పాట కచ్చేరీలు మొదలగు నన్యవ్యవసాయములఁ గాలముఁ గడుపసాగెను. ఇన్నిమాట లేటికి ? కృష్ణరావునకు నింట నిర్బంధము లేకపోవుట చేతను, తగిన శిక్షణము లేకపోవుటచేతను, నానావిధ వ్యసనములలోఁ జిక్కి సదానంద తన్మయుఁ డయ్యెను. ఇరుగింటనున్న సుందర తరుణి తనకుఁ బత్ని కావలయునని యతఁ డిచ్ఛవహించెను. నిజముగనె యతనికిఁ గమలపై గాఢానురాగ ముదయించెను. కాని, యా ప్రేమను బరీక్ష చేసినచో 'విషయోద్భూత' మనియె తేటబడి యుండును. నిజము దేవున కెఱుక ! ఈ విషయము తండ్రి కెఱింగింప నాతఁ డప్పాజీపంతుకడఁ బ్రస్తావించెను. కాని, పంతు "సకల భారమును గమలయే వహించియున్నది. సకలముఁ దన యిష్టానుసారము జరుపుకొనును. ఇందున నే నేసంబంధమును గల్పించుకొనలే" దని స్పష్టముగాఁ దెలిపినందుపై, సదాశివరావు హతాశుఁడై యూరకుండెను. తుద కొకనాఁడు కృష్ణరావు స్వయముగనే యేకాంతమునఁ గమలను సందర్శించి, తన కోరిక వెల్లడించెను. అప్పుడతని కెట్టి ప్రత్యుత్తరము లభించినదియు, నే విధముగ హతాశుఁడైనదియు, భగ్న హృదయుఁడైనదియుఁ బ్రథమ ప్రకరణమున నుడువఁబడియున్నది.

అనంతరము గొలఁది దినములలోనే కమలా వినాయకులకుఁ బ్రియమైనట్టియు, కృష్ణరావున కప్రియమైనట్టియు వివాహమయి, కమల యభీప్సితము సిద్ధించెను.

* * *

కమలా వినాయకులకు వివాహమై యైదు సంవత్సరములు గడచినవి.

అప్పాజీ పంతులుగారి శ్రద్ధాభక్తుల మూలమున వినాయకరావున కుత్తమ విద్య లభించి బి. ఏ., యల్. యల్. బి., పదవి లభించుట, గని యప్పాజీపంతునకుఁ దన శ్రమయు, ధనవ్యయము సార్థకమయినదని మిగుల నానందము కలిగెను. సంఘమునకుఁ గీటకమగు కృష్ణరావు మూలమున, ప్రోత్సాహమునఁ గమలా వినాయకుల కనేక సంకటము లొదవుచుండెను. సాటివారల వలన వీరి కనేక సంకటము లొడవెను. వాని నన్నింటిని మిక్కిలి యోర్పుతో నోర్చియుండిరి. మదగజమును గని శునక మెంత మొఱిగిన దాని కేమిలోటు? కమలా వినాయకు లీ మొఱుఁగుఁ గుక్కల బెదరింపుల కణుమాత్రముఁ జలింపరైరి.

వినాయకరావునకు న్యాయవాది పట్టము లభించిన వెంటనే రెండు సంవత్సరములకు బరోడా సంస్థానమున న్యాయ శాఖలో నొక గొప్ప యుద్యోగము లభించెను. అతఁడుద్యోగమునకుఁ బోవుట కిదియే మొదటిసారి యగుటచేఁ దా నొక్కఁడే పోయెను. కమలను దీనికొనిపోలేదు. ఆ సమయమునఁ గమల యించుక యనారోగ్యమున నుండెను. అంతయే కాక క్రొత్తయూరు, తగిన వసతి మొదలగునవి ముందు ఏర్పఱిచిన పిదప పిలిచికొనిపోవ నెంచియుండెను. కాని, మన మొకటి సేయనెంచిన నది వేఱొకటి యగుచుండును గదా ! ఆ రెండు సంవత్సరములును గమల కా నూతన సంసారశకటము నడిపించు నవకాశము లభింపలేదు. కమల యనారోగ్యవతియై యుండి కొంచెముగ నిమ్మళించి, లేచి యటునిటుఁ దిరుగఁ బ్రారంభించిన వెంటనే లక్ష్మీబాయికి మన్యపుజ్వరము తగిలెను. అందుండి యామె యించుక యారోగ్యము వడయుచుండ నప్పాజీ పంతునకు సంధివాతము సంప్రాప్తమయ్యెను. ఇట్టి సంకటములలోఁ దలిదండ్రులను విడచి మగని కాపురముదిద్దఁ బోవుట కా యువతి కవకాశము చిక్కదయ్యెను. వినాయకరావు మాత్ర మప్పుడప్పుడు సెలవుదీసుకొని యిక్కడికి వచ్చుచుఁ బోవుచుండెను. అదియుఁ గాక కమల పితృగృహ నిర్వహణ భారమంతయుఁ దానవహించి మిగులఁ జతురతతోఁ జరుపుచుండుటచే వినాయకరావున కట్టె యధికముగా సెలవుదీసుకొని వచ్చి యింటనుండ నవసరము లేకపోయెను. ఇప్పుడు రోగము అప్పాజీపంతులు గృహమును త్యజించి పోయెను. దీపావళి సమీపించుచుండెను. ఈ పండుగున కల్లుఁడువచ్చును మరలిపోవునపుడు కమలను బంపవలయునని యప్పాజీపంతు నిశ్చయించి యుండెను. కమలకు వివాహమైన దాది నేవో కారణముల మూలమున అనేక విఘ్నము లొదవుటచే నొక్క దీపావళి పండుగయుఁ దగినరీతి జరపి యుండలేదు. దీపావళి యల్లుండ్ర పండుగ కదా ! ఈ మారు తమ యింట నెల్లరు సుఖరూపమున వచ్చిన కష్టములన్నియుఁ దొలగి లేచుటచే నీ పండుగ మహావైభవముతో జరుప నిశ్చయించి యుండిరి. సకలము నొక పక్షము దినములకు ముందే సిద్ధపఱుచుచుండిరి.

దీపావళి యింక నెనిమిది దినములే యున్నది. అప్పాజీపంతు తన మనోగతము నెఱింగించుచుఁ దమ బంధుమిత్రాదులతో రావలయునని వినాయకరావున కాహ్వానము బంపెను. ఇంట సర్వము నిండియున్నది; ఆనందము తాండవ మాడుచున్నది. పెండ్లియింట సైతమిట్టి కోలాహల ముండదు.

వినాయకుని వృద్ధమాతకును, వితంతువై నిరాధారయై యున్న యమునకును బత్రికలు లిఖించిరి. కాని, వృద్ధమాత గోపికాబాయి "నాకు దేహ మనారోగ్యముగ నుండుటచే నేను రానందుకు విచారమగుచున్నది. యమునను బంపుమనన్న నాకిక్కడ నుపచారము సేయువారెవ్వరును లేరు" అని ప్రత్యుత్తరము పంపెను. అన్నిటికిని వినాయకుఁడె ముందునకు రావలసి వచ్చెను. గోపికాబాయి వృద్ధయౌటచే నీ ప్రయాణశ్రమ కోరువఁజాలదని పం తెఱిఁగి యుండెను. అయినను వాడుక చొప్పున నుత్తరము వ్రాయవలసి వ్రాసెను.

తన యాంతరంగిక మిత్రులలో నొకరిద్దఱిఁ గలిసి ధనత్రయోదశినాఁటి రాత్రి పునహాకు వచ్చెద నని వినాయకరావు కడనుండి యుత్తరము వచ్చెను.

రేపు ధనత్రయోదశి; రేపు రాత్రి వినాయకరావు వచ్చును. కావున నింట నందఱును మహదానందసాగరమున నీఁదుచుండిరి. ఇఁకఁ గమల మాటఁ జెప్ప నేటికి ? "ఎప్ప డీనాఁడు గడచి తెల్లవారునా, ఎప్పుడు రేపు పవలు గడచి రాత్రి యగునా, ఎప్పుడు తన ..... వచ్చునా ? ఎప్పుడు తాను లజ్జావనతవదనయై హారతి యిత్తునా ?" అని యీ తీరుగ మనమున ననేక విధములఁ దలపోయుచుండెను. ఆమె యానందము స్వర్గమును ముట్టియుండ వచ్చును. ప్రతిక్షణము నీమె లెక్కించుచుండెను. ఎట్టెటో ధనత్రయోదశి యుదయమయ్యెను. నేఁడు కమల యానందమునకుఁ బారమే లేకపోయెను.

దీపావళి నిమిత్తమై గృహ ముత్తమరీతి సుశోభితమై యుండెను. అందునను ముందరి చావడి మిక్కిలి యింపుగా శృంగారింపబడి యుండెను. సాయంకాలమయ్యెను. అప్పాజీపంతు తన బండినెక్కి స్టేషనుకుఁబోయెను. ధూమశకట మానాడు కొంచె మాలస్యముగ వచ్చునని తెలిసెను. అంతఁ బంతు తన బండిని, సేవకుని స్టేషనున వినాయకునికొఱ కుంచి తానొక బాడుగ బండిలో నెక్కి యింటికి వచ్చి చేరెను. బండి వచ్చు వేళయు నయ్యెను. కమల వినాయకుని వచ్చు త్రోవయందు దృష్టి యుంచి యుండెను. బండి చప్పుడు వినవచ్చెను. తన భర్త వచ్చెనని యామె వీధివంకఁ జూచెను. ఆ బండి యట్లే వెడలిపోయెను. ఈ విధముగ నెన్నియో బండ్ల చప్పుడు వినవచ్చెను. ఒక్క బండియుఁ దమ యింటికడ నాఁగలేదు. చాలఁ బ్రొద్దుపోయెను. బండి రాలేదు. వినాయకరావును రాలేదు. ఇంకను బదిపదేను నిమిషములు వేచి యుండి పంతు దుస్తులను ధరించి స్టేషనుకు వెడలెను. అచట జనసమ్మర్దము తగ్గియుండెను. అచట విచారణ చేసెను. బండివచ్చి వెడలిపోయియు నొక గంటసేపైనది. ఈ బండిలో వినాయకరావు రాలేదు. భగ్నహృదయముతో నాతఁడింటికి మరలి వచ్చెను.

వినాయకరావు రాకుండుటచే నింట నెల్లరకు ముఖ్యముగాఁ గమలకు మిక్కిలి విషాద ముదయించెను.

"వత్తునని తెలిపిన పిమ్మట నాతఁడు రాకుండువాఁడు కాఁడు. ప్రయాణ సమయమున నేదైన విఘ్న మొదవినదను కొందమా అ వెంటనే 'టెలిగ్రా' మిచ్చి యుండునే ! టెలిగ్రామును రాకుండుటచే నాతని కీబండి మిగిలిపోయి యుండ

(60వ పేజీ చూడండి)

బొడ్లోసూత్రం

భార్గవ

అధికార బాధ్యతలను నిర్వర్తించటానికి ప్రభుత్వం అనేక స్థలాలకు పంపుతుంది. మాయూరంలో ఉన్నత పాఠశాల ఉన్నది. అందులో చాలా అవకతవకలు జరుగుతున్నవనీ, హెడ్మాస్టరుతో కలిసి ఇంకొక ఉపాధ్యాయుడు చాలా డబ్బు మింగుతున్నాడనీ, కొందరకు జీతాలను సక్రమంగా ఇవ్వటంలేదని ఫిర్యాదులు వచ్చినై. వాటిని పరిశీలించి సక్రమచర్యలను తీసుకొమ్మని నన్ను పంపించారు. ఎలా సాగిపోవాలా అనే విషయాలను ఆలోచిస్తూ పార్కులో ఆ సాయంత్రం కూచున్నా. ఇంతలో కాస్త దూరంగా విషాదమే రూపుదాల్చినట్లు కన్పించిందొక స్త్రీమూర్తి. నిశితంగా పరిశీలిస్తే పరిచితమైన ముఖంగా కన్పించింది. కాగితం మీద కెక్కని విషయాలేమైనా ఆవిడ చెప్పగలుగుతుందేమోననే ఆశ చిగురించింది. నెమ్మదిగా ఆవిడను సమీపించగలిగాను.

చూడండి మిమ్మల్ని ఎక్కడో చూచినట్లున్నాను.

ప్రతి మగవాడికీ ఇదే వరసలెండి.

క్షమించండి. అచ్చంగా మీలాగే సుజాత అనే అమ్మాయి ఉండేది. నా చిన్నతనంలో మా వీధిలోనే ఆమె తలిదండ్రులు ఉండేవారు. ఆ అమ్మాయితో ఆటలాడుకునేవాడిని.

నా పేరుకూడా సుజాతే కాని నాతో ఆటలాడకండి.

కోపగించకండి. నామాట వినండి. రంగనాథం మేష్టారుగారి కుమార్తె సుజాత. ఇద్దరు కొడుకులు తర్వాత ఆమె కలిగింది. ఒక తమ్ముడుకూడా ఉండేవాడు.

చాలా పకడ్బందీగానే ఈ విషయాలను సేకరించారు గాని మీరెవరు ?

సోమశేఖరంగారి అబ్బాయిని. వరలక్ష్మిగారు మా అమ్మ. నాకొక అక్క. ఇప్పటికైనా నమ్మకం కుదిరిందా ? నన్ను బాబ్జీ అని పిలిచేది సుజాత.

ఇప్పుడెక్కడుంటున్నారు ?

విశాఖలో మీ ఆయనపేరు గోపాలమేనా ?

వెనక ఆయన నా భర్త. ఇప్పుడుకాదు.

ఎందుకని ?

నన్ను వదిలివేశారు.



అయ్యో ! ఎందుకలా జరిగింది ?

మీరేమన్నా ఆర్చేవారా, తీర్చేవారా ?

మిమ్మల్ని చూశానని అమ్మకు చెప్తే ఎన్నో విషయాలను అడుగుతుంది. ఆవిడ సంగతి గుర్తుందా ?

ఇంకా స్త్రీ జనోద్ధరణలోనే ఉన్నారా ?

అదే ఆవిడకు ఆరవప్రాణం. గోపాలం వేసిన కేసు వివరాలను తెలుసుకుని, మిమ్మల్ని కలవాలని,

ఎలాగైనా మీకొక మంచి దారి చూపించాలని చాలా సార్లు అన్నది. మీకభ్యంతరం లేకపోతే ఆ కేసు వివరాలు చెప్పండి. అమ్మకు చెప్తా.

జాబ్లీ!

ఎన్నాళ్ళకు వినగలిగాను ఆ పిలుపు.

జాబ్లీ! ఫరవాలేదు. క్లుప్తంగా చెప్తా వినండి. మీ అమ్మగారి దగ్గరకు చేరాలని ప్రయత్నంచేశా. కాని చేయలేకపోయాను.

మీది ఆదర్శ వివాహమని, కట్నకానుకలు లేకుండా గోపాలంతో మీ వివాహం జరిగిందని విని అమ్మ చాలా సంతోషించింది.

అదే నా బ్రతుకుని నాశనం చేసింది. అన్నయ్యల చదువులు, వివాహాలు అయిన తర్వాత నాన్నగారు రిటైరయ్యారు. నా వివాహం ఒక సమస్యగా మిగిలింది. ఉన్న ఆస్తి ఒక్క ఇల్లు, దానిని అమ్మి నా పెళ్ళి చేస్తానన్నారు. నే పడనివ్వలేదు. ఆ సమయంలో గోపాలంతో నాన్నకు పరిచయమైంది. ఆయనలో ఇద్దరు వ్యక్తులున్నారని తెలుసుకోలేని నాన్న మా వివాహం చేశారు. అప్పుడే నా జీవితంలో అరణ్యపర్వం ఆరంభమైంది.

ఏం జరిగింది?

శోభనంనాడే అత్తగారు విరుచుకుపడ్డది. దరిద్రం మొహమని, కట్నంలేకుండా చేసుకొనేటట్లు కుమారుడిని చేశామని ఒకటేతిట్లు. కొంతసేపు సహించా. అనరాని మాటలంటుంటే ఎదురు జవాబిచ్చా. దాంతో ఆయనకు తిక్కరేగి బెల్టుపుచ్చుకుని చావగొట్టారు. వాళ్ళ అమ్మకు ఎదురు చెప్పరాదట. ఆ రాత్రి శోభనమని అంతా సంబరపడ్డారు. అదిమటుకు జరగలేదు. రాత్రి అంతా సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ నా శరీరంలోని ప్రతిభాగాన్ని మండుతున్న సిగరెట్టుతో కాల్చారు. విపరీతమైన బాధ. ఒంటినిండా పుళ్ళు. ఈ పుళ్ళు నాకిదవరకే ఉన్నవని, దానిని కప్పిపెట్టామని తల్లికి ఫిర్యాదు. ఆవిడ దీవెనలకు అంతులేదు. దాచుకోవటానికి మందులేదు. రెండవనాటి రాత్రి ఇంకా ఘోరం. కాల్పులతోబాటు నా చీరకుకూడా నిప్పు అంటించారు. బాధ భరించలేక బయటకువచ్చి తెల్లవారగానే మా వూరు చేరుకున్నాను.

మంచి పని చేశారు.

కాదండీ. అక్కడ అమ్మ, నాన్న ఇంకా తిట్టిపోశారు. ఏంచేసినా మొగుడిదగ్గరే పడిఉండమని గెంటివేశారు. ఏంచేయగలను. నా చిన్ననాటి నేస్తం విజయ ఇక్కడ ఉద్యోగం చేస్తున్నదని తెలిసి అరాత్రికి రాత్రే దానిదగ్గరకు చేరాను. ఉద్యోగప్రయత్నం చేసి ఇక్కడే తనతోబాటు ఉద్యోగం చేయమన్నది. తప్పలేదు. ఈలోగా విడాకులకేసు. నాశీలం మంచిదికాదని వాదం. ఆయన నడవడే సరియైనది కాదని ఆయనకొకరకమైన పిచ్చి అని రుజువుచేస్తూ విడాకులు తీసుకున్నాను.

మళ్ళీ వివాహం తలపెట్టలేదా?

ఒకసారి అయింది చాలదూ?

అందరూ అలాగే ఉంటారా? కాలేజీలో నాతోబాటు చదువుకుంటున్నప్పుడే గోపాలానికి మానసిక రుగ్మత ఉండేదిలేండి. ఇపుడెలావుంది మీ జీవితం?

ఏంచెప్పమంటారు? మొగుడు వదిలివేసిన దాన్నని హెడ్మాస్టర్‌తో సహా చాలమంది చులకనగా మాటలాడుతూ ఉంటారు. నాశీలం మంచిదికాదని నేను తేలికగా వారివశం కాగలనని పాచికలు వేశారు. విజయ మూలకంగా వీటి బారినుండి తప్పించుకోగలిగాను. బదిలీకి ఎన్ని దరఖాస్తులు పెట్టుకున్నా ఫలితం శూన్యం. చివరకు జరుగుతున్నది వింటే ఏమనుకుంటారో.

చెప్పండి.

మూడు నెలలనుంచి నాకు జీతం రావటంలేదు. నాకు అండగా ఉండటంచేత విజయకు రెండునెలల జీతం లేదు. రేపు ఒకటో తేదీ, జీతం ఈసారైనా వస్తుందోలేదో! ఎవరో ఆఫీసరు వస్తున్నారని విన్నాం ఆయనకు చెప్పుకుంటే లాభమేమైనా ఉండవచ్చని ఆశ.

ఈ విషాదమంతా మీ ముఖంలో గమనించే మిమ్మల్ని పలకరించా. నా సలహాను పాటిస్తానంటే ఒక మాట చెప్తాను.

చెప్పండి.

మీకు విశాఖలో స్నేహితులున్నారా?

నా తమ్ముడే ఉన్నాడు, శంకరం.

అయితే ఈ ఉద్యోగానికి రేపే రాజీనామా ఇచ్చి విశాఖ చేరండి. అక్కడ మా అమ్మగారిని కలుసుకుంటే లాభం ఉండవచ్చు.

ఉన్న ఉద్యోగం పోగొట్టుకోమంటారా?

భయం లేదు. మీలాంటి వారిని చాలామందిని మా అమ్మగారు చేరదీశారు. ఆమె నడిపే ఉన్నత పాఠశాలలలో ఉద్యోగాలిచ్చి, వాళ్ళకు చక్కని సంబంధాలు చేసి పంపుతున్నారు. ప్రతినెలా వారి యోగక్షేమాలను విచారిస్తూ వస్తారు. ఉత్తరం ఇస్తాను. రేపే బయలుదేరండి.

ఆవిడ బొడ్లో ఇంకా ఎన్ని మంగళ సూత్రాలున్నాయండీ?

మా నాన్నగారికే తెలియదు. నాకేం తెలుసు?

ఇక్కడ ఏ పనిమీద వచ్చారు? ఎంతకాలముంటారు?

ఆ పని రేపు సాయంత్రం స్టేషనులో మీకు వీడ్కోలిచ్చేటప్పుడు చెప్తాను. రేపు కలుస్తారు గదా!

అలాగేనండీ, ప్రయత్నిస్తా!

నామీద నమ్మకం కుదరనట్లున్నది.

అదేం లేదండీ, వస్తా.

ఈ కేసును దర్యాప్తు చేయమని అధికారులు నా కప్పగించారు. అదృష్టవశాత్తు ఆమెనే కలుసుకోగలిగాను.. మా అమ్మ అడ్రసిచ్చాను. ఒక గది పెంచవలసి వచ్చిందని పాతిక వేలు ప్రభుత్వం నుంచి ఈ హెడ్మాస్టర్ తెచ్చాడని, గదిని కట్టించినట్లు కాగితాలను సృష్టించాడని చాలా ఫిర్యాదులున్నవి. స్టోర్స్ విషయంలో కూడా ఇంకో ఉపాధ్యాయుడు చాల మింగివేశాడన్నారు. వారం రోజుల నుంచి సి. ఐ. డి. వారీ స్కూలును క్షుణ్ణంగా అన్వేషించి రిపోర్టులు తయారు చేశారు. రేపు జీతాల పంపిణీ వేళకు స్కూలులో అడుగుపెట్టాలి.

అలాగే చేరాను. ఎవరోలే అని హెడ్మాష్టర్ పట్టించుకోలేదు. నా కార్డ్ తీసి ఆయనకిచ్చాను. గుర్తించాడు. నేనే వస్తానని తెలుసుకొని, ఇలా చెప్పా పెట్టకుండా వస్తానని ఆయన ఊహించలేదు. మర్యాద చేయడం మొదలుపెట్టాడు. ఇంతలో హెడ్ గుమాస్తా జీతాల సంచితో రాగానే, ఆయనను పే రిజిష్టరు తెమ్మని, డబ్బు సంచీని ఇక్కడే ఉంచమని ఆదేశించాను. విధి లేక అలాగే చేశాడు. రిజిష్టర్ తిరగేస్తే సుజాతకు మూడు నెలల నుంచి, విజయకు రెండు నెలల నుంచి, శేఖరానికి రెండు నెలల నుంచి జీతాలు అందలేదు. ఈ ముగ్గురికి లెక్కకట్టి హెడ్మాష్టరును నిలదీశాను. సుజాతను పిలుచుకు రమ్మన్నాను. వచ్చింది.

మీరా?

ఔను, నేనే! చూడమ్మా. మీకు మూడు నెలల జీతాలు అందలేదు. ప్రతి నెలకు సంతకం చేసి ఇవాల్టి తారీకు వేయి. నీ జీతం బకాయితో సహా బట్వాడా చేస్తాను.

అలాగే చేస్తుంటే గుమాస్తాకు వణుకు పుట్టింది. క్రిందటి నెలలకు కూడా ఇవాల్టి తేదీ వేస్తే ఆడిట్ వాళ్ళ ద్వారా ఏం చిక్కులు వస్తాయో అని మొత్తుకున్నాడు.

ఆ చిక్కులను నువ్వు, నీ హెడ్మాస్టర్ ఎదుర్కోండి. ఆ అమ్మాయికి ఈరోజే జీతం ముట్టింది గనుక ఇవాళ్టి తేదీ ఉండి తీరాలి.

ఆ అమ్మాయి జీతం తీసుకురాలేదండీ.

ఎందుకని?

శాంక్షన్ కాలేదని అన్నారు.

ముందు మీరు బకాయిలు పెట్టిన వారికి పంపిణీ చేస్తాను. తర్వాత ఇతరుల విషయం.

జీతం ఈ నెల రాకపోతే చాలా ఇబ్బంది పడతాం సార్.

అలాంటి ఇబ్బందే సుజాతకు, విజయకు, శేఖరానికి ఉంటుందని మరచిపోయారా?

హెడ్మాస్టర్ గారు చేయమన్నట్లు చేశామే గాని మా తప్పేమీ లేదండీ.

చూద్దాంలే.

సుజాత, విజయ, శేఖరం బకాయిలతో సహా జీతాలు తీసికొని వెళ్ళారు. మిగిలిన పైకాన్ని బట్వాడా చేయగా హెడ్మాస్టర్, స్టోర్సు చూసే రామం, గుమస్తాలు మిగిలిపోయినారు. వీళ్ళ జీతాలు నిలిచిపోయినై. నెత్తురుచుక్క లేని ముఖాలతో నిల్చున్నారు. హెడ్మాస్టరుని క్రొత్తగా కట్టించిన గదిని చూపమన్నాను. ముఖం తేలవేశాడు. ఇదివరకే ప్రభుత్వమిచ్చిన బదిలీ ఆర్డర్లను వాళ్ళకిచ్చి ముట్టినట్లు సంతకాలు చేయించుకున్నాను. ముగ్గురినీ మూడు ప్లాటూళ్ళ రివర్ట్ అయినారు. అరవై నాలుగు గంటల్లో ఆ వూళ్ళలో చేరాలి. సి. ఐ. డి. వారిచ్చిన నివేదికలను వాళ్ళకు చదివి వినిపించాను. విజయను పిలవమని కబురు పంపితే ఆవిడకు నా దగ్గరున్న నాల్గవ ఆర్డరిచ్చాను. వేరే ఏర్పాట్లు జరిగేటంతవరకు విజయను ఆ ఉన్నత పాఠశాలకు హెడ్‌మిస్ట్రెస్‌గా ప్రభుత్వం ఉత్తరవు జారీ చేసింది. నా ఎదటే హెడ్మాస్టర్ వెంటనే తక్షణం నుంచి ఛార్జి తీసుకుంది. రెండు నెలల తర్వాత మళ్ళీ వస్తానని అప్పుడు ఈ

స్కూలు పరిస్థితులను సరిదిద్దగలనని వ్రాసి విజయ కిచ్చాను. బయటకు రాగానే విజయ కూడా వచ్చింది. మేష్టర్లంతా మా చుట్టూ మూగారు. విజయ ఇంకా వివాహం చేసుకోలేదని సుజీ నిన్న చెప్పింది. బదిలీల వార్త వాళ్ళ నందరినీ ఆనందంలో ముంచింది. విజయ వీడ్కోలు చెప్పబోతూ అన్నది.

"మీరు రావడం మంచిదైంది. ఈ రాత్రికి మా ఆతిథ్యం స్వీకరించమని ప్రార్థన".

"మంచిది కాదమ్మా. మీకు వివాహం కాలేదు. ఈసారి నా భార్యతో వస్తాను. అప్పుడు తప్పకుండా మీ ఇంట్లోనే దిగుతాం".

"మీకు పిల్లలా?"

"రాబోయే నెలలో ఒక పిల్లను సెలక్ట్ చేసి పెడ్తుంది మా అమ్మ. అప్పుడావిడ చేతుల్లోనించి ఇచ్చే మంగళసూత్రాన్ని బిగిస్తాను".

"మీ ఇష్టానిష్టాలతో ప్రసక్తి లేదా?"

"నా మంచిని విచారించేది మా అమ్మే. నాకు ఇష్టంలేకుండా ఆవిడ ఏమీచేయదు. నేనూ అంతే."

"మీరు వచ్చేనాటికి సుజాత ఇక్కడ ఉండదు."

"ఎందుకని?"

"రాజీనామా ఇచ్చి విశాఖవెళ్తున్నది."

"చీడపురుగులు పోయినా వెళ్తున్నదా?"

సుజీ కలగజేసుకుంది.

"మీరేగా ఈ ఉద్యోగం వదలుకొని మీ అమ్మగారు నడిపే స్కూలులో చేరమన్నారు."

"మరచిపోయినా."

"ఐతే రాజీనామాను ఉపసంహరించుకోమంటారా?"

"అది మీ ఇష్టం. ఐనా ఆ అమ్మ ఏం సలహా ఇస్తుందో? విజయగారూ, ఒక వారం రోజులుదాకా సుజాతగారి రాజీనామాను పైకి పంపకండి. ఇదంతా జీతంలేని సెలవగా తీసుకోండి."

"జీతం లేకుండానా?"

"మూడు నెలలు ఓపికపట్టారుగా, ఇంకొక్క వారం...."

ఆ సాయంత్రం స్టేషన్ కు చేరాను. దూరంగా సుజీ కన్పించింది స్వర్ణరూపి. మేలిమి రంగు కాదుగాని మంచి రంగే. కళ్ళలో వెలుగు ఉంది. నడతలో సౌమ్యత,సంస్కారం ఏమనుకుంటున్నదో? నా సలహాను వెంటనే అమలు జరిపింది. నామీద ఏమన్నా ప్రేమా? తెలీదు. నాలో ప్రేమాంకురాలు మొలకెత్తినవా? అంతుపట్టలేదు. చిన్ననాటి స్నేహితురాలు. నా సహాధ్యాయిని చేసుకొని మోసపోయింది. విధి వంచిత. వాడి అన్నే ఇంతదాకా ఇక్కడున్న హెడ్‌మాస్టరని తెలియదేమో! ఇంటికివెళ్ళి సుజాత సంగతి అమ్మకు వివరించాను. ఒక ఉపాధి కల్పించమని, కంటికి రెప్పలా కాపాడమని, మంచి సంబంధం చూసి సుజీకి వివాహం చేయమని చెప్పాను. నాల్గవ రోజు సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి సుజీతో ఇంకెవరో ఉన్నారు. అమ్మతో మాట్లాడుతున్నారు. నన్ను చూచి సుజీ మందహాసం చేసింది. నన్నుకూడా అక్కడే కూచోమని అమ్మ ఆదేశించింది. కూచున్నా.

"అమ్మాయి సుజీ, రేపటినుంచే నా స్కూలులో చేరు. ఇదిగో ఆర్డర్లు."

"అలాగేనండీ."

"నీ కభ్యంతరం లేకపోతే మంచి సంబంధం చూశాను. నీ వివరాలను మా శశి పూర్తిగా వివరించాడు."

"శశి అంటే?"

"చిన్నప్పుడు బాబ్జీ అని పిలిచేదానివి. వాడే శశి."

"అసలుపేరు మరచిపోయినట్లున్నా."

"పోనీలే, బాబ్జి అనే పిలు. పెళ్ళి సంగతి..."

"ఒకసారి బందిగదండీ. మళ్ళీఆ నరకంలోకి..."

"ఈసారి అలా కాదు. నే కుదిర్చిన సంబంధాలు ఇంతవరకు చాలా ఆనందంగా సాగుతున్నవి. నీ విషయంలో కూడా ఆ బాధ్యత నాదే. నీ మీద ఈగ వాల నివ్వను. సరేనా."

"మీ ఇష్టం."

"చక్కని కుర్రవాడున్నాడు. మీ ఇద్దరికీ ఈడూ జోడూ కుదురుతుంది. సంస్కారి, నామాటకు విలువిస్తాడు. చేసు కుంటావా?"

"మీకే అన్ని విషయాలను అప్పగిస్తున్నాను."

"అబ్బాయిని ఇదివరకేచూచావు. మళ్ళీచూస్తావా?"

"నే నెప్పుడు చూచానండీ? గుర్తులేదు."

"అంత మతిమరుపైతే ఎలా సుజీ?"

"అమ్మలాంటివారు మన్నించండి."

"శశీ, చూశావుగా సుజీని. నీకిష్టమేనా?"

"ఏమిటమ్మా నువ్వనేది?"

"సుజీని నీవు పెళ్ళి చేసుకోవడం నాకిష్టం."

"ఏం చేస్తాను. అలాగే కానీయి."

ముహూర్తం నిశ్చయిస్తా. రేపే నిశ్చయం. సుజీ, అబ్బాయితో ఏమన్నా మాట్లాడి వివరాలు తెలుసుకోవాలంటే వెళ్ళు. వచ్చి నా కేసంగతీ చెప్పాలి. నీ తమ్ముడిక్కడే ఉంటాడు. అతనితో కాస్త మాట్లాడాలి. శశితో వెళ్ళు

నెమ్మదిగా నా గదిలోకి చేరుకున్నాను. ఇంత త్వరలో ఇలాంటి నిర్ణయాన్ని అమ్మ తీసుకుంటుందని ఊహించలేదు. ఇదంతా నేనే పన్నిన కుట్ర అని సుజీ అపోహపడవచ్చు. ఆమెతో ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? అసలు నన్ను చేసుకోవటం సుజీకి ఇష్టమేనా? ఈ విషయాలను వేటినీ ఆలోచించకుండా ఇలా చేసిందేమిటి? నేను రాకముందే నా సంగతి మాట్లాడుకున్నారా? సుజీనే అడుగుతా.

"సుజీ, అమ్మ చెప్పింది నీకిష్టమేనా?"

"పెద్ద కుట్ర పన్నినట్టున్నారే!"

"నా ప్రమేయమేమీలేదు. నన్ను నమ్ము, సుజీ.

"ఒకసారి మోసపోయిన తర్వాత మగవాడిని నమ్మగలనా?"

"అంగన నమ్మరాదన్నారు."

"ఐతే మీ అమ్మకు మాటెందు కిచ్చారు."

"అవిశ అంగనలలో ఆదర్శ గృహిణి,సంఘసేవిక, నామేలు కోరేది.

"నేనెలాంటిదానినో, నాశీల మెలాంటిదో తెలుసుకోకుండానే చేసుకుంటారా?"

"అవలిస్తే పేగులు లెక్కపెట్టే మనిషి మాఅమ్మ నీలో ఎలాంటి కళంకమున్నదని స్ఫురించినా ఆవిడ నిన్ను చేసుకోమనదు. నీకు మనస్ఫూర్తిగా ఇష్టమైతేనే చెప్పు."

"నాకు సంబంధాలు చూస్తున్నప్పుడు మీ సంగతి నాన్నకు చెప్పించాను. కాని మీ అంతస్తుకి మేము సరి తూగలేమని నాన్న పట్టించుకోలేదు."

"జ్ఞాపకమున్నాననన్నమాట. అంతస్తులు కాదు సుజీ అంతఃకరణలు కలవాలి. అమ్మ కేవలం ఆదర్శాలు వల్లించే మనిషికాదు. తన జీవితంలోనే ఆచరిస్తుంది."

"రెండవసారి కూడా నేను మోసపోనని నమ్మమంటారా?"

"అమ్మనడుగు. మాతృవాక్య పరిపాలన నా ధ్యేయం. కాని..."

"కానీలు, అర్థణాలు లేవుగా. ఏమిటి సందేహం?"

"ఏంలేదు. అమ్మ, నువ్వు ఏకమై నన్ను సరిగా ఉండనిస్తారా?"

"ఉండనివ్వకపోతే మాకేగా నష్టం."

"సరే, అమ్మకు చెప్పు నీ అభిప్రాయం?"

"రేపు ఉద్యోగంలో చేరమంటారా?"

"అమ్మ చేరమంటే చేరు, నాకెలాంటి అభ్యంతరమూ లేదు."

"వస్తానండి."

"పెళ్ళిపీటలమీదికేగా!"

"ఇంక తప్పేదేముంది?"

"చక్కగా ఆలోచించి నిశ్చయించుకో, సుజీ."

"ఇదివరకే ఐపోయింది ఆ నిశ్చయం ప్రస్తుతానికి సెలవు ఇప్పించండి స్వామీ!"

"వెళ్ళిపోయింది మర్నాడు. ఉద్యోగంలో చేరింది. ముహూర్తం పెట్టించినట్లున్నది అమ్మ. పదిరోజుల తర్వాత మా వివాహం ఘనంగా జరిగింది. సుజీ నేనూ ఒకటైనాము. సుజీ ఏమి చెప్పితే దానిని అమ్మ ఆమోదిస్తున్నది. నేనే ఒంటరివాడినైనాను. సుజీ వెంటలేనిదే సాయంత్రాలు నే కదలటానికి వీలులేదు. ఏదైనా ఊరు వెళ్ళవలసివస్తే సుజీనికూడా ప్రయాణం కమ్మంటుంది. ఒక విధంగా నాకు స్వేచ్ఛ పోయింది. కాని అన్ని విషయాలను సుజీకి వదలి వేయటంతో చాలా విశ్రాంతి దొరుకుతుంది. ఏమన్నా అంటే, మోసంచేసి నన్ను చేసుకున్నారని సాధిస్తుంది మృదువుగా. కాస్త కోపంవస్తే బాబ్జి అని పిలిచి కోపం పోయేట్టు చేస్తుంది. నెల రోజులు ప్రశాంతంగా గడచినై. ఇక మొదలుపెట్టింది పోరు. విజయకు సంబంధం చూడమన్నది. అమ్మతో మాట్లాడమన్నా, విధిలేక సుజీతో కలసి నేనే అమ్మతో ఈ ప్రసక్తి తెచ్చాను. మా అక్కయ్య పెళ్ళికి వచ్చిందిగా. అప్పుడన్నదట. తన మరిది భాస్కరానికి సంబంధం చూడమని. సుజీద్వారా విజయనుగూర్చి అంతా తెలుసుకుంది.

"ఒరే, శశీ! భాస్కరం పెళ్ళి చేసుకుంటాడేమో

కనుక్కోరా."

"ఎందుకు చేసుకోడు. ప్రిన్సిపాలైనాడుగా."

"ఐనాదులే ఇలా దూరుగా తిరుగుతున్నాడు. చూశావుగా. ఆ అమ్మాయిని చేసుకుంటాడేమో చూడు."

"నీ బొడ్లోనుంచి ఒక మంగళసూత్రం తీసివ్వు. వెంటనే కట్టేస్తాడు."

"వేళాకోళం కాదురా."

"మరి విజయ వీడిని చేసుకుంటుందా?"

"వాడిని రమ్మని వ్రాయి. వాడిని తీసికొని సుజీతో నువెళ్ళి రావాలి. సుజీ, ఏమంటావు?"

"ఏమంటాను అత్తయ్యా! మీతో ఇదివరకే ఈ సంగతి చర్చించాను. మీరు సరేనన్నారు. ఆపదలో నున్నప్పుడు నన్ను చేరదీసి, కాపాడిన విజయకూడా ఒక ఇంటిదైతే ముందుగా సంతోషించేది నేనే."

"వెళ్ళిరామ్మా."

ఉత్తరం వ్రాస్తే భాస్కరం వచ్చాడు. చూచాయగా విజయసంగతిచెప్పి, ఆమెను పెళ్ళి చేసుకోవటం మంచిదన్నాను. తలాయించాలని చూశాడుగాని వాడి ఎత్తు సాగలేదు. అమ్మ, సుజీ కలసి వత్తిడి చేయటంతో సరే నన్నాడు. మేము వస్తున్నట్లుగా విజయకు వ్రాశాను. స్టేషనుకు వచ్చింది. మా ముగ్గురినీ చూసింది.

భార్యతో కలసి వచ్చి మా ఇంట్లో దిగుతామన్నారు. అలా కాకుండా సుజాతను తీసుకు వచ్చారు. మీ భార్యను నేను చూడగూడదా?

తప్పకుండా చూడవచ్చు. భార్యతోనే వచ్చాను.

"అంటే సుజాత..."

"నా భార్యే"

"నిజం?"

"మున్నాటికి, శుభలేఖ పంపాను. అందలేదా?"

అందింది. కాని అందులో సుజాత అని ఉంటే ఎవరో అని అనుకున్నా. మా సుజీయే అనే భావన రాలేదు.

విజయ ఇంటికి చేరుకున్నాము. అన్ని సదుపాయాలు చాలా బాగా చేసింది. స్నానాదికం నిర్వర్తించిన తర్వాత తీరికగా కబుర్లలో పడిపోయాము. భాస్కరాన్ని పరిచయం చేయటం మరచిపోయాను. గుర్తువచ్చింది.

ఈయన మాబావగారి తమ్ముడు, జూనియర్ కాలేజీకి ప్రిన్సిపాల్. మాతోపాటు సరదాగా తీసికొచ్చాము. మీదీ జూనియర్ కాలేజీయేగా మీ సమస్యలను మీరు చర్చించుకోవచ్చు. ఆఁ, మరిచిపోయాను. సుజీకి ఏదో మా అమ్మ చెప్పింది. ఆ విషయం సుజీయే చెప్తుంది.

"....సుజీ, ఏమిటీ మూగనోము. మీవారి ఎదట మాటలు రావా?"

"వారి ఎదటేనండీ ఒకటే వాగుడు. కాస్త తగ్గించే ఉపాయం చూడండి."

"ఏమే సుజీ, నీమీద పెద్ద ఫిర్యాదు వచ్చింది. పూర్తిగా మారిపోయినావా?"

"లేదండీ వదినగారూ. అసలు ఆడబిడ్డకన్నా ఎక్కువ జోరులో ఉన్నారు. శాంతించండి. మా అత్తగారు మీకొక కబురు అందజేయమన్నారు. మీరు మావెంట రావాలి.

"మీ అత్త అంటే నాకు భయమే. నీకు కుదిర్చినట్లుగా నాకు కూడా వెంటనే పెళ్ళి చేస్తుందేమోనని దిగులుగా ఉంది."

"వదినగారూ, ఒక మనవి. మా అత్తగారికి నీ పెళ్ళి చూడాలని గట్టి సంకల్పముంది. నెరవేరేదాకా నిద్రపోదు ఆవిడ మాట వింటే కనీసం నీ భర్త ఐనా బాగా సుఖపడతాడు."

"నువ్వు సుఖపడటంలేదా ?"

"నా సుఖమేమిటిలే. బాబ్జీని అడుగు."

"ఈ బాబ్జీ ఎవరే?"

"మా ఆయనే. నా చిన్నతనం మావూళ్ళోనే ఉండే. వాళ్ళు అప్పుడు ఆటల్లో బాబ్జీ అనే పిలిచేదాన్ని. ఆయనే గుర్తుచేశారు. ఎందుకని ?"

నాచేత సేవలు చేయించుకోవటానికి.

"అన్నయ్యగారూ, సుజీ ఇలా మాట్లాడుతుందే మిటి? దానిని కష్టపెడుతున్నారా?"

"ఇంత వరకు నేనే కష్టపడుతున్నా. మా బావగారి తమ్ముడిని మీరు చేసుకుంటే నాకష్టాలు పోతై. మన మిద్దరం కలసి సుజీ సంగతి చూడవచ్చు."

"నా ప్రమేయం లేకుండానే నాకు సంబంధం కుదర్చారా?"

"కాదండీ వదినగారూ! మా అత్తగారు నిశ్చయించారు ఆవిడ మాటకు తిరుగులేదు. మీ రుభయులు సంప్రదించుకోండి."

భోజనాలైనతర్వాత స్కూలుకు చేరాము. ఉపాధ్యాయులందరూ ఆశ్చర్యంతో చూశారు. వెనకటి హెడ్మాస్టరుగారిని సస్పెండ్ చేసి కేసు పెట్టారుట. రామానికి ఉద్యోగం పోయిందట. హెడ్ గుమాస్తాకు వార్నింగ్ ఇచ్చారని విన్నాము. స్కూలు కళ కళలాడుతున్నది మాకు కనబడకుండా వెళ్ళిన సుజీని పట్టుకుంది విజయ.

ఉపాధ్యాయులతో తీరికలేకుండా వసపోసిన పిట్టలాగా వాగుతున్నది. ఇది వరకు మూగనోములో ఉన్న సుజీ ఇంత మారిపోయిందేమా అని అందరు ఆశ్చర్యపోయారు. ఆ రాత్రికి విజయ, భాస్కరం ఏమేమో చర్చించుకుంటున్నారు. సుజీ నాదగ్గరకు వచ్చింది.

"బాబ్జీ నన్ను మోసంచేసి పెళ్ళి చేసుకున్నారు. ఇప్పుడు విజయను మోసంచేయాలనా మీసంకల్పం?"

"సుజాతాదేవిగారూ, మోసగింపబడ్డది నేనేనండీ! మీకేం, మీరు హాయిగా ఉన్నారు."

"మిమ్మల్ని కనిపెట్టుకుని తిరగటమేనా హాయి అంటే? వంటరి బ్రతుకు చాలా బాగుండేది. దానిని...."

"జంటబ్రతుకు చేసుకున్నాం."

"ఆ జంట అనే జంఝాటంలో...."

"మీదే పైచేయి ఐంది అలా చేశారు మీరు, మీ అత్తగారు."

"ఆవిడనేమీ అనకండి."

"ఈవిడనూ అననులెండి, లేకపోతే ఇంటికి వెళ్ళగానే..."


"చాలులెండి . ఈ నటన. భాస్కరం సంగతి విచారించరా?"

"వాడు సుముఖుడే. విజయ విషయమే నీవు తేల్చుకోవాలి."

"వెళ్ళివస్తా. విశేషాలుంటే చెప్తాలెండి."

"వస్తారుగా."

విజయ ఏం నిర్ణయం తీసుకుంటుందో అని ఆలోచిస్తూ పడుకున్నాను. నిద్ర పట్టదు. భాస్కరం వచ్చాడు కాని సుజీ రాలేదు. వాడంత వాడే ఏమన్నా చెప్తాడేమోనని ఎదురుచూచా. వాడు మాత్రం ఈల పాటలో నిమగ్నుడైనాడు. శుభశకునమే. మర్నాడు విజయను తీసికొని అమ్మదగ్గరకు వచ్చాము. భాస్కరంతోను, విజయతోను విడి విడిగా మాట్లాడివచ్చింది అమ్మ. బొడ్లో మంగళసూత్రాన్నిచూచి భాస్కరం ఆనందించాడు. విజయకు చూపించాను. సిగ్గుతో కుంచించుకుపోయింది. అక్కయ్యకు, బావకు కబురు వెళ్ళింది. ఇంకా ఎన్ని మంగళ సూత్రాలున్నయో ఆవిడ బొడ్లో అని నేచూస్తుంటే సుజీ కొంటెగా నవ్వింది. విజయ ముఖంలో దరహాస రేఖలు. ●



డా॥ ఇంగువ కార్తికేయ శర్మ

సప్తస్వర సుందర శివ

సాధారణముగా సంగీత సాహిత్యములకు పెన్నిధిగా సరస్వతీ దేవిని కొల్చుట యాచారము. అట్లే నాట్యమునకు శివుని నటరాజు రూపమున ఆరాధించుట అనాదిగా నున్నది. కాని శివునికి సంగీతమునకు గల సంబంధము అందరెరిగిన విషయము కాదు. ఈ సంబంధమును చిత్రించ నొక మహత్తర శిల్పము 1931 లో బొంబాయి నగరమునకు చేరువుగా నున్న 'పరేల్' యనుచోట వెలికి వచ్చినది. దీనిని గూర్చి నిదివరలో కొందరు పండితులు చర్చించినారు (1) కాని పూర్తిగా నీ మూర్తి శిల్పమున భావ గర్భితమైయున్న శివ తత్వమున సంగీత స్వరూపముల నిశితముగా తర్కింప బడలేదు. ఈ వ్యాసమున నీ శిల్పరాజమును గుర్చి వివరముగా పరిశీలింతును.

(ఛాయా చిత్రము — 1).

ఈ శిల్పము కొనకోసి తల క్రిందు చేసిన సీమ బాదంకాయ ఆకారములో నున్న పెద్ద శిలాఫలకముపై చెక్కబడెను. బింబములు మనకు శిలాతలము నుండి పైకెగురు చున్నట్లు కన్పడు చున్నవి దీనిని వుధృత శిల్పము (అర్ధ శిల్పం) అనవచ్చు. క్రీస్తుబ్దము 6 – 7 వ శతాబ్దిని మహారాష్ట్ర – ఆంధ్ర కర్ణాటకముల నేలిన చాళుక్య - రాష్ట్ర కూట రాజుల కాలమునకు చెందిన యీ శిల్పము అర్చమూర్తిగా నారాధింపబడ కున్నను, గర్భాలయముపైన భద్ర కోష్ఠమున ప్రతిష్ఠించబడి యుండెను కాబోలు. శైవాగమము ప్రకారము నీ మూర్తి శిల్పము దక్షిణా మూర్తి, నటరాజ విగ్రహములున్న చోట దక్షిణముఖముగా నున్న భద్రకోష్ఠమున నుంచబడి యుండనగును.

ఈ శిల్ప రాజమున ముఖ్యమైన యేడు స్వరూపముల గూర్చి (1 - 7 కొంత విపులముగా చర్చింతును. చిత్ర మేమన యేడు మూర్తుల ముఖ కవళికలు భావగర్భితములై నిండుగా నొకే శైలిలో కానవచ్చుచున్నవి. విశాలములైన అర్ధనిమీలిత నేత్రద్వయము ఫాలమున నిటారుగానున్న మూడవ నేత్రము, చిక్కని పెదిమలు, నిండు బుగ్గలు, ఆజానుబాహువుల నమరికగా నున్న ముంజేయి కంకణమును, సర్పకేయూరములు, దట్టమైన కేశపాశములు నడుముగా గూడు కట్టి బిగించినను, స్కంధములపై పొరాడుచున్న జటా జూటములు, సాగిన మకర కుండలములు, కంఠహారములు, గ్రైవేయకము నిస్సంశయముగా మహా సదాశివుని స్వరూపముగా తెలుసుకోనగును. మధ్యనున్న సంపూర్ణరూపమున (4), పూర్తిగా పాదముల వరకు తాకుచున్న పింజపోసి కట్టిన కచ్చ, కటి వస్త్రము చక్కని అర్ధచంద్రాకారపు ముడతలలో మోకాళ్ళను తాకుచున్నది. ఎవ్వరికిని యజ్ఞోపవీతము లేదు. మధ్యగా నిల్చున్న మూర్తి సంపూర్ణముగా చూపబడినాడు. తక్కిన ఆరు స్వరూపములు పాక్షికముగా మాత్రమే శిల్పింపబడెను, కాని పూర్తి స్వరూపములుగా నొక దానిపై నొకటి క్రమ బద్ధముగా నున్నట్లు గ్రహింపవలసి యున్నది.

శిలాఫలకమున మధ్యగా నిల్చున్నట్లున్న మూర్తులలో పైన ఎనిమిది చేతుల మూర్తిని బొడ్డువరకే చూడగల్గుచున్నాము. క్రింద మరొక ప్రతిమ, దాని క్రిందుగా పూర్తిగా కానగు మూర్తి, ఈ స్వామికిరువైపుల భుజస్కంధముల నుండి పైకెగురుచున్నట్లున్న రెండు శివమూర్తులు, ఒకదానిపైనొకటి శిల్ప సంజ్ఞలలో ఆకాశగమనమును సూచించు, గంధర్వ – కిన్నెరులవలె విహరించుచున్నట్లు, కనిపించుచున్నారు.

ప్రతి రూపములలో నిరుచేతుల హస్తముద్రలలో అరచేయ-వ్రేళ్ళ యభినయములలో మార్పులున్నవి. ముఖ్యముగ గ్రహింప వలసినదేమన్న అచరమైన అభినయ హస్తముద్రలు సంయుక్తముగాను, విడివిడిగానైననేమి, సంగీత స్వరముల సూచించుచున్నవి.

1 మొదటిమూర్తి శిలాగ్రమున చెక్కబడి యున్నాడు. అష్ట భుజములలోని యంశముల పరీక్షింతును. ముందున్న రెండుచేతులు పైకి ఎత్తబడియున్నవి. కుడిచేతిని పద్మగుచ్ఛము, యెడమచేయి హస్తభాగము సొంపుగా ఆకాశమువైపు చూపుచున్నది. పైన రెండుచేతులు సర్పశిర ముద్రలో శిరముపైని ప్రభవలె నున్నవి. ఇది చక్రమండలమునకు సంకేతమగుచున్నది. మధ్యనున్న నాల్గుచేతులందు ఆయుధములు – డమరు, మృగ, ఖడ్గ, కీటకము లున్నవి. ఈ అష్టభుజమూర్తి తక్కిన ఆరురూపముల కన్న ప్రత్యేక స్థానమును బొందియున్నాడు. సప్తస్వరములలోని మొదటిదైన షడ్జమము, అనగా 'స' యొక్క ప్రతిరూపముగా, సద్యోజాత శివునిగా భావింపనగును.

ఇక తక్కిన ఆరు రూపముల యందలి హస్తముద్రల విడివిడిగా పరిశీలింతము. ఛాయా చిత్రమున వీని వరుసక్రమమును చూపి యుంటిమి. (1-7).

(2) ఎడమప్రక్కపై మూర్తి. ఈతని కుడిహస్తము భుజముపైవరకు ఎత్తియున్నది. వ్రేళ్ళముద్రలలో నంగుష్టము తర్జనిని తాకుచున్నది. తక్కిన వ్రేళ్ళన్నియు విడివిడిగా కానవచ్చుచున్నవి. దీనిని భ్రమర హస్తముద్రగా నెరుగ వలయును. ఈ హస్తాభినయము 'రిషభ' లేక 'రి' ని సూచించును భ్రమరము 'రిం' కారమును చేయును. ఎడమచేయి కటిపైనున్నను అరచేతిని కమలమున్నది. ధోవతియొక్క ముడుతలు ఈ చేతిపై నెగురుచున్నట్లు చూడనగును.

(3) పై మూర్తివలె యెగురుచున్నట్లున్న ఈ రూపమున కుడిచేతిని అంగుష్టకము మధ్య వ్రేలిని తాకుచున్నట్లు చూపబడెను. తక్కిన మూడువ్రేళ్ళు త్రిశూలాకారముగ నభినయించుచున్నవి. అందువలన నీముద్ర మూడవ స్వరమైన గాంధార లేక 'గ'ను సూచించును. యెడమ అరచేతిని పద్మము, కాండముపై తట్టుగా పిడికిలిలో నున్నటుల తెలియుచున్నది.


(4) ఇది మధ్యనున్న సంపూర్ణ శివస్వరూపము. కన్నుల నాకట్టుకొను సుందరమూర్తి, పైకెత్తి యున్న కుడి చేయి చతుర హస్త ముద్రలోనున్నది. యెడమ చేయి హస్త ముద్రలో 'నున్నను' అరచేతిని నిండైన పద్మము గలదు. వ్రేళ్ళ మధ్యగా పైకి పట్టుకొని యున్నట్లు తెలియుచున్నది. ఇది సింహ హస్త ముద్రకు సంకేతము ఈ రూపమును మధ్యమస్వరమైన 'మ'కు సంకేతముగా నెరింగి ఈ శివుని మధ్యమ స్వరమూర్తిగా తీసుకొనవలయును.

(5) ఈ రూపమున కుడిచేయి ధ్యానముద్రలో హస్తము వక్షస్థలము వైపుకున్నది. అంగుష్టము తర్జనీ కలసి యున్నవి. తక్కినవి విడిగానున్నవి. యెడమ చేయి క్రింది వ్రేలాడుచున్నను, వరద హస్త ముద్రలోనున్నది. పద్మము కూడ కానవచ్చుచున్నది. ఈ చేతిలో ముఖ్యముగ గమనింప వలసినది మధ్యమ-అంగుళీయకముల చుట్టుకొనియున్న చిన్న రుద్రాక్షమాల. ఈ మాల శివపంచాక్షరి సంకేతము. స్వరమండలమున పంచమ స్థాయిని సూచించును.

(6) కుడి ప్రక్కగా నెగురుచున్న యీ రూపమున కుడి అరచేయి సొంపుగా పైకి చూపించుచున్నాడు. ఐదువ్రేళ్ళు కలసి "పతాక" హస్త ముద్రను సూచించును. యెడమ చేతిని లీలాకమలమున్నది. కాడ, బొటనవ్రేలు తర్జనీల మధ్యగా వున్నది. ఆరవ స్వరమైన దైవత లేక 'ద'కు సంకేతము. కాన ఈ మూర్తి దైవత స్వరమూర్తిగా నెరుంగ వలసియున్నది.

(7) కుడి వైపు పై భాగమున యెగురుచున్నట్లున్న ఈ మూర్తి కుడి చేతిని బొటనవ్రేలు, అంగుళీ - కనిష్టికములు కలిసియున్నవి. యెడమ చేయి పైకిగా నుండి ఐదువ్రేళ్ళను చూపుచున్నది. కాన నీ సంయుక్త హస్త ముద్రలలో యేడువ్రేళ్ళు సప్తస్వరమైన నిషద లేక 'ని'కి సంకేతముగా తీసుకొన వలసి యున్నది.

ఈ విధముగ నీయేడు రూపములు యేడు స్వరముల ప్రతీకలుగ సుందర శివుని శిల్పించిరి. అంతటితో తృప్తిజెందక సప్తస్వర శివుని సంగీత ప్రదర్శనకు



ఛాయాచిత్రము-1 : పటల్ : సప్తస్వర సుందర శివ : చాళుక్య - రాష్ట్ర కూటకృతము క్రీ. శ. 6-7 వ శతాబ్ది.

లయ-శ్రుతుల చేకూర్చుటకై అయిదు గణములను కూడ ఫలకము క్రింది భాగమున నిరువైపులా చూపియున్నారు. ఈ మరగుజ్జు గణములు, కుడి ప్రక్క ముగ్గురు, యెడమ వైపు నిరువురు తమ తమ పనులలో మునిగియున్నారు. కుడి తట్టు కూర్చొన్న గణము ఢదేలు (?) వలెనున్న వాయిద్యమును మీటుచు నోరు విప్పి ఆనందోత్సాహముగా నున్నాడు. ఇతని ప్రక్క వాడు వేణువును, పైని నిల్చున్న గణము శ్రుతికై వీణను మీటుచున్నాడు. యెడమ వైపు గణములలో - పై వాడు నిల్చుకొని తంబుర నొక చేతిని పట్టుకొని పాడుచున్నట్లు కనబడుచున్నాడు. క్రింద కూర్చొన్న గణము యేడు తంత్రుల పరివాదినిని వాయించుచున్నాడు. ఇట్టి గణములు సప్తస్వర శివునికి లయ - శ్రుతుల (కంఠ, తంత్రీ, సుషిర, కంచువాదనము) చేకూర్చుచున్నారు.

ఈ విధముగా స్వర్గ భాగమున యెనిమిది చేతుల మూర్తి మొదలు కొని వరుసగా - షడ్జమము, (స) ఋషభ (రి), గాంధార (గ), మధ్యమ (మ), పంచమ (ప), ధైవత (ద), నిషాధ (ని), ములుగా తెలుసు కొనగల్గితిమి. హస్త ముద్రలు కేవలము ఆవశ్యమైన అభినయ హస్తములేగాని, నృత్య హస్తములలో వలె కదలికలను సూచించవు. ఈ అభినయ హస్త ముద్రలు భరతుని నాట్య శాస్త్రమున అలపద్మ, వక్రహస్త, సర్పశిర మండల, స్వరమండల, త్రిపతాక కటక. సింహముఖ, భ్రమర, చతురహస్తములుగా పేర్కొనబడినవి.

ఈ శిల్పము చాళుక్య - రాష్ట్రకూట కాలము నాటిదిగా వారు రాజ్యము చేసిన చోట్ల లభించుట వలన చెప్పుకొనుచున్నాము. కాని యిదే కాలమునకు చెందిన స్వర సంకేతముల వివరించు శిలా లేఖనము తమిళనాడులోని "కుడి

మియామల'' యనుచోట లభించినది. ప్రాచీన కాలమున నారదాదులచే చెప్పబడిన పరివ్రాజకోపనిషత్తు నందు స, రి, గ, మ, ప, ద, ని, యను సప్తస్వరముల ప్రశస్తి కలదు. క్రీస్తబ్దము 6 - 7 శతాబ్ది నాటికే ఈ సప్తస్వర సంగీతము మిక్కిలి ప్రచారము లోనికి వచ్చియుండెను. మహారాజులు కూడ సంగీత శాస్త్రమున గొప్ప పండితులుగా ప్రతిభకు వచ్చినట్లు తెలియుచున్నది. పల్లవరాజు మహేంద్రవర్మ (క్రీ. శ. 560 - 380), సంకీర్ణ రాగముల సృష్టించెనట. అందు వలననే యీతనికి సంకీర్ణ జాతి, విచిత్ర చిత్త యను బిరుదములు వచ్చెను.

ఈ కుడి మియామల శాసనము పల్లవ గ్రంధలిపితో సంస్కృత భాషలోనున్నది. కావించిన వాడు పల్లవరాజు పరమ మాహేశ్వరుడు రుద్రాచార్యుని శిష్యుడు. సంగీత సాధన చేయగోరు విద్యార్థులకై నీ శాసనము గావింపజేసెనట. శాసనము చివర ''పరివాదినీయె'' యను పదమున్నది. ఇది కాక తమిళనాడున మరికొన్ని చోట్లకూడ నిట్టి సంగీత శాసనములున్నవి. తిరువయము, మరియు తిరు గోకర్ణమనుచోట్లకూడ నీ ''పరివాదనియె'' కానవచ్చును. ఈ స్వరముల 'పాట్టు' యనగా పాడువారికి, 'యాళ్' అనగా పరివాది నీ సాధకులకు మార్గ దర్శకముగా వ్రాయబడిన వీని శాసనముల పేర్కొన బడినది. ఈ చోట్లన్నింట శివుని కంకితములైన గుహాలయములు పుదుక్కోట జిల్లాలోనే, వున్నవి. ముఖ్యముగా కుడిమియామల శాసనమున స్వర సంకేతములపై, అ, ఇ, ఉ, ఎ అను అచ్చులను అనుసంధించిరి. పై నుదహరించిన శిల్పమున నిట్టి స్వరముల సంకేతముల ద్వారా హస్తముద్రలలో సూచించుట గమనార్హము.

ఇంతగా సంగీతమునకు ప్రాధాన్యత వచ్చుటకు కారణము ఆనాటి ప్రసిద్ధ శైవ ప్రవక్తలు, శివోపాసకులు నైన అప్పార్ (తిరునావుక్కరసు), సంబంధార్ (తిరుజ్ఞాన సంబంధార్), మరియు సుందరార్ (సుందరమూర్తి నయనార్) మున్నగు మహాను భావులు ? తేవారములందు శివుని నాదబ్రహ్మంగా, స్వరాచార్యుడుగా, నటరాజుగా పలురకములు స్తుతించిరి, సదాశివుని ప్రణవ స్వరూపునిగా ఓంకార), సామగాన చతురుడుగా పాదల్ వల్లాణ్‌గా ప్రతిపాదించ ఆరాధించిరి. తరువాత కాలమున గూడ శివుని సంగీత స్వరనిధిగా నాయనమార్లు, విష్ణువును ఆళ్వారులు భక్తితో కొలిచి పాడుకొనిరి. వీరందరూ నొక గొప్ప దాక్షిణాత్య సంస్కృతీ సాంప్రదాయములకు వారసులుగా నిల్చిరి.

కాని మన తెలుగు జాతి సగర్వంగా తర తరాలుగా తమదనే చెప్పుకో గల్గిన శాశ్వత సంగీత భండారముల సృష్టించినవారు నల్గురు మహనీయులు తాళ్ళపాక అన్నమాచార్యులవారు, క్షేత్రయ్య, రామదాసు మరియు త్యాగబ్రహ్మలు. వీరందరూ భక్తి మార్గమున తమ కవితాగాన మాధుర్యములతో భగవత్ సాక్షాత్కారమును బొందిరి. వీరి సంగీత ప్రయోగములతో ప్రజల తన్మయులజేసిరి. ఈ భక్తి - మోక్షతత్వములు వైదిక పురాణేతిహాసముల నుండి గ్రహింపబడినవే యైనను, ఈ భావ సంస్కృతి తరతరాలుగా భారతావనిలో వాస్తు - శిల్ప - సంగీత కళలద్వారా సజీవమై ప్రవహించుచుండెను. ఈ మహత్తర సంస్కృతీ ప్రాభవమునకు, ప్రచార ప్రసారములకు భాషా ప్రాంతీయపు ఎల్లలు అడ్డురాలేదు.

పైన వివరించిన శిల్పమిట్టి మహత్తర సంగీత సాహిత్య శాస్త్రముల సంయమునకు ప్రతీకగా నిలిచిపోయినది. మరొక ముఖ్య విశేషమేమన ఈ మూర్తి శిల్పమును పైన పేర్కొన్న వాగ్గేయకారులెవ్వరు చూడలేదు, యెరుగరు. సంకీర్తనాచార్యుడు; పదకవితా పితామహుడైన అన్నమాచార్యుల వారి కాలానికన్న (1408 - 1503), ఈ శిల్పము యేడు శతాబ్దుల పూర్వము గావింపబడెను. వీరెవ్వరికీ అందుబాటులో, కానరాని చోటున వృగ్యమై యుండెను.

కాని త్యాగబ్రహ్మ యీ సంగీత స్వరమూర్తిని సప్తస్వర సుందరులను తన్మయత్వంలో తనివి తీరగా యెంతటి సత్య దృష్టితో వర్ణించి పాడుకొన్నాడో గమనించిన ఆ మహనీయుని కబ్బిన భారతీయ సంస్కృతి యెంతటి వృత్కృష్టమైనదో తెలియును.

త్యాగరాజ స్వామి రెండు కీర్తనల నిచ్చట పేర్కొనుచున్నాను.

1. సిద్ధరంజని - ఆదితాళం

నాదతను మనిశం, శంకరం ।
నమామి మే మనసా శిరసా ॥

అనుపల్లవి

మోదకర నిగమోత్తమ సామ
వేదసారం వారం వారం

చరణము

సద్యోజాతాది పంచవక్త్రజ
స రి గ మ ప ద ని వరసప్తస్వర
విద్యాలోలం విదళిత కాలం
విమల హృదయ త్యాగరాజ పాలం

2. జగన్మోహిని - రూపకం

పల్లవి : శోభిల్లు సప్తస్వర సుందరుల భజింపవే మనసా ॥
అనుపల్లవి : నాభి హృత్కంఠ రసన - నాసాదుల యందు
చరణము : ధరఋక్సామాదులలో - వరగాయత్రీ హృదయమున
సురభూసుర మానసమున శుభ త్యాగరా జాదులలో ॥

సప్తస్వర సుందరుల అనేది పుంలింగ బహువచనము. సుందరుడు అనేది శివుని పేరు. మధురలో వెలసిన దైవము శ్రీ సుందరేశ్వర స్వామి. సప్తస్వర సుందరులన సప్తస్వర మూర్తులైన శివులు. వీరందరూ యేకమైన నాదతనుం - సంగీతమే శరీరముగా గల శంకరుడై నాడు. ఈ మహత్తర వైదిక తత్వ సాంప్రదాయమునకు పై శిల్పమెట్లు ప్రతీకగా క్రీ. శ. 6 - 7 వ శతాబ్దిని సృష్టింపబడెనో - అట్లే పదకొండు శతాబ్దుల అనంతరము వచ్చిన త్యాగబ్రహ్మ (1767 - 1847), యీ సప్తస్వర సుందరుల తన సంగీత స్వర - సాహిత్యముతో పునః సృష్టించెను.

మరికొన్ని కృతులలో కూడ నీ సుందర రూపముల తత్వమును చక్కగా వివరించెను.

సామజ వరగమన (రాగ - హిందోళ, ఆదితాళము).

సామ నిగమ సుధామయగాన, మరియు వేద శిరోమాత్రజ సప్తస్వర నాదాచలాధిప : మరియొక కీర్తనములో రాగ సుధారసపానము (రాగ ఆందోళిక - తాళము - దేశాది), సదాశివ మయమగు నాదోంకార స్వరవిహిల్లు, యని నాదము సదాశివుడు, నాదము ప్రణవము, సప్తస్వరములు ప్రణవ మంత్రోద్భవములు అని తెలియజేయు గొప్ప తత్వమును మహదానందముతో తానెరిగి ప్రపంచమునకు తెలుపుటకై రాగయుక్తముగ సృష్టించిన మన త్యాగరాజ స్వామి వందనీయుడు. అటు శిల్పమును ముందుంచు కొని, యిటు శ్రీ త్యాగరాజ స్వామి వారిపై కృతుల పాడుకొన్న వొళ్ళు పులకరించి పోవును. అహో ! భారతీయ కళా - సంస్కృతీ ! నీకు జే జేలు. త్యాగయ్యను గన్న తెలుగు జాతీయులార మీరు ధన్యులు. నమో ! సప్తస్వర సుందర మూర్తీ ! నమోనమః !

ఉపయుక్త రచనలు

1. ''స్వరమయ'' రూప్‌లేఖ (బొంబాయి 1958) సం. 18, నెం. 1 - 2; ఇంకా కె. ఆర్. శ్రీనివాసన్ ''ఏన్ ఇంటరెస్టింగ్ ఇకాన్ ఆఫ్ శైవ సింబాలిజమ్'' ఎ న్యూ ఎప్రిషియేషన్; ప్రొసీడింగ్స్ ఆఫ్ ది సెమినార్ ఆన్ సింబాలిజమ్ ఇన్ టెంపుల్ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్, అనంతాచార్య ఇండోలాజికల్ రీసెర్చి సెంటర్, (బొంబాయి, 1981), పు. 70 - 84.

ఈ వ్యాసమును చదివి సంస్కరించిన పెద్దలు శ్రీనేల సూతల శ్రీకృష్ణమూర్తి, న్యాయవాది, నెల్లూరు. వారిక్ నా కృతజ్ఞతాపూర్వక నమస్సులు. ఈ వ్యాస రచనలో నాకు మా చిరంజీవిని విమల తోడ్పడినది. చక్కని ఛాయా చిత్రమును కోరినంతనే తీసిన మా శాఖ సీనియర్ ఫోటోగ్రాఫర్ శ్రీ త్యాగరాజన్‌కు నా ధన్యవాదములు.

నివాళి

శ్రీ సూర్యదేవర రవికుమార్

నన్నయ నుంచీ నిన్నటిదాకా
ఎన్నో వందల కవిపుంగవులు ...
ఎవరి రచనలో ఏ ఘట్టంలో
ఏ పద్యంలో ఏ పాదంలో
నీకేదైనా తెలియకపోతే
నిఘంటువులు వారి నడుగు
నిలబడ్డ ఫలంగా నీ సందేహాన్ని
నివృత్తి చేస్తారని నే విన్ననాడు
ఆయనంతటి ఘనుడా ? అని
అనుకొన్నాను మనస్సులో.
కాని ... వారి
ఉదాహరణ వాఙ్మయంలో
ఓనమాలు దిద్దుకున్నప్పుడు
తెలుగు కవుల చరిత్ర పుటల్ని
తిరగవేస్తున్నప్పుడు,
వారు
ఆంధ్రభారతి లావణ్యరేఖలను
'భారతీ' దర్పణంలో
ప్రతిబింబింప జేసినపుడు
ఆంధ్ర సాహిత్యాకాశంలో

అహర్నిశలూ మెరిసే
అద్భుత వ్యాస తారకల
నవతరింప జేసినపుడు

ఆ అమోఘ పాండిత్యం
ఆ అద్భుత ప్రజ్ఞ
ఆ నిరంతరానుశీలనం
ఆ నిర్మల మనో వ్యాపారం
సువ్యక్తమైనాయి
సుదర్శనమైనాయి
అనుకోకుండానే వారికి
అంజలి ఘటించాను
ఆయనెంతటి ఘనుడో ! అని
ఆశ్చర్యపోయాను.


సాహిత్య సముద్రాన్ని
ఆపోశనం పట్టిన
అభినవ అగస్త్యులు వారు

ఆజన్మాంతం మథించి
అహర్నిశలూ అమృతాన్ని పంచిన
సాహిత్య బాంధవులు వారు

ఆ విమర్శక శిఖామణి
అస్తమించారంటే
ప్రాచీన సాహిత్యపు బాగోగులు
ప్రపంచానికిక చాటేదెవరు ?
తమవాదమే వేదమన్నవారిని
తట్టి నిజమిదని చెప్పి
తగ్గమనే వారెవరు ?

తెలుగు పలుకుల తీరుతెన్నులు

వెలికి తీసిన విద్యారత్నము
'బహుళాంధ్రోక్తి మయ ప్రపంచ'
పరిశోధనా పరమేశ్వరులు
విమర్శక లోకంలో స్థిరంగా
వెలిగే కళాప్రపూర్ణులు
జంగమ విజ్ఞాన సర్వస్వంగా
జగమెరిగిన మనీషి
ఉన్నారెందరో వారి రచనలు చదివి
ఉత్తేజితులైన భాషాభిమానులు
నడుస్తున్నారెందరో వారి రచనాపథాన్ని
అనుకరిస్తూ; అనుక్రమిస్తూ
వారి రచనల మణిదీపాలు
భారతికిచ్చిన హారతులు
అమలినమైనవి
అద్భుతమైనవి
అక్షరమైనవి.



సీరియల్

సమిధలు

దిలావర్

(గత సంచిక తరువాయి)

13

సాయం సమయం. ఆకాశం నిండా సిందూరం పూసినట్టుంది. పగలంతా వుడికెత్తించిన గాలి కాస్త చల్లబడింది. సంజ వెలుగులో బంగారు పూత పూసుకున్నట్టున్న రెక్కలు చాపుకొని ఆహ్లాదకరంగా వున్నది పార్కులోని వాతావరణం. రేవతి పార్కులోని కొచ్చి ఖాళీగా వున్న ఓ సిమెంటు బెంచీ మీద కూర్చుని ఏదో ఆలోచిస్తున్నది.

"హల్లో రేవతిగారు, ఏమిటీ దీర్ఘంగా ఆలోచిస్తున్నారు ? స్త్రీ విమోచనోద్యమం గురించేనా ?" నవ్వుకుంటూ వచ్చాడు కిష్టు.

కిష్టువేపు అయిష్టంగా చూస్తూ "ఏం ? ఆలోచించగూడదా ?" అంది సూటిగా.

"ఇప్పుడేం కొంపలంటుకున్నాయండీ అంత సీరియస్‌గా బుర్ర బద్దలు కొట్టుకునేందుకు ?" చాలా యీజీగా అన్నట్టున్నా ఆ మాటల దాగివున్న కవ్వింపు రేవతిని చిర్రెత్తించింది.

"ఇప్పుడేం ఖర్మండి బాబూ ! ఆ అంటుకోవడం షనేది ఎప్పుడో కొన్ని యుగాల ముందునుండే ప్రారంభమైంది. ఇప్పుడిప్పుడే పురుషాధిక్యతలో అణగారిన స్త్రీ ఆర్తినుండి, కష్టాల నుండి, కన్నీళ్లనుండి తేరుకొని తిరుగుబాటు ప్రకటిస్తుంటే మీ బోటి మగమారాజులకు మింగుడు పడ్డంలేదు" కసిగా అంది రేవతి.

"నో ... మా మీద లేని పోని అభాండాలేస్తే నే నొప్పుకోను. పురుషుడు మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు, ఆరాధిస్తున్నాడు. దేవతగా చూసుకుంటున్నాడు మీరు లేకుంటే మేం బతకలేం అని గుండెలు బాదుకుంటున్నాడు. మీరేమో లేనిపోని వన్నీ వూహించుకొని కేస్ట్రేషన్ కాంప్లెక్సుకు గురయి తెగ గింజుకుంటున్నారు ..." పుండుమీద కారం జల్లినట్టున్నాడు కిష్టు.

"ఛత్ ! వుట్టి హిపోక్రాట్‌గా మాట్లాడకు. ప్రపంచంలో ఏ సమాజమైనా స్త్రీని ఎట్లా అణగదొక్కిందో చరిత్ర పుటలు తెరచి ఒక్కసారి చూడు. పురుషునికో న్యాయం, స్త్రీకో న్యాయం. పురుషునికేమో హక్కులు. స్త్రీకి మిగిలేవి బాధ్యతలు- సుఖం పురుషునికి. బండచాకిరి స్త్రీకి. ఇట్లా దారుణంగా స్త్రీ కొల్లగొట్ట బడుతుంటే నువ్వేమో దానికి ఆరాధన - ప్రేమ అని రంగులు వేస్తున్నావ్ ..." ఈసడింపుగా కిష్టువేపు చూస్తూ అన్నది రేవతి.

"మొత్తం మీద మిమ్మల్ని అభినందించాలి. అటు మీ హీరో ... అదే ... రవి ... ... హేవ్స్ అండ్ హేవ్ నాట్స్ అని ఓ రకమైన వర్గ కసి పెంచుకుంటుంటే ఇటు మీరేమో పురుష లోకవర్గం, స్త్రీలోక వర్గం అంటూ మరో వర్గ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. చూడ ముచ్చటగా వుందండీ మీ జోడీ ..." ఎగతాళిగా నవ్వాడు కిష్టు.

"మిస్టర్ కిష్టు! ఏ వర్గం గురించైనా మాట్లాడేందుకు ఓ కనీస అర్హత వుంటుంది. అది నీలో ఏ కోశానా లేదు. వడ్డించిన విస్తరి నీ జీవితం. బంగారపు చెమ్చాతో పుట్టిన వర్గం నీది. హేవ్ నాట్స్ గురించి - వాళ్ల బ్రతుకుల గురించి నీ కేమీ తెలియక పోవడమే నాచురల్. ఏ మాత్రం తెలిసినా మేం ఆశ్చర్యపడాలి. అట్లాగే తరతరాలుగా స్త్రీల మీద పెత్తనం చెలాయించిన పురుషజాతి నీది. ఇక మా సమస్యలు నీ లాంటి వారికెట్లా అర్థమవుతాయి ?" లోలోపల మండుతుంటే నిగ్రహించుకుంటూ అంది రేవతి.

"ఇందులో అర్థంగాక పోవడానికేముంది ? ఇంతకూ మీరు కలలుగనే స్త్రీ పురుష సమానత్వమెట్లా వస్తుందంటారు? స్త్రీలు వుద్యోగాలు చేస్తూ పురుషులు వంట చేయడమేనా మీరు కోరుకునే స్త్రీ స్వాతంత్ర్యం ?"

"ఏం ? స్త్రీలు వుద్యోగాలు చేయకూడదా ? వంట చేయడం నామోషి అయిన పనైతే ఆ పని స్త్రీలే ఎందుకు చేయాలి ? మిస్టర్ కిష్టు, ఓ విషయం గుర్తించుకో మీ పురుషుల్లో పెత్తనం చెలాయించాలనే కోరిక అంతరించే వరకూ - మీ నరనరాల్లో జీర్ణించుకు పోయిన పురుషాధిక్య భావం రూపుమాసే వరకూ ఈ వుద్యమం నడుస్తూనే వుంటుందని తెలుసుకో. చీరల కోసం - నగల కోసం - కార్ల కోసం - షికార్ల కోసం మొహం వాచి మీ చుట్టూ తిరిగి - అలిగి - ఏడ్చి బానిసగా పడివుండే స్త్రీలోనే ఎన్నెన్ని అగ్నిపర్వతాలు నిదరపోతున్నాయో తెలుసుకునే ఓ రోజు వస్తుంది. రొమాన్సనీ - లవ్వనీ మెల్లగా స్త్రీని ముగ్గులోకి దింపి ఆ తర్వాత మాంగల్యాన్నే వురితాడుగా బిగించే మీ స్వార్థబుద్ధి వున్నన్నినాళ్ళూ యీ ఉద్యమం కూడా వుంటుంది ..." ఆవేశంతో వూగిపోతూ అన్నది రేవతి.

"మరి - మా రవి మగాడేనే ? వాడితో రొమాన్స్ ఎట్లా లాగించేస్తున్నారు ?"

"రాజా రామ్‌మోహన్ రాయలు - కందుకూరి - వీరేశలింగం పంతులు - చలం - వాళ్లంతా మగవాళ్లే మిస్టర్ కిష్టు. కాని అణచివేతకు గురైన స్త్రీలను చూచి జాలిపడ్డారు. సానుభూతి చూపారు. మహిళా జీవితాల్లో కొత్త జ్యోతుల్ని వెలిగించారు. కొత్త జీవితాల్ని ప్రసాదించారు. స్త్రీలలో యీ మాత్రమైనా భావ విప్లవం రావడానికి ఆ మహానుభావులే కారణం అని మరచి పోవద్దు. అంతేగాని బావిలోపడ్డవారి మీద మీలా మరో రాయి వేయడానికి ప్రయత్నించలేదు."

"అంటే - రవి కూడా అట్లాంటివాడేనంటావా ?"

"మహానుభావులంతటి వారితో పోల్చక పోయినా వారు చూపిన బాటలో పయనిస్తున్నవాడు రవి. స్త్రీని గౌరవించే సంస్కారం వుంది. ఆడదాని శీలానికో విలువా మగవాడి శీలానికో విలువా కట్టే కుసంస్కారి కాడు. స్త్రీకో న్యాయం పురుషునికో న్యాయం అని భావించే సంకుచిత మనస్తత్వము రవికిలేదు. నా ఆశయాలను, ఆదర్శాలను, వ్యక్తిత్వాన్ని గౌరవించే సంస్కారవంతుడ్ని నా జీవితంలో ఆహ్వానించడం కన్నా నేను కోరుకోదగిన దేముంటుంది ?" అంది రేవతి.

రేవతి భావాలు కిష్టుకు నచ్చినా నచ్చకపోయినా ఆమె వాక్చమత్కారం వాదనా పటిమ - ప్రవాహంలా సాగిపోయే వాగ్ధోరణి కిష్టు నెంతగానో యింప్రెస్ చేశాయి. అదే విషయం ఆమెతో అన్నాడు

"ఏది ఏమైనా మాటలతో ఎదుటి వారిని బోల్తాకొట్టించే ఆకర్షణ మీలో వుంది. ... ఐ అప్రిషియేట్ యూ"

"అదో, అదే అనొద్దు అంటున్నాను. ఇందులో బోల్తా కొట్టించే అంశమేం వుంది ? వాస్తవాన్ని అంగీకరించడాని క్కూడా గట్స్ వుండాలి మిస్టర్ కిష్టూ ... తరతరాలుగా వస్తున్న మూఢవిశ్వాసాలకు స్త్రీలను బలిచేస్తూ ఇష్టంలేని పెళ్ళిళ్లతో - పులుముడు శోభనాలతో - బలవంతపు కాపురాలతో వరకట్నాలతో - అవి తేలేకపోతే తగల బెట్టడాలతో ... ఎంత రాక్షసత్వం సృష్టించ బడుతున్నదో సానుభూతితో అర్థం చేసుకుందుకు ప్రయత్నించు కిష్టూ నా మాటల్లో నిజాయితీ నీకు తప్పక అప్పుడు బోధపడుతుంది." కిష్టూవేపు చూస్తూ

సౌమ్యంగా అన్నది రేవతి.

గౌరవభావం నింపుకున్న చూపులతో రేవతిని చూస్తూ "ఆల్‌రైట్ … బెస్టాఫ్ లక్ … వస్తా …" అని అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు కిష్టు.

గుంటూరులో జరిగిన భారత జాతీయ మహిళా సమాఖ్య పదకొండవ మహాసభకు వెళ్ళింది రేవతి. బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో మహిళలతో కిటకిటలాడిపోయింది. ఉరకలు వేసే వుత్సాహంతో ఆశలను నింపుకున్న కళ్లతో మహిళలు ఆ సభల్లో పాల్గొన్నారు.

పురుషులతో పాటు సమానహక్కుల కోసం జరిగే పోరాటంలో మహిళలు అగ్రభాగాన వుండాలని ప్రబోధించిన భారత మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుణా అసఫాలీ మాటలు రేవతికి పదే పదే గుర్తుకు వస్తున్నాయి.

కేవలం సుఖాలు ఏర్పరచు కోవడం ద్వారా శోషణరహిత సమాజ స్థాపన సాధ్యం కాదు. సుదీర్ఘ పోరాటం ద్వారానే వర్గ రహితమైన సమాజం ఏర్పాటు అవుతుంది. అని ఆమె నొక్కి చెప్పిన మాటలు రేవతిలో ఏవో కొత్త భావాలను జ్వలింప చేస్తున్నాయి. కొత్త మార్గాలను అన్వేషించేట్టు చేస్తున్నాయి. ఆ అన్వేషణ రవి మార్గానికి చేరువవుతున్నట్టు తెలుసుకున్న రేవతి మనసు బెలూన్‌లా సంతోషంతో తేలిపోతున్నది. ఇద్దరి మార్గాలు ఒక్కటే. సమస్యలూ ఒక్కటే కలసి బ్రతికిన – కలసి చచ్చినా ఈ ఆశయసిద్ధే తమ జీవిత లక్ష్యం ……

ఏదో తెలియని విద్యుచ్ఛక్తి తన నరనరాల్లో ప్రవహిస్తున్నట్టు – ఏదో పెద్ద భారము తన తలమీంచి దించివేయబడినట్టు అనిపించింది రేవతికి.

గుండెల నిండా హాయిగా గాలి పీల్చుకొని ఏదో మైకంలో నడిచినట్టు నడుస్తూ పార్కులోంచి బయటపడింది రేవతి.

14

రవి మనసును అల్లకల్లోలం చేస్తున్న ఆలోచనలు ఓ తీరం చేరుకుంటున్నాయి. ఈ వ్యవస్థ కుళ్ళి ఎంతగా దుర్గంధ పూరితమయిందో బాగా అవగాహన చేసుకున్నాడు రవి. ఇంక ఆలోచిస్తూ తాత్సారం చేసేందుకు వ్యవధి లేదు.

భూస్వామ్య వర్గాల, గూండాల, పెత్తందార్ల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలకు ప్రజల్ని ఆయత్తం చేయవలసిన తరుణం వచ్చిందని రవికి ఆదేశాలు వచ్చాయి.

పీడిత ప్రజలను ప్రజాపోరాటాలకు సిద్ధం చేయాలన్న పిలుపు తనలో కోటి జలపాతాలై ధ్వనిస్తున్నది. ఆవేశం తుఫానై విరుచుకు పడుతున్నది. సలసల మరిగిన రక్తం పోటెత్తుతున్నది. పిడికిళ్లు బలంగా బిగుసుకున్నాయి.

ఉవ్వెత్తున విరుచుకు పడే ఆ వుద్రేకానికి, వుత్సాహానికి ఏ మూలో చిన్న సంకెల కూడా పడినట్టనిపించింది. వెంటనే అతనికి రేవతి గుర్తుకొచ్చింది. ఆమె ఆశలు, ఆశయాలు, ఆవేశం, పట్టుదల, అందం, ప్రేమ – అతని కాళ్లకు బంధాలు వేస్తున్నాయి. హృదయాన్ని కలవర పరుస్తున్నాయి. అంతరంగంలో కల్లోలం రేపుతున్నాయి.

ఏం చేయాలి తను నమ్మిన సిద్ధాంతం ఒకవేపు. తనను నమ్మిన ప్రేమమూర్తి ఒకవేపు. ఎటు మొగ్గాలి ? ఎటు మొగ్గినా మిగిలేది తనకు ఓటమేనా తన వూహల్లో రూపుదిద్దుకున్న భవితవ్యం శూన్యం కావలసిందేనా ? క్షణం క్రితం – తన వూహాలు – తన ఆలోచనలు – తన ఆశయాలు ఎంత స్వేచ్ఛగా ఎంత విశాలంగా సాగాయి ? ఇదేమిటి ? ఇప్పుడేమయింది. తనకు వూపిరి కూడా సలపనంత బరువుతనం తనను వుక్కిరి బిక్కిరి చేస్తున్నదేమిటి ? తాను ఓటమిని నిస్సహాయంగా అంగీకరించవలసిందేనా ? తన వ్యక్తి జీవితాన్ని సమీక్షిస్తూ నీరసంగా బ్రతుకీడ్వవలసిందేనా ?

గదిలో కాలుకాలిన పిల్లిలా రవి అటు ఇటూ తిరుగుతున్నాడు. ఆలోచనలతో బుర్ర వేడెక్కి పిచ్చెక్కుతుందేమో అనిపిస్తున్నది.



"ఎప్పుడు చూచినా బుర్ర బద్దలుకొట్టుకోవడం తప్ప ఇంకో పన్లేదా నీకు ?" అంటూ వచ్చింది రేవతి.

చిరాకుగా జుట్టు పీక్కొంటోయి రేవతిని చూసి ఆగాడు రవి.

ఎదురుగా వున్నది తన కల ! తన ప్రాణం ! తన సమస్తం !

ఇంత అందమైన కలకు దూరం కావలసిందేనా ?

ప్రాణం లేకుండా జీవచ్ఛవంలా బతకవలసిందేనా ?

తాను సమస్తం కోల్పోయి అనాథగా మిగిలిపోవలసిందేనా ?

"ఏమిటీ ? అట్లా పిచ్చివాడిలా చూస్తున్నావ్ ?" రేవతి.

"ఓహ్ ! వీణలు మీటినట్లు - మురళి రవళించినట్టు వున్న ఆ కమ్మని మాటలకు దూరమై బతకగలనా ?"

"అయ్యో ... రేవతి అనే ఓ శాల్తీ నీ గది కొచ్చింది మహానుభావా ..." బిగ్గరగా అరచింది రేవతి.

తృళ్లిపడ్డాడు రవి.

"ఆఁ ... రేవతి ... రేవతి ... అవును ... వచ్చింది ..."

ఆ తడబాటు, కంగారు, అయోమయం చూసి నవ్వాపుకో లేకపోయింది రేవతి.

"ఆఁ ... ఆఁ ... నీ కన్నీ నవ్వులాటలుగానే వుంటాయ్ ... నా బాధ నీకేం అర్థం అవుతుంది ?" వుక్రోశంగా అన్నాడు రవి.


"బాధా ? ఎందుకట ?" అంది రేవతి.

తన ప్రేమ - తన అణువణువులో జీవం పోసుకున్న ప్రేమ - ఓటమికి చిహ్నంగా నిలిచిపోతుందా ? ఓహ్ ... మనిషి నిజంగా ఎంత దుర దృష్టవంతుడు ! జీవితమనే కొన్ని విషయాలు ఎంత ప్రియమైనవి ! వెలకు దొరకనూ దొరకవు - చూస్తూ సొంతం చేసుకోకుండా వుండనూ లేము సొంత మయ్యేమార్గమున్నా చేరువయినట్టే అవి దూరం అవుతుంటాయి ! నిస్సహాయంగా నిలిపే ఆ అశక్తత ఎంతటి రంపపుకోత !

ఏదో నైరాశ్యం - వైముఖ్యం అతడ్ని కృంగదీస్తున్నాయి.

ఏమిటీ వింత పరిస్థితి ? ఎందుకీ అనిశ్చిత స్థితి ? దీనికి కారణాలేమిటి ? ఈ వ్యామోహాలు - విన్యాసాలు - సిద్ధాంతాలు ఎందుకు పరస్పరం సంఘర్షించు కుంటాయి ? ఎందుకు సమాంతరాలుగా మిగిలిపోతాయి. ఎందుకీ వైరుద్ధ్యాలు ? ఇది నిజంగా విరుద్ధభావాలేనా కేవలం తన వూహా జనితాలా ? గిరి దాటలేక పోతున్న బలహీనతా ?

నో ... తాను నమ్మిన సిద్ధాంతాల ముందు ఏ బలహీనతకు తావులేదు. ఏ వ్యామోహానికి స్థానం లేదు. రాగద్వేషాల కతీతం తన గమ్యం. మిన్ను విరిగి మీదపడ్డా చెక్కు చెదరనిది తన జీవిత లక్ష్యం. ఆ మార్గంలో బంధాలు, రక్త సంబంధాలు అన్నీ పటా పంచలు కాలవసిందే. క్షణికోద్రేకం కోసం - శాశ్వత విలువల్ని తృణీకరించలేడు. కేవలం ఒక జీవితపు స్వార్థం కోసం తన ముందున్న వేలాది జీవితాల కోసం చేయనున్న త్యాగాన్ని విస్మరించలేడు.



క్రమంగా అతడ్ని పెనవేసుకున్న బంధాలన్నీ తెగిపోతున్నాయి. అతడ్ని ఆవరించిన వ్యామోహపు తెరలు తొలగిపోతున్నాయి. ఇంతవరకూ అలముకొంచిన అంధకారంలో ఓ కాంతిరేఖ సాక్షాత్కరించినట్టయింది. ఆ వెలుగులో ఓటమి నుండి గెలుపుకు మార్గం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇక అనిశ్చిత పరిస్థితి లేదు. అనుమానం లేదు. అయోమయం లేదు. జీవితాకాశంలో ప్రేమ ఒక ధృవతార ! అది ఉజ్వలంగా వెలుగుతూనే వుంటుంది. దానికి మృత్యువు లేదు. ఓటమి లేదు. దివ్య తేజస్సుతో మార్గాన్ని నిర్దేశిస్తూనే వుంటుంది. దానికి స్వార్థం లేదు. ప్రేమ త్యాగాన్నే కోరుకుంటుంది ......

ఆ భావం రవిని వుత్తేజ పరచింది. ఆ భావం అతని ఎదల విజయోత్సవాన్ని పులకింప జేసింది. అతని ఆశలకు, ఆశయాలకు తిరిగి జీవం వచ్చింది. భవిష్యత్తు కోటి సూర్యుళ్ల తేజోపుంజంగా దర్శన మిచ్చింది.

"రేవతీ !" అన్నాడు గంభీరంగా.

"ఎప్పుడెప్పుడు మాట్లాడతాడా అని కాచుక్కూచున్నాను. ఊఁ గబగబా మాట్లాడు బాబూ !" అంది రేవతి.

"మన కలలు నిజమయ్యే రోజు ఆసన్నమైంది" ఏదో దృఢ నిశ్చయం అతని గొంతులో ఖంగు మన్నది.

"అంటే ?"

"అంటే ఏమీ లేదు ... ఇన్నాళ్ళూ కేవలం సిద్ధాంతాలను వల్లెవేస్తూ కూచున్నాం గదా ? ఇప్పుడు ఏ ప్రజల కోసమయితే మనం బంగారు భవిష్యత్తు ఆశిస్తున్నామో ఆ ప్రజల మధ్య నివసిస్తూ వారు ఏ విధంగా దోపిడికి గురవుతున్నారో తెలిపి జాగృతమొనర్చాల్సిన బాధ్యతను స్వీకరిస్తున్నాను."

"దాని కింత జుట్టుపీక్కోవడం ఎందుకు రవీ ?" అంది రేవతి తేలిగ్గా.

అదిరిపడ్డాడు రవి. రేవతి ఈ చిక్కును యింత తేలిగ్గా విడదీస్తుందని వూహించలేక పోయాడు రవి. నన్నొదిలి పెట్టి వెళ్ళొద్దు అని గోల గోలగా ఏడుస్తుందనీ - తన కన్యాయం చెయ్యొద్దు అని నెత్తీనోరు బాదుకుంటుందనీ దాన్నెలా తట్టుకోవాలా అని పిచ్చెక్కేట్టు తాను సంఘర్షణకు లోనయ్యాడు కాని ... కాని .. రేవతి - అదొక సమస్యే కాదన్నట్టు తేల్చిపారేసింది.

"యురేకా !" అని అరవాలనిపించింది రవికి.

"థ్యాంక్యూ రేవతి ... థ్యాంక్యూ ...... ఇప్పుడు నా దృష్టిలో ఎంతగా ఎదిగావో తెలుసా ..." అభినందిస్తున్నట్టు రేవతి వేపుచూశాడు రవి.

పసిపిల్లవాడిలా నిర్మల మనస్తత్వంలో వుప్పొంగిన భావాలను అణచుకోలేక తనను మెచ్చుకుంటున్న రవిని కన్నార్పకుండా చూస్తూ దగ్గరకు జరిగింది రేవతి.

కళ్ళలో కళ్లు కలిశాయి.

చేతులు చేతులు తడుముకుంటున్నాయి.

ఇద్దరి గుండెల్లో వుప్పెనలా తియ్యని భావాలు.

ఇద్దరి ఎదల్లో వరదలా మధురోహలు.

ఇద్దరి మనసులు లతల్లా అల్లుకుపోతున్నాయి.

ఇద్దరిలో ఏవో కొత్తలోకాల ద్వారాలు తెరచుకుంటున్నాయి.

అనిర్వచనీయమైన అనుభూతులు గుండెల్లో గుసగుస లాడుతున్నాయి.

అతనిలోని గొప్పతనాన్ని ఆరాధిస్తున్నది ఆమె.

ఆమెలోని ఔన్నత్యాన్ని ప్రేమిస్తున్నాడు అతడు.

అతడే ఆమెగా - ఆమే అతడుగా - యిద్దరూ ఒక లోకంగా .... ఏకంగా ....

(ఇంకా వుంది)

శ్రీ ముదిగొండ ఈశ్వర చరణ్

మల్లికార్జున పండితుని జీవితము-సోమన్న చెప్పని విశేషములు

ఆంధ్ర దేశంలో మాత్రమే బహుళ ప్రచారంలో ఉన్న ఆరాధ్య శైవ సంప్రదాయానికి బాటలు వేసిన వారిలో కాలగణనంలో చివరివాడైనా తొలివాడుగా చెప్పుకోదగిన వాడు మల్లికార్జున పండితారాధ్యుడు. ఆరాధ్య సంప్రదాయాను గుణంగా బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాసి రూపకల్పన చేసిన వాడు శ్రీ నీలకంఠ శివాచార్యుడు. అతని తరువాత శ్రీపతి పండితుడు, మంచెన పండితుడు తమ మహిమలను చూపి, విద్వత్తును ప్రదర్శించి "నకించన శివాదన్యం, నకించిన శివాత్పరం, శివాతిరిక్తం నహిచ, నకించన జగత్" అని నిరూపించారు. పై ఇరువుర తరువాత మల్లికార్జున పండితారాధ్యుడు "శివ విశిష్టాద్వైతము" లేక "శివాద్వైతము"అని చెప్పబడుతున్న ఆరాధ్య శైవ సంప్రదాయాన్ని అటు వైదిక సమ్మతముగా, అటు తన సమకాలికుడైన బసవన్న భక్తి సమ్మతముగా తీర్చిదిద్దాడు. ఈ ముగ్గురు పండితులు పండిత త్రయంగా ఆరాధింపబడుతున్నారు

12 వ శతాబ్దంలోని మల్లికార్జున పండితుని మహిమలను, విద్వత్తును అతని తరువాత సుమారుగా 70 లేక 80 సంవత్సరాల తరువాత 13 వ శతాబ్దంలో పాల్కురికి సోమన కవీంద్రుడు "పండితారాధ్య చరిత్ర" మనబడే బృహత్కావ్యంలో వర్ణించాడు. సమకాలీనమైన తెలుగు సమాజపు జీవితంలో, సాహిత్యంలో, మతంలో గొప్ప విప్లవాన్ని, సంచలనాన్ని కలిగించిన సోమన్నకు పండితుని మత ప్రచారంపై కల శ్రద్ధ వ్యక్తిగత జీవిత విశేషాలపై లేకపోవడం వల్ల మల్లికార్జున పండతారాధ్యుడి జీవితాన్ని గురించి సాహిత్య విమర్శకులలో అనేక సందేహాలు కలిగి ఎవరికి తోచినట్లుగా వారు సమాధానాలు చెప్పే ప్రయత్నం చేశారు.

ఇట్టివారిలో కీ. శే. కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు ఆద్యులు. వారు "శివతత్త్వసారం" యొక్క ప్రథమ ముద్రణకు విపులమైన పీఠిక వ్రాస్తూ ఎన్నో అమూల్యమైన విషయాలను ప్రస్తావించారు. వారి తరువాత ఈ విషయంలో పరిశ్రమించిన పండితులు సుమారుగా వారి అభిప్రాయాలనే బల పరిచారు.

రెండవవారు కీ. శే. నిడుదవోలు వేంకటరావు పంతులుగారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. పరిశోధక పరమేశ్వరులు కళాప్రపూర్ణులు ముఖ్యంగా శైవ వాఙ్మయ ప్రచురణ ప్రచారాలకు తమ జీవితాన్ని ముడుప కట్టిన వారు. కృష్ణా పత్రికవారు ప్రచురించిన "శివతత్త్వసారం" ద్వితీయ ముద్రణకు పరిష్కర్తలుగా, పీఠికా రచయితలుగా వారు పండితుని జీవిత విశేషాలను గూర్చి విపులంగా - చర్చించడమే కాక, "శివజ్యోతి" పత్రికలోనూ, 'ఆంధ్ర పత్రిక దుర్మతి ఉగాది సంచిక'లోనూ, ఇతరత్రా కూడా ఎన్నో ఆసక్తి కరమైన విషయాలను చర్చించారు. ముఖ్యంగా దుర్మతి ఉగాది సంచికలో "మల్లికార్జున పండితారాధ్యుని జీవితము - పునః పరిశీలనము" అనే వారి వ్యాసం బహుశా ఈ విషయంలో వారి తుది వ్యాసం.

ఈ వ్యాసంలో వారు కొత్త విషయాలను ప్రతిపాదించారు. ఒకటి - పండితుడి జన్మస్థలం శ్రీశైలమని, రెండవది - పండితుడు కర్ణాటక బ్రాహ్మణుడని పాల్కురికి సోమన్న వ్రాతలను స్థూలంగా చదివినప్పుడు, పండితుడు శ్రీశైలంలో పుట్టాడని తోస్తుంది. 'వానస' వంశీయులు జన్మస్థలం, భాష పరిగణనలోకి తీసుకొన్నప్పుడు పండితుడు కర్ణాటక బ్రాహ్మణుడేమో అని సందేహం కలుగుతుంది. కాని సావకాశంగా సోమన్న చెప్పిన విషయాల నుండి చెప్పని వానిని గ్రహించే ప్రయత్నం చేసినప్పుడు, వానస వంశీయులలోని గోత్ర భేదాలను పరిశీలించినప్పుడు శ్రీ రావుగారి వ్రాతలు ఆలోచనీయాలుగా ఉంటాయి.

మల్లికార్జున పండితారాధ్యుని పుట్టుకను గూర్చి సోమన్న ఇలా చెప్పాడు

భూలోకంలో శివభక్తి వర్ధనార్థం నందీశుని బసవన్నగా అవతరించమని ఆజ్ఞాపించాక, అతనికి సహాయంగా మరొకరిని కూడా పంపితే బాగుంటుందని అనుకొన్నాడట శివుడు. ఆయన తలపు తలపులో ఉండగానే నందీశు సర్వజ్ఞత భృంగి సిద్ధ, దూర్వాస శాపశక్తి, అక్షపాదవాగ్విచక్షత, ఉపమన్యు గురుత్వము వీరభద్రు శౌర్యము మొదలైన అతులిత శక్తులన్నీ కలసి ఒక మూర్తిగా రూపుదాల్చి జాగిలి మ్రొక్కింది. ఆ పరమశివుడు ఆనందమూర్తియై "దాక్షారామ భీమేశ్వరొరు లింగంబు...పురోహిత శ్రేష్ఠుడు" పుత్రార్థియై శ్రీశైలంలో పంచాక్షరీ మహామంత్ర పురశ్చరణ చేస్తున్నాడు.

"అతనికి నుదయింపుమనుడు.
ననురక్తి సాష్టాంగుడై యేగుదెంచి
జనియించె భీమాఖ్యు సాధ్విగౌరాంబ
జఠరంబున జనని జఠర కఠోర
పిఠరాపహరణ కర్మఠుడురు మతిని
మల్లికార్జున కీర్తి మహిత శ్రీశైల
మల్లికార్జున దేవు మహనీయ నామ
మగుట బండింత మల్లికార్జునుండనగ
నగణిత ప్రతి దక్షారామమునకు
జని..."

పై ద్విపదలలోని 'జనియించె' 'చని' అనే క్రియాపదాలు మల్లికార్జున పండితుడు శ్రీశైలంలో జన్మించి, అక్కడ నుండి దక్షారామం వెళ్ళాడని సూచిస్తున్నాయి. ఈ సూచనలననుసరించి కీ. శే నిడుదవోలు వారు దుర్మతి సంచికలో "భార్యా భర్త లిరువురును తీర్థయాత్రా స్థలమున నుండుటయే సనాతనధర్మము కావున, గౌరాంబ కూడా తన భర్త సన్నిధిని శ్రీశైలములో నున్నది. మల్లికార్జున పూజాఫలమగుటచే నాతనికి "మల్లికార్జును" దని పేరు పెట్టిరి. గౌరాంబా భీమయ పండితులేమైరో తెలియదు కాని కుమారుడు తండ్రి గ్రామము దక్షారామమునకు పండిత మల్లికార్జున నామముతో తిరిగి వచ్చెను.... పండితుడు దక్షారామమునకు వచ్చుటకు తన తండ్రి యుద్యోగమే కారణమై యుండును" అని వ్యాఖ్యానించారు.

భీమయ పండితుడు "శ్రీ భీమేశ్వరొరు లింగబు...పురోహిత శ్రేష్ఠుడు" దక్షారామంలో పుత్రార్థియై పంచాక్షరీ మంత్రపురశ్చరణలు చేశాడు. ఫలితం కనుపించసందువల్ల శ్రీశైలంలో మల్లికార్జునుని సన్నిధిలో పురశ్చరణ ప్రారంభించాడు. ఆ సమయంలో శివుడు తాను సంకల్పించిన మూర్తిని అతడికి పుత్రుడుగా జన్మించమని ఆదేశించాడు. గౌరాంబ గర్భవతైంది పుత్రుడు కలిగాడు. ఆ తర్వాత పుత్రుడు "పండిత మల్లికార్జునుడనంగ నగణిత ప్రీతి దక్షారామమునకు" వెళ్ళాడు. పైన చెప్పుకొన్నట్లుగా ఈ సందర్భంలో సోమన్న ప్రయోగించిన "జనియించి" "చని" అనే క్రియాపదాల అర్థాన్ని యథాతథంగా గ్రహిస్తే పీటికన్నా పూర్వం సోమన్న యొక్క పదప్రయోగాల్ని కూడా జాగ్రత్తగా గమనించి వాటి అర్థాల్ని కూడా యథాతథంగానే గ్రహించాలి.

తాను సృష్టించిన మూర్తిని భీమయకు పుత్రుడుగా జన్మించమని చెప్పే సందర్భంలో శివుడిలా అన్నాడని సోమన్న వ్రాశాడు

"వ్యక్త వానస వంశవర్ధన కరుడు
వాత్రుండు భీమన పండితేంద్రుండు
పుత్రార్థియై మమ్ము భువి భజింపుచును
శ్రీ దివ్యపంచాక్షరీ శుభ మంత్ర
మాదట శుద్ధాత్ముడై యనుష్ఠింప
బహుపురశ్చరణలు వాటిల్లినిపుడు
మహినొప్పు శ్రీగిరి మల్లికార్జునుని
సన్నిధి నొక పురశ్చరణ గావింపు
చున్నవాడతనికి నుదయింపుమనుడు..."

ఈ ద్విపదల్లోని 'భీమన పండితేంద్రుండు' 'శుద్ధాత్ముడై' 'ఉన్న

వాడు' 'ఆతనికి' మొదలైన శబ్దాల పుంలింగ ఏకవచన రూపాలు ఆతడొక్కడే శ్రీశైలం పురశ్చరణ చేశాడని, గౌరాంబ ఆతని సన్నిధిలో లేదని సూచిస్తున్నాయి. దీనివల్ల భీమన్న శ్రీశైలం పురశ్చరణ చేసి దక్షారామం వచ్చాక పుత్రోదయం కలిగి ఉంటుందని ఊహించాల్సి వస్తున్నది. ఈ అనుమానం శ్రీ రావుగారికి కూడా కలిగినట్లే ఉంది. అందువల్లనే "ధారా, భర్త లిరువురును తీర్థయాత్రా స్థలమున నుండుటయే సనాతన ధర్మము. కావున గౌరాంబ కూడా తన భర్త సన్నిధిని శ్రీ శైలంలో ఉన్నది. అని వ్రాయడం జరిగింది. నిజానికి 'జనియించి' 'చని' అనే క్రియాపదాలు ఎంత నిశ్చయాత్మకంగా ఉన్నాయో పై పుంలింగ ఏకవచన రూపాలు కూడా అంతే నిశ్చయాత్మకంగా ఉన్నాయి. పై క్రియా పదాలకు వలెనే వీటిని కూడా నమ్మాలి. శాస్త్రపురాణాలు, సనాతన ధర్మాలు ఆసరాగా సోమన్న చెప్పని గౌరాంబను శ్రీ శైలం దాకా పట్టుక రావడం అవసరం లేదు. గౌరంబ దక్షారామంలోనే ఉంది. భీమన్న శ్రీ శైలంలో పురశ్చరణ సాగించిన వ్రత ఫలితంగా పుత్రుడు పుట్టాడు అనుకుంటే తప్పేమీ లేదు.

అయితే ఇలా అనుకోవడం వల్ల మల్లికార్జునుడు "ఎక్కడ" పుట్టాడు. పండితుడనంగ దక్షారామానికి "ఎక్కడనుంగి" వెళ్ళాడు అనే రెండు ప్రశ్నలకి సమాధానం చెప్పవలసి ఉంటుంది.

భీమయ పండితుడు "శ్రీ భీమేశ్వరోరు లింగ ... పురోహిత శ్రేష్ఠుడు." ఆయన పత్నిసమేతంగా శ్రీ శైలం వెళ్ళి పుత్రోదయమయ్యే వరకు అక్కడే ఉన్నాడను కోవడం సహజంగా లేదు. ఎందువల్లనంటే శ్రీ శైలం వెళ్ళడానికి ఆ రోజుల్లో ఒక నెల మంత్ర పురశ్చరణం మండలం అంటే 40 రోజులు గర్భ ధారణం నవమాసాలు. 8 వ నెలలో తిరుగు ప్రయాణం సాగించారనుకొన్నా అది మళ్ళీ ఒక నెల. మొత్తం 14 నెలల 10 రోజులు. అయితే ఇంత కాలం ఆయనకు సమయం దొరికిందా ? దొరికిందనే అనుకుందాం. కొడుకు పుట్టాకైనా తిరిగి రావాలి కదా. ఇల్లా వాకిలి, ఉద్యోగం, బంధువులను వదలి శ్రీ శైలంలో స్థిర పడ్డారా ? సోమన్న ఏమీ చెప్పలేదు. కాబటి ఊహయే శరణ్యం.

పైన చెప్పుకొన్న పుంలింగ ఏకవచనాలను బట్టి భీమయ పండితు డొక్కడే వెళ్ళి వచ్చాడు. మల్లికార్జున పండితుడు దక్షారామంలోనే జన్మించారు. ఇది ఒక ఊహ.

కాదు అంటే సనాతన ధర్మాన్ని అనుసరించి భార్యా భర్త లిద్దరూ వెళ్ళినా, పురశ్చరణానంతరం దక్షారామం తిరిగి రాగా కొడుకు పుట్టాడు.

లేదు పుత్రోదయమయ్యే వరకు శ్రీ శైలంలోనే ఉన్నారనుకొన్నా చివరికి వారు దక్షారామం వచ్చారనే చెప్పుకోవాలి. ఇలా చెప్పుకోలేక పోతే ఆ దంపతు లిద్దరూ ఏమయ్యారో తెలియక గవేషించ వలసి వస్తుంది.


వారు శ్రీ శైలంలో స్థిరపడ్డారను కోవడానికి ఏమాత్రం ఆధారాలు లేవు. లేకపోగా సోమన్న వ్రాత ఇందుకు బాధకరంగా ఉంది. మల్లికార్జునుడు "పండితు డనంగ నగణితప్రీతి దక్షారామమునకు జని" అని వ్రాశాడు సోమన్న. తాను శ్రీ శైలంలో పుట్టాడు. తల్లి దండ్రులు శ్రీ శైలంలో ఉన్నారు. బాల్య మంతా శ్రీ శైలంలోనే గడచింది. విద్యాభ్యాసం అక్కడే ! అటువంటప్పుడు అతడికి దక్షారామానికి వెళ్ళాలనేంత "అగణితప్రీతి" ఎందుకు కలిగింది ? పితృపితామహుల జన్మస్థలం అని వెళ్ళినా లేక గొప్ప శివక్షేత్రం అని వెళ్ళినా కొద్ది రోజులుండి తిరిగి వచ్చి ఉండాలి. కాని ఆయన అక్కడే స్థిరపడ్డట్లుగా పండితారాధ్య చరిత్ర సాక్ష్యం చెబుతున్నది. ఆయన తన జీవిత కాలంలో శ్రీ శైలం వెళ్ళినట్లుగా ఎక్కడా చెప్పబడ లేదు. చివరి రోజుల్లో తనకు మారుగా తన శిష్యుడిని పంపాడు. తండ్రి ఉద్యోగం కారణ మనుకుంటే ఆయనకు దేశాటనలు, వాదోపవాదాలు, వీరవ్రతాచార నిష్ఠ, భక్త మహేశ్వ రార్చల తోడిదే లోకం. ఉద్యోగం చేయగల ఓపిక గాని, తీరిక ఆయన కున్నట్లుగా లేదు. ఉద్యోగం కోసం వెళ్ళాడనుకొన్నా రెండు సందేహాలు కలుగుతున్నాయి. మల్లికార్జునుని పుట్టుకకు పూర్వం భీమయ దంపతులు దాక్షారామం వదలి వెళ్ళారని కదా చెప్తున్నది. మల్లికార్జునుడు పుట్టి, పెరిగి "పండితుడనంగ" విద్యాభ్యాసం చేసే నాటికి ఎంతలేదన్నా సుమారుగా 20 సంవత్సరాలకు పైగా కాలం గడచి ఉంటుంది. ఇంత కాలం తండ్రి ఉద్యోగము తనయుడి కొరకు ఎదురు చూస్తూ ఉన్నదా ? ఇకపోతే శ్రీ శైలంలో పుట్టి, పెరిగి, విద్యాభ్యాసం చేసి "పండితు డనంగ" పేరు పొందిన మల్లికార్జునకు శ్రీ శైలం ఉద్యోగము లభించక పోయిందా ? ఇన్ని సందేహాలకు తావిచ్చే దానికన్నా పుంలింగ ఏకవచనాలను బట్టి భీమయ ఒక్కడే శ్రీశైలం వెళ్ళాడని, ఆతడు దాక్షారామం తిరిగి వచ్చాక మల్లికార్జునుడు పుట్టాడని, ఆ తర్వాత తండ్రి తన ఉద్యోగం తాను చేసుకొంటూ ఉండగా తనయుడు తన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాడని "జనియించె" అన్న క్రియను వ్యాఖ్యానించు కొంటే ఏ ఇబ్బందీ ఉండదు.

ఇక రెండవ క్రియాపదం "చని" మిగిలిపోయింది.

"పండిత మల్లికార్జును డనంగ నగణిత ప్రతి దక్షారామమునకు జని" అని వ్రాశాడు సోమన్న. దీనిని బట్టి దాక్షారామం వెళ్ళినాటికి మల్లికార్జునుడు పండితుడనిపించుకొన్నాడని, ఆతడి పాండిత్య ప్రతిభా విశేషాలు దక్షారామంలో బాగా ప్రసిద్ధి పొందాయని తెలుస్తున్నది. పండిత శబ్దం ఆతడు తనకు తాను తగిలించుకొన్నది కాదు. ఆనాటి పండితులు, ప్రజలు ఆతడి శేముషీ సంపత్తిని బాగా గమనించి సగౌరవంగా ఇచ్చిన బిరుదమది. ఐతే ఇంతటి పాండిత్యాన్ని ఆతడెక్కడ సంపాదించాడు ? గురువెవ్వరు ? సోమన్న శివుడి మాటలుగా ఇలా చెప్పాడు.

"—నేను లోకారాధ్యమూర్తి
కరచరణాద్యంగకములతో వచ్చి
శిష్యగా నిన్ను శిక్షించి రక్షించి
శిష్యప్రశిష్య ప్రసిద్ధు గావించి
లోక గురుత్వ మలు ప్రవైభవము
ప్రాకట స్వసమయ పాలనత్వంబు
బర సమయాంతక ప్రథితప్రశక్తి
బరమ పాండిత్య విభ్రాజిత మహిమ
వీర భక్తస్థల విశ్రుతాచార
సారవ్రతైక నిష్ఠాపరత్వంబు
నసమ శాపాను గ్రహ సమగ్రతయు
రస విషయాది వైరాగ్యవర్తనము
వేదవేదాంతోపపాదిత మత్ర్వ
సాద విశేష సంపాదన ప్రతిభ
శివమహత్త్వ ప్రతిష్ఠిత వచస్సిద్ధి
శివతత్త్వసార సంచిత కళావృద్ధి
సముదిత శివయోగ సంపత్సమృద్ధి
ఘోర నిస్సార సంసార వారాశి
పారగత్వము గళాపరతంత్రతము నొసగెద..."

అని శివుడు అభయ మిచ్చాడట. చెప్పినట్లుగానే కోటిపల్లి ఆరాధ్య దేవుడై అవతరించి సమస్త విద్యలు, సమస్త మహిమలు మల్లికార్జునునకు ప్రసాదించాడు కాబట్టి ఆ కోటిపల్లి ఆరాధ్యదేవరయే మల్లికార్జునుని విద్యా గురువు. మరియు దీక్షా గురువు కోటిపల్లి ఆరాధ్యదేవర అనేది ఆ గురువుగారి సంకేత నామం ఆయనకు ప్రత్యేకంగా మరేదైనా పేరున్నదో లేదో మనకు తెలియదు. కోటిపల్లి ఆయన నివసించిన గ్రామనామం. ఆరాధ్య శబ్దం గౌరవ వాచకం లేదా జాతి వాచకం. మల్లికార్జున పండితుని తరు



వాతే ఆరాధ్య శబ్దం జాతి వాచకంగా పరిణమించినట్లున్నది, కాబట్టి పై సందర్భంలో గౌరవ వాచకమనుకోవడమే సముచితం. ఈ కోటిపల్లి దాక్షారామానికి అతి సమీపంలో ఉన్నది. అక్కడ ఆరాధ్య దేవర వద్ద భీమయ దంపతులు తమ కుమారుడిని చదువవేశారు. గురువుగారు సాక్షాత్తు పరమశివుడు. సర్వజ్ఞమూర్తి శిష్యుడు. ఆ శివుడు తలచినంత మాత్రాన సర్వశక్తులు గూడు కట్టుకొని రూపుదాల్చినవాడు. అతని బోధనా పటిమ, ఈతని అవగాహనా పటిమ రెండు కథలు కథలుగా అంచెలంచెలుగా వ్యాపించినవి. ముఖ్యంగా దక్షారామంలోని వారికి తమ ఊరి పిల్లవాడు, తమకత్యంతాప్తుడే భీమయ పండితుని పుత్రుడు. ఇంతటి అసాధారణ శేముషీ కలవాడు కావడం ఒక గర్వ కారణమైంది. అందుకే అతడి కన్నా పూర్వమే అతని పాండిత్య ప్రభ ఆ వూరినిండా విరిసింది. అతడి శీల సంపద వారందరికీ ఒక కావ్యమై వినిపించింది అందుకే అతడు దక్షారామం వెళ్ళి, విభూది రేఖలు, రుద్రాక్షమాలలు ధరించి ఉండగా వారందరికీ ఆ కొత్త వేషం అబ్బుర పాటు కల్పించగా ఈ విధంగా ప్రశ్నించారట.

> "పండితయ్యా ! నీవు పౌరాణికుడవు
> సర్వజ్ఞోత్తముడవు, సచ్చరిత్రుండవు
> విద్వాంసుడవు వేదవిదుడవు"

అయి ఉండీ కూడా ఈ వేషమేమిటి ? ఈ ప్రజలేమిటి ? ఈ పాద తీర్థాలేమిటి ? అని. వీటి కాతడు చెప్పిన సమాధానాలు, యుక్తులూ అన్నీ వేరు కథలు.

పాల్కురికి వల్ల మల్లికార్జున పండితారాధ్యుడు శ్రీశైలంలో కాక దక్షారామంలో జన్మించాడని శ్రీశైలం నుండి కాక కోటిపల్లినుండి, అగణిత ప్రీతితో దక్షారామం వెళ్ళాడని చెప్పుకోవడమే సోమన్న ప్రయోగించిన "జనియించి "చని" అన్న క్రియాపదాలకు న్యాయం చేకూర్చిన వాళ్ళ మోసాము.

ఈ రకంగా అతని జన్మస్థలాన్ని గూర్చి నిర్ణయించుకొన్నాక అతడు కర్ణాటక బ్రాహ్మణుడు అన్న అంశాన్ని పర్యాలోచించవలసి ఉన్నది.

భీమయ పండితుడు వానస వంశీయుడని శివుని నోటి మాటగా సోమన్న చెప్పాడు కాబట్టి దీనిని గూర్చి వివాదమే లేదు. కాకపోతే వానస వంశీయులు కర్ణాటకలోని కుంతల వనవాస ప్రాంతం వారని, ఆ రోజుల్లో తీర ప్రాంతంలో ప్రభుత నెరపిన వానస అనంత పాల దండనాయకుడు తనతో పాటు అనేక కుటుంబాల వారిని తన వెంట తెచ్చుకొన్నాడని, ఒక వాసియే తెలుగులో వానస అయిందని, అంచేత వానస వారంతా కర్ణాటక బ్రాహ్మణులని వేంకటరావు పంతులుగారు భావించారు.

మనకు తెలిసినంతలో వానస వంశీయులు చాలా మంది కనపడుతున్నారు. అందరిలో ముఖ్యుడు తెలుగు జాతి, తెలుగు సాహిత్యం కల కాలం గుర్తుంచుకోదగినవాడు వానస నారాయణ భట్టు. పాక శాసనికి నారాయణుడిలాగా భారత ఘోరరణాంగణంలో నన్నయగారికి తోడ్పడ్డవాడు. భీమయ పండితుడు పైన పేర్కొన్న అనంత పాల దండ నాయకుడు వానస వంశీయులే! వీరే కాక మడికి సింగన పద్మ పురాణాన్ని కృతి పొందిన కందన మంత్రి, నాగవాయి శాసనాల్లో కనబడుతున్న గోవిందరాజు కూడా వానస వంశీయులే !

పండిత త్రయంలో ప్రథముడైన శ్రీపతి పండితుడు వానస వంశీయుడే ! అయితే వీరి ఇంటిపేరులు ఒకటిగా వినబడుతున్నా వీరి గోత్రాలు వేరు. నారాయణ భట్టు హారితస గోత్రుడు. భీమయ పండితుడు గౌతమసుడు. కందన మంత్రి కాశ్యపుడు గోవిందరాజు వాసిష్ఠుడు. అనంత పాలుని గోత్ర నామం తెలియరాలేదు. ఇక శ్రీపతి పండితుడు కౌశికస గోత్రం వాడు. మనలో ఇంటిపేరు అప్రధానం. గోత్రమే ప్రధానం. కాబట్టి వేర్వేరు గోత్ర నామాలు కలవారు వేర్వేరు ప్రాంతాల వారని వేర్వేరు భాషల వారని చెప్పుకోవల్సి ఉంటుంది. కాసేపు ఈ గోత్ర భేదం మరచిపోయినా, పైన చెప్పుకున్న వానస వారులూ ఒక ప్రాంతం వారని, ఒకే కుదుటి వారని చెప్పగల సాక్ష్యాధారాలు లేవు. గృహనామ సామ్యమే ప్రధానంగా గ్రహిస్తే ఆరాధ్య బ్రాహ్మణులలో ముదిగొండ వారున్నారు. పద్మసాలీలలో కూడా ముదిగొండ వారున్నారు. వీరిద్దరూ ఒకటే ననడం అన్యాయమే మరి.

భీమయ పండితుని గోత్రం గురించి పండితులొక నిశ్చితాభిప్రాయానికి రాలేదు. సోమన్న చెప్పలేదు. మల్లికార్జున పండితుడు కూడా తన శివతత్త్వ సారంలో చెప్పుకోలేదు. ఈ విషయంలో కీ. శే. కొమర్రాజు వారు శివతత్త్వ సారం ప్రథమముద్రణ పీఠికలో ఇలా వ్రాశారు.

"పండితుని సూత్రము సంగతిగాని గోత్రము సంగతిగాని పండితారాధ్య చరిత్ర యందు చెప్పబడలేదు. చతుర్మఠ నిర్ణయ" మన్న చిన్న సంస్కృత పుస్తకము నందు నితనిని గూర్చి చెప్పుచు "ఖ్యాతోగౌతమ గోత్రజో- గురువరో ఋగ్వేద శాఖాన్విత" యని చెప్పబడి యున్నది, ఈ చిన్ని పొత్తము వరంగంటి శివ ధర్మవర్ధనీ రామలింగేశ్వర ముద్రాక్షర శాలలో ముద్రించబడినది. ఇది యెవరెప్పుడు వ్రాసినది తెలియదు. ఇది యెంతవరకు ప్రమాణమో చింత్యము."


చాగంటి శేషయ్య పంతులుగారు కూడా "వీరిది గౌతమ గోత్రమందురు. కాని నిశ్చయముగా చెప్పలేము !" అని తమ ఆంధ్ర కవితరంగిణి రెండవ సంపుటం 48 వ పేజిలో వ్రాశారు.

నిడుదవోలు వారికి మాత్రం ఈతని గోత్ర శాఖలను గూర్చి ఏ మాత్రం సందేహం లేనట్లున్నది. శివతత్త్వ సారం ద్వితీయ ముద్రణ పీఠికలో "వీరిది ఋగ్వేదము గౌతమ గోత్రము" అని విస్పష్టంగా వ్రాశారు.

నిజానికి కొమర్రాజు వారికి గాని మరొకరికి గాని ఈ విషయంలో ఏమాత్రం సందేహించ వలసిన అవసరం లేదు. "స్థితిశ్చగతిశ్చింత నీయా" అన్నట్లు ఇతరములైన ఏ ఆధారాలు లేనప్పుడు ఉన్న ఆధారం చిన్నదో పెద్దదో విశ్వసించక తప్పదు. కాబట్టి "చతుర్మఠ నిర్ణయం" చెబుతున్న సాక్ష్యం ఒప్పుకోవాలి. ఆ పుస్తకం చిన్నదనుకుంటే మరి లోక ప్రమాణం ప్రబలమైనది. ఈ నాడు మల్లికార్జున పండితుని వంశీయులమని చెప్పుకొంటున్న ఆరాధ్యులందరూ గౌతమస గోత్రులు, ఋగ్వేదులు. మూల పురుషుడు ఒక గోత్రీకుడు కాగా తద్వంశీయులు వేరే గోత్రాల వారు కావడం కుదరదు.

దీని వల్ల వానస వారిలో వేర్వేరు గోత్రాలవారు వేర్వేరు శాఖల వారున్నారని, ఇంటిపేరు ఒకటైనంత మాత్రాన వారంతా ఒకే కుదుటి వారని వారి జన్మస్థలాలు మాతృ భాషలు ఒకటేనని చెప్పడానికి ఆధారాలు చాలవని తేలుతున్నది. నారాయణభట్టు, అనంతపాలుడు కర్ణాటకులని చెప్పుకోగల్గినా మల్లికార్జున పండితుడు తక్కిన వానసీయులు మాత్రం తెలుగువారని వారి మాతృ భాష తెలుగని చెప్పుకోక తప్పదు.

ఇదిలా ఉండగా నారాయణభట్టు నామధేయులు ఒక్కరా ఇద్దరా అని పరిశీలకులు అనుమానిస్తునారు. దక్షారామంలో నారాయణభట్టు కూతురు కుపము వేయించిన దాన శాసనాన్ని నందంపూడి శాసనాన్ని పరిశీలించి త్రైలోక్య మల్లవిభుని ప్రధాని నారాయణభట్టు, నన్నయగారికి తోడ్పడ్డ నారాయణభట్టు ఒక్కరు కాదని చాగంటి శేషయ్యగారు భావిస్తున్నారు. వీరిద్దరూ ఒక్కరే అయిన పక్షంలో ఆ నారాయణభట్టు తెలుగువాడని ఆతడి మాతృభాష తెలుగు తప్ప కన్నడం కాజాలదని నేను భావిస్తున్నాను. ఇందుకు ముఖ్యమైన ఆధారం నన్నయగారి పద్యం నన్నయగారు నారాయణభట్టును గూర్చి "తన కిష్టుడున్ సహాధ్యాయుడునైన వాడ" ని కతోక్తిగా చెప్పుకున్నారు. నన్నయగారు ఆంధ్ర దేశపు విద్యార్థి కర్ణాటకుడైన నారాయణభట్టు ఆయనకు సహాధ్యాయికాగల అవకాశాలు చాలా తక్కువ. నన్నయగారు "అవిరళ జపహోమ తత్పరుడు." "నిత్యసత్యవచనుడు." "మత్యమరాధిపా చార్యుడు" సుజనుడు. అతని సహాధ్యాయియైన నారాయణభట్టు కూడా అలాంటి గుణ గణాలు కలవాడే అయి ఉండాలి. అందువల్లనే ఆతడు కేవలం సహాధ్యాయి మాత్రమేకాక "ఇష్ట"



డయ్యాడు. అందువల్లనే అతడు పాయక పాకశాసనికి భారత ఘోర రణంబునందు నారాయణభట్టు "నన్నయగారికి భారతాంధ్రీకరణంలో తోడుపడ్డాడు. ఈ పద్య భాగంలో భారతాంధ్రీకరణంలో నారాయణభట్టు ఎంత విశిష్టమైనదో తెలుస్తుంది. ఒక కర్ణాటకుడికి ఇంతటి ఆంధ్రాభిమానం ఉండటం అబ్బురపాటు కలిగించే విషయం.

రాజకీయంగా త్రైలోక్యమల్ల విభుని వద్ద నుండి నారాయణభట్టు వలస వచ్చి రాజరాజనరేంద్రుని ఆశ్రయం కోరి నన్నయగారి సహాయం చేసి ఉండకూడదా అన్న సందేహం కలుగవచ్చు. నారాయణభట్టు ఒక్కరే అని భావిస్తున్న చరిత్రకారులు రాజరాజనరేంద్రుడే తన స్థానాన్ని పదిల పరచుకోవడం కోసం నన్నయగారి ద్వారా నారాయణభట్టును, అతడి ద్వారా త్రైలోక్యమల్ల విభుని మంచి చేసుకొని, నామ మాత్రంగా తను త్రైలోక్యుని సామంతునిగా ఉండటానికి అంగీకరించి, అతని ప్రతినిధిగా నారాయణభట్టును తన ఆస్థానానికి ఆహ్వానించి సగౌరవముగా నిలుపుకొన్నాడని చెబుతున్నారు. నారాయణభట్టు ఆంధ్రుడు కావడం వల్లనే మాతృభూమి, మాతృభాషలందలి అభిమానం వల్లనే తను త్రైలోక్యమల్ల విభుని ప్రధాని అయి ఉండి కూడా ఒక సామంతరాజు ఆస్థానంలో ప్రతినిధిగా ఉండడానికి అంగీకరించాడని చెప్పుకోవాలి. ఒకవేళ అతడు నిజంగా కర్ణాటకుడే అయి ఉంటే రాజరాజు ఆస్థానంలో తనకున్న పలుకుబడిని ఉపయోగించి ఇక్కడ కూడా కర్ణాటక భాషా ప్రాచుర్యం కోసం పాటుపడి ఉండేవాడు.

ఇందువల్ల మల్లికార్జున పండితారాధ్యుడు, నారాయణభట్టు వానస వంశీయులైనా వేర్వేరు గోత్రాల వారని వారిద్దరూ తెలుగు వారనీ, తెలుగు వారి మాతృభాషని నిర్ణయమౌతున్నది

ఇకపోతే పండితారాధ్యుని కర్ణాటక భాషా పరిజ్ఞానాన్ని కూర్చి కూడా ఆలోచించవలసి ఉంది. లింగార్చనా సమయంలో బండారు బసవన్న భవ్య గీతాలు పాడినట్లుగా సోమన్న చెప్పాడు. బసవన్న గీతాలు కన్నడంలో ఉన్నాయి. కాబట్టి అతనికి కర్ణాటక భాష వచ్చని అతడి తాత తండ్రులు కర్ణాటకులు కాబట్టి వారి మాతృభాష కన్నడం కాబట్టి, వారు బయట తెలుగు మాట్లాడినా ఇంట్లో మాత్రం కన్నడమే మాట్లాడి ఉంటారని ఈ నాటికీ వైష్ణవ కుటుంబాలు, మాధ్వ కుటుంబాలు ఇలాంటి వున్నాయని చెప్పబడుతున్నది. కేవలం కన్నడంలో కవిత్వం వ్రాయగల శక్తి పొందడం కోసమే పండితుడు బసవన్న విభూది నర్థించాడని కూడా చెప్పబడింది.

నాటి రోజులలో తెలుగు కన్నడములకు సాహిత్య పరంగానే కాకుండా మత రాజకీయ సాంఘిక పరంగా కూడా చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. కన్నడ ప్రభువులు చాల కాలం తెలుగు గడ్డమీద ఆధిపత్యం నెరపారు. కన్నడ రత్నత్రయంలోని ఆదికవి పంపడు. తృతీయుడు రన్న తెలుగువారే ! రెండవ వాడైన పొన్నకవికి ప్రోత్సాహమిచ్చిన వారు తెలుగు రాజులు. ఇదే విధంగా తెలుగు పండితులకు, కవులకు కన్నడ భాషా సాహిత్య పరిజ్ఞానం ఎక్కువగానే ఉండేది. ఈనాటికీ తెలుగు వారెందరో ఉర్దూలో చక్కని కవిత్వం వ్రాయగల వారున్నారు. తెలుగులో కన్నా ఉర్దూలోనే చక్కగా మాట్లాడగలవారున్నారు. అలాగే మహమ్మదీయులెందరో తెలుగులో కవిత్వం చెప్పగలవారూ, తెలుగులో స్వచ్ఛంగా మాట్లాడగల వారూ ఉన్నారు, ఇంత మాత్రాన వారి మాతృభాష ఉర్దూ లేక తెలుగని చెప్పడం సరికాదు. కాబట్టి పండితారాధ్యునికి కన్నడ భాష వచ్చి ఉండడం అతడు బసవని భక్తిగీతాలు పాడడం ఆశ్చర్యకరమైన లేదా ఆలోచనీయమైన విషయమేమీ కాదు. మొదటి నుండి కన్నడం రాక పోయినా భక్తులు పాడగా విని ఆ గీతాలలోని భక్తి పారవశ్యానికి ముగ్ధుడై నేర్చుకొని ఉంటాడు సాక్షాత్తు పరశివాంశ సంభూతుడై, ఆ పరశివుని వద్దనే సమస్తవిద్యలూ నేర్చిన ఆ మేధావికి ఇదొక గొప్ప విషయం కాదు. ఈనాటికీ మనలో ఏకసంతాగ్రాహులు, ద్విసంతాగ్రాహులు ఉన్నారు. ఇదే కాక మత పరమైన గీతాలూ, శ్లోకాలు వాటి అర్థ తాత్పర్యాలు తెలియక పోయినా ఆ భాష రాకపోయినా పాడుకొనే స్త్రీ పురుషులు కోకొల్లలు. వీరిలో చాలామంది మాతృభాషలో కూడా నిరక్షరాస్యులే. కేవలం వినికిడి వల్ల పాడుకో గల్గిన వారే ! కాబట్టి బసవన్న గీతాలు పాడడం పండితుని కర్ణాటక భాషా పరిచయానికి 'సర్టిఫికెటు' కాజాలదు.

ఇకపోతే కన్నడంలో కవిత్వం వ్రాయగలందులకే విభూది నర్థించాడనడం కూడా విమర్శనీయమే ! కేవలం ఇంత విభూది పెట్టుకోవడం వల్ల కవితాధార అలవడుతుందని ఒకవంక విశ్వసించగలిగి మరోవంక అతడి దివ్య జన్మ కథను విశ్వసించలేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కేవలం బసవన్నయందలి గౌరవాన్ని చాటుకోవడానికి మాత్రమే పండితుడు విభూది కోరాడు కాని కవిత్వం వ్రాయలేక కాదు. సోమన్నకు బసవన్న అంటే ఎంతో యిష్టం. అందువల్ల అతడికి పెద్దపీట వేయాలని కవితాత్మకంగా వర్ణించాడు.


చివరగా ఒక ప్రశ్న – చాల పెద్ద ప్రశ్న మిగిలే ఉంది. ఇన్నివేల ద్విపదలలో పండితారాధ్య చరిత్ర వ్రాసిన సోమన్న తన కావ్య నాయకుడి జీవిత విశేషాలను ఎందుకు వివరించలేదు ? గ్రంథపాతం జరిగిందా ? గ్రంథం ఇంకా పెరుగుతుందని భయపడ్డాడా ? లేక అవన్నీ అనవసరమనుకొన్నాడా ?


పండితారాధ్య చరిత్ర పరిశీలిస్తే అందులో గ్రంథపాతం జరిగిందనడానికి వీలులేదు. అలా అని ఏ పండితుడూ ఊహించలేదు కూడా !

గ్రంథం పెరుగుతుందని భయపడ్డాడనుకుందామన్నా అందుకు ఆధారాలు లేవు.

సోమన్న చాలా గ్రంథాలు వ్రాశాడు. వాటిల్లో ముఖ్యమైనవి రెండు, బసవ పురాణము పండితారాధ్య చరిత్ర. బసవ పురాణము బసవేశ్వరుని జీవిత చరిత్ర అందులో బసవని తల్లి మాదాంబ వ్రతనిష్ఠలు గర్భధారణము ఆమెలో మార్పులు, గర్భవేదన, పుత్రోదయము, తండ్రితో వాదు, వివాహము మొదలైనవన్నీ చాలా విపులంగా ప్రబంధ ధోరణిలో వివరించాడు.

బసవనిది భక్తి మార్గం. భక్తికి విశ్వాసం ఊపిరి. అందులో తర్కాలకు వాదులకు తావులేదు. అది హృదయ సంబంధి. భక్తుని జీవితంలోని ప్రతి అంశం భక్తి మార్గంలో ఒక సోపానమై ముక్తికి త్రోవ తీస్తుంది. అందుకే బసవనికి, ఇతర భక్తులకుం సంబంధించిన ఎన్నో మహిమలు, కల్పనలు బసవ పురాణంలో విరివిగా కనుబడతాయి. ఇలాంటివి పండితారాధ్య చరిత్రలో కూడా ఉన్నాయి. కాని అందులో వాటి ప్రాముఖ్యం తక్కువ. మత ప్రబోధకుని బుద్ధి





బాష్పాంజలి

డా॥ వి. లక్ష్మీపతిరావు

తెనుఁగు బాస ప్రపంచమునుండునందాక
నమరుఁడై యుండు మహామనీషి
బాలశిక్ష మొదలు భారతమ్మువఱకు
నాపోశనము పట్టినట్టి ప్రోడ
బ్రతుకెల్ల సాహిత్య పరిశోధనమునకే
మీఁదు కట్టిన మహామేయ బలుఁడు
కపట మన్నది యెఱుంగక తనలోనున్న
మాట పై కనెడు నమాయికుండు

మనసు మెత్తనివాఁడు సన్మానకాంక్ష
నల్పుల స్తుతింపఁబోని యాత్మాభిమాని
సత్యకాలమువాఁడు సజ్జనుఁడు నిడుద
వోలు వేంకటరావు ! గుణాల ప్రోవు !

పుడమి రాలియు సుయశమ్ము చెడనితావు !
సొగసువలపులు వాడని బొగడపూవు !
పుంభావ శారదామూర్తి పరిశోధనా
పరమేశ్వరుడు శిష్యవత్సలుం డేకసం
థాగ్రాహి సుకవి విద్యారత్న బిరుదాంకి
తుండు లౌక్యపుటడ్డుత్రోవ లెఱుఁగనివాఁడు
మాటలో మనసులో మధు వొల్కు సద్గుణం
బులప్రోవు శ్రీ నిడుదవోలు వేంకటరావు !

ఆ కళాప్రపూర్ణుఁడా శారదాదేవి
ముద్దుబిడ్డ లేని పెద్దలోటు
తీర్ప రాదు సాహితీ జగత్తున ! జాతి
కతని ఋణము తీర్పనలవి కాదు !

వైశవ్యానికి కల ప్రాముఖ్యం హృదయ స్పందనకు ఉండదు. అడుగడుగునా వేదాలనుండి, ఆగమ పురాణేతి హాస శాస్త్రాల నుండి ఉదహరిస్తూ ప్రతివాది మారు పలుక లేకుండా తన "ఋజాన్ని" స్థాపించ దలచినవాడు చూపవలసిన నేర్పు మనకు "చరిత్ర" లో కనబడుతుంది. అందువల్లనే మల్లికార్జునుని మేధా సంపత్తిని ప్రదర్శించినంతగా ఆతడి జీవిత ప్రపత్తిని సోమన్న చూపలేదు. ఇదీ కాక సోమన్న మల్లికార్జుని జీవిత చరిత్ర వ్రాయలేదు. ఆతడు వ్రాసింది పండితారాధ్య చరిత్ర. అతడు తన కావ్యనాయకునికి మల్లికార్జునుడని పేరు పెట్టక పోయినట్లైతే ఈ పండితారాధ్యుడు ఏ పండితారాధ్యుడైనా కావచ్చు. నిజానికి పండితారాధ్య చరిత్రలో పొందు పరుచబడ్డ వాదోపవాదాలు మల్లికార్జున పండితుడు విపక్షులతో వాదిస్తూ ఉండగా "చేపు" చేసిన బాపతువికావు. అవి సోమన్న స్వోపజ్ఞములు. అంటే చరిత్ర" లో కనిపించే పండితుడు సోమన్నయే. కవులు తమ కావ్య నాయకునిలో తమ స్వంత వ్యక్తిత్వాలను ప్రదర్శించు కోవడం మనకు కొత్త విషయం కాదు. ఇందువల్ల మనం ముఖ్యంగా గుర్తించవలసిన అంశం పండితారాధ్య చరిత్రలో మత సంబంధమైన సిద్ధాంత భాగానికి కల స్థానం పండితుడనేవాడి జీవిత విశేషాలకు లేదు. కాబట్టే బసవ పురాణంలో బసవేశ్వరుని జీవిత విశేషాలను వర్ణించినంతగా చరిత్రలో పండితుడి వ్యక్తిగత అంశాలను సోమన్న చెప్పలేదు.

ఇదీ కాక మరో కారణం కూడా ఉంది.

సోమన్న బసవేశ్వరుని అచ్చమైన శిష్యుడు. తొలి రోజులలో మల్లికార్జున పండితుని అనుసరించినా ఆ తరువాతి కాలంలో ఆతడు క్రమేణా బసవన్న పక్షంలో చేరిపోయాడు. సోమన్నలోని ఈ మార్పును "ప్రథమాంధ్ర విప్లవ కవి పాల్కురికి సోమన్న" అన్న వ్యాసంలో సూచించాను. చూడుడు భారతి – ఏప్రిల్ – 1977. బసవ పురాణలో" "ఈశ్వర కులజుండ – గురు లింగ వర కరోదర జనితుండ – భక్తి గోత్రుండ" అని చెప్పుకొన్నా తన తల్లి దండ్రుల పేర్లను కూడా సగౌరవంగా చెప్పుకొన్నాడు. కాని 'చరిత్ర' వ్రాసే నాటికి ఆతడి దృక్పథం పూర్తిగా మారిపోయి "మును బసవ పురాణమున నెన్న దగిన పెనుపారు జనులకుఁ బెంపుడు గొడుక – బసవ గోత్రుండ – బసవన్న దూతనే బసవన్న బంట – బసవన్న లెంకనే బసవన్న లెంగి – బసవన్న యిలువుట్టు బానిస కొడుక" అని చెప్పుకోగల తాదాత్మ్యం పొందాడు. బసవన్న ఉపనయనాది వైదిక కర్మలను పూర్తిగా త్యజించి, వర్ణాశ్రమ ధర్మాలను ఉజ్జగించి కేవలం భక్తి యోగాన్ని మాత్రమే అనుసరించిన వీరశైవుడు. మల్లికార్జున పండితుడు "భక్తి మీఁది వలపు – బ్రాహ్మ్యంబుతో పొత్తు" బాయలేని సమన్వయ వాది. ఒకవంక వీర శైవాచార నిష్ఠ పాలిస్తూనే మరో వంక వైదికా చారములు, వర్ణాశ్రమధర్మాలు కూడా పాటించినవాడు. ఇందువల్ల కూడా శుద్ధ భక్తి మార్గానుయాయి యైన సోమన్న మల్లికార్జునుని గోత్ర నామాలైనా చెప్ప కూడా దాటివేశాడు.

సందేహాలు కలుగకుండానే ఉండాలి. కలుగడమే ప్రారంభమైతే శరపరంపరగా కలుగుతూనే ఉంటాయి. ఏదో కారణం వల్ల సోమన్న చెప్పలేదు. మరి మల్లికార్జున పండితుడు తాను వ్రాసిన గంథాలలో ఎందుకు వ్రాసుకోలేదన్న సందేహం కలగడం సహజమే ! అయితే ఆయన వ్రాసిన గ్రంథాలన్నీ లభించలేదు. వాటిలో ముఖ్యమైన శివతత్త్వసారం కూడా అసమగ్రమే కాబట్టి ఆయన తనను గూర్చి ఏదైనా చెప్పుకున్నాడో లేదో ఇప్పుడప్పుడే నిర్ణయించలేం. తల్లిదండ్రుల పేర్లు గోత్ర నామాలేకాక అసలు వీరశైవవ్రతాచార నిష్ఠకు మూలమైన లింగ ధారణ దీక్ష పొందినాడో లేదో కూడా ఆయన చెప్పుకొన్నట్లుగా లభ్యమైన గ్రంథాలలో ఎక్కడా లేదు. సోమన్న కూడా ఏమీ చెప్పలేదు. అందువల్ల మల్లి కార్జున పండితుడు లింగధారణ దీక్ష పొందనే లేదని కొందరు పండితులు భావిస్తున్నారు. పైపైకి ఈ అనుమానం ఎంతో గొప్పదిగా కనుపించినా అంతస్సారం లేనిది. బ్రాహ్మణులు త్రాటిమాలలని, పచ్చిమాలలని వారి ముఖమైనా చూడరాదని తిట్టిపోసిన సోమన్న లింగధారి కాని బ్రాహ్మణ మల్లి కార్జునుని తన కావ్యనాయకునిగా గ్రహిస్తాడా ? ఇకపోతే లింగధారి కానివాడు లింగధారులు ఏం చేయాలో ఏం చేయకూడదో చెబుతాడా ? లింగధారి కాని వాడి వంశీయులు, లింగధారులై ఆతడు తమ మూల పురుషుడని చెప్పుకొంటారా ? ఈ ప్రశ్నలకు లభించిన గ్రంథాలలో అంతః సాక్ష్యాలతో సమాధానం చెప్ప వలసి ఉంది అయితే మరో వ్యాస విషయం.

ఇంతకూ ఈ సుదీర్ఘ చర్చవల్ల మల్లికార్జున పండితుని జన్మస్థలం దక్షారామమేనని ఆయన కోటిపల్లి నుండి దక్షారామం అగణిత ప్రీతితో వెళ్ళాడని, ఆయన అచ్చమైన ఆంధ్రుడని, తన ప్రణాళికలోని అంశాలకు సంబంధించి నవి కాకపోవడం వల్ల సోమన్న ఆయన జీవిత విశేషాలను వర్ణించలేదని నిర్ణయం

ఇతిశమ్ !

[ప్రాతః స్మరణీయులు కీ. శే. నిడుదవోలు వేంకటరావు పంతులు గారు బహుముఖ ప్రజ్ఞావంతులు, కళాప్రపూర్ణులు, విమర్శక చక్రవర్తులు. పరిశోధక పరమేశ్వరులు తెలుగులోని శైవ సాహిత్యం ప్రచురణకు, ప్రచారానికి వారు చేసిన సేవ అనితర సాధ్యమైనది. వారి పవిత్రస్మృతికి వినీతుడనై శ్రద్ధాంజలి ఘటిస్తూ ఈ వ్యాసాన్ని వారి కంకితం చేస్తున్నాను.

గుండెలో కోయిల

విహారి

శివపురం—రంగప్ప మాష్టారి ఊరు.

శివపురంలోనే ఆ రాత్రికి నా మజిలీ. డొంక రోడ్డున గతుకుల్లో పడిలేస్తూ పోతోంది జీపు. మౌనంగా జీపుని తోలుతున్నాడు ఖాశిం.

అప్పటికి ఐదు రోజులుగా పదిపన్నెండు పల్లెలు పూర్తిచేశాను. శివపురంతో అధికారులు నాకు అప్పజెప్పిన పనికూడా - పూర్తి చేస్తున్నట్టే !

రోడ్డువారగా నిలబడి చూస్తున్నారు దారినవెళ్తున్న ఆసాములు. దూరంగా పొలాల్లో ఒకరిద్దరు పెద్దయ్యలు పొన్నుకర్రమీద ఆనుకుని కళ్లు విప్పుకుని పరిశీలిస్తున్నట్లు తోస్తోంది.

సూర్యుడు నారింజపండు రంగులో - తాటితోపులోకి దిగబడిపోతున్నాడు.

నారింజపండు - నాన్నకి చాలా యిష్టం.

నాన్న గుర్తుకొచ్చాడు. ఆ వెంటనే నాన్నరాసిన ఉత్తరం గుర్తుకొచ్చింది ఉత్తరంలో విషయం గుర్తుకొచ్చింది.

ఆ విషయం చదువుతుంటే నాకు వ్రణం మీద ఉప్పురుద్దినట్లనిపించింది.

అవును.

"శారద స్వయంపాకమనిషి. దాన్ని మనస్తాపాన ముంచి నువు సాధించేదేవుంది ?"—ఇదీ ఆయన రాత ! నాకయితే కుమ్మపొగపెట్టినట్టే వుంటుంది.

ఉలిక్కిపడ్డాను. దూరంగా రైలుకూత వినిపించింది ! నడిదిబ్బమీద చింత చెట్టుని దాటుతోంది. జీపు తోటల్లో నుంచీ గూళ్లకి వెళ్లిపోతున్నై పిట్టల గుంపులు.

ఊరు దగ్గరయింది. నా ఆలోచన ఆగింది.

రంగప్ప మాష్టారు గుర్తుకొచ్చారు. రంగప్పగారంటే ఆ రోజుల్లో చండశాసనుడు. తెలివిలోనూ అపరచాణుక్యుడు. ఆయన మంచి స్థూలకాయుడు. బుర్ర మీసం, కోటు, పంచె పెద్దపొగా, మంచి అట్టహాసంగా వుండేవాడు. దానికితోడు కంచు కంఠం "రేయ్" అని ఆయన వొక్కకేక పెడితే చాలు ఊళ్లో పిల్లలంతా నోర్లకి టాకీలు వేసినట్లు మూగపోయేవాళ్లు.

రంగప్పమేష్టారంటే రూళ్లకర్రమాష్టారనే అర్థం. రూల్సని రూళ్లకర్రలు చేసి పిల్లలకి వాటితోనే పాఠాలు చెప్పేవాడు. స్కూల్‌కి లేట్‌గావస్తే తొడపాశం, పాఠంరాకపోతే గోడకుర్చీ, అల్లరిచిల్లరి పనులకి మెటికలమీద రూళ్లకర్రతో సంఖ్యామానం చెప్పించడం – ఆయన "మెథడ్స్"గా వుండేవి.

"ఊళ్లోకొచ్చాం సార్" అంటూ జీపుని ఆపేడు, ఖాశిం. నేను ఆలోచనల్లోంచి తేరుకుని పక్కకిచూసేను.

పంచాయితీ ఆఫీసు !

ఇంజన్ ఆపమంటూ క్రిందికి దిగేను.

విధినిర్వహణ మొదలెట్టాను. ఖాశింని రంగప్పగారిని పిలుచుకురమ్మని పంపేను. రంగప్పగారియిల్లు నేను చూపిస్తానంటూ ఎవరో కుర్రాడు జీపెక్కి కూర్చున్నాడు. జీప్ వెళ్లిపోయింది.

* * *

రాత్రి ఎనిమిది దాటింది.

రంగప్పగారి ఇంటికి చేరేము. ఆయన ఊరికి కొంచెం దూరంగా మెరక చేనులో యిల్లుకట్టుకుని దాన్లో వుంటున్నారుట.

చేను చుట్టూకొబ్బరి చెట్లు లోపల కూరగాయల పాదులు, పూల మొక్కలు వొక పక్కగా మామిడి, జామి, సపోటా, నారింజలూ వున్నై. బావి పక్కన అరటి తోటవుంది. ఒక మూలగా పనస చెట్టు వెలిసింది. "ఇది పడిమొలిచిన పంపరపనస" అంటూ ఆ చెట్టునీ చూపించారు రంగప్పగారు. ఈ తోటకి మధ్యగా చిన్నకుటీరంలా ఆయన ఇల్లువుంది. వరండా, రెండుగదులూ వున్నై, కప్పు బంగాళాపెంకుది.

"మీలో ఈ మార్పు చాలా వింతగావుంది"- మంచినీళ్ల గ్లాసు కింద వుంచుతూ అన్నాను.

రంగప్పగారు వేదాంతిలా నవ్వేరు.

ఆయన కేసి తేరిపార చూశాను.

ఇప్పటి రంగప్పగారిలో అప్పటి రంగప్పగారిలోని "పవర్" లేదు. మనిషి మరుగుజ్జులా అయాడు. చూపుసరిగా ఆనదు. చేతిలో కర్ర, ముగ్గుబుట్టలాంటి జుట్టు స్వరం పీలగావుంది. కుర్చీలో ముందుకు జరిగేను.

తాను చెప్పింది నాకు సరిగా వినిపించలేదని అర్థమయింది ఆయనకి. మళ్లీ మొదలెట్టేడు.

"మెషిన్‌గన్‌ని పేల్చే సైనికుడికైనా విశ్రాంతి అవసరం కాదూ ?" అని ఎటోచూస్తూ క్షణంసేపు ఆగేడు, నేను తోటలో కర్రకు కట్టిన బల్బువెలుగును చూస్తున్నాను.

"నూరుగొడ్లను తిన్న రాబందుకూడా గాలివానకు కొట్టుకుపోతుంది.రాజూ" అన్నాడు గొంతు గద్గదికమైనట్టు తెలుస్తూనే వుంది. నేను మౌనం వహించాను.

పూలమొక్కలమీద నుంచి చిరుగాలి ఒకటి చిన్నగా విసిరింది.

"క్రమశిక్షణతో పిల్లల్ని గొప్పవాళ్లని చేద్దామనుకున్నాను." ఆయన మొదలెట్టాడు. నేను వింటున్నాను.

"నీకు తెలుసోతెలీదో—మా రామ్మూర్తి సంగతి ?"

"ఏమైంది" అడిగేను.

"నువ్ యెస్సెల్సీ పూర్తిచేసి పట్నం వెళ్లిన తర్వాతి సంవత్సరం నేను మీ వూరినుంచీ బదిలీ అయ్యాను. కొత్తపల్లి వేశారు. రామ్మూర్తి ఆయేడు కొత్తపల్లిలో యస్సెల్సీ పాసయ్యాడు. కాలేజీ చదువుకి తిరుపతి పంపాను. అక్కణ్ణుంచీ నా యిక్కట్లు మొదలైనై."

"అంటే—"

"నెల నెలా అడిగిన డబ్బు పంపేవాణ్ణి. సవ్యంగా చదువుతుంటున్నాడని అనుకునేవాణ్ణి నేను. ఒక్క ఏడాదిలోనే చెడిపోయాడు. సెలవలకి ఇంటికివస్తే, వాళ్లూ వీళ్లూ చెప్పిన వాటిలో నిజమెంత అని నిగ్గదీశాను. వాడేమన్నాడో తెలుసా?"

రంగప్పగారి కళ్లల్లో నీళ్ళు పేరుకున్నై, నేను గమనించాను.

"చిన్నప్పటినుంచీ నువ్ నన్ను రాచి రంపానపెట్టినందుకు నీకు తగిన శాస్తి చేయదలచుకున్నాను. నా యిష్టంవొచ్చినట్లు నేనుంటాను. ఏంచేస్తారో చెయ్యండి" అన్నాడు.

"నాకు నిజంగా నిలువుగుడ్లు పడినై, వాడి తెంపరితనం, మొండితనం, మూర్ఖత్వం నన్ను పశువుగా మార్చేసినై. ఉద్రేకంలో వాణ్ణి ఇంట్లోంచి వెళ్ళగొట్టేశాను. బుద్ధిగా చదువుకోమని కన్నకొడుకుని మందలించడం నేరమా? నువ్ చెప్పు. మాష్టారుగా మిమ్మల్నందర్నీ ఎన్నెన్ని దండనలకి గురిచేశాను, అంతమాత్రాన, నేను శ్రేయోభిలాషిని కాకుండా పోయానా"

'మీరానాడు గరపిన బుద్ధులేగదా—మమ్మల్నీనాడు మనుషుల్ని చేసింది' చిత్తశుద్ధిగానే అన్నాను.





"చూడు రాజూ, కొందరికి జీవితాలతో చెలగాటమాడాలని వుంటుంది. ఎదుటివాళ్ళని ఏడ్పించి ఆనందించాలని ఉబలాటపడుతూవుంటారు. మా రామ్మూర్తి అలా అయ్యాడు."

"కానీ ఆ ఉబలాటం తమ భవిష్యత్తుకే దెబ్బగదా."

"ఆ ఆలోచన వుండదు."

"ఇంతకీ ఏమయ్యాడు."

"ఏమీ కాలేదు. ఎక్కడో లారీల్లో క్లీనర్‌గా, స్టుడియోల్లో బాయ్‌గా, సినిమాహాల్లో గేట్‌కీపర్‌గా ఉంటున్నాడంటున్నారు అక్కడా ఇక్కడా చూసిన వాళ్ళు."

వాతావరణం బరువెక్కింది. నేను నిట్టూర్చి, కుర్చీలో వెనక్కి వాలాను. రామ్మూర్తిరూపం స్ఫురణకు వచ్చింది. మెడ నరాలూ, ముఖంమీది నరాలూ ఉబ్బి, ముడితిరిగి వుండేవి. నల్లగా, వికృతంగా వుండేది అతని రూపం.

వృద్ధాప్యంలో రంగప్పగారికి కొడుకుని గురించి కలిగిన బాధకి నామనస్సు కలుక్కుమంది.

"అవునూ—మీరు రిటైరై ఆరేళ్ళు అయివుంటుందికదూ" వాతావరణాన్ని ఈజ్ చేయాలని వేసిన ప్రశ్న ఇది. నాకు తెలుసు.

ఎక్కడ ఆరేళ్ళు పదమూడేళ్ళయింది." గతంలోకి చూపుని సారిస్తూ అన్నారు.

రామ్మూర్తిద్వారా నేను నేర్చుకున్న పాఠం ఒకటయితే, మా సుమతి ద్వారా నేర్చుకున్నది మరొకటి"

నాకు సుమతి రూపం కళ్ళముందు కదలాడింది.

లేత మొలకలా వుండేది సుమతి. మనిషి ఎరుపు. పుష్టిగానూ వుండేది. ఎర్రంచువున్న, తెల్ల పట్టుపరికిణీమీద ఎర్రజాకెట్టు కట్టుకుని, ఉంగరాల జుట్టుతో ఉయ్యాలలూగుతూ వుండేది. సందెవేళ రోజూ గుడిచుట్టూతిరిగొచ్చి దేవుడికి దణ్ణం పెట్టుకుని వెళ్తూవుండేది. ధ్వజస్తంభం పక్కగా మేము గోలీలాడు కుంటూ వుండే వాళ్ళం ఆ సమయానికి.

నాకు ఇప్పటికీ బాగా గుర్తు. ఒకసారి అట్లతద్దె రోజున మోదుగ ఆకు పొట్లంలో అట్లు పెట్టుకుని మాయింటికివచ్చింది. అమ్మ చేతికిచ్చి పరిగెత్తుతు పోతుంటే అమ్మ పరిహాసంగా అంది. "మా అబ్బాయికోసం తెచ్చి వాడికిచ్చి పోతావేం. వాడికే యివ్వు అంత ప్రేమయితే" అని 'ఛీ పో' అని తుర్రుమని పారిపోయింది సుమతి.

"సుమతి ఎలావుందిప్పుడు? ఏవూళ్లో వుండటం?" అడిగేను.

రంగప్పగారు నాకేసి చూశారు. నేను "చెప్పండి" అన్నాను.

"నమ్మకాలనేది మనిషిని ఓ ఆట ఆడిస్తాయని పిస్తుంది. నావరకు ఇది నిజం. తరుచుగా చదువుని గురించీ, అభ్యాసాల గురించీ, క్రమశిక్షణ గురించీ హెచ్చరిస్తూ రామ్మూర్తిని చెడగొట్టాననే నమ్మకం ఏర్పడింది. వాడలా జులాయిగామారి, ఇల్లు వదలి వెళ్ళిపోయిన తర్వాత. అందుకని సుమతి విషయంలో పగ్గాలు వదిలేశాను. ఇంకా చెప్పాలంటే గేట్లు ఎత్తేశాను. పర్యవసానంగా అమెకూడా నాకు తగిన గుణపాఠం చెప్పింది. నాకూతురి పేరే సుమతి-సుమతి కుమతి కానేకాదనే నా నమ్మకాన్ని వమ్ముచేసి తానూ వెళ్ళిపోయింది." చెప్పటం ఆపి గ్లాసులో నీళ్ళు తాగేరు, ఆయన.

"ఓ క్రిష్టియన్‌ని ప్రేమించి అతనితో వెళ్ళిపోయింది"

"కులాసాగా వుంటున్నారు కదా" అడిగాను,

"తెలీదు. ఎవరో కబుర్లు చేరేస్తూ వుంటారు. కాకినాడలో వుంటున్నారనీ, ఇద్దరు పిల్లలనీ."

"పోనీలెండి. క్షేమంగా సుఖంగావుందీ తిన్నగా కాపురం చేస్తున్నది గదా మంచిదే"

రంగప్పగారు నవ్వేడు మ్లానంగా. "ఏంమంచో-కామంచి"

*　　*　　*

భోజనాలయినై.

పల్చటి వెన్నెల్లో ఆరుబయట పడుకున్నాం.

అస్పష్టమైన తపనగావుంది నాకు. రంగప్ప మాష్టారి భార్యపోయి చాలా ఏళ్ళయినట్లు చెప్పాడు. మాటల మధ్యలో. మరి ఈవ్యక్తి ఎవరు? మాకు భోజనం వడ్డించి తలుపువారగా నిలిచిన మనిషి ఎవరు?

ప్రశ్న గోచరిస్తోంది గానీ అడిగే ధైర్యం రావడంలేదు. అలాగని, ఆ విషయం నాకు సంబంధించింది కాదులెమ్మని ఊరుకోవాలనీ అనిపించడంలేదు.

కొబ్బరిమట్టల్లో ఎక్కడో వివరంలేని సవ్వడి వినవస్తుండగా అన్నాడు రంగప్పగారు.

"జీవితంలో అలసిపోయాను రాజూ. అలసిన జీవితానికి విశ్రాంతి ఎంత అవసరమో ఒంటరి మనిషికి ఓ తోడూనీడా కూడా అంతే అవసరం. అందుకనే లోకులేమైనా అనుకోనిమ్మని శాంతిని ఇక్కడే వుండిపొమ్మన్నాను. మనమిప్పుడు ఆరగించింది ఆమె చేతి విందునే"

నేను ఏమీ అనలేదు. నాకు సంబంధించినంత వరకూ ముడి ఇంకా విడివడ లేదు. ఆయనే మళ్ళీ చెప్పసాగేడు.

"ఈ శాంతి ఎలాంటి మనిషో చెప్పనా? చిన్నప్పుడు 'నేను నిన్ను ప్రేమించగలనే గాని పెళ్ళి చేసుకోలేను' అని నామొహాన్న చెప్పిన మనిషి" ఒక్కసారిగా నా వెన్నున చరచినట్లుంది. నా మనస్సంతా గజిబిజిగా అయింది. శివపురంలో ఆఫీసుపని పూర్తిచేసుకుని వెళ్ళిపోతే బాగుండదేమోననే ప్రశ్న కూడా మేధస్సులో మొలిచింది. రంగప్పమాష్టార్ని చూసిపోదామని ఈరాత్రి మజిలీ చేసినందుకు ఆయన కథలోని మలుపుల్ని వినాల్సివచ్చింది.

నాన్న - కళ్ళముందు మెదిలేడు. శారద ఆలోచనలో కదిలింది.

శారద-మామయ్యకూతురు. ఎమ్మేదాకా చదువుకుంది. బ్యాంక్‌లో ఆఫీసరు. నన్నుతప్ప మరొకర్ని పెళ్ళాడనని శపథంచేసిన పెద్ద మంగమ్మ! ఉద్యోగంచేసే యువతిని భార్యగా స్వీకరించనని నిర్ణయించుకున్న వాణ్ణి నేను మరి!

సన్నగా, పొడుగ్గా పల్చగావుండే శారదరూపం గుర్తుకొచ్చింది. కొనతేలిన గడ్డం, చురుకైన పెద్ద కళ్లు, పచ్చటి నున్నటి శరీరం-లావణ్యంలోనూ సౌందర్యంలోను శారద నా స్వప్నాధిదేవతే! కాని అభిరుచుల్లో వైరుధ్యం మా వివాహాన్ని దూరంచేస్తూ వస్తోంది.

"జరిగిందేదో జరిగిపోయింది. అప్పుడప్పుడూ అనిపిస్తూ వుంటుంది. చావు తుదకు లావు దుఃఖం అని. ఈ బాధలన్నీ ఎందుకు. రామ్మూర్తీ,సుమతీ ఒక్కసారి వచ్చి చూసిపోతే బాగుణ్ణు అని. కానీ....కానీ అది జరుగుతుందా?—ఊఁహూఁ"

మాష్టారు ఏదో మాట్లాడుతున్నాడు.

నాకు నిద్ర పట్టేసింది.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను.

ఒక రాత్రివేళ —

వాక్యాన్ని అక్షరాలు పరచుకొని వున్నట్టు భూమినంతా పరచుకుని వెన్నెల కాస్తోంది.

మా మంచాలకు ఆవలగా.

సపోటా చెట్టుక్రింద అలికిడయింది. లేచి వెళ్ళాను.

మా ఖాశిం! అక్కడ మంచంమీద కూర్చునివున్నాడు. మొహం కప్పుకుని తలవంచి మోకాళ్ళమధ్యన పెట్టుకుని వున్నాడు.

నన్నుచూసి కళవళపడి లేచి నిలబడ్డాడు.

"ఏం ఖాశిం నిద్రపోలేదా!" అడిగాను.

"నిద్ర రావడంలేదు సార్. ఆకాశంకేసి చూస్తుంటే ఏమేమో వాస్తవాలు గుర్తుకొస్తున్నాయ్" పగిలిన గొంతుతో చెప్తున్నాడు.

నేను విచలితుణ్ణయ్యాను. "ఏం వాస్తవాలు భాయ్" అని ఆత్మీయంగా పలుకరించాను.

"ఏంలేదు సార్. మొన్న మనం కాంప్‌కి బయల్దేరేముందు రోజు నాబిడ్డ పోయినాడు"

అదిరిపడ్డాను. వెన్నున చరచినట్లయింది. గొంతు తడారిపోయింది. క్షణాల తర్వాత తేరుకుని అడిగాను. "అదేఁవిటి నాకు చెప్పలేదేం? ఎంత వయస్సు? సో సారీ"

"వయస్సెక్కడ సార్. పుట్టిన నాలుగోరోజునే పోయాడు."

"నీ భార్య ప్రసవించిన సంగతే చెప్పలేదు నువ్. భలేవాడివేనే. ఇంత జరిగితే ఆ మర్నాడే కాంప్‌కి రాకపోతే యేమోయ్. చెప్తే నేనేదో విధంగా సర్దుకునే వాణ్నిగదా" నొచ్చుకున్నాను.

"అంతా బొమ్మలాటసార్. నాటకంలో మన పాత్రని మనం చెయ్యడమే బస్"

గాడిలో పోయే బండికి ఏదో ఓ రాయి చక్రానికి తగిలితే బండి తబ్బిబ్బు అయినట్లు, నా మనసులో ఊగిసలాట ప్రారంభమైంది.

నిమ్మళంగా కదిలేను.

తెల్లవారుతూనే తిరుగు ప్రయాణమయ్యాను.

లోటాలో పాలుత్రాగి లేచి బయటికి వచ్చాను.

అప్పటి కప్పుడే ఖాశిం వెళ్ళి జీపుదగ్గర సిద్ధంగా వున్నాడు.

నాతో కలిసి అడుగులు వేస్తున్నాడు రంగప్ప మేష్టారు.

"నేను వస్తాను మాష్టారూ మరి మీ ఆతిధ్యానికి ధన్యవాదాలు. అన్నదాతా సుఖీభవ" సన్నగా నవ్వేను.

చటుక్కున నా ముందుకొచ్చి నా చేతుల్ని తనచేతుల్లోకి తీసుకున్నాడు. రంగప్ప మేష్టారు.

నీళ్ళునిండిన కళ్ళతో అన్నాడు, "నువ్ పూర్తిచేసుకుని వెళ్తున్న కేసులో నిందితుడు మా శాంతికొడుకే. పొట్టమీద మాత్రం కొట్టకు!"

నేను గతుక్కుమన్నాను! మాటకూడా కట్టుపడింది!

నమస్కారం పెట్టి ముందుకు అడుగేశాను.

"రాజూ- వొక్కమాట" అని మళ్ళీపిల్చాడు. ఆగి వెనక్కి చూశాను. వసారా గుంజకు ఆనుకొని శాంతి! రంగప్పగారిని ప్రేమించగలిగి పెళ్ళిమాత్రం చేసుకోనన్న శాంతి! పధ్నాలుగేళ్ళు పలకరింపు యెరుగని ఊర్మిళలా శాంతి!

రెండు నారింజపళ్లు నాచేతిలో వుంచాడు రంగప్ప మాష్టారు. ఎంతో ఆర్ద్రతతో అన్నాడు, "ఈ ప్రాంగణానికి శాంతివనం అని పేరు పెట్టుకొన్నాను. కానీ వైరుధ్యం చూశావా రాజూ- మా ప్రాంగణంలో వుందికానీ శాంతి- మా మనసుల్లో లేదు. ఎందువల్లనో మరి!.... నిలుస్తామరి. ఈ ప్రాంతానికివస్తే ఈ ముసలి మాష్టారిని పలకరించకుండా వెళ్ళమాక"

నేను ముందుకి కదిలేను.

తుంచకుండా విడదీయలేని పీటముడి గోచరిస్తోంది కళ్ళముందు. కానీ,

నారింజపండ్లని నాన్నకివ్వాలనిపిస్తోంది.

రంగప్పమాష్టారి కోరిక గుర్తుకొచ్చింది. 'జరిగిందేదో జరిగినా రామ్మూర్తీ సుమతీ వస్తే బాగుండును'.

శాంతి పరోక్షంగా వేడుకున్న అభ్యర్థన గుర్తుకొచ్చింది.

ఆరురోజుల క్రితం పోయిన బిడ్డని తలచుకొంటున్న ఖాశిం మూగవేదన గుర్తుకొచ్చింది.

ఆ వెంటనే అతని మాటలూ నా చెవుల్లో మార్మోగినాయి. "నాటకంలో మన పాత్రని మనం చెయ్యడమే సార్"

జీప్ ఎక్కికూర్చున్నాను.

మామిడి కొమ్మల్లోనుంచీ కోయిల కొసరడం మొదలెట్టినా నలువైపులా, చిరుగాలికి కదిలే రంగురంగులపూలూ, మనోహరంగా ఎగిరే సీతాకోక చిలుకలూ, పైన-స్వచ్ఛంగా ఆకాశం!

చేతిలోని నారింజపండ్లలో ఒకటి నాన్నకూ ఒకటి శారదకూ అనుకున్నాను. జీపు సాగిపోతోంది.

ఇప్పుడంతా హాయిగా ఉంది. పూవుకంటె తేలిగ్గామారింది గుండె.

శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి

గణపతి దేవుడి ఆస్థానము

కాకతి గణపతిదేవుడు క్రీ. శ. పన్నెండువందల పిదప ఆంధ్రదేశములో అధిక భాగమున రాజ్యాధికారము స్థాపించుచు ఆర్థికముగను, సాంఘికముగను తెలుగు మాట్లాడు ప్రజలలో ఒక విశిష్టత కనుపించునట్లు కొన్ని మార్పులను రూపొందించెను. వాటినిగూర్చిన పరిశోధనలు ఇంకను జరుగుచున్నవి. ఆ రాజు పరిపాలన కాలములో భాషా-సారస్వతములందు తెలుగువారు దేశమందలి యితర ప్రాంతీయులతో ఏమాత్రము తీసిపోనట్లు బహుముఖ వైదుష్యమును సాధించిరి. రాజరాజ నరేంద్రుని ఆస్థానమున నన్నయ భట్టారకుడు, నారాయణభట్టు వంటి విద్వాంసుల తోడ్పాటుతో ఆంధ్రమహాభారతరచనకు పూనుకొన్న పిదప యిన్నూరేండ్లు కావచ్చుచుండగా నెల్లూరులో మనుమసిద్ధి యాస్థానమున తిక్కయజ్వ ఆ బృహద్గ్రంథమును తెలుంగున పూర్తిగావించెను. ఇది పదమూడవ శతాబ్ది మధ్య భాగమునాటి విశేషము. అప్పటికి దేశములో రాజాస్థానములు విద్వత్కవీంద్రులచే అలంకరింపబడియుండియుండుట సర్వసామాన్యమై యుండెను. ఆ కాలపు మనదేశ రాజకీయ చరిత్రలో గణనీయ స్థానము నార్జించిన గణపతిదేవుని విద్వదాస్థానమును గూర్చి తెలిసికొనుటకు తగిన ఆధారములు చాల తక్కువ. ఆ చక్రవర్తి ఆస్థానము నుండి వెలువడిన గ్రంథమేదియు మనకు లభించుటలేదనియే చెప్పవచ్చును. అయితే కేవలము రాజకీయఘనతను బురస్కరించుకొనియే ఆ రాజు మనకు చిరస్మరణీయుడై నాడా ? ఆ విధంగా మఱి యేరాజైన కీర్తినార్జింపలేదని ఒక సమకాలీన శాసన కవి వ్రాస్తాడు.

కుర్వన్తు కీర్తనశతాని రణాంగణేషు
మథ్నన్తు వైరినికరం ధన ముత్సృజన్తు ।
కాలాన్తరే తదఖిలం ప్రబలాంధకార
నృత్యోపమం కవిజనై రనిబధ్యమానమ్ ॥

(రణరంగములలో అనేక జయగీతములు పాడినను, శత్రుసముదాయమును మదించినను, విస్తారముగ ధనము దానాదులకొరకై వినియోగించినను, అట్టి ఘనకార్యములన్నియు కవులచే గీర్తింపదబడపోయినచో కాలముగడచినపిదప ప్రబలాంధకారములోచేసిన నృత్యమువలె ప్రశంసార్హము కాజాలదు.)

కనుక రాజులాకాలములో తప్పనిసరిగ విద్వదాస్థానములు నిర్వహించువారు ఇతర రాజుల ఆస్థానములలో ఆదరింపబడు విద్వాంసులు తమయొద్దకేతెంచినపుడు వారి విద్వత్తును పరీక్షించి తగురీతిగ సన్మానించుటకు కూడా రాజులు పండిత సభలను జరిపించుటకై తమయొద్ద విద్వాంసులుండవలెను. గణపతి దేవుడుకూడ తన ఆస్థానములో కొందరు విద్వాంసులను ఆదరించి పోషించుచుండెడువాడు. కానివారు గ్రంథరచయితలుగ మనకు తెలియుట లేదు. వారు రచించిన శాసనములను బట్టి మాత్రము కొందరు విద్వాంసులు ఆ రాజుయొక్క.. ఆయన సామంతులయొక్క ఆదరముతో వర్ధిల్లినట్లు తెలియవచ్చుచున్నారు. వీరందరు క్రీ. శ. 1200_1260 కాలమువారు.

1. కవిచక్రవర్తి

ఈయన అసలు పేరు తెలియదు. ఈ బిరుదనామముతో రచింపబడిన రెండు శాసనములు గలవు. మఱికొన్ని శాసనములు గూడ ఈయన రచించియుండును. ఇంతటి మహాబిరుదము వహించిన ప్రజ్ఞాశాలియేవేని గ్రంథములు కూడ రచించెనేమో తెలియదు. గణపతిదేవుని కొలువులో గజసాహిణిగ ప్రసిద్ధిచెందిన జాయసేనాపతి వేయించిన చేబ్రోలు శాసనము[2] పాకాల చెఱువు శాసనము[3] ఈకవి చక్రవర్తి రచించినట్లు చెప్పబడెను. ఈ రెండును సంస్కృత రచనలే. చేబ్రోలు శాసనములో ఈకవి తన సారస్వతాభిమానము నిట్లు చెప్పుకొనెను.

శ్లో॥ హంసాః పద్మాసనాసీనా యదంతస్సముపాసతే ।
పరామృతరసస్యన్ది స్రోత స్సారస్వతం స్తుమః॥

(హంసలు సరస్వతీనదియందు పద్మములపై గూర్చొని ఆస్వాదించు అమృతతుల్యమగు అందలి స్రోతోరసము వంటిదియు పరమహంసలగు యోగులు పద్మాసనాసీనులై సమాధియందంతర్ముఖులై గ్రోలుచుండు సచ్చిదానందామృతము వంటిదియు అయి అనుభవైకవేద్యమై బ్రహ్మానందమునకు సబ్రహ్మచారియగు పరామృతరసము బ్రవహించెడి సారస్వత స్రోతస్సును స్తుతించుచున్నాడు)

పాకాల శాసనములో-

శ్లో॥ ఏతన్మాద్యన్మహీరాజగజకేసరి విక్రమం ।
గణపత్య వనీంద్రస్య శాసనం చక్రవర్తినః॥

ఈ యనుష్టుపులోని భావము గంభీరముగ దోచుచున్నది. మదించిన మహీపాలురనెడి గజములయెడ సింహపరాక్రమము జూపు చక్రవర్తియైన గణపతి భూపాలుని శాసనమిది అని మొదటి అర్థము. ఈ దృశ్యమానమగు అధికార విశేషము మదించిన రాజగజములయెడ కేసరి పరాక్రమము ప్రదర్శించు గణపతిదేవునిది. శాసనము (రచన) (కవి) చక్రవర్తిది.

ఇందు గమనించవలసిన విశేషమొకటి కలదు. గణపతిదేవుడికి 'రాయగజకేసరి' అను అధికారిక బిరుదు కలదు. ఆ బిరుదుతోటే నాణెములను ముద్రలను ప్రవేశపెట్టెను. కేసరి గద్యాణములు, కేసరి రూకలు, కేసరి పుట్లు మన తెలుగు దేశములో ఇట్లే వాడుకలోకి వచ్చెను.[4] రచయితకు కవిచక్రవర్తి బిరుదు శాసనము చివర చెప్పబడెను. కనుక కృతిపతి యొక్కయు, కృతికర్త యొక్కయు అధికారిక బిరుదములు ఈ శ్లోకములో చెప్పబడెను.

జాయసేనాపతి గుణ విశేషముద నిట్లు వర్ణించును:

శ్లో॥ వర్ధతే ఖలు వసుంధరా పతే
స్తస్య సింధుర చమూధురంధరః ।
జాయన స్సకలనాట్య వైదిక
గ్రామణీః కవి సభాశిఖామణిః ॥

గణపతి దేవుడి గజసేనాధిపతియైన జాయన సకలనాట్య వేదమునేర్చిన ప్రౌఢ. కవిసభాశిఖామణి యను విశేషఖ్యాతి నార్జించినవాడు. ఈయన రచించిన నృత్తరత్నావళి యను ప్రామాణిక నాట్యలక్షణ గ్రంథము ప్రచారమందున్నది. గీతరత్నావళి వాద్య రత్నావళి మరి రెండు గ్రంథములుకూడా ఇతడు రచించెను. కాని అవి యింతవరకు ఉపలభ్యముకాలేదు. అతని బహుముఖ సామర్థ్యమును కొనియాడుచు చెప్పిన శ్లోకము.

శ్లో॥ మన్త్రీ కార్యనిరూపణే ప్రియ సుహృద్విస్రంభ సంభాషణే
కావ్యారంభ విధౌ కవిః సహచర స్సంగీత సంపాదనే ।
కర్తా శిల్పకలా కలాపవిషయే సంప్రేషణే కింకరో
యుద్ధే యశ్చలమత్తి గండనృపతే ర్యగేసరో వర్తతే ॥

ఇట్టి ప్రజ్ఞాశాలియయిన మంత్రి, సేనాపతి గణపతిదేవుడికి లభించుట అతని యదృష్టమనిపించును. కాకతీయ శిల్పమని ప్రసిద్ధిగాంచిన కళావిశేషము జాయన ప్రవేశపెట్టిన సంప్రదాయమై యుండును. కాని అతడు రచించిన నృత్తరత్నావళి లోని లక్షణములు కాకతీయ శిల్పములో కానరావని ప్రొ. రాఘవను ఆ గ్రంథ

పీఠికలో చెప్పెను. దీనినిబట్టి జాయన తన గ్రంథములలో శాస్త్రీయలక్షణములను చెప్పినను తాను నిర్మించిన దేవాలయ శిల్పములలో దేశీయ సంప్రదాయమునే అనుసరించెనని చెప్పవలెను.

జాయనచే పరాజితుడైన శత్రురాజు పత్నితో కొండలుదాటి పారిపోవుట వర్ణించుచు—

శ్లో॥ సుతను వదనకాంతిం వాససః పల్లవేన
స్థగయ సలిలపూరై ర్దుర్గమం వర్త్మమాభూత్ ।
ఇతిగిరి మధిగచ్ఛన్ యస్యశత్రుక్షితీశః
కథయంతి నిజకాంతాం చంద్రకాంత స్థలీషు ॥

పరాజితుడైన రాజు భార్యతో త్వరగా కొండలుదాటి పోవునపుడు తోవలో చంద్రకాంత శిలలుకూడా తగులుచుండును. చంద్రబింబమును పోలియున్న ఆమె ముఖకాంతి సోకగనే ఆ శిలలు ద్రవించి తోవ బురదయైనచో తమ రహస్య త్వరితగమనమునకు ఆటంకము కలుగును కనుక ఆ రాజు ఆమెను చీరకొంగుతో ముఖము కప్పుకొనుమని చెప్పెనట. శత్రువులు తమ సుకుమార స్త్రీలతోగూడ కొండల పాలైరి. చంద్రకాంతశిలలు ద్రవించి బురదయేర్పడి తమ శీఘ్రగమనానికి ఆటంకమగుట ఉత్ప్రేక్షానుప్రాణిత పరిణామము. పరాజితులైనవారు ముఖము చాటుచేసికొని పోవలెనని సూచించుట వ్యంగ్యము అట్లే దుఃఖముతో వచ్చిన కన్నీటిని చీరకొంగుతో తుడుచుకొనుమని కూడా చెప్పబడుచున్నది. పాకాలశాసనంలో సముద్రంలో పారిపోయే వారినిగూర్చి—


శ్లో॥ హస్తై రావృణుతాననం మృగదృశో నోచేన్మృగాంక భ్రమాత్
న్నందన్ కృంతతి పోతపాత్ర ముదధి స్తుంగై స్తరంగోత్కరైః ।
ఇత్థం యత్రతి భూభృతాం ప్రతిదిశం ద్వీపాంతరం గచ్ఛతాం
శుద్ధాంత ప్రమదాః సభీతిసదయం శంసంతి సాంయాత్రికాః ॥

ఇచట శత్రురాజస్త్రీల ముఖచంద్రులను జూచి సముద్రముపొంగి తరంగములతో తమ నౌకలను పగులకొట్టునను భయముతో నౌకావర్తకులు తమ పడవలలో రహస్యముగా కాందిశీకులై పోవుచున్న వారినుద్దేశించి చేతులతో ముఖములు కప్పుకొనుమని చెప్పుచున్నారు. రాచవారితో చెప్పుటకనుక భయము, అట్టి సుకుమార వనితలకీ దుర్గతి పట్టెనని దయ. మిగిలిన అంశములు వెనుకటివలెనే. ఈ కవిచక్రవర్తి శాసనాల్లో చక్కని అలంకారాలు భావస్ఫూర్తి కనుపిస్తుంది.

2. పాలంపేట శాసనకర్త – పేరుతెలియదు

కాకతి రాజ్యస్థాపనాచార్య అని ప్రఖ్యాతిగాంచిన రేచర్ల రుద్రసేనాని పాలంపేట సమీపమున గొప్ప చెరువు త్రవ్వించి దానిదగ్గరలో శిల్పకళా శోభితమైయున్న రామప్పగుడిని కూడా నిర్మించెను. అచటనే సుదీర్ఘశాసనమును సంస్కృతమున వ్రాయించి శిలా స్తంభము స్థాపించెను. ఇందలి శ్లోకములు రమణీయముగ కావ్యశైలిలో రచింపబడెను. గణపతిదేవుని భక్తిభావమును ఇట్లు వర్ణించును.

శ్లో॥ శ్రీమద్గణపతి క్షోణీపతి ర్జయతి జిత్వరః ।



యచ్చిత్తేపి వసన్నీశో సముంచత్య చలస్థితిమ్ ॥

చిత్తము సాధారణముగ అతి చంచలమైనది. కాని గణపతిదేవుని చిత్తములో నెలవుచేసికొన్న శివుడు తన సహజమైన అచలస్థితిని విడుచుట లేదట. అందే గణపతి చిత్తము కైలాస పర్వతమువలె శుద్ధము అచలము.

రుద్రసేనాని ప్రతాపమునుగూర్చి

శ్లో॥ వీరారాతి నృపాంధకార తరణే ర్యస్య ప్రతాపాతపః
ప్రత్యర్థి ప్రమదా లసన్ముఖ సరోజాత ప్రజ మ్లానతాం।
ఆశ్చర్యం కురుతే తరాం ప్రియతమ ప్రాప్తి ప్రమోదాన్విత
స్వాంత స్వర్వని తాక్షికైరవ వనప్రోత్ఫుల్లతాంచ స్ఫుటమ్॥

శత్రురాజులనెడి అంధకారమునకు సూర్యునివంటి యితని ప్రతాపము అనెడి యెండ ఆ శత్రురాజస్త్రీల ముఖారవిందములను (వికసింపజేయుటకు బదులు) ముకుళింపజేయుచున్నది ఇంతకంటె ఆశ్చర్యకరమైనది వేరొకటి కలదు. తమకు ప్రియతములైన వీరులు వచ్చుచున్నారను సంతసముతో స్వర్లోక వనితల ముఖములనెడి కలువలను స్ఫుటముగ వికసింపజేయు చున్నదికూడ ఆ ప్రతాపాతపము. ఇందు సరోజములను ముకుళింపజేయుట, కలువలను వికసింపజేయుట ఆతపమునకు అసహజము గనుక ఆశ్చర్యము విరోధము.

ఇట్లు అనేక వర్ణనలుచేసి ఓరుగల్లులో రుద్రుడు స్థాపించిన రుద్రేశ్వర దేవునికి నెక్కొండ గ్రామమును ధర్మమొసగెనని చెప్పి, అచటి వైభవమును అనేక విధముల వర్ణించును. తుదకు ఆ వైభవమును కనులార చూచు కుతూహలముతో ఉద్యానవనములోని తాంబూలలతికలు పోకచెట్లపైకి ఎగబ్రాకుచున్నవట.

శ్లో॥ యస్యాః శ్రియమివ ద్రష్టుం తాంబూల లతికాద్రుతం।
ఉద్యాన పూగ స్కంధాగ్రాణ్యారోహంతి సమంతతః॥

తమలపాకుకు పోకకు సహజసంబంధము. ఆ నగరోద్యానమునందు ఆ లతికలు నాయికలుగను, పోకచెట్లు నాయకులుగను బోల్చబడిరి. తిరునాళ్ళవంటి వేడుక సమయాల్లో నాయికా నాయకుల సంరంభము గమ్యమానమగుచున్నది. నాయకుల భుజములపైకి ఎగబ్రాకుచు నాయికలు ఆ వేడుకలు చూచుట సూచితము.

3. కొండపర్తి శాసనకర్త[6] – పేరు తెలియదు

గణపతిదేవుని సేనాపతులలో మల్యాల చౌండసేనాపతి, మల్యాల కాటసేనాపతి రాజధానికి సమీపంలో కొండపర్తియనుచోట కాపుండెడివారు. వారు నిర్మించిన అచట దేవాలయాల్లో రెండు సంస్కృత శాసనాలు వేయించుకున్నారు. అందొక దానిలో శివుని స్తుతించుచు చెప్పినది—

శ్లో॥ అభీష్ట ఫలదః స్థాణుః అష్టమూర్తి రతీంద్రియః।
కామారిరర్థనారీశో మహాదేవస్సపాతువః॥

స్థాణువై అభీష్టఫలములొసగును. (ఎండిన మోడైనప్పటికి కోరిన ఫలముల నిచ్చును.) అష్టమూర్తియని పేరుగాంచినవాడై ఇంద్రియములకు గోచరించడు. కామారి అని మేటి బిరుదను వహించియు శరీరార్థమున స్త్రీరూపము దాల్చెను. మన్మథుని దహించెనేకాని స్త్రీ విషయంలో లోకోత్కృష్టమైన ప్రేమను చూపువాడు ఇట్టి గుణముగల మహాదేవుడు మిమ్ము రక్షించుగాక.

ఆ దేవాలయ నిర్మాణ కౌశలమును వర్ణించుచు.

శ్లో॥ ప్రాకారో జయతి త్రికూట మభితస్థస్తేన నిర్మాపితః
సుశ్లిష్టైః క్రమశీర్షకై రుపచితో నీలోపలైః కల్పితః।
యశ్చా లక్షిత సంధిబంధ కథనా దేకాశిలా తక్షకైః
సంతక్ష్యేవ మహీయసీ మివశిలాం యత్నాత్సముత్తారితః॥

అచటి త్రికూటాలయము చుట్టు నిర్మించబడిన ప్రాకారవర్ణన యిది. నల్లరాళ్ళు కచ్చితంగా అంచులుండునట్లు చెక్కి పేర్చగా రాతికి రాతికి మధ్య అతుకుకూడా కనుపించనంతగా నునుపుచేయబడ్డ నిర్మాణమది. దానినిచూస్తే ఒకే పెద్ద రాతిని మలచి తక్షకులు దీనిని రూపొందించారా అన్నట్లు తోచును. ఆనాటి శిల్పుల నైపుణ్యమునకు దీటైయున్నది. ఈ కవితా నైపుణ్యము. ఇందు అతిశయోక్తికంటే స్వభావోక్తియే ప్రధానమైయున్నదని కాకతీయ శిల్పమును పరిశీలించుచో తెలియ

గలదు. ఈ అజ్ఞాతకవితయే కటుకూరు శాసనమును[7]గూడ రచించెను. అందు మల్యాల కాటయ భార్యయైన మైలమను-వర్ణించును

శ్లో॥ మందసుందరగతం సుభాషితం
లోచనాంచల విలోలవీక్షితం
హంసకోకిల మృగైః పృథక్కృతం
యత్రయోగ మగమ త్పరస్పరమ్॥

మంద సుందరగతి హంసలలోను, సుభాషిత్వము కోకిలలోను విలోలవీక్షణము లేళ్ళయందు విడిగా మూడుచోట్ల ప్రసిద్ధమైయున్న గుణములు ఈమెయందు ఒకే చోట కలసియుండుటను పొందియున్నవి.

వీరి శాసనములలో అచ్చటచట ప్రాకృత శ్లోకములుగూడా రచింపబడెను.

4. అభినవ మయూరుడు

ఇతడు మల్యాలవంశమునకు జెందిన గుండయసేనాని అస్థానమున ఆదరింపబడుచుండెడివాడు. వీరందరు గణపతిదేవుని యాస్థానములోని వారైయున్నను సామంతులుకూడ ఒక్కొక్కరియెడ విశేషాదరము జూపుచు తమ శాసనములను వ్రాయించు కొనెడివారు. ఈ మయూరభట్టు విద్వత్కుటుంబములోని వాడై ఈశ్వరభట్టోపాధ్యాయులవారి పుత్రుడనియు పదవాక్య ప్రమాణ ప్రమేయ విచిత్ర కవిత్వ తత్త్వజ్ఞుడనియు తను రచించిన వర్ధమాన పురశాసనములో జెప్పుకొనెను. ప్రసిద్ధ మయూర కవిని అనుకరించుచూ అభినవ మయూరుడని యితడు బిరుదనామము వహించెను. ఆత్రేయ గోత్రుడు. ఇతని బిరుదము అన్నివిధముల సార్థకమైయున్నదని అంగీకరించక తప్పదనిపించు పాండిత్యము కవితాశక్తి యితని శాసనరచనలో వ్యక్త మగుచుండును. ఇతని పుత్రుడు ఇమ్మడి యీశ్వరభట్టు. ఆయన వైదుష్యము అసాధారణమైనది. వేదశాస్త్రము లభ్యసించి కవిత్వరీతులందు నైపుణ్య మార్జించిన విద్వత్కవివర్యులని పేరుగాంచినది వీరి వంశము. మల్యాలగుండయ గోనవంశానికి చెందిన ఆడబడచును పరిణయమాడెను. ఆమె బూదపురములో తటాకము నిర్మించి ఈశ్వరభట్టుచే శాసనము వ్రాయించెను. గుండయ వర్ధమాన పురములో దేవాలయము నిర్మించి అభినవ మయూరునిచే శాసనము వ్రాయించెను. వీరి రచనలు అర్థగాంభీర్యముతోను, పద లాలిత్యముతోను మిక్కిలి రమ్యముగా నుండును. వర్ధమాన పురశాసనములో గుండయను వర్ణించుచు-

శ్లో॥ ఆకారతో రతిపతిః స్వయమేవ యోసౌ
వీరః ప్రచండ చరితః పరమేష భేదః।
అస్త్రీకరోతి మదన స్సమరాంగణేషు స్త్రీ
ర్వీరా నయం తు కురుతే స్త్రుధరానపి స్త్రీః॥

అకారమున ఇతడు స్వయముగ రతిపతియే. వీరుడు ప్రచండుడు కూడ కాని యీ భేదము గమనించ దగును. మదనుడు సమరాంగణములందు స్త్రీలను అస్త్రములుగ జేసికొనును. అనగా వారిని ప్రయోగించి పురుషులను జయించును. ఈ గుండయ అస్త్రధరులైన వీరులనుగూడ స్త్రీతుల్యులుగ జేయును. ఉపమానముకంటె ఉపమేయ మధికమని వ్యతిరేకము చెప్పబడెను.

గుండసేనాని వర్ధమాన పురములో నిర్మించిన దేవాలయ ఔన్నత్యమును గూర్చి చెప్పినది—

శ్లో॥ అదౌయస్య నికామహేమశిఖరం జ్ఞాత్వా సమాలోచ్యత
త్కాలే ర్భానురథావరోధన భయా న్మార్గద్వయం వేధసా।
నిర్మాయోత్తర దక్షిణాయనవిభా దిత్థం జగత్కల్పితం
నో చేత్ తుఙ్గరథోరవిః కథమిహ స్పష్టం సమాచక్షతే॥

ఇక్కడ కలియుగములో ఒక ఉన్నతమైన దేవాలయము నిర్మింపబోనున్నది, దాని హేమ శిఖరము వలన సూర్యరథమునకు అవరోధము ఏర్పడగలదు అని ముందుగనే సృష్టికర్తయైన బ్రహ్మ ఊహించి ఆ సూర్యపథమునే రెండు వైపులుండునట్లేర్పాటుచేసెనట. లేకున్నచో అతితుఙ్గమైన రథమార్గములున్న సూర్యుడేల ఉత్తర దక్షిణాయనములనెడి రెండు మార్గముల నడుచును? అతిశయోక్తి-ఉత్ప్రేక్ష.


కాకతిగణపతి దేవుడు ఈ గుండయయొక్క పరాక్రమాది విశేషములను బురస్కరించి సామంతచిహ్నముగ కాకతీయుల పూర్వమునుండి వంశలాంఛనమైన గరుడ చిహ్నమును ప్రసాదించెను. ఆ గరుడధ్వజమును మూడుశ్లోకములలో వర్ణించును.

శ్లో॥ యస్యోద్య ద్ధ్వజ నద్ధ రాయగరుడం దృష్ట్వా రవే స్సారథా
వశ్వానాం వినివార్య శ్రీఘ్రగమనం ప్రేమోక్తి బద్ధోత్సవే।
దీర్ఘావాసరపద్ధతిః ప్రభవతీ త్యాలోచ్య యాత్రోద్యమే
నూనం చక్రకులం ధ్వజోన్నతి మిమాం ప్రస్తౌతి విస్తారతః॥

గండసేనాని యుద్ధయాత్రకు బయలుదేరగనే చక్రవాకములు అతని రాయగరుడ ధ్వజోన్నతిని మిక్కిలి ప్రస్తుతించుచున్నవట. ఆ ఉన్నత ధ్వజముపై చిహ్నితమైయున్న గరుత్మంతుని జూచి సూర్యసారథియగు అనూరుడు తనసోదరుడు యాదృచ్ఛికముగ మార్గములో కలిసెను కాబట్టి ప్రేమోక్తులతో తన శ్రీఘ్రగతిని కొంత ఆపును. అందువలన పగటి సమయము దీర్ఘమై చక్రవాకములు తమకు ఇష్ట ప్రాప్తి కలుగునను సంతోషముతో ఆ ధ్వజమును ప్రశంసించును. వేరొకశ్లోకములో రాయగరుడుని కీర్తిమాల పాతాళమునుండి పైకి వ్యాపించి యున్నది గనుక అచటి శేషనాగము ఆ గరుడునికి భీతిల్లి వినమ్ర భావమున తలవంచెనని చెప్పి అందువల్ల అతని విధియైన భూతహన క్రియకు అంతరాయ మేర్పడగా, తన ధ్వజానికి విన మ్రుడైనందుకు ప్రీతి సూచకముగా భూభారమును గుండసేనానియే వహించెనట. మూడవ శ్లోకములో ఆ ఉన్నత ధ్వజముపైనున్న రాయగరుడ చిహ్నమునుచూచి సర్పశిరోరూపముగల రాహువువలన తమకిక భయములేదని సూర్యచంద్రులు దానిని ప్రస్తుతించుచుండిరట. ఇట్లా శాసనమంతా గంభీరార్థముతో అతిరమణీయముగ నుండును. శాసనాంతమున ఒక చక్రబంధశ్లోకమును రచించెను. పదివలయములు గల చక్రసంపుటిని మూడు జ్యా (జయామెట్రిక్) పంక్తులలోను పైచుట్టు వలయములలోను శ్లోకము నాలుగు పాదములు అమర్చబడును. దీని విశేషమేమనగా, 'గుండవీరనుతి' అని కృతిపతి, 'మయూరవిరచితం' అని శాసనకర్త 'నాగేశశాసనం' అని దేవునిపేరు 'నాగయలిఖితం' అని లేఖకుని పేరు వచ్చునట్లు శార్దూలవిక్రీడిత వృత్తము కూర్చబడెను. అభినవ మయూరుడు పేరుకుతగ్గ మహాకవి ఈయన కొడుకు ఈశ్వరభట్టు.

5. ఈశ్వరభట్టు

వ్యాకరణ శాస్త్రములోఖని. ఇతని కాశాస్త్రమందు అపరిమితాభిమానము. చిత్రకవిత లనేకముకూర్చి బూదపుర శాసనము రచించెను. వృత్తములో వృత్తము వచ్చేటట్లు, నిర్దంత్యములు, నిరోష్ఠ్యములు, నిష్కంఠ్యములు, ఏక 'ల' కారక్రియాత్మకములు ఇట్లాయెన్నో విచిత్రకవనములు నేర్చిన ప్రౌఢ ఈశ్వరభట్టు బూద



పూరులో మల్యాల గుండయభార్య కుప్పాంబ త్రవ్వించిన తటాకమును వర్ణించుచూ దానిని పాణినీయముతో పోల్చును.[8]

శ్లో॥ సన్ధాతు వృద్ధ పృథ్వ్యాది సమాసాళీ సమన్వితః
నదీపూరణ సంపూర్ణః పాణినీయాయతే పయః॥

ధాతువులు, వృద్ధసంజ్ఞలు పృథ్వ్యాదిగణాము సమాసములు నదీసంజ్ఞ పాణినీయము నందు ప్రసిద్ధములు, తటాక పక్షములో మంచినీటితో సమృద్ధమై, గొప్పది సంక్షిప్తమైన అడ్డుకట్టకలది. నదీజలముతో పూరింపబడి సంపూర్ణమైనది అని అర్థము. కేవలం 'లిట్' వికరిణిలోనే పిష్, పుష్, తుష్, మిష్, ముష్, శిష్ ఇష్ అనుస్వారధాతువులను వాడి చెప్పిన శ్లోకము-

శ్లో॥ శత్రూనాశుపిపేష వీరనిరతాన్ బన్ధూన్ పుపోషాత్మనో
దారేష్వేవ తుతోష నిత్యవిలస న్నీత్యోన్మిమేష క్షితౌ।
సౌందర్యేణ ముమోష శంబరరిపో శ్శ్రీశ్వం విశేషత్విషా
సద్ధర్మం విశిశేష యః పరహితం శోషాది యేషప్రభుః॥

ఇందు పిపేష, పుపోష, తుతోష, మిమేష, ముమోష, విశిశేష, ఇయేష అనే ప్రయోగాలు శ్లోకానికి శబ్దాలంకారాన్ని కూర్చుచున్నవి. సాధారణంగా తర్కవ్యాకరణాది శాస్త్రాల్లో నిష్ణాతులైన విద్వాంసులకు, కవిత్వమబ్బదు. సూత్రానికి తు, చ, తప్పకుండ అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలకు తావు లేకుండ పూర్వపక్ష సిద్ధాంత రూప శాస్త్రార్థాలకు అలవాటైన వారికి అతిశయోక్తులు, విరోధభాసలు భ్రాంతులు ఉత్ప్రేక్షలు మొదలైన కృత్రిమ రచనయే జీవితముగాగల కవిత్వమబ్బుట అరుదు. రాజాస్థానాల్లో కవులు వేరుగాను, శాస్త్రపండితులు వేరుగాను ఉంటారు. గణపతి దేవుడి అదృష్ట మేమోకాని పండితులు కవులుగాను, కవులు పండితులుగాను ఖ్యాతి నార్జించినట్లు వారిరచనలు నిరూపించుచున్నవి. ధర్మసాగర శాసనంలో ఒకపద్యం-

శ్లో॥ యశ్చ ప్రతాప జ్వలనస్య సన్నిధౌ
వసుంధరాయాః కరముగ్రహీ ప్రసాత్
సతీవ కీర్తిః కకుబన్త మన్వగాత్
సాపత్న్యవార్తా సహనాహి యోషితః॥

గణపతి దేవుడు ప్రతాపాగ్ని సమక్షంగా భూకాంత యొక్క పాణి గ్రహణం చేయగా, కీర్తికాంత పతివ్రతవలె దిగంతములకు చేరుకొన్నదట, దానిని అర్థాంతర న్యాసంతో సమర్థిస్తాడు. సాధారణంగా మానమే ధనంగాగల పతివ్రతలు సపత్నులు ఇంట్లో కాపురం చేయటానికి ఇష్టపడరు. అట్లాగని తమ పాతివ్రత్య నియమాన్ని ఉల్లంఘించరు. కనుక గణపతిదేవుని కీర్తికాంత దిగంతముల నాశ్రయించి ఆ రాజన్యుని ఘనతనే చాటుచున్నది.

6. బయ్యారం శాసనం[9] - రామదేవకవి

గణపతిదేవునికి ఇద్దరు తోబుట్టువులు మైలాంబ, కుందమాంబ ఇద్దరు నతవాడి రుద్రభూపాలునికి భార్యలని చెప్పబడింది శాసనాల్లో. ఆ రుద్రుడు ఒకరా, యిద్దరా అన్న సందేహం కలుగు తున్నది. మైలమాంబ బయ్యారం చెఱువు త్రవ్వించి అచట కొన్ని శాసనాలు రామదేవుడనే కవి చే వ్రాయించింది. అందు బయ్యారం చెఱువు శాసనం సుదీర్ఘమై కావ్య శైలిలో వ్రాయబడింది. ఈ తటాక సేతువును గూర్చిన శ్లోకం—

శ్లో॥ విన్ధ్యాద్రేః కిము కుంభ సంభవమునే రాజ్ఞా ప్రతిష్ఠాభిత
స్సృక్ష్వాకార మిహాఖిలో పకృతమే వర్తిష్ణు మన్యం శ్రితః।
భూతానా మభయాయ బాహు రథవా ప్రాప్తప్రసారః క్షితే॥
రిత్యాతర్కిత సేతురేతి హృదయం నిధ్యాయతాం యోన్నృణామ్॥

పూర్వము విన్ధ్యాద్రి హద్దుమీరి పెరుగుచు సూర్యగతిని నిరోధించి లోకో పద్రవమునకు కారణమయ్యెను. ఇపుడు లోకోపకారకముగనుండ వలెనని తలపోసి యీ తటాకమునకు కట్టగా అవతరించెనా అని తోచుచున్నదట. అంటే యిచట చెఱువుకు కట్ట యెత్తయిన కొండ నీరు ఎక్కువగా నిలచి లోకోపకారము కలుగ గలదు. కనుక పూర్వము లోకోపద్రవమునకు కారణమై అగస్త్యుని ఆజ్ఞాబద్ధుడై విన్ధ్యాద్రి యిచట శ్లాఘనీయమగు ఔన్నత్యము దాల్చెనని భావము. అతిశయోక్తి ఉత్ప్రేక్ష. లేదా భూదేవి తన బిడ్డలనుద్దేశించి చాచిన అభయహస్తమా అన్నట్లుగా తోచుచున్నదా సేతువు. తటాకమును గూర్చి—

శ్లో॥ ఏ తత్పురీ నివసన స్థిరచిత్తవృత్తిం
లక్ష్మీం నిరంతర దిదృక్షు రపాంపతిః।
శ్రీ ధర్మకీర్తి జలధి వ్యపదేశశాలీ
మన్యే కిమన్య దిహ సంప్రతి సన్నిధత్తే॥

మైలాంబ నిర్మించిన ధర్మకీర్తి పురములోనే నిరంతర నివాసమేర్పాటు చేసికొన్న లక్ష్మీదేవిని విడిచియుండలేక సముద్రుడు కూతురును ఎల్లప్పుడు చూచుచుండవచ్చు నని యీ ధర్మకీర్తి జలధి అనే వ్యపదేశముతో ఇక్కడున్నదా అనిపించుచున్నదట యీ తటాకము అపహ్నవము.

7. కుందవరం శాసనాలు[10]-బాలభారతి

కుందమాంబ జనగాం తాలూకాలో నిడిగొండ, కుందారం గ్రామాల్లోను, చెన్నూరు తాలూకాలో గోదావరియొడ్డున వేరొక కుందారంలోను ఇంచుమించు ఒకే శాసనాన్ని వేయించెను. అందు కాకతివంశ వర్ణన, దేవాలయ వర్ణన, తటాకవర్ణనలు ఉంటును. రచయిత బాలభారతియని పేర్కొనబడెను. ఇదికూడా బిరుద నామమేకాని నిజనామము కాదు. ఇతని కవిత్వము దీర్ఘసమాసములు లేకుండ క్లిష్ట పదభూయిష్టముగాకుండ పదలాలిత్యముగలిగి ద్రాక్షాపాకమున రమణీయమైయుండును. ముందు కవిపేరు—

శ్లో॥ సూక్తి ముక్తావళీ భాతి బాలభారతి సత్కవేః।
సుగుణైః కుందమాంబాయా యామహీ హృదయంగమా॥

కుందవరా గ్రహారాన్ని గూర్చిన వర్ణన—


శ్లో॥ విరాజతే కుందపురాగ్రహారః
సరస్వతీ తుంగకుచాగ్రహారః।
భూదేవ రత్నాని వినిర్మలాని
స్ఫురన్తి యత్రోజ్జ్వల వృత్తవన్తి॥

కుందపురములోనున్న విద్వన్మణులతో 'సరస్వతీదేవికి కుచహారమేర్పడు చున్నదని యచటి విద్వాంసుల విద్వత్ప్రకర్ష కొనియాడబడెను. వారిపక్షమున సచ్చరిత్రవర్తన గలవారిని, రత్నముల పక్షమున ప్రకాశించుచు వృత్తాకారముగ నున్నవని చెప్ప బడెను. మహాదేవరాజును వర్ణించుచు—

శ్లో॥ రాజోత్తంస మణీ రరాజ స మహాదేవో విభూత్యుజ్జ్వలః
సౌభాగ్యోర్జిత భాగ్య బయ్యల మహాదేవీ మనోవల్లభః।
యస్యాసీ న్మదసింధురో వృషపతిః సేనాగ్రగణ్యాగణాః
విశ్వైట్సంహరణే రణేగ్నినయ నాటోపః ప్రతాపః పునః॥

రాబోవు శ్లోకములో గణపతిదేవుని చెప్ప నుద్దేశించి యిందు మహాదేవరాజును మహాదేవునితో పోల్చుచున్నాడు. (రాజోత్తంస మణిః=ఈశ్వరుడు; రాజులలో శ్రేష్ఠుడైన మహాదేవుడు. విభూత్యుజ్జ్వలః=విభూతితో శోభిల్లువాడు శివుడు ఐశ్వర్యముతో శోభిల్లువాడు మహాదేవరాజు; బయ్యల మహాదేవీమనోవల్లభః= అటవికులు శివుని బయ్యన్నఅనియు, పార్వతిని బయ్యాంబ అనియు పిలుచుట గలదు కనుక శివుడని యిచట అర్థము. మహాదేవరాజు భార్యపేరు బయ్యాంబ; వృషపతిః=నంది శివునికి వాహనంకాగా, మదసింధురము ఆ నంది అవతారముగ మహాదేవరాజుకి వాహనమయ్యెను. ప్రమథగణములు శివునికి సేనాగ్రగణ్యులు, వారే మహాదేవునికి సేనలుగ పుట్టిరి. అగ్నినేత్రము శివునికి శత్రుసంహారము కాగా, మహాదేవునికి ప్రతాపాగ్ని శత్రుసంహారక మయ్యెను. కుందలదేవికి త్రిన్ని పొగడుచు—

శ్లో॥ సుస్నిగ్ధలహరీ రుచిజిత్వరీయ
యత్కీర్తిమ ప్రతిదిశం ప్రతిసృత్వరీయ।
క్షీరోదగర్భవసతిః పురుషోత్తమేన
సాదరణి ధ్రువ మభూ జ్జగతీ జనానామ్॥


అసలైన తెలుపు ఏమిటో...ప్రపంచానికి చూపండి
డెట్
డెట్
def
DETERGENT CAKE
Unique Rich Formula
ఉత్తమం... ఉత్తమం... తెలుపులో సర్వోత్తమం!
డెట్ మీకు అందిస్తుంది ఎంతో ఎక్కువ. దీని క్రొత్త రేపర్ ఎంతో అందమైనది. ఆకర్షణీయమైనది. తీసి చూడండి, లోపల మరో ఆశ్చర్యం — ఉల్లాసకరమైన ఘనమోహక పరిమళం. అంతేకాదు, డెట్‌లో నిండి వున్నది ఎంతో ఎక్కువ తెలుపు శక్తి. మరి రండి, డెట్ ప్రపంచంలో అడుగిడండి. స్వయంగా చూడండి, అందరికీ చూపండి. డెట్ తెలుపు...అసలైన తెలుపు!
Shilpi DM 9A/84 Tel.

అతి స్నిగ్ధమైన పాలతరంగముల కాంతులను జయించిన ఆమె కీర్తులు దిక్కులం తట వ్యాపించగా క్షీర సముద్రగర్భమున నివసించు భాగ్యము ఒక్క పురుషోత్త మునియందేకాక, జగములలోనుండు జనులకందరికి సాధారణ విషయమయ్యెను. బాలభారతి కల్పనా నైపుణ్యమునకిదియొక మచ్చు.

8. విశ్వేశ్వరశివాచార్యుడు

ఈయన గణపతిదేవునికి, రుద్రమదేవికి పాశుపత దీక్షనొసగిన రాజగురువు ఈయన శాసనాలు త్రిపురాంతకములోను, 11 మల్కాపురములోను ఇంకను కొన్ని చోట్ల గలవు. ఈయన, ఈయన కొడుకు నరసింహుడుకూడ గొప్ప రచయితగా ఖ్యాతిగాంచిరి. నరసింహుడు ప్రతాపరుద్రుని కాలంలో (క్రీ. శ. 1281-1328) నున్నవాడు కనుక ఇచట అప్రస్తుతము, విశ్వేశ్వర రచనలలో రెండు ఉదహ రింతును. రుద్రమదేవి కీర్తిప్రకర్షను గూర్చి—

శ్లో॥ ఆక్రామంతి తరత్తరంగ విగళ ద్దుగ్ధాబ్ధి ఫేనావలీ
రాచామంతి శరచ్ఛశాంక విశద జ్యోత్స్నా ప్రవాహామృతం।
ఆకర్షంతి సురేంద్రదంతి దశన ప్రాగ్భారలగ్నాం శ్రియం
ముక్తాహార లతాయితాః ప్రతిదిశం రుద్రాంబికా కీర్తయః॥

ఆమె కీర్తులు క్షీరాబ్ధినుండి వెడలిన తరంగముల ఫేనములను ఆక్రమించుచున్నవి, శరచ్చంద్ర చంద్రికా ప్రవాహామృతమును గ్రోలుచున్నవి, ఐరావతముయొక్క దంతద్యుతిని ఆకర్షించుచున్నవి. దిక్కాంతలకు ముక్తాహారములుగ ప్రతిదిశయందు వ్యాపించు చున్నవి.

ఈయన గద్యరచనకూడా చాల మనోజ్ఞమై ప్రౌఢశైలిలో నుండును.

“స్వస్తిశ్రీ సమస్త విద్యావిలాసినీ లాసక రసిక, సకల జలనిధి వేలా మేఖలా వలయిత వసుమతీవలయ విజయమాలాకలిత భుజాశిరోత్తంస, సహ్యకాంతు వంశావతంస, సమరసమ సమయ సమాహన్యమాన నిస్సాణ ఘోషసమాకర్ణన విసర్పద్బాష్ప ధారాధౌత ప్రతిభట భటీగండేన, చలమర్తి గండేన కరకలిత కరవాళ క్షపిత విపక్ష విలాసినీ విశంబ్యమానాలకవల్లరీ వినిస్సాదిత లలాటతట కస్తూరికా తిలకేన కాకతికుల తిలకేన, కవికుల కమలాకర దివాకరేణ సకల గుణగణ రత్నాకరేణ. విభవ వినిర్జిత విబుధరాజేన గణపతి మహారాజేన....”

ఈ గద్యరచన బాణభట్టుని, దండిని స్మరింపచేస్తుంది. దీనిలోనున్న 'కవి కుల కమలాకర దివాకరేణ' అని గణపతిదేవుని ప్రశంసించుట అక్షరాలా నిజమని పైజెప్పిన విషయము నిరూపించుచున్నది. గణపతిదేవుని నాటి శాసనసాహిత్యము స్థాలీపులాకముగ చూపబడెను. గ్రంథరూపమున వెలువడిన సాహిత్యమేదైనా కల దేమో తెలియదు. ఆ మహారాజుయొక్క ఆస్థానములో ఒక కవి చక్రవర్తి ఒక త్రిభువన విద్యా చక్రవర్తి, (ఇందు ఉదహరింపబడలేదు. మంథెన శాసనకర్త) ఒక కవి సభాశిఖామణి (జాయసేనాని) ఒక అభినవ మయూరుడు, ఒక ఈశ్వర భట్టు, ఒక రాజగురువు, ఒక బాలభారతి, ఇంకెందరో అజ్ఞాత నామధేయులు రాజా దరణమున వర్ధిల్లుచుండిరి. వీరిలో కొందరు తెలుగునకూడా చక్కని శాసనములు చెప్పిరి. వారిలో మయూరభట్టు రచించిన వర్ధమానపురము శాసనము, ఆయన కొడుకు ఈశ్వరభట్టు రచించిన బూదపుర శాసనములోను తెలుగు గద్యరచనలు కూడా ప్రబంధశైలిలో గలవు. అట్లే అజ్ఞాతనామకుడైన ఉప్పరపల్లి శాసనకర్త పేర్కొనదగిన ఆంధ్రరచయితలు.

9. ఉప్పరపల్లి శాసనము :-12

గణపతిదేవుడి సేనానులలో ప్రముఖుడు రేచెర్ల రుద్రరెడ్డి. అతని ప్రధాని ఉపసేనాని రాజనాయకుడు. ఇతడే కళింగదేశ దండయాత్రలో ప్రముఖపాత్ర వహించెను. ఇతనికొడుకు కాటనాయకుడు ఈ శాసనము వేయించెను. విఘ్నేశ స్తుతితో ప్రారంభమై గణపతిదేవుడిని రేచెర్ల రుద్రుని రాజనాయకుని గీర్తించుచు ఉప్పరపల్లిలో కాటయచేసిన దానాదికమును తెలుపుటకై యీ శాసనము వేయించ బడెను. అందుండి కొంతభాగము—

ఉ. శ్రీమదనూన దాన జలసేచక భాయక ప్రమేయ షట్పద
స్తోమ నినాదము ల్వినుచు సూరెలనెప్పుడున్ బ్రస్తుతించు సి
ద్ధామరకోటికి స్వరదుడైన గణేశుడు సుస్థిర స్థితిం
గామసమాన మూర్తియగు కాటయకిచ్చుత మిష్టసంపదల్:

క. చరణ సరోరుహరాగ
స్ఫురణ న్మహిమని శిరంబు పొలుపుగ సంధ్యా
ప్రభరుచినెనయమెట్టిన స
త్కరుణాన్విత దుర్గి వరము గాటయకొసగున్ ।

ఇట్లు ఇష్టదేవతా ప్రార్థన జేసిన పిదప కొంత గద్యం.

“స్వస్తి శ్రీమదపార పారావార పరివృత మహీతలంబున సకల జనవినుతంబగు నంధ్రదేశంబునకు విభూషణంబైన యనుమకొండయను పురవరంబు నిజ రాజధానిగా నొప్పుచుండ కాకతె భూపాలక్రమంబున జనవినుతయశో విలాసుండును నైన రుద్రనరేంద్ర సుపుత్రుండును సదారాధిత త్రినేత్రుండును విబుధజన వసంతుండును రమణీయశ్రీ సీమంతినీ జయంగుండును సకలజన మనోరంజనుండును నరాతిరాజ మదభంజనుండును శరణాగత శరణ్యుండును ధైర్యామర సానుమంతుండును దుకగరేవంతుండునునైన గణపతిదేవమహీనాథునకుం ప్రధానియై

మ. ప్రతిపక్ష క్షితిపాల కుంజర మద ప్రారంభ సంరంభము
ద్ధత బాహాసిహిత ప్రచండ నిశితోద్యత్ఖడ్గధారానఖా
హతి భేదించి యఖర్వగర్వబలశౌర్య స్ఫూర్తిం గంఠీరవా
కృతియై సన్నుత వృత్తిదాల్చి వెలసెన్ రేచర్ల రుద్రుండిలన్ !

ఈ విధంగా రచన సాగుతుంది. అభినవమయూరుడు రచించిన వర్ధమాన పురశాసనములోని తెలుగుగద్యకూడ ప్రబంధసరళిలో నుండును. గణపతిదేవుడు గొప్పపండితాభిమాని, మహాకవులను తనయాస్థానములో ఆదరించెను. నెల్లూరినుండి కవిబ్రహ్మ తిక్కనసోమయాజి రాజకీయ దౌత్యమునకై యోరుగల్లుకేతెంచుటలో ఆ రాజు విద్వత్కవులయెడ జూపు ఆదరాతిశయమే ముఖ్యకారణము. ఈ రచయితచే 'కాకతీయ శాసనసాహిత్యము' అను గ్రంథము సంకలనముచేయబడి ఆంధ్ర సారస్వతపరిషత్తు, హైదరాబాదు, వారిచే ప్రచురించబడెను.

విశేష సూచి

1. ఎపి. ఇండికా 28-పుట 281
2. ,, ,, 6 ,, 142....
3. వరంగల్లుజిల్లా శాసనములు పుటలు 203-11
4. పి. వి. పి. శాస్త్రి, కాకతీయ కాయిన్సు అండ్ మెషర్సు-పుటలు 8
5. వరంగల్లు జిల్లా శాసనములు పుటలు 142-9
6. ,, ,, 181-8; 192-9
7. తెలంగాణా శాసనములు 2-పు. 128
8. కార్పస్ ఆఫ్ తెలంగాణా (శాసనసంపుట 2) పు 140-180
9. భారతి-1967, ఏప్రిల్
10. సెలెక్టు ఎపిగ్రాఫ్స్ ఆం.ప్ర, పుటలు 55-60
11. ద. భా. శా. సం. 10, 395 —
12. కరీంనగరజిల్లాశాసన సంపుటి-89-92



ఉదాహరణ పురుషుడు
శ్రీ కపిలవాయి లింగమూర్తి

ప్రథమావిభక్తి

కం. నిరవద్యుడు పరిశోధన
పరమేశ్వరు డనుపముండు ప్రాజ్ఞుడు భాషా
పరశేషుడు సరసుడు బుధ
వరుడు నిడుదవోలు వంశ పావనుడు మహాన్.

మఱియు వేదమువారి పిమ్మట మరల నంతటి పండితుండు
పరగ భాషాసేవయందున పండిపోయిన మండితుండు
రెండు తరముల పండితులకు అండదండన నున్నవాడు
దండి సత్యాగ్రహుని కన్నుల నిండుగా గనుగొన్నవాడు.

కోటు వేసినవాడు కోటి కెక్కినవాడు
గొడుగు బట్టినవాడు గొడవ బట్టనివాడు.

ద్వితీయావిభక్తి

కం. పుంభావ సరస్వతినిన్
సంభావిత బుధుని విపులశబ్దజ్ఞానున్
గంభీర హృదయువాఙ్మయ
కుంభో ద్భవుని న్విశిష్ట కోవిదునెంతున్.

తనదగునెక్కటి తనమున నిల్పినవాని
ఘనుడయి మిక్కిలి కలివిడి పలుకులవాని
పదవినివేరయి చదువున నిలిచినవాని
చదివిన దెప్పుడు మెదడున మెదలెడువాని

ధారణావతారుని – అసా ధారణ మేధావిని
క్షీరనీరన్యాయము తన మేరయైున వానిని

తృతీయావిభక్తి

కం. వేషము చేతన్ మరసం
భాషణ చేతవిచేత పాండిత్య సము
న్మేషము చేసతము సము
ద్భూషింపగ దగినవాడు బుధగణమందున్.

కలముచేతను గళముచేత కపటమెఱుగని బలముచేత
తలచినది తలము నిగితేల్చెడు విలువగలిగిన చలము చేత
తడయుటయు నుడుగుటయులేకను చెడుగు డాడినరీతినేదే
నడిగినను తడుమకను జెప్పెడు అద్భుతంబగు నెఱుక చేత.

నిడుదవోలగుటచే నిడుదపీఠికలచే
ఇంటిపేర్నిలిపినటు వంటిపండితుడు.

చతుర్థివిభక్తి

కం. ఎఱుగని ప్రయోగములకై
యరుగదగినయట్టిదిట్ట – ఆంధ్రంబునకై
బిరుదైనవాడు, తర్జన
ఖైరసబస బడనివాడు కాద్యజ్ఞుడిలన్

తెలుగు కవుల చరిత్రకొఱకై
వెలుగుజూడని దేశికొఱకై
వచనవాఙ్మయ రచనకొఱకై
ప్రచురమందని కృతులకొఱకై

పాఠనిర్ణయాలకై పలుకుబళ్లకోసమై
శ్రాంతిలేని– అశాంతిగొనని శ్రమైకజీవియాతడు.

పంచమీవిభక్తి

కం. హృదయమువలనన్ మఱియును
చదువువలన చేతనైన సాయమువలనన్
పదుగురివలనన్ మన్నన
లొ దవినయభిమానశీలు డున్నతుడుభువిన్.

అసలసలనియెడు ఊతలవలన
అసలు విషయముం జెప్పుటవలన
కాదుసుమండని కరములు ద్రిప్పి
"కరాఖండి"స దెలుపుటవలన

మూర్తిమత్వమువలన స్ఫూర్తినిచ్చుటవలన
కీర్తనీయుండయి వర్తిలినధీరుండు.

షష్ఠీవిభక్తి

కం. బహుముఖ ప్రజ్ఞాశాలికి
బహుభాషా పరిచితునకు భాషావిషయం
బహురహము గాంచువానికి
నహినహి "మన నిడుదవోలు"నకు సాటియిలన్

ప్రయోగమూషక మార్జాలమునకు
జయ వివాదమున శార్దూలమునకు
సాధుగుణమ్ముల కవిపుంగవునకు
గాథలు మేసిన "కతలపిట్టకు"

ఏకసంధాగ్రాహికి– అనేక గ్రంధివిభేధికి
గ్రంథముల్హృత్కవిలిగా– సంధించుకొన్న నిధానికి.

సప్తమివిభక్తి

కం. కావ్య పరిష్కరణంబున
కావ్య విమర్శనమునందు కావ్యరచనలో
కావ్య సమీక్షలయందున
కావ్య డతని సాటినేడు– కనరారుగదా!
తాళీదళసంపుట కాంతారమందు దారులందు
వేళజిక్క యిష్టగోష్ఠి మేళమందు కాలమందు
సదనమందు సభలయందు సర్కారుద్యోగమందు
పదులుదాటు వయసునందు – ప్రతిభమొగ్గు కాలమందు
సాహిత్యం హృదయమందు సడలకుండ నిల్పినవాడు
సాహిత్యారాధనందు సమయమ్ముంగడపినాడు.

సార్వవిభక్తికము

తే. అతడు విద్వత్కవి యతని, నతులితుడని
రతనిచే తెల్గునకుగల్గె నమలకీర్తి
అతనికొఱకు నమస్కార మతనివలన
నందిరెందరొ ప్రేరణ మతనియొక్క
మతివిశేషము, అసలది నతనియందు.

మ.ద్వి. రచయిత, కవి, విమ ర్శకుడు దాహరణ
వాఙ్మయోద్ధర్త, తా బహుగ్రంథకర్త
ఏకసంధాగ్రాహి, లోకవిదుండు
కాయమ్ము దాల్చిన, గ్రంధాలయమ్ము
పరగ పత్రికలకు, చిరపరిచితుడు
జంగమ విజ్ఞాన, సర్వస్వమనుచు
రహినెన్నదగిన, కళాప్రపూర్ణుండు.
అతనికి నీయుదా హరణ కావ్యమ్ము
అంకితమ్మంకితము– అంకితముసుమ్ము

సహగమనం



మధురాంతకం నరేంద్ర

(గత సంచిక తరువాయి)

5

ఫాన్ ఆన్ చేసుకుని, తడివెంట్రుకలు ఆరబెట్టుకుంటూ కూచుంది మానస.

సాగర్ యూనివర్సిటీకీ, కృష్ణమూర్తి ఆఫీసుకూ వెళ్ళిపోయారు.

అన్నపూర్ణ వంటగదిలో వుంది.

వాణిజ్య ప్రసారవిభాగంవాళ్ళ 'జనరంజని' సైతం ముగియడంతో, ట్రాన్సిస్టరు నోరు కట్టేసి చాలా సేపయిపోయింది.

యిల్లంతా నిశ్శబ్దంగావుంది.

గడచిన రాత్రి చాలా సేపటివరకూ మానసకు నిద్రపట్టలేదు. తెల్లవారుజామున, యెప్పుడో అదమరచి నిద్ర పోయింది.

ఉదయం యెనిమిది గంటలు దాటుతున్నా మెలకువ రాలేదు. అన్నపూర్ణ "యిదేం మొద్దునిద్రే నీకు? నిద్రపోయింది చాలుగానీ లే పైకి" అంటూ విసుక్కుంటూ లేపి కూచోబెట్టింది. కూచోవడానికిసైతం వోపిక లేకపోయింది ఆమెకు. మళ్ళీ పడకపైన వాలిపోయింది. వొళ్ళంతా సూదులతో కుచ్చినట్టుగా చికాకు కలుగుతోంది. తలపైన యేదో బరువున్నట్టుగా భారంగా తోచింది. కళ్ళు తిరుగుతున్నాయి. కడుపులో యేదో హడావుడి జరుగుతున్నట్టుగా అనిపిస్తోంది. గట్టిగా కళ్ళు మూసుకొంది. అయిదు నిముషాల తరువాత మళ్ళీ గదిలోకొచ్చిన అన్నపూర్ణ విస్తుపోయింది. పడకపైన కూర్చుని "గంట యెనిమిదన్నరయిపోయింది. ఇంకా పడుకుంటే యెలా చెప్పు? లేచి ముఖం కడుక్కో.... టిఫెను చల్లారిపోతోంది" అంది. మానస బలవంతంగా కళ్ళు తెరచి చూచింది. "అలా వున్నావేమిటి?" కంగారుగా మానస నుదుటిపైన చేయి వేసింది అన్నపూర్ణ. చల్లగానేవుంది యెందుకలా వున్నావు. నీరసంగా వుందా అంటూ ప్రశ్నించింది...."కళ్ళు తిరుగుతున్నట్టుగా వుందమ్మా" అంది మానస...."యెందుకుండదు చెప్పు? రాత్రి అన్నం తిన్నావా నువ్వు? పిలిచి పిలిచీ నా నోరే నొప్పెట్టిపోయింది. తీరావచ్చి కూచున్నాక రెండు మెతుకులయినా తిన్నావా ? లే, లేచి ముఖం కడుక్కో.... కడుపులో యేమీ లేకపోతే అలాగే వుంటుంది. ముందు కొంచెం కాఫీయిస్తాను. తాగేసి ముఖం కడుక్కో టిఫెను తిన్నావంటే వొళ్ళు కొంచెం తేలికబడుతుంది. స్నానం కావాలంటే నిదానంగా చెయ్యొచ్చు...."....వో గ్లాసు కాఫీ తాగినతరువాత బాత్రూంకెళ్ళి ముఖం కడుక్కొంది మానస. డ్రెసింగ్ టేబుల్ దగ్గరికొచ్చి కూర్చొంది. యెలుకలు తొలుస్తున్నట్టుగా కడుపులో బాధ....ఆకలేమో! యిడ్లీప్లేటు ముందుకొచ్చింది. యిడ్లీ యెందుకో చేదుగావుంది రెండు తినగానే దోకొస్తున్నట్టుగా తోచింది. రెండు గ్లాసుల మంచినీళ్ళు తాగి చేతులు కడుక్కొంది. "అప్పుడే లేచావేమిటి?" అన్నపూర్ణ టేబులుదగ్గరికి పరిగెత్తుకొచ్చింది...."యిక తినలేనమ్మా"... తన గదిలోకొచ్చి వాలుకుర్చీలో కూర్చొంది. గ్లాసునిండా గ్లూకోజునీళ్ళు తీసుకొచ్చింది అన్నపూర్ణ — యిదయినా తాగు ... యింతకూ స్నానంచేస్తావా, లేదా?"...."చేస్తాన్లే....హీటర్ ఆన్ చేయి...." ఖాళీగ్లాను తీసుకుని అన్నపూర్ణ వెళ్ళిపోయింది. మానస కళ్ళు మూసుకుంది. అయిదు నిమిషాలు గడిచాయి.... వోపిక చేసుకుని బాత్రూంకెళ్ళింది. యెంత ప్రయత్నించినా మత్తు వదలడంలేదు. చికాకుపడుతూ, నీళ్ళు నెత్తిపైన దిమ్మరించుకుంది. స్నానం చేయగానే, వొళ్ళు కొంచెం తేలికపడినట్టుగా తోచింది. "అదేమిటి?....వొంట్లో నలతగావుందన్నావు. యిప్పుడు తలస్నానం చేశావేమిటి?"....మానస సమాధానం చెప్పలేదు. ఫాన్ ఆన్‌చేసి తలార్చుకుంటూ కూచుంది.

షాంపూ పరిమళం ముకుపుటాల్ని ఘాటుగా స్పృశిస్తోంది.

టర్కీ టవల్ని పడకపైనే పరచి పెట్టి, బ్రష్‌తో చిక్కుతీసుకుని, వదులుగా జడ అల్లుకొంది.

యేం చేయాలో తోచలేదు.

బీరువా తెరచి, పుస్తకాల రాక్‌లోంచీ 'గీతాంజలి' అందుకొంది.

పేంకుర్చీలో కూచుని పేజీలు తిప్పసాగింది.

పుస్తకంలోంచీ ఫోటో వొకటి జారి, వొళ్ళోకి పడింది.

ఫోటోను చేతికి తీసుకొంది.

తన పెళ్ళినాటి ఫోటో.... చిరంజీవీ, తానూ.... కొద్దిరోజుల మునుపటివరకూ టీపాయ్‌పైని ఫోటోఫ్రేమ్‌లో వుండేది.' అపరిచితులను చూస్తున్నట్టుగా, ఫోటోవైపు నిర్వికారంగా చూడసాగింది మానస.

టీపాయ్ వైపుకు చూసింది.

ఖాళీ ఫోటో ఫ్రేం సైతం లేదక్కడ.

'చిరంజీవిని గుర్తుకు తెచ్చే వస్తువుల్ని గదిలోంచీ తొలగించడం కోసం అమ్మ చాలా శ్రమ తీసుకున్నట్టుంది. ఆరునెలల తరువాత మళ్ళీ అదే ఫోటోఫ్రేం

తీసుకొచ్చి పెడుతుందేమో యిక్కడ ! కానీ అప్పుడు, అందులో పాత ఫోటోకు బదులుగా కొత్తఫోటో వొకటి వుంటుందేమో ! అందులో'....

మానసకు హృదయం బరువెక్కినట్టుగా తోచింది.

'తనపైన తనకే అసహ్యం కలుగుతోంది—— మార్గమేదయి తేనేం, సుఖపడడమే ముఖ్యం——అంతేనా? అదే నిజమయితే నీతి, న్యాయం, ప్రేమ, అభిమానం మొదలయిన పదజాలాలని కంతా తనకు తెలియని కొత్త నిర్వచనాలేవో వుండి వుండాలి—— నేను బాధలు పడినా నువ్వుమాత్రం సుఖంగా వుండాలోయ్ ! అందుకే యిలా బిజినెస్ పనుల్తో సతమత మవుతున్నాను. బాగా సంపాదించి నీ కోరికలన్నీ తీర్చేసెయ్యాలి—— అనేవాడు చిరంజీవి. తనను సుఖపెట్టడం కోసమేనా యిలా చేశాడు ! అతడి అస్తిత్వ-మేమైపోయింది ? యెక్కడికెళ్ళిపోయాడు?.... అంతగా ప్రేమించిన వ్యక్తికి ద్రోహం చేయమని అన్నయ్య అంటున్నాడు. అమ్మానాన్నా సైతం అదే న్యాయమని అంటున్నారు.... మొన్నటివరకూ చిరంజీవి తన భర్త ! రేపటినుంచీ.... ? కట్టుకున్న చీరెను విప్పి మరో చీర కట్టుకున్నట్టు ! నిన్నటి వరకూ నమ్మినదంతా మాయని అనుకొని, రేపటినుంచీ కొత్తజీవితాన్ని ప్రారంభించాలి!.... యెంతగా మరచిపోదామన్నా మరువలేని అనుభవాలు ! మరచిపోదామనుకున్న విషయాలనే మళ్ళీ జ్ఞాపకం చేసే కోతిబుద్ధి.... పైకి వొకటి- లోపల యింకొకటి- ఆలోచనల్లో సైతం ద్వంద్వ ప్రవృత్తి....క్షణంక్షణం నటన... ప్రతి క్షణం ఆత్మవంచన....యీ పాత్రను ధరించగల శక్తి తన కెక్కడిది ?....

'గీతాంజలి'ని పక్కన పడేసింది.

అంతూపొంతూలేని ఆలోచనలు ఆమెను చుట్టిపారేస్తున్నాయి.

విసుగ్గా కణతలు నొక్కుకుంది.

టెలిఫోను గొంతు చించుకుంటోంది

హాల్లోనికి నడచి, రిసీవర్ చేతికి తీసుకుంది.

"హల్లో అమ్మా !" సాగర్ కంఠం.

"అమ్మకాదు, నేనన్నయ్యా !" అంది మానస.

"అమ్మవంటింట్లోవుందా ?..."

"అవును, పిలవమంటావా ?...."

"అవసరం లేదు. అమ్మతో వొకమాటచెప్పు...."

"మధ్యాహ్నం లంచ్‌కి నాతో బాటూ వొక ఫ్రెండు వస్తున్నాడు...."

"..........."

"యెవరని అడగవేం ?"

"......."

"రాజేష్ వస్తున్నాడు."

తనను తాను తమాయించుకొని, ఆదుర్దాను కప్పిపుచ్చుకోవాలని విఫల ప్రయత్నం చేస్తూ "అమ్మతో చెబుతాను" అంది.

"అశోకవనంలో సీత పోజును కొంచెం కట్టిపెట్టి, హుందాగా కనిపించాలి • నువ్వు...."

మానస చికాకు పడిపోయింది "అంతేనా" యిక వుంటాను."

"అలాగే, మధ్యాహ్నం వొంటిగంటకంతా అక్కడుంటాము...."

రిసీవర్ని వుంచేసి, వంటగదిలోకి వెళ్ళితల్లికి వర్తమానాన్ని చేరవేసింది.

"ఫ్రెండంటే యెవరూ, రాజేషేనా" అంటూ అడిగింది ఆమె.

మౌనంగా వెనక్కొచ్చేసింది.

'అంతా ప్రిప్లాన్....' మానస మళ్ళీ వోసారి తనను తాను అసహ్యించుకొంది.... 'అందరూ కలసి తన-జీవితంపైన ఎక్స్‌పెర్మెంట్ చేసి పారేస్తున్నారు. లాబొరేటరీలో యెలుకపిల్ల....గినియాపిగ్....జీవితమయితే తనది గానీ, దానిపైన నిర్ణయాలు మాత్రం తనవిగావు. అమ్మా, నాన్నా, అన్నయ్యా, ప్రపంచమూ- అందరూ తనపైన అధికారాన్ని చలాయించే వారే ! కానొక మనిషి....ఆలోచించగలశక్తి వుండీ, అసహాయురాలై పోతున్న నిశ్చేష్టపుజన్మ....చిరంజీవిని పెళ్ళి చేసుకో....యిప్పుడిప్పుడే వొద్దు, నేను చదువుకోవాలి....లాభం లేదు. అది అణ్ణ.. రాజేష్‌ను పెళ్లాడు-అడ్డు చెప్పడానికి తన గొంతు పెగలదేం ?- నీమంచికోరే 'చేతు
తున్నాము. అప్పుడే స్వంత నిర్ణయాలు తీసుకునే శక్తి వచ్చిందానీకు ?- రాలేదా మరి ? యెప్పటి కొస్తుంది !....తన జీవితం తన అదుపులో లేదు. తన బ్రతుకు పైన తనకే అధికారమూ లేదు...."

దిన పత్రికను అందుకుని అడ్వర్‌టైజ్ మెంట్లు చూడసాగింది. మట్టిరంగు కాగితంపైన అలుక్కుపోయినట్టున్న ప్రింటింగు....రకరకాల దుస్తుల్లో యువతీ యువకులు....అపాయింట్ మెంట్స్ కాలాన్ని వెక్కిరిస్తున్న టెండర్ నోటీసులు. పేపరు విసిరిపారేసి కళ్లుమూసుకుంది.

అరగంటసేపు గడచింది.

యింటిముందు అడుగులసవ్వడి వినిపించింది.

'గంట యింకా పన్నెండయినా కాలేదు. అప్పుడే నాన్న ఆఫీసునుంచీ



వచ్చేశాడా? నాన్న గాకపోతే మరెవరు?....'

చంద్రమౌళీ, సరోజమ్మా...

ఆమె చేతిలో పళ్ళబుట్ట....

వాకింగ్‌స్టిక్ టకటకలాడించుకుంటూ అతనూ....

కంగారుపడుతూ లేచి నిల్చొంది మానస.

"పర్వాలేదు కూర్చోమ్మా!" సోఫాలో కూచుంటూ అన్నాడు చంద్రమౌళి

ఆయన కంఠంలో ధ్వనించిన విషాదపు తాకిడికి మానస చలించిపోయింది. తల పైకెత్తి చూసింది.

గడచిన కొద్ది రోజుల్లో దంపతులిద్దరూ సగమైపోయారు. కళ్ళల్లోమాత్రం ప్రాణాలు గాలిలోని దీపాల్లా కొట్టుకులాడుతున్నాయి.

"అమ్మ వంటగదిలో వుందమ్మా!" సరోజమ్మ కోడలి పక్కకొచ్చికూచుని, వీపుపైన లాలనగా చేయివేసింది.

మానస తలాడించింది.

"బాగా చిక్కిపోయావమ్మా" అన్నాడు చంద్రమౌళి.

"మీరు మాత్రం ...?" మానస వాక్యాన్ని పూర్తిచేయలేక పోయింది.

"మాదేముందమ్మా యీ జీవితంలో యింకా అనుభవించవలసిందేం మిగిలిందని? నువ్వింకా చిన్నదానివి, యీ వయసుకే యిన్ని బాధలు పడవలసి వస్తోంది. హూ!" అని నిట్టూర్పులో యెన్ని విషాదపు తుఫానులో!

సరోజమ్మలేచి వంటగదిలోపలికెళ్ళింది.

"మీ అన్నయ్య....మొన్న....యింటికొచ్చాడు ? అతి ప్రయత్నంమీద మాటలు కూడబలుక్కుంటూ చెబుతున్నాడాయన. "అంతా చెప్పాడు. మొదట... మేమిద్దరమూ చాలా బాధపడిపోయామనుకో! కానీ...ఆలోచించిన తరువాత అర్థమయింది....మంచి నిర్ణయమే తీసుకున్నాడని...."

"మీరు చెబుతున్నది - " మానస గ్రుక్కిళ్ళు మింగసాగింది.

"మీ అన్నయ్య తీసుకున్న నిర్ణయం గురించే! నువ్వింకా చిన్నదానివి.... పెండ్లి మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది . వాడికి లోకంతో ఋణం తీరి పోయింది. వుండి మమ్మల్ని పంపించవలసినవాడు—మాచేతులమీదుగా వెళ్ళి పోయాడు. యేడిస్తేనూ, ఆక్రోశిస్తేనూ వొరిగేదేమీలేదు....నీజీవితం మోడుగా ఎందుకు మిగలాలి? మీ అన్నయ్య చాలా మంచినిర్ణయం తీసుకున్నాడు....అసలు అప్రిసియేట్ చేయాల్సింది ఆ అబ్బాయిని....ఆ అబ్బాయి పేరేమిటీ? యేదో చెప్పాడు సాగర్..."

మానసకు మూళ్ళపయిన కూచున్నట్టుగావుంది. యేడుపు పొంగుకొచ్చింది. "నేను....నేను..." మాట్లాడలేక పోయింది.

"నువ్వేమీ తప్పుచేయడం లేదులేమ్మా ! బాధపడొద్దు నువ్వు.. మీ అత్తయ్య రాద్ధాంతం చేస్తుందేమోనని మొదట భయపడ్డాను. కానీ....నీకింత అన్యాయం జరిగి పోయింది గదా అని హృదయవిదారకంగా యేడ్చిందారోజున.... మేము కోపం తెచ్చుకున్నామని నువ్వనుకుంటావేమోనని భయపడి....మేమేమీ కోప్పడడం లేదని చెప్పడాని కొచ్చాము. నీ జీవితం నాశనం కావడం మాకుమాత్రం యిష్టమా యేమయినానా ? మాకసలు కొడుకు పుట్టలేదనుకుంటాము....అనుకోవాలి....అను కోకతప్పుతుందా చెప్పు ! నవ్వే మాకూతురి వనుకుంటాము....మళ్ళీ నువ్వు కళకళ లాడుతూ తిరుగుతుంటేగానీ మాకు హాయిగా వుండదు. పైగా యీ పెండ్లి జరిగితే వాడి ఆత్మకు కూడా శాంతి కలుగుతుందనిపిస్తోంది. వాడిమనస్తత్వం నాకు తెలుసు. వొక జీవితం నాశనం కావడం వాడు భరించలేడు...."

యెంత ప్రయత్నించినా ఆయన తన బాధని దాచుకోలేకపోతున్నాడు. విషాదపుజీర అతడి మనఃక్లేశాన్ని స్పష్టంగా తెలుపుతూనేవుంది.

"నేనింకా యిందుకు వొప్పుకోలేదండీ...." పొంగుకొచ్చిన యేడుపుమధ్య మానస మాటలు ముద్దముద్దగా వినిపించాయి.

చంద్రమౌళి కళ్ళల్లోంచి రెండు కన్నీటి బొట్లు కిందికి రాలాయి. లేచి, మానస దగ్గరికొచ్చినిలబడి, ఆమె తలపైన ఆప్యాయంగా చేయివేసి, "యేడవొద్దు ....యికపైన నువ్వు యేడవగూడదు. మనమంతా శాపగ్రస్తులమేమో....లేకపోతే, యీ వయసులో మాకీ కష్టమెందుకొచ్చింది చెప్పు ! నీకు మాత్రం—యేంతప్పు చేశావని నీకీశిక్ష....వొద్దుమానసా ! మరచిపో....కొత్తజీవితాన్ని మొదలుపెట్టు.... మేమిలా మళ్ళీమళ్ళీ నీకు కనిపించి పాత-విషయాల్ని జ్ఞాపకం చేసి బాధపెట్టాలని అనుకోవడం లేదు. కానీ యిప్పుడు రాక తప్పలేదు...." అన్నాడు.

వంటగదిలోంచి అన్నపూర్ణ, సరోజమ్మ వొచ్చినిలుచున్నారు.

యెవరికి వారు, యేదో వొకటి మాట్లాడాలని ప్రయత్నించారు. యెవరికీ నోరు పెగలలేదు.


కాస్సేపు యెవరూ మాట్లాడలేకపోయారు.

సరోజమ్మ తనలో తాను గొణుక్కుంటున్నట్టుగా చెప్ప నారంభించింది "వొక్కొక్కప్పుడు యిదంతా కేవలం భ్రమ మాత్రమే-నేమో ననిపిస్తుంది. వంట గదిలో పనిచేసుకుంటూ వున్నప్పుడు, కాలింగ్‌బెల్ మ్రోగుతుందేమోనని, చిరంజీవి యింటిలోపలికొచ్చి 'ఆకలేస్తుంది, అన్నం పెట్టమని అడుగుతాడేమో'నని అని పిస్తుంది. ఆ యింట్లో ప్రతివస్తువూ, ప్రతిచోటూ వాడినే జ్ఞాపకం చేస్తున్నాయి. నా కడుపులో పుట్టిన బిడ్డ....నా చేతుల్లో పెరిగినవాడు...యిక కళ్ళకు కనిపించ డని అనుకోవడమే దుర్భరంగావుంది...." ఆమెదీర్ఘంగా నిట్టూర్పువిడిచింది.... "వాడి జ్ఞాపకంగా నువ్వయినా యింట్లోవుంటావని అనుకున్నాను. స్వార్థమేననుకో! కానీ....పోనీలే! నువ్వయినా సుఖపడితే అంతకంటే కావల్సింది మరేముంటుంది. మాకు !... లేకపోతే...వొక టేకొరత.. నువ్వయినా కళ్ళముందుంటా వనుకుంటే.... యెప్పుడయినా చూడాలనుకున్నప్పుడు వచ్చిపోతూ వుంటాను...ఆయింట్లో యిక నవ్వుతూ తిరిగే మనిషి కనిపించదేమో !...."

మానస బోరున యేడ్చేసింది. "నేనూ వచ్చేస్తానక్కడికి....నాకీ పెళ్ళొద్దు...నేను....నేను....యీపని చేయలేన్నేను...."వెక్కిళ్ళమధ్య మాటలు స్పష్టంగా పలకడంలేదు.

సరోజమ్మ కోడలి ప్రక్కకెళ్ళి కూర్చొంది. మానస ఆమె వొళ్ళోకి సోలి పోయింది. "నీకు వాడంటే యెంత యిష్టమో నాకు తెలుసు మానసా! కానీ... మొదట్లో యిబ్బందిగావుంటే వుండొచ్చు. కానీ యీ ఆరేడు నెలల నేరానికి జీవితమంతా శిక్షెందుకు అనుభవించాలి నువ్వు? చదువుకున్నదానివి...కష్టాలకూ నష్టాలకూ తట్టుకోవడం నేర్చుకోవాలి. కన్నతల్లిని... నేనే గుండె దిటవు చేసు కున్నాను. మేమే చెబుతున్నాముగదా! నువ్వేమీ మనస్సుకు కష్టం పెట్టుకోవద్దు... ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షిస్తూనే వున్నాయి. అయినా వొక మంచిపని చేస్తున్నాన్న భావన ఆమెకు బాహాటంగా నిలబడింది. చెప్పదలచుకున్న విషయాన్ని వ్యక్తం చేయడంలో ఆమె సఫలీకృతురాలయింది.

"మనమొచ్చి యిప్పుడిప్పుడే వూరటపడుతున్న అమ్మాయిని మళ్ళీ కదిలించినట్టున్నాము." అన్నాడు చంద్రమౌళి. "యిక మేము వెళ్తామమ్మా... ! అవతల ముంచుకుపోయే పనులేవీ లేవనుకో! కానీ...వెళ్ళాలి. యెప్పుడయినా



మమ్మల్ని చూడాలనుకుంటే... నీవెప్పుడయినా, యెలాటి స్థితిలోనయినా.... నువ్వక్కడికి రావచ్చునమ్మా! యీ విషయంలో సందేహాలు పెట్టుకోవద్దు నువ్వు... యిప్పటినుంచీ నీకు రెండు పుట్టిళ్ళున్నాయని అనుకో... సరేనా ... ?''

''వొక నిముషం అన్నయ్యగారూ! కాఫీ అయినా పట్టుకొస్తాను...'' అంది అన్నపూర్ణ.

అతను మౌనంగా వుండిపోయాడు.

అన్నపూర్ణ వంటింటిలోకి వెళ్ళిపోయింది.

మానస సరోజమ్మ వొడిలోనే పడుకుని కళ్ళు మూసుకుంది.

కాస్సేపు ఆ గదిలో గడియారపు టిక టకలూ, మానస వుచ్ఛ్వాస నిశ్వాసాల శబ్దాలూ, సరోజమ్మ ముక్కు చీదుకుంటున్న సవ్వడీ, తప్ప మరో అలికిడి వినిపించలేదు.

''పరవాలేదులే రాజూ! వో అరగంట ముందుగా వచ్చినంత మాత్రాన మా యింట్లోవాళ్ళు మరోలా అనుకోరులే! రా లోపలికి...'' అంటూ హాలులోపలి కొచ్చిన సాగర్, అతిధుల్ని చూడగానే ఆశ్చర్యపడిపోయి, అలాగే నిల్చుండి పోయాడు. వొకటి రెండు నిముషాల తరువాత తేరుకుని ''నమస్తే! మీరెప్పుడొచ్చారండీ'' అంటూ నవ్వుతూ పలకరించడానికి ప్రయత్నించాడు,

''వో అరగంటయింది'' అన్నారు చంద్రమౌళి.

''యితనేనండీ.... రాజేష్... మీకు చెప్పానుగదా!'' రాజేష్ చేయి పట్టుకుని ముందుకు లాగాడు.

రాజేష్ నమస్కరించాడు.

''నమస్తే ! నువ్వేనన్నమాట రాజేష్.... రానాయనా ! యిలా కూర్చో....'' సోఫాలో వొకవైపుగా జరిగి కూచున్నాడు చంద్రమౌళి.

మానస అత్తగారి వొళ్లోంచిపైకి లేచి, సర్దుకుని కూచొంది. లోపలికి వెళ్లాలో, లేక కూచునే వుండాలో తోచక కాస్సేపు తర్జన భర్జనలు పడి, వెళ్లిపోవడానికే నిశ్చయించుకుని పైకిలేచింది.

''పరవాలేదులే కూచోమనూ ! రావోయ్ రాజూ !'' అంటూ కుర్చీలోకొచ్చి కూచున్నాడు సాగర్.

రాజేష్ సోఫాలో కూర్చున్నాడు.

మానస తలవొంచుకుని కూర్చొంది.

అన్నపూర్ణ కాఫీట్రే తీసుకొచ్చింది.

''మాక్కూడా వొకరవుండు కాఫీలు కావాలమ్మా. వో అరగంట తరువాత భోంచేస్తాం....'' అన్నాడు సాగర్.

''నాకొద్దమ్మా ! యెందుకో ఆదోలావుంది....'' అంది మానస,

''ఆదోలా అంటే యెలా ? వూరికే ఆలోచిస్తూకూచునివుంటావు. కాఫీ తాగు, ఆదే తగ్గిపోతుంది....'' సాగర్ కసురుకున్నాడు.

''ముఖమంతా పీల్చుకుపోయింది. కొంచెం కాఫీ తాగమ్మా.... తేలికబడుతుంది.....'' అంది సరోజమ్మ.

మానస తనకప్పనందుకుని టీపాయ్‌పైన వుంచింది.


అన్నపూర్ణ వంటగదిలోంచి మరో రెండు కప్పుల కాఫీ తీసుకొచ్చి, సాగర్‌కూ రాజేష్‌కూ అందించింది.

అరకప్పు కాఫీని బలవంతంగా మింగి, మిగిలిన కప్పును అలాగే వుంచేసింది మానస. కడుపంతా తిప్పుతున్నట్టుగా వుంది. నోరంతా చేదుగా, వికారంగా తోచింది. సోఫాకు ఆనుకొని కళ్లుమూసుకొంది.

''యేం చేస్తున్నావునాయనా నువ్వు ?'' అంటూ ప్రశ్నించాడు చంద్రమౌళి.

''పిడబ్ల్యూడిలో అసిస్టెంటు యింజనీర్నండీ.. వోసారి నేనూ సాగర్ మీయింటి కొచ్చాము. మీరు మరచిపోయివుంటారు'' అన్నాడు రాజేష్.

''నాకు జ్ఞాపకంలేదు.... మీ అమ్మానాన్నా....''



''నాన్నగారు రిటయిరయిపోయారండీ.... ఆయన లెక్చరర్‌గా పనిచేసేవారు. అన్నయ్య బ్యాంకు మేనేజరు.... ప్రస్తుతం అమ్మానాన్నా అన్నయ్య దగ్గరే వుంటున్నారు....''

మానస కూర్చోలేకపోతోంది.

వొళ్లంతా తోటకూరకాడలా తూలిపోతోంది.

అరిచేతుల్లోసైతం చెమట పోస్తోంది.

మీ నాన్నగారికి... మీ అమ్మా నాన్నా... వాళ్ళకీవిషయం తెలుసా?'' చంద్రమౌళి సందేహిస్తూనే అడిగాడు.

''యింకా చెప్పలేదండి ...కానీ....వాళ్లు అభ్యంతరం చెబుతారని అనుకోను....వొకవేళ చెప్పినా, నచ్చచెప్పగలనన్న ధైర్యం నాకుంది,

మానసకు గొంతుకలో గరళం యిరుక్కున్నట్టుగా అనిపిస్తోంది. తూలుతూ తూలుతూ, లేచి వంటగదిలోకి నడచింది.

''యేమిటే అమ్మాయ్....?'' అన్నపూర్ణ కంగారుపడుతూ వెనకే పరుగెట్టింది.

''యేమయ్యిందమ్మా...?'' ముఖం చిట్లించుకుని, గది లోపలికొచ్చాడు సాగర్.

''నిన్నటినుంచీ యిది మూడోసారి డోక్కోవడం.... అప్పుడు రెండిడ్లీలు, యిప్పుడు అరకప్పు కాఫీ... తిన్నది అంతే! యివ్వాడు కడుపులో యేమీలేదు. తిండీ, నిద్రా సక్రమంగా సమయానికి తిని రెండు నెలలవుతోందికదా! యెప్పుడు పిలిచినా ఆకలి లేదంటుంది. వొళ్ళో పసిరిక లెక్కువగావుంది. నిన్నటినుంచీ అనుమానంగావుంది నాకు ....చూడు వొళ్ళంతా యెలా చెమటలు పోస్తున్నాయో!''

''చంద్రమౌళీ, సరోజమ్మా గదిలోకొచ్చి చూస్తూ నిల్చున్నారు.

''మరేం పరవాలేదులెండి....జాండిస్సేమోనని అమ్మ అనుమానం. యెందుకయినా మంచిది, డాక్టర్ని రమ్మని ఫోన్ చేస్తాను....'' అంటూ సాగర్ హాల్లో కొచ్చేశాడు. ఫోన్ చేసిన తరువాత రాజేష్‌వైపుకు తిరిగి ''అమ్మకు అన్నీపిచ్చి సందేహాలే! సందేహాల్ని తీరిస్తేగానీ ఆమెకు నిలకడుండదు. అందుకే ఫోన్‌చేశాను.

డాక్టర్ సుందరవల్లి....ప్రశాంతి నర్సింగ్‌హోం డాక్టరు....యిప్పుడే బయల్దేరుతున్నానన్నారావిడ'' అన్నాడు.

టీపాయ్‌పైనుంచి యిలస్ట్రేటెడ్ వీక్లీ నందుకుని బొమ్మలు తిరగేయసాగాడు రాజేష్.

సాగర్ మళ్ళీ లోపలికెళ్ళి పోయాడు.

అయిదు నిముషాల తరువాత తిరిగొచ్చి ''మేడపైకెళ్ళి కూచుందామా? అక్కడయితే హాయిగా వుంటుంది. నా పుస్తకాలొకసారి నొకసారి గాలించే వీలుంటుంది నీకు.... ' అంటూ రాజేష్‌ను పరామర్శించాడు.

"ఫర్వాలేదులే సాగర్....డాక్టరుగారొస్తున్నారుగదా! యిక్కడే వైట్ చేస్తాను" అన్నాడు రాజేష్.

డాక్టరు యింటికి రావడానికి మరో పదిహేను నిముషాలు పట్టింది.

గదిలోంచి అందర్నీ బయటికి పంపి, పరీక్ష చేయసాగింది డాక్టరు.

ఆమె వెలుపలికి రాగానే "అమ్మ జాండిస్సేమోనని అనుకుంటోంది డాక్టర్! యీజిట్ ట్రూ ?" అంటూ ఆమెను ప్రశ్నించాడు సాగర్.

"మీరోసారి అలారండి...." అ ది డాక్టర్ సుందరవల్లి.

"యింకా చిన్నపిల్ల గదండి ! యేవేవో ఆలోచిస్తూ కూచుని సమయానికి భోజనం చేయడం లేదు. వారాలతరబడి యిలా చేస్తే యేమవుతుంది చెప్పండి ? రెండుసార్లు వామిటయింది. అందుకని...."

"సాగర్.... " డాక్టర్ అడ్డు తగిలింది. ఆమె కనుబొమలు ముడిపడ్డాయి నుదుటిపైని చెమట బిందువుల్ని తుడుచుకుంటూ "ఆమెకు జాండిస్ అటాక్ గాలేదు" అంది.

"థాంక్ గాడ్ !.... అలాంటిదేమీ లేదని నాకు తెలుసునండీ! కానీ సందేహం తీరినట్టవుతుందని మిమ్మల్ని రమ్మన్నాను...."

"కానీ సాగర్...."

"మీకు చాలా శ్రమిచ్చాను...."

"వైయ్యార్యూ యిన్ సచ్యే హర్రీ...." ఆమె విసుక్కుంది. "చెప్పేది వినిపించుకోవెందుకు ? నౌ షీ యీజ్ ప్రెగ్నెంట్.... నేను అడిగేవరకూ ఆమెకు సైతం యీ సందేహం రాలేదు. ఆయ్ థింక్ దిస్ యీజ్ థర్డ్‌మన్తు. యిది మూడో నెలయివుండొచ్చు...."

6

'ఆలోచన- అనే వరం మానవుడి కొక్కడికి మాత్రమే లభించింది. యెవరా మాట అన్నది ? జీవితమంటే వేదికలెక్కి వుపన్యాసాలు దంచడం కాదు. చేతికో కలమూ కాగితమూ దొరికాయి గదా అని ఆదర్శాలు కుప్పించడంగాదు. జీవిత మొక పరీక్ష. ఆలోచనా సర్పదష్టులపాలిట మృత్యుపానుపు. ఆలోచన వరం కాదు, అది శాపం. మానవుడనే అమాయిక ప్రాణిని నిరంతరం వేటాడే క్రూరమృగం - ఆలోచన ప్రతి క్షణం నేనున్నానంటూ ప్రత్యక్షమయ్యే నక్షత్రకుడి అవతారం - ఆలోచన మనిషి వొంటరిగా దొరికితేచాలు, తోడుగా నేనున్నానంటూ భుజంపైన చేయివేసి, వూబిలోకి లాక్కెళ్ళిపోయే నయవంచకురాలు - ఆలోచన. డామ్నది థింకింగ్.... డ్రైవ్ దిస్ అఫ్...."

రాజేష్ ఆఫీసునుంచి వొక ఫర్లాంగు దూరమయినా రాలేదు. గదికెళ్ళడానికి యింకా రెండుమూడు మైళ్ళు వెళ్ళాలి. మోటార్ బైకును స్లో చేసి, హేండ్లూ యెగ్జిబిషన్ వైపుకు మళ్ళించాడు.

యెగ్జిబిషన్ గ్రౌండుకు ముందు ట్రాఫిక్ జామ్.... తొందరగా లోపలికి వెళ్లడం కోసం తొక్కిసలాట....పార్కింగ్ ప్లేస్‌లో రకరకాల వాహనాలు.... యిక్కడ జరుగుతున్నది కొంపదీసి మోటర్‌వాహనాల యెగ్జిబిషన్ కాదుగదా !.... ముసలివాళ్లు, నడివయసు సంసారులు, యువదంపతులు,కాలేజీకుర్రాళ్లు, కుర్రాళ్లు.... యెటు చూసినా జనం....

మోటర్ బైకును పార్కుచేసి లోపలికి నడిచాడు. మానవ సాగరాని కొచ్చిన తుఫానులో, విసురుగా ముందుకురుకుతున్న వో కెరటపు తాకిడికి విరుచుకు పడుతూ కదులుతున్నాడు.

"యేయ్ ! యెవరది ?.... కళ్లు కనిపించడం లేదా ? యెందుకలా ముందుకు తోస్తావ్ ?.... చెబుతుంటే వినిపించుకోవేమిటి ?...."

హోరులో అతడి గొంతుక అతడికిసైతం వినిపించడంలేదు.

'యెందుకింత సంరంభం ? యెందుకింత ఆరాటం ? యిదిగో వోల్డుమాన్, యిందుకంత తొందర? నీ వాకింగ్ స్టిక్ జాగ్రత్త! యేం కొంటావయ్యా యిక్కడ ఆర్యూకమింగ్‌టూపర్చేజ్ యేథ్రవుడ్ ఫర్ యూ....యిదిగో పంజాబీ, పిల్లా ? ఆ షర్వాణీ కాస్తా కిందికి లాక్కో, యిది నీ అందానికి యేర్పాటు చేసిన ఫాషన్! పరేడ్ కాదు....యిదిగో లిటిల్ యేంజిల్....జాగ్రత్త ! తప్పిపోయిన వాళ్లకోసం అనౌన్సుమెంటు వింటూనే వున్నావు కదా ! మళ్లీ యెందుకలా మీ అమ్మానాన్నల్ని వదలిపెట్టి పరిగెడ్తావు ? హాయ్, అమ్మాయ్ ; యిక్కడికొచ్చింది యెగ్జిబిషన్ చూడ్డానికి -అంతేగానీ, నీ ప్రియుడి భుజంపైన వాలిపోయి సరాగాలు పోవడానికి కాదు. యిది బెడ్రూమని అనుకుంటున్నారా మీరు ? చుట్టూ యిందరం చూస్తూనే వున్నాము, కనిపించడం లేదా మీకు? హలో అబ్బాయ్ ఆ కోతిముఖంలో యేముందని అలా చూస్తూ పరవశించి పోతున్నావు ? నీకే గనుక మానసలాంటి పిల్లదొరికితే యిక....మానస.... యెంత అందమైన అమ్మాయి ! యేదీ యిక్కడ యింతమంది గుమికూడారుగదా, వొక్కరయినా అంత బావున్నారా ? ....లేదు....మానసే మానస....తేడా దృష్టిలోనేగానీ, సృష్టిలో లేదని తప్పించు కోవాలనుకుంటున్నారేమో ! నే నొప్పుకోను....లోపం మీదృష్టిలోనే వుంది....యేయ్ బాబూ ! మీ అమ్మచేయిపట్టుకో యెందుకలా పరిగెడతావు నువ్వు ?....మానస....మానసను సైతం....మళ్లీ అవే ఆలోచనలు .... మనిషి నీకు సుఖంలేదు....నీ బ్రతుకింతే?.."

రాజేష్ వో షెంటులోకి దూరేశాడు.

రంగురంగుల బట్టల చుట్టూ రకరకాల - మనుషులు....

యెక్కడాస్థలం కనిపించడం లేదు....

వో చివర్లో, పొరబాటున వొక కౌంటరు ఖాళీగామిగిలిపోయి కనిపించింది.

వెళ్ళి నిల్చున్నాడు.

"లాల్చీ, పైజామా....సెవన్టీ రుపీస్‌సార్....ట్వంటీ పర్సెంట్ రిబేట్...."

"చూపెట్టండి...."

"దీస్ ఆర్ మేడ్ యిన్ రాజస్థాన్ సార్! నైస్ వెరయిటీ....నియర్లీఫిఫ్టీ పర్సెంట్ ఆర్ సోల్డ్ అవుట్.. "

తల పైకెత్తి చూశాడు....ఎర్రటి ఛాయ....వొత్తయిన వెంట్రుకలు.... తెలుగువాడై వుండడు.

"గివ్‌మీ వనపెయిర్...."

చక చకా కవర్లో సర్ది, బిల్లు తయారు చేశాడతను. యంత్రంలా కదులుతున్న అతడి వ్రేళ్ళవైపే ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు.

"హావ్యూ సీన్ ది రాజస్థాని సారీస్ సార్! డోన్ట్‌మిస్‌దెమ్....యువర్ వైదర్ హాఫ్ విల్‌బీ ప్లీజ్‌డ్...."

"అయామ్ యే బాచిలర్ యూసీ...." అడ్డు తగిలాడు.

వో క్షణం సేపు రాజేష్‌వైపు చూసి, అదోలా నవ్వి, ముందుకు కదిలాడు అతను.

'బాచిలర్ అయితే మాత్రం? మానసకోసం వొక చీర యెందుకు కొనకూడదు తాను? చీరలకే అందం మానస....మానసకోసం వొక బహుమతి....'

"దీస్ ఆర్ ది చిల్డరన్స్ గార్మెంట్స్...." యెవరో అరుస్తున్నారు.

మానసకయితే చీర కొంటున్నాడు....మరి....? వీల్లేదు....తనచేతగాదు.... తాను భరించలేడు....ఛీ.... గాలయినా రావడంలేదిక్కడ....వొళ్ళంతా చెమటలు పోస్తున్నాయి. బయటికెళ్ళి పోవాలి....యేమిటీ, వన్ రుపీ చేంజ్‌కావాలా, లేకపోతేపోనీలే, పాకెట్టిలాయివ్వు...'

షెంటు బయటకొచ్చి, వెనుదిరిగి చూడకుండా బయటికొచ్చేశాడు. వాహనాలమధ్య తన మోటారు బైకును పసిగట్టి, బయటికి తీయడానికి పదిహేను నిముషాలు పట్టింది. అడ్డంవచ్చిన వ్యక్తినల్లా మనసులోనే తిట్టుకుంటూ మోటారు బైకును రోడ్డుపైకి లాక్కొచ్చాడు.

కిక్కర్‌పై బూటుకాలు విసుగ్గాపడింది

వాహనం కదిలింది.

'వొంటరితనం దుర్లభం....మనుష్యులమధ్య నరకం....నీడలా మధన... యెందుకిలా సతమతమై పోతున్నాడు తాను? యిప్పుడేం జరిగిందని? యింతా తాను యేవూబిలోనూ దిగబడి పోలేదుగదా....! మరి యెందుకిలా బాధపడాలి...? యింతకూ తానిప్పుడేంచేయాలి? తాను సుఖపడటంకోసం తానేం చేయాలి...?

రుద్రభూమిలా

వర్తమానం
నానా రకాల అంటురోగాలుతాకి

ఈ గల్లీ తోలుతూ
మంచంపై మూల్గుతున్న వ్యాధిగ్రస్తలా ఉంది
వర్తమానం
ఛిన్నహింసాప్రవృత్తుల కత్తిపోట్లకుగురై
గాయాలతో

దుఃఖిస్తున్న క్షతగాత్రలా ఉంది
వర్తమానం
రాక్షస దౌష్ట్యకామప్రకోపనకుబలై
శీలం కోల్పోతున్న కులకాంతలా ఉంది
వర్తమానం
దళారీల సేవలో సర్వస్వం కోల్పోయి
అస్తిపంజరమై
చావుకెదురుచూస్తున్న శ్రమజీవిలా ఉంది
వర్తమానం

ఎవడి ఆలోచన అరువుతెచ్చుకొని
తన ఇంటికే నిప్పంటించి
పగలబడి నవ్వుకుంటున్న అజ్ఞానంలా ఉంది

వర్తమానం
సాటిమనిషిపై ద్వేషంకక్కి
సౌజన్యానికి సమాధికట్టి
ఘోరమారణకాండ కొడిగట్టి
రక్తం తాగుతున్న ఉన్మాదంలా ఉంది

వర్తమానం భీభత్సంలా
వర్తమానం విషాదంలా
వర్తమానం కాలనేమిలా
వర్తమానం రుద్రభూమిలా
అబ్బా!
వర్తమానం
ఈ
వర్తమానం!!

తిరునగరి

యేది తనకిష్టం....తనకు తానే వొక 'పజిల్'గా తయారయిపోతున్నాడు... తనకు కావలసిందేమిటి... ? యింతకూ తననిప్పుడు వేధిస్తున్న సమస్యయేమిటి....? అంతా అస్పష్టంగా కనిపిస్తోందెందుకు ....'

మోటారు బైకును కాస్సేపు స్లో చేసి, సిగరెట్టు వెలిగించుకున్నాడు.

ధ్యాసను సిగరెట్టు రుచిని ఆస్వాదించడం వైపుకు మరల్చడానికి ప్రయత్నించాడు.

ప్రొద్దుటినుంచీ చాలా సిగరెట్లే తగలేసినట్టున్నాడు, నోరంతా చేదుగా వుంది. సిగరెట్టు సయితం వెగటుగా తోస్తోంది.

వేడివేడి నిట్టూర్పులు వదులుతూ మోటార్‌బైకు గదిముందు ఆగింది.

స్టాండు లాగుతూ, గదివైపుకు తిరిగిన అతడు కాస్సేపు అలాగే ఆగిపోయాడు.

గది తలుపులు తెరచివున్నాయి.

డూప్లికేటు తాళం చెవి సహాయంతో, గదిలోకి వెళ్ళగలిగిన యేకైక వ్యక్తి యెవరో అతనూహించుకోగలిగాడు.

కంగారుగా సిగరెట్టు పీకను విసిరిపారేసి, గదిలోకి తొంగి చూశాడు.

గొంతు సవరించుకుని,"యెప్పుడొచ్చావన్నయ్యా?" అంటూ పలకరించాడు.

వాలుకుర్చీలో కూర్చున్న మురళి 'ఫైనాన్స్ రిపోర్టు'లోంచి తలపైకెత్తాడు. పత్రికను ముడిచిపెడుతూ, "మీ ఆఫీసులో నీచేత వోవర్‌టైం మాత్రమేగాకుండా నైట్‌డ్యూటీ కూడా చేయిస్తున్నారన్నమాట!" అన్నాడు.

రాజేష్ మంచంపైన కూర్చుని, ముద్దాయిలా తల వంచుకున్నాడు– "అంటే, నిన్ననే వచ్చావా నువ్వు?...."

"నిన్న సాయంత్రాలం నాలుగింటికి...."

"డ్యాం సర్వేకోసం వెళ్ళాను. రెండు మూడు రోజులుగా తీరికలేదు. నిన్న అక్కడే యేడ్చుపోయింది. యిక మళ్ళీ సిటీకొచ్చే వోపిక లేక, గెస్టుహౌస్‌లోనే పడుకున్నాను. యీరోజు మధ్యాహ్నానికిగానీ పని పూర్తికాలేదు. ఆఫీసుకెళ్ళి, ఫైల్లు సబ్మిట్ చేసి, నేరుగా గదికే వస్తున్నాను...." కాస్సేపు ఆగి, మళ్ళీ చెప్పసాగాడు— "నువ్వు వస్తున్నావని నాకు తెలియదుగదా! నువ్వు ఉత్తరం గూడా రాయలేదు...."

మురళి మాట్లాడలేదు.

"అమ్మా నాన్నా బావున్నారా?.... వదినా, పిల్లలూ "

మురళి తల వూపాడు.

యేదో వొకటి మాట్లాడడంకోసం కాస్సేపు మాటల్ని వెతుక్కుని, "వచ్చిన పని పూర్తయిందా?" అంటూ రాజేష్ మళ్ళీ తానే ప్రశ్నించాడు.

"యేపని?" తమ్ముడివైపు చురుక్కుమనిపించే చూపుల్ని ప్రసారం చేశాడు మురళి.

పరధ్యానంగా గురిపెట్టిన బాణం, వెనుదిరిగి తననే ఢీకొన్నట్టనిపించడంతో, రాజేష్ తికమక పడిపోయాడు. "మీ హెడ్డాఫీసులో యేదో పనుందన్నావుగదా!.... అదే.... అప్పుడప్పుడూ నీకు యేవేవో పనులుంటాయిగదా అక్కడ.... అందుకోసం వచ్చావేమోనని...."

"యీసారి నేనొచ్చింది ఆఫీసు పనిపైనగాదు.... " మురళి చిరునవ్వు నవ్వాడు.

'అమ్మయ్య!' అనుకొని, వోసారి వూపిరి పీల్చుకున్నాడు రాజేష్— "మరి... ?"

"నాన్న ఉత్తరం రాశానన్నారు...."

"యే వుత్తరం?...."

"అదేరా, నీ పెళ్ళిగురించి...."

"..........."

"వెళ్లి ముఖం కడుక్కుని దుస్తులు మార్చుకో...."

రాజేష్ కేమీ అర్థంకాలేదు.

"యీవూళ్లోనే వో సంబంధముందట! నాన్నకెవరో స్నేహితుడు ఉత్తరం రాశారు. నీతోబాటూ వెళ్ళి చూసిరమ్మని నాన్నగారి ఫర్మానా...."

"........"

"యీ రోజు వుదయం పదిగంటలకంతా వాళ్లింటి కొస్తున్నామని నాన్న వుత్తరం కూడా రాసేశారు. నువ్వేమో సమయానికి కంటికి కనిపించకుండా పోయావు ... వుదయం నేను ఫోనుచేశాన్లే.... యెలాగయినా సాయంత్రానికి నీతో బాటూ వాళ్లింటికొస్తున్నానని...."

"........"

"వెళ్లి తొందరగా బయల్దేరు...."

మాసిన బట్టల్ని విప్పి హేంగరుకు తగిలించి, స్నానం చేయాలన్న మిషతో రాజేష బాత్రూంలోకి దూరేశాడు.

'యెదురయిన మొదటి సమస్యను పరిష్కరించుకోవడమెలాగో తెలియక తాను తికమక పడిపోతున్నాడు. యింతలో మరో సమస్య. కాల్చిన యినుప ముక్కకే సమ్మెటదెబ్బలు తగులుతున్నట్టుగా పరీక్షపైన మరో పరీక్ష..పెళ్లిచూపులకు యిప్పుడే వెళ్లాలా తాను? యీ అన్నయ్యొకడు! యిప్పుడే రావాలా వీడుగూడా? మొదటి సమస్యకు అన్నయ్య రాకడే పరిష్కారం కాదుగదా! యేగొడవలూలేని కొత్త సంబంధం....అపరిచితురాలయిన ముగ్ధ....కావలిస్తే కోరినంత కట్నం డబ్బులూ....సుమధురస్వప్నం లాంటి జీవితం....అదర్శం పొగమంచు లాంటిది.. పట్టుకోవాలన్న తాపత్రయం తనకెందుకు?....అదిగో, మళ్లీ తాను సైతానుకు లొంగిపోతున్నాడు సాగర్ కేమని సమాధానం చెప్పాలి?....ఆత్మను చంపుకుని బ్రతకడం తన చేతనవుతుందా? అయినా యేమిటీ పరీక్ష? వోపికగా ఆలోచించుకునే సమయమయినా తనకెందుకు దొరకదు? యేంచేయాలి తాను?.... తానేం కోరుకుంటున్నాడు? తనకు తానే వొక్క చిక్కుముడిలా తయారైపోతున్నాడెందుకు? వొకముడివిప్పేసరికి, మరో కొత్త ముడిపడిపోతోంది....'

టవలుతో ముఖం తుడుచుకుంటూవచ్చి, మంచంపైన కూర్చున్నాడు రాజేష్.

"లేచి తొందరగా బయల్దేరు....పాంటూ, షర్టూ తొడుక్కుని సిద్ధంగా కూర్చున్న మురళి హెచ్చరించాడు.

"యిప్పుడే వెళ్ళితీరాలా అన్నయ్యా!" రాజేష్ తాపీగా అడిగాడు.

"మరి....?" మురళికి తమ్ముడిధోరణి అర్థం కాలేదు. "పొద్దున్నే వెళ్ళాల్సినవాళ్ళం! యిప్పటికే అలస్యం అయిపోయిందని నేను కంగారుపడుతున్నాను..."

"అదికాదూ..." రాజేష్ సాగదీశాడు.

యేదికాదు...ముందు నువ్వు బయల్దేరు చెబుతాను...." తాను పైకి లేచి నిల్చున్నాడు మురళి. ,

"కాస్సేపు కూర్చో అన్నయ్యా! వొకమాట...!"

"యేమిటోరా నీసంగతి అంతా అయోమయంగావుంది. అవతల అమ్మా, నాన్నా యిప్పటికే అలస్యమైపోయిందని గగ్గోలు పడుతున్నారు. అప్పటికీ నాన్న చెప్పనే చెప్పారు నువ్వెలాగయినా యెగనామం పెడతావని. యెలాగో వొకలా నిన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత నాదేనని మరీ మరీ చెప్పింది అమ్మ. నువ్వేమో యిలా జగమొండిలా తయారై కూచున్నావు. యింతకూ నువ్వు పెళ్ళి చేసుకో దలచుకున్నావో లేదో ఆ సంగతి తేల్చిచెప్పు..." మురళి చికాకుపడుతూ కూర్చున్నాడు.

"నువ్విలా కోప్పడితే యేలా చెప్పు? నేను పెళ్లి చేసుకోనని అన్నానా యెప్పుడయినా?...."

"మరి యిప్పుడు బయల్దేర డానికి అభ్యంతరమేమిటి?"

"అది కాదన్నయ్యా! యిదేదో వొక ఆటలా మనం పెళ్లి చూపులకు వెళ్లడమెందుకు? వెళ్లడమూ, చూడడమూ, నచ్చలేదని వాళ్లకు ఆశాభంగం కలిగించడమూ - యెందుకివన్నీ? ఆడపిల్లల కేర్పడిన నిస్సహాయ పరిస్థితిని అసరాచేసుకుని యిలావాళ్లను యేడ్పించడం బావుంటుందా "?

"నువ్వు చెబుతున్నదేమిటో నాకు అర్థం కావడంలేదు. అమ్మాయిని చూడకముందే నచ్చదని అనుకుంటున్నావేమిటి? యింతకూ....కొంపదీసి, నువ్వింకో అమ్మాయినెవరినయినా...."

"అబ్బెబ్బే. అదేం లేదు...తడబడిపోయాడు రాజేష్.

"కొత్తగా సంబంధాలూ చూడకుండా, నీకు నువ్వుగా యెవరినీ యెన్నుకోకుండా, యెలా పెళ్ళి చేసుకుందామనుకుంటున్నావు. నువ్వు నీకేమయినా పిచ్చెక్కిందా....?"

"అదికాదన్నయ్యా"

గది బయట మోటారుబైకు ఆగిన శబ్దం వినిపించింది.

రాజేష్ పైకి లేచి, కిటికీలోంచి అవతలికి చూశాడు.

సాగర్ లోపలికొచ్చాడు.

సరిగ్గా సమయానికి ఆపద్బాంధవుడిలా అతడిలా రావడంతో, తనకీ ప్రమాదంనుంచీ తప్పించుకునే అవకాశం దొరుకుతోందనుకుని, రాజేష్ హాయిగా నిట్టూర్చాడు. "అన్నయ్యా, యితనే సాగర్....నీకు చాలాసార్లు చెప్పాను...." మిత్రుడ్ని పరిచయంచేశాడు.

"నమస్తే, రండి, రండి....కూచోండి" కుర్చీ చూపెట్టాడు మురళి.

"నమస్తేనండి....మీరు ఆఫీసు పనిమీద చాలాసార్లు యిక్కడికొచ్చారట కదా! ఒక్కసారయినా నాకు మిమ్మల్ని చూపెట్టలేదు మీ తమ్ముడు..."అన్నాడు సాగర్.

"వీడికెప్పుడేం చేయాలో తెలియదులెండి!" మురళి తమ్ముడికి తప్పించుకునే అవకాశాన్నివ్వలేదు. కొత్తగా పరిచయమైన వ్యక్తిని తన కేసుకు న్యాయమూర్తిగా మార్చుకుని, తన వాదనను కొనసాగించాడు.

వయసొచ్చిందిగానీ, బుద్ధిమాత్రం రాలేదు వీడికి. యెలాగూ సమయానికి వొచ్చారుగదా, మీరైనా నచ్చజెప్పండి మీ స్నేహితుడికాస్త...."

పెనంపైన్నుంచి పొయ్యిలోకొచ్చి పడ్డానన్న సంగతి అర్థం గావడంతో రాజేష్ కంగారుపడిపోసాగాడు.

కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ, "యేమిటి రాజేష్? యేమిటీ కంప్లయింటు?" అంటూ చిరునవ్వు నవ్వాడు సాగర్.

తనూ నవ్వడంకోసం విఫల ప్రయత్నంచేశాడు రాజేష్.

"వాడేం చెబుతాడ్లెండి! నేనే చెబుతాను....యింటిదగ్గర మా అమ్మా నాన్నా వీడికి పెళ్ళెప్పుడు జరుగుతుందా అని బెంబేలు పడుతున్నారు. వీడేమో యే సంబంధాన్ని చూపెట్టినా యేదో వొక వంక పెడుతున్నాడు. మా నాన్న యీవూళ్లోనే వొక సంబంధముందనీ, వెళ్ళి చూసి రమ్మనీ నన్ను పంపారు. సమయానికి సెలవులుగూడాలేవు నాకు. అయినా యెలాగోలా తంటాలుపడి నేనొస్తే, వీడు ససేమిరా కదలనని మొరాయిస్తున్నాడు. మేము వస్తున్నామని వాళ్లకు ఫోనుగూడా చేశాను. పోనీ, యింకెవరినైనా పెళ్ళిచేసుకోవాలని అనుకుంటున్నావా చెప్పమంటే, అదేమీ లేదంటాడు. కాలికేస్తే చేతికి, చేతికేస్తే కాలికి—అదీ సంగతి.... యేంచేయాలో తోచడంలేదు నాకు...."

సాగర్ సైతం గుక్కిళ్ళు మింగసాగాడు.

"రాజేష్ మీగురించి చాలాసార్లు చెప్పారు. మీరిద్దరూ చాలా క్లోజ్ ఫ్రెండ్సుగదా! మీకు తెలిసేవుంటుంది. వీడెవరినైనా ప్రేమించడం, కలిసితిరగడం లాంటి పనులేమయినా చేస్తున్నాడేమో చెప్పండి. యెవరయినా మాకెవరికీ అభ్యంతరంలేదు. అమ్మాయి చక్కగా చదువుకుని, బుద్ధిమంతురాలైతే చాలు....! మీరైనా చెప్పండి...."

"నాకుమాత్రం యేం తెలుసు చెప్పండి" ప్రమాదాన్ని తప్పించుకోవడం కోసం తాను చేతులుపైకెత్తేశాడు సాగర్. "మీ అన్నయ్యతో చెప్పడానికి భయ

మెందుకు? చెప్పు రాజేష్! యింతకూ నీ అభ్యంతరమేమిటి....?"

"నా అభ్యంతరమా....? అది....అది...." తనను తప్పించడానికి బదులుగా, బోనులోకెక్కించి, తమాషాచూడాలనుకుంటున్న మిత్రుడివైపు కొర కొరా చూడసాగాడు రాజేష్—"అదేమీలేదు....పెళ్ళిచూపులు చూడ్డం నాకిష్టం వుండదు...."

"యెందుకని? "మురళి క్రాస్ యెగ్జామినేషన్ మొదలుపెట్టాడు .

"యెందుకంటే...పుత్ర పుణ్యానికి ఆడపిల్లల్ని ఇంటర్వ్యూ చేయడమెందుకని.

"పుత్ర పుణ్యానికికాదు. పెళ్లి చేసుకోవటం కోసం యింటర్వ్యూ చేస్తున్నావు.."

"చూడకముందే, యిష్టంలేదని చెప్పడమూ బావుండదు...."రాజేష్ చిన్న పిల్లాడిలా మూతి పెట్టేశాడు.

"చూడకుండానే యిష్టం కలగదని యెలా అనుకుంటున్నావు? అంటే.... మరెవరినో యిష్టపడుతున్నావని అర్థమవుతోంది...."

"అలాంటిదేమిలేదు...."గింజుకోసాగాడు రాజేష్.

"చూశారా సాగర్! యిదండీ పరిస్థితి....

వీడి తలతిక్క నెలాకుదిరించాలో తోచటంలేదు. యీ జబ్బుకు మందుంటుందంటారా?

సాగర్ మౌనంగా వుండిపోయాడు.

"యిప్పటికిప్పుడు బయల్దేరమంటే యెలాచెప్పు?యిదేమి చిన్నవిషయం గాదుగదా! నాకు ఆలోచించుకోడానికి కొంచెం సమయం కావాలి.."అన్నాడు రాజేష్.

"కొంచెం అంటే యెంతో అది కూడా నువ్వే చెప్పు?...."

"రేపు వుదయం చెబుతాను .. "

"మళ్ళీ రేపటికి పోస్ట్‌పోన్ చేస్తున్నావన్నమాట! అంటే నేను రేపు కూడా యీ వూళ్ళోనే వుండాలి. సెలవులెక్కడున్నాయి నాకు ?

"రేపు చెబుతాను...."

"వోకే.... రేపటివరకూ వెయిట్ చేస్తాను. యెలాగోలా సెలవు అడ్జస్టు చేయమని బ్యాంకుకు వైరిస్తాను. రేపు ఉదయం పెళ్లిచూపుల కెళ్తున్నాం మనం. సరేనా?.... యేమండీ సాగర్‌గారూ మీరే సాక్ష్యం... "

సాగర్ నవ్వడానికి ప్రయత్నించాడు.

"సునీల్‌నగర్ కాలనీలో నాకో ఫ్రెండున్నాడు. కనీసం వాన్నయినా కలుస్తా నివ్వాళ. యీసమయంలోనయితే వాడింటి దగ్గరే వుంటాడు నేను వెళ్తాను. యీలోగా నాకు మీరో సహాయం చేసిపెట్టాలి. వీడి వాలకం చూస్తే యేదో దాస్తున్నాడన్న అనుమానం కలుగుతోంది. నాతో చెప్పడానికి సందేహిస్తున్నట్టున్నాడు. వీలయితే మీరోసారి కదిపి చూడండి... "

"అలాగేనండి" అన్నాడు సాగర్.

బూట్‌లేసులు బిగించుకుని పైకిలేచాడు మురళి.

"కావలిస్తే నా మోటర్‌బైక్ తీసుకెళ్ళన్నయ్యా!" తాళం చెవి మురళి చేతి కందించాడు రాజేష్.

మురళి బయటికెళ్ళిపోయాడు.

మోటర్ బైకు బయల్దేరిన శబ్దం వినిపించింది.

అయిదు నిమిషాలసేపు యిద్దరూ మౌనంగా కూచున్నారు.

రాజేష్ పైకిలేచి, బట్టలు తొడుక్కున్నాడు.

తాళం కప్ప చేతి కందుకున్నాడు.

సాగర్ వెలుపలికొచ్చి తన వాహనాన్ని స్టార్టు చేశాడు.

గది తలుపులకు తాళం బిగించి, మోటర్‌బైకు వెనకసీటు పైకొచ్చి కూర్చు న్నాడు రాజేష్.

పదిహేను నిముషాల ప్రయాణం సాగిన తరువాత, మోటర్‌బైకును స్లో చేసి, వెనుదిరిగి చూసి, "మనమిప్పు డెక్కడి కెళ్తున్నాం" అంటూ చిరునవ్వు నవ్వాడు సాగర్.

"యేమో, నాకేం తెలుసు ?" రాజేష్ మిత్రుడి ముఖం కేసి చూడలేక పోయాడు.

మరో పదినిముషాల ప్రయాణం తరువాత వాహనం రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆగింది.

"యిక్కడి కెందుకొచ్చాం మనం ?" అంటూ కిందికి దిగాడు రాజేష్.

"వోసెట్టు లాగిద్దామని...." అన్నాడు సాగర్.

"యిప్పుడా ?"

"......"

"మూడ్ లేదునాకు...."

"......."

"నీతో కొంచెం మాట్లాడాలి...."

"నాతోనా ?!"

"......."

"అలా లాన్‌లో కూచుందాం...."

క్లబ్బు ప్యూను లాన్‌లోకి గార్డెను చేర్సు తీసుకొచ్చి వేశాడు. వేడి వేడి చాయ్ తెచ్చిపెట్టాడు.

సిగరెట్టు వెలిగించుకుని, తాపీగా వొక దమ్ములాగి "మీ అన్నయ్యేమో నన్ను అడిగి తెలుసుకోమంటున్నాడు. నువ్వు నాతో మాట్లాడాలంటున్నావు. యీ రెండింటిలో ఫస్టు ప్రిఫరెన్సు దేనికిద్దాం చెప్పు ?" అన్నాడు సాగర్.

"అవి రెండూ వేర్వేరు విషయాలుగావు." రాజేష్ విసుగ్గా అడ్డు తగిలాడు. "అయినా నిమ్మకు నీరెక్కినట్టుగా నువ్విలా తయారయ్యావెందుకు ? అన్నీ తెలిసిగూడా యిలా చేతులు పైకెత్తేస్తే నా సంగతేం కావాలి?"

"నేనా ? నేనేం చేశాను ?" సాగర్ కంగారు పడిపోయాడు.

కోపాన్ని బలవంతంగా అణచిపెట్టుకుని, వీలయినంత ప్రశాంతంగా మాట్లాడడానికి ప్రయత్నించాడు రాజేష్— "ఆవేళ మీ యింటి దగ్గరినుంచీ వచ్చినప్పటినుంచీ నేనెంతగా మధనపడిపోతున్నానో తెలుసా నీకు ? కాళ్ళ కింద భూమి తొలుచుకుపోతున్నట్టుగా తోస్తోంది నాకు. నేనూ మానవుణ్ణేగదా! నా బాధని సైతం నువ్వర్థం చేసుకోవాలి. మనిషిమనిషిగా ప్రవర్తించడం సాధ్యమేగావచ్చు, కానీ...."

"నువ్వు మరింత విపులంగా చెబితే బావుంటుంది..."

"యింతకంటే విపులంగా చెప్పడం నాచేతగాదు. నువ్వు కాస్త అర్థం చేసుకోడానికి ప్రయత్నించు. మొన్నటి ఆ సంఘటనే జరగకుండా వుంటే, యివ్వాళ మా అన్నయ్యతో యీ సంగతి స్పష్టంగా చెప్పివుండేవాణ్ణి! కానీ.... అదిమాత్రం నాచేతగాదు...."

"... ...."

"నువ్వు 'హామ్లెట్' నాటకం చదివావుకదా ! నన్నుమాత్రం 'క్లాడియస్' కమ్మని చెప్పొద్దు.... నా చేతగాదు...."

"మరి.... మరి.... "

"యింతకంటే స్పష్టంగా యెలా చెప్పగలను సాగర్?" విధివంచితురాలైన అమ్మాయిని సానుభూతితో చూడగలను. ఆవిడను పెళ్ళిచేసుకోగలనుకూడా! కానీ మొదటిపెళ్ళికి సాక్ష్యంలా కనిపించే బిడ్డనుమాత్రం భరించలేను. వొక 'హామ్లెట్'ను అనుక్షణం చూస్తూ, అతడి వేదనను గమనిస్తూ బ్రతకలేను. కావలస్తే, వొక బిడ్డ తల్లిని సానుభూతితో చూడగలను. కానీ పెళ్ళి చేసుకోవటం....ప్లీజ్ సాగర్.... నన్ను అర్థంచేసుకోవడానికి ప్రయత్నించు....ఆపనిమాత్రం నేను చేయలేను...."

"నువ్విలా మాట్లాడుతావని నేననుకోలేదు." సాగర్ కలవరపడిపోయాడు.

నా బాధేమిటో నీకు అర్థమయినట్టులేదు. నేను మానసను పెళ్ళిచేసుకోనని అనడంలేదు....చేసుకుంటాను. కానీ ఆమె మరెవరిబిడ్డకో తల్లికావడం నేను సహించ లేను. కాబట్టి .. అందుకని...."

"అందుకని?" సాగర్ రెట్టించాడు.

"ఆ ప్రమాదం జరక్కుండా చూడడమెలాగో నీకూ తెలుసు. మళ్ళీ నా నోటితో చెప్పించడమెందుకు?"

(ఇంకా ఉంది)

శ్రీ తీర్థం శ్రీధరమూర్తి

నరస భూపాలీయముపై ఏకావళి ప్రభావము

ఆంధ్ర సాహిత్యములో అలంకార శాస్త్ర గ్రంథములు చాల తక్కువ. ఆ తక్కువైన యున్నవానిలో విన్నకోట పెద్దన రచించిన కావ్యాలంకార చూడామణి, రామ రాజ భూషణుడు వ్రాసిన కావ్యాలంకార సంగ్రహము సుప్రసిద్ధములై ఉన్నవి. కావ్యాలంకార సంగ్రహమున తొరగంటి నరసరాజుకు అంకితము కావింపబడినది. ఆ కారణముగా గ్రంథమునకు నరస రాజీయము,నరసభూపాలీయము అని ప్రసిద్ధి కలిగినది. ఈ నరసరాజీయమునకు మూలము లేదా ఆధారమైన గ్రంథము ఏది ? అను విషయములో పండితులు భిన్నాభి ప్రాయములు కలిగియున్నారు.

రామరాజభూషణుడు తన నరసభూపాలీయమునకు మూల గ్రంథమిది యని స్పష్టముగ పేర్కొనియుండ లేదు. తాని గ్రంథమును ప్రాచీనములైన అనేక గ్రంథముల సహాయముతో రచించుచున్నట్లు గ్రంథాదిలో ఇట్లు సూచన కావించియున్నాడు.

క. ఈ కావ్యలక్షణంబు ల
నేకులు తొల్లింటిపెద్ద లేర్పఱచిన సు
శ్లోక నృపచరితసరణి దీ
టౌకలనయు, నభినవాంధ్రకవితయు నునుప౯.
(నరస 1 - 21)

సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారు నరసరాజీయమును సవ్యాఖ్యగా వెలువరించియున్నారు. అందు వారు తమ మరిపలుకులలో ఈ నరసభూపాలీయము సంస్కృత మందు విద్యానాథకవి రచించిన ప్రతాపరుద్రీయమునకు అనువాద గ్రంథమను అభిప్రాయమును వ్యక్తము చేసియున్నారు. వారి పలుకులివి :

"ఈతని (సాహిత్య దర్పణ కర్తయగు విశ్వనాథ పంచాననుని) సమకాలికుడే యనదగిన విద్యానాథుడు ప్రతాపరుద్రీయమును విరచించెను. ప్రతాపరుద్రీయము సంగ్రహములలో సంగ్రహము. ఈ కావ్యాలంకార సంగ్రహము (నరసభూపాలీయము) ఆ ప్రతాపరుద్రీయమునకు సంగ్రహ రూపమగు ననువాదమని చెప్పవచ్చును." (పు. 9)

మానవల్లి రామకృష్ణ కవిగారు 1939 ఫిబ్రవరి భారతిలో "నరసభూపాలీయములు" అని ఒక వ్యాసము వ్రాసిరి. అందులో కవిగారి యొక్క అభిప్రాయము ఇట్లున్నది :

తెలుగు నరసరాజీయమున అంకితము గొన్న తొరగంటి నరసరాయల యొక్క తల్లికి ఓబమాంబ అనునొక సోదరి కలదు. ఆమె గొబ్బూరి తిమ్మరాజు యొక్క భార్య. వీరి కుమారుడు గొబ్బూరి నరసరాజు. సుమ్మకృష్ణయజ్వ అను కవి సంస్కృతములో నరసభూపాలీయమను అలంకార శాస్త్ర గ్రంథమును రచించి, ఆ గొబ్బూరి నరసరాజుకు అంకితము చేసెను. అనగా సంస్కృతాంధ్ర నరసరాజీయములకు కృతిపతులైన వారు నరసభూపాల నామాంకితులే. వారి రువురును పినతల్లి పెదతల్లి కుమారులు. ఈ రెండు నరసభూపాలీయములును ఏక కాలమున (క్రీ. శ. 1580 ప్రాంతం) రచితములైయున్నను. ఒకదాని కింకొకటి మూల గ్రంథము కాదు. రామరాజ భూషణుడు ప్రతాపరుద్రీయ కావ్యప్రకాశ సింగ భూపాలీయముల నుండి వస్తువును గ్రహించి, కొంత అనువదించియు, అనుసరించియు, మార్చియు ఆంధ్రమున నూతనమని తోచునట్లు నరసరాజీయమును రచించియున్నాడు. (చూ. మానవల్లికవి – రచనలు పు. 352)

ఇక, నరసరాజీయమునకు ఆధార గ్రంథములు అనదగిన వానిలో ప్రతాపరుద్రీయాదులే గాక ఏకావళి యను అలంకార శాస్త్ర గ్రంథము 'గూడ చేరియున్నదని గుర్తింపవలసి యున్నది. విద్యాధరుడని కవి ఏకావళి అను అలంకార శాస్త్రమును, కేళీరహస్యము అను కామశాస్త్రమును రచించెను. ఏకావళిని ఓఢ్ర (కళింగ) దేశాధిపతి యగు నరసింహ గజపతిదేవునికి అంకితము గావించెను. ఆ కారణమున ఏకావళికూడ నరసరాజీయము అనదగియున్నది. దీనిని రచించిన విద్యాధర కవి 14వ శతాబ్దిలో ఉండెను. ఏకావళిలో క్రమముగ ధ్వని వ్యవస్థాపనము, శబ్దార్థనిరూపణము, ధ్వని భేదనిరూపణము, గుణీభూత వ్యంగ్య నిరూపణము, గుణనిరూపణము, దోషనిరూపణము, శబ్దాలంకార నిరూపణము,— అర్థాలంకార నిరూపణము అని ఎనిమిది ఉన్మేషములు గలవు. ఏకావళిలో ప్రథమోన్మేషములో ప్రాచీన గ్రంథములైన వేదములు ప్రభుసమ్మితములుగా, ఇతిహాస పురాణములు మిత్ర సమ్మితములుగా, కావ్యములు కాంతా సమ్మితములుగా వర్గీకరింపబడి యున్నవి.

శ్లో. శబ్ద ప్రధాన వేదాఖ్యం ప్రభుసమ్మిత ముచ్యతే,
ఇతిహాసాదికం శాస్త్రం మిత్రసమ్మిత ముచ్యతే,
ధ్వని ప్రధాన కావ్యం తు కాంతా సమ్మిత మీరితమ్ (ఏకావళి పు. 3)

పై శ్లోకమునకు అనువాదము.

శా. వేదంబుల్ నృపశాసనంబులు, సుహృద్విజ్ఞాపనంబుల్ పురా
ణాది గ్రంథము, లంగనాజన విలాసాలాప లీలా సమ
ప్రాదుర్భావము లౌర ! కావ్యములు కర్తవ్యోపదేశ క్రియా
వాద ప్రక్రియ నెన్నఁగావ్య మహిమల్ వర్ణింపఁగా శక్యమే ? (నరస. 1 - 25)

కావ్యమహిమాభి వర్ణనము:

శ్లో. విశ్వోల్లంఘన జాంఘికీం వితనుతే కీర్తిం,
కుంభయోనిశ్చకార,
ధత్తే. ఖద్యోత లీలామయమపి గగనే శ్రీనృసింహక్షితీంద్ర !
త్వత్కీర్తేః కర్ణనీలోత్పల మిదమపి చ ప్రేక్షణీయం విభాతి.
(ఏకావళి. పు. 299)

విధత్తే శ్రియం
హేలాధిక్కృత యక్షరాజ విభవాం, చింతాకరం వ త్యఘం,
దుగ్ధే స్వాదుతరాన్ రసాన్ వితరతి స్ఫారం కాకౌశలం,
కావ్యం నిర్వృతి మావహత్యపి పరిస్పందాపహం చేతసః॥
(ఏకావళి. పు. 17)

పై శ్లోకమునకు స్వేచ్ఛానువాదము :

మ. పరమజ్ఞాన లతాలవాలము, జగత్ ప్రఖ్యాత విఖ్యాతి సా
గర చంద్రోదయ, మిష్టసంఘటన రేఖా దివ్య ధేనూత్తమం,
బురుకార్పణ్యాదశానిశా దినముఖం, బుద్వేల నిర్వాణ భ
వ్య రసాస్వాద రసాయనం బనినఁ గావ్యం బెన్న సామాన్యమే ?
(నరస 1 - 26)

ఎనిమిదవ ఉన్మేషమగు అలంకార విభాగము నుండి కొన్ని పట్టులు :

1. అ గి శ యో క్త్య లం కా ర ప్రభేదమునకు లక్ష్యము.

శ్లో. పల్లవతః కల్పతరోరేష విశేషః కరస్య తే వీర !
భూషయతి కర్ణమేకః పరస్తు కర్ణం తిరస్కురుతే ॥
(ఏకావళి పు 238)

వీరుడా ! కల్పవృక్షము యొక్క పల్లవము కంటే నీ చేతికి గల విశేషమిది.

నీ చేయి (దానము చేత) కర్ణతిరస్కారము (కర్ణుని మించియుండుట) చేయుచున్నదని భావము.

పై శ్లోకమునకు రామ రాజ భూషణుని అనువాదము :

క. అగు నొకటి కర్ణభూషణ,
మగు నొక్కటి కర్ణవైరి, హరిచందన పుం
జిగురును నీ చే జిగురును
బొగడొందుట కిదియె భేదము నృసింహ నృపా !
(నరస. 5 - 100)

హరి చందనపల్లవము కర్ణభూషణము. నీ హస్త

పల్లవము కిర్ణవైరి అని భావము. సారాలంకారమునకు లక్ష్యము.

శ్లో: అంతర్విష్ణో: త్రిలోకీ నివసతి, ఫణినా
పీశ్వరేఽ సోఽపి శేతే
సింధో: సోఽప్యేకదేశే, తమపి చుళుకయాం

విష్ణువు యొక్క గర్భమున మూడు లోకములు ఉన్నవి. విష్ణువు ఆదిశేషునిపై శయనించెను. శేషుడు సముద్రములో ఏకదేశమున నెలకొనెను. సముద్రమును అగస్త్యుడు ఆపోశనము పట్టెను. అగస్త్యుడు ఆకాశమున ఖద్యోతమువలె తోచెను. ఓ నరస భూపాలా ! ఆ ఆకాశమున నీ కీర్తి కాంతకు కర్ణోత్పలముగా ప్రకాశించుచున్నదని భావము.

పై శ్లోకమునకు అనువాదము :

సీ. స్థావర జంగమాధారముల్ త్రిజగంబు,
లల జగంబుల జాండములఁ జెలంగు,
నా యజాండిములుండు హరిరోమకూపమం
దా శౌరియును భోగిపై శయించు,
నా భోగి జలధికోణావాస మొందు నా
కడలి కుంభజుచుళుకంబుఁ జెందు,
నా కుంభజుఁడు నింగి కేకఖద్యోతాభుఁ
డా నింగి కలురియై యతిశయిల్లు,
తే. నీ యశోలక్ష్మి కక్షీణ నీతిచతుర !......
(నరస. 5 - 229)

ఏకావళి అను అలంకారప్రభేదము గలదు. దాని లక్షణము :

శ్లో. యత్ర విశేషణభావం పూర్వం పూర్వంప్రతి
క్రమేణైవ,
భజతి పరం పరమేషాలంకృతి రేకావళీ కథితా.
(ఏకావళి. పు. 297)

పై శ్లోకమునకు అనువాదము :

క. ధరఁ బూర్వ పూర్వమున కు
త్తరోత్తరము క్రమసమగ్రత విశేషణమై,
పరగిన నేకావళి యన
నరుదగు సత్కృతులయందు నది యెట్లన్నన్.
(నరస. 5 - 224)

పై అలంకారమునకు లక్ష్యము :

శ్లో. రాజ్ఞాం సభా: సకవయ: కవయో నిసర్గ
సారస్వతప్రసర నిర్మిత రమ్య కావ్యా:
కావ్యాని వర్ణిత భవచ్చరి తాన్యతీవ,
చిత్రాణి వీర ! భవత: చరితాని భాంతి
(ఏకావళి పు 297)

పై శ్లోకమునకు అనువాదము

క. అవనిధవాస్థానంబులు
కవియుతములు, కవులు రచిత కావ్యులు
కావ్య
వ్యవహారము, లమిత భవత్
నవ నవ గుణభూషితములు నరసింహ నృపా!
(నరస. 5 - 225)

విద్యాధరకవి రచించిన ఏకావళి హృద్యమైన అలంకార శాస్త్ర గ్రంథము దానికి తరళము అను వ్యాఖ్యానమును సవదరించిన మల్లినాథసూరి ఏకావళి యొక్క మహిమను గ్రంథాంతమున ఇట్లు ప్రశంస కావించియున్నాడు.

శ్లో. ఏకా మేకావళీ మేవ కంఠే ధత్త కవీశ్వరా:!
అ:! కిమన్యైరలంకారై: అసారై: భారదా
యిభి:॥

ఏకావళి - అనగా ప్రకృతి గ్రంథము, ఒంటిపేట హారము అని రెండు - అర్థములు. ఈ ఒక్క ఏకావళిని మాత్రము కంఠస్థము చేసిన చాలును. నీరసములు, భారజనకములు అయిన మిగిలిన అలంకార గ్రంథముల జోలికి పోనేల ? అని గ్రంథపరమైన అర్థము. మెడలో ఏకావళి హారమును మాత్రము ధరించిన చాలును. బరువును కలిగించు పలుభూషణములేల ? అని హారపరముగా మరొక అర్థము.

ఏకావళిని చదివిన వారికి మల్లినాథసూరి యొక్క పై ప్రశంసలోని సత్యాంశము బోధపడగలదు. ఏది యెట్లున్నను రామరాజభూషణుడు రచించిన నరసరాజీయముపై ఏకావళి యొక్క ప్రభావము స్పష్టముగా కానవచ్చుచున్నది.

ఆధారగ్రంథములు.

1. ఏకావళి :- మల్లినాథకృత తరళ వ్యాఖ్యా సహితము
తత్వవివేచక ముద్రణాలయము,
బొంబాయి. 1903.
2. కావ్యాలంకార సంగ్రహము (నరస భూపాలీయము),
వివరణకర్త :- శిరోమణి సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి,
నిజాంరాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు,
హైదరాబాదు 1945.
3. మానవల్లికవి - రచనలు,
సంపాదకులు : 1. విద్యారత్న నిడుదవోలు వేంకటరావు.
2. దా. పోణంగి శ్రీరామ అప్పారావు,
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి,
హైదరాబాదు - 1872.
4. ఆంధ్రకువలయానందము,
కంభంపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి
శ్రీ వేంకటేశ్వర ఓరియంటల్ సీరీస్ - 13
తిరుపతి, 1948.

మైదానం !

శ్రీ సాధనాల వేంకట స్వామి నాయుడు

ఓ మైదానం—
ఎంత విశాలం నీ హృదయం !
వెలుతురు పిట్ట లరవకముందు
నీవు బహిర్భూమివి !
సుప్రభాతం పలకగానే
రక్షక భటులకు 'పెరేడ్‌గ్రౌండ్'వి !
గోధూళి వేళకు ముస్తాబై
ఉపన్యాసాలకు వేదికవి !
ఎన్ని ఉపన్యాసాలు విని
ఎంత పాండిత్యం గడించావో ? !
వెలుగు కనుమరుగైతే—
మధుపాన ప్రియుల ఆవాసానివి !
మత్తులో ముంచి తేల్చే స్వర్గానివి !
చీకటి, చుక్కల చీరకడితే
కాము కేళీ విలాస కేంద్రానివి !
రసాస్వాదకుల రసమయ నిలయానివి !
మతి కొందఱికి—
ఒడిలో చేర్చుకొని నిద్రపుచ్చే తల్లివి !
ఓ మైదానం—
ఎంత విశాలం నీ హృదయం ? !

(22వ పేజీ తరువాయి)

వచ్చునని యూహింపవలసి యున్నది. నేఁటిబండి మిగిలిపోయినందునఁ దప్పక యుదయపు బండికి వచ్చును.'' అని యప్పాజీపంతింట నందఱను సమాధానపఱచెను.

అందఱును నమ్మిరి. ఆ రాత్రి గడపుట కమలకెంతో కష్టమయ్యెను. 'ఎప్పుడు తెల్లవారునా' యని కన్నులు మూయకుండెను. అనేక విధ పరస్పర విరోధ కల్పనా తరంగ డోలికలలో నూఁగుచు నామెయుండ నెట్లో తెల్లవారెను. నేఁడు నరకచతుర్దశి యగుట జనులందఱు నరుణోదయాత్పూర్వమె మేలుకొనిరి. అందందు నపూర్వా నందోత్సాహములు తాండవమాఁడుచుండెను. అనేకులు మంగళస్నానము సేయుచుండిరి. స్నానానంతరమున సుగంధ ద్రవ్యములు మేనులకు రాచి, నానావిధామూల్యాంబరాభరణములు గైసేసి నగర నారీ వరగణములు దేవతా దర్శనమున కరుగుచుండిరి. ముందటి వాఁటివలెనె యప్పాజీపంతు స్టేషనుకడకు వినాయకరావు కొఱకు బండి నంపియుండెను. బండిపోయియు రెండుగంటల కాల మయ్యెను. వినాయకరావు రాలేదు. అప్పాజీపంతు గృహమున నందఱకు విచారమయ్యెను; చింతింపసాగిరి. నేఁటిదినము మహదానందమునఁ గడుప సర్వసన్నాహములతో నుండ, దీర్ఘకాలమునుండియుఁ గోరుచుండు నీ కోరిక ఇప్పుడు నష్టమైనందున నెల్లరకు మిక్కిలి దుఃఖమయ్యెను. కమలాహృదయమో —— ఆ స్థితిలో నుండువారలకే తెలియవలయును!

ఇంకను రెండుగంటల కాలము గడచెను. అప్పాజీ పంతు విషణ్ణహృదయముతోఁ జావడిలో నొకపడకకుర్చీయందుఁ బరుండి విచారమగ్నుఁడై యుండెను. 'టెలిగ్రాఫ్' కచేరినుండి యొక భటుఁ డొక 'టెలిగ్రా'మును దెచ్చి యాతని చేతికిచ్చెను. దస్కతుచేసి భటునిఁ బంపివేసి యా 'లకోటా'ను జేతఁబట్టికొనెను. దానిని విప్పుట కతనికి ధైర్యము కలుగలేదు. టెలిగ్రాము వచ్చిన తోడనే యతని డెందము పరిపరివిధాలోచనా కల్లోలములతో నిండిపోయెను. అనేక విధములగు కుశంక లుదయించెను తుద కెట్టెట్లో మనసును బిగఁబట్టి దాని విప్పిచూచెను. అ వెంట నాతఁడు పాషాణ విగ్రహమువలె నిశ్చేష్టుఁడయ్యెను! శరీరమున రోమాంచములు నిక్కఁబొడిచెను! చేతిలోని కాగితము జారి నేలఁబడియెను. ఈ విషయ మింట నెవరికిని దెలిసియుండలేదు. సేవకున కొకనికి మాత్రము తెలిసియుండెను. వాఁడును బెగడొంది యేమియుఁ జేయఁజాలక, లోనికరిగి, మెల్లఁగ లక్ష్మీబాయికిఁ జెప్పెను. ఆమెయు నాక్షణమె బయటికి వచ్చి భర్తస్థితిఁ గనెను. ఆమెకు గుండెలు చెదరిపోయెను. కాళ్ళు నిలువఁజాలక పోయెను! నోరెండిపోయెను. మొగము వాడిపోయెను. స్వల్పకాలముననె యింటనందఱకు నీ టెలిగ్రాముసంగతి తెలియవచ్చెను. అందఱు నాత్రముతో, భయముతో, దుఃఖముతో, నచటికి వచ్చిరి. ఎవ్వరికి నేమియుఁ దోఁచుటలేదు. అందఱును దుఃఖవిహ్వలులై పోయిరి. కడకప్పాజిపంతు ధైర్యము దెచ్చికొని యిట్లనియెను. "ఇందు జబ్బేలాటిదో వివరించలేదు. కాని వ్యాధి భయంకరమైనదనియు, చికిత్స జరుగుచున్నదనియు మాత్రమే యున్నది. కాఁబట్టి మనము టెలిగ్రామిచ్చి పై సంగతులు తెలుసుకొనుట కంటె నే నే స్వయముగా నిప్పుడే మన డాక్టరు త్ర్యంబకరావుని వెంటఁగొని బరోడాకుఁ బోయిన బాగుండును.'' ఈ సలహా యందఱకు సమ్మతమయ్యెను. వెంటనే బరోడాకుఁ బ్రయాణసన్నాహము కావింపసాగెను. తమ కుటుంబ వైద్యుడును, పరమ మిత్రుడునునగు డాక్టరు త్ర్యంబకరావునకీ యుదంతమంతయుఁ దెలుప నాతఁడును బ్రస్తుత స్థితిగతుల నెఱిఁగి బరోడాకు వెడల సిద్ధమయ్యెను. వారు మధ్యాహ్నపు బండికి బయలుదేర నిశ్చయించిరి.

బయలుదేరు వేళ కింక నొక్క గంటకు ముందగ మఱొక తంత్రీవార్త వచ్చెను. అప్పుడు మాత్ర మాతని కొదవిన దుస్థితి వర్ణింప లేము. కవరు విప్పుటకైనను నాతనికి వ్రేళులలో శక్తి యుండలేదు. ధైర్యము నశించెను. దేహమంతయు గడగడ వడఁకుచుండెను. ఒక నొకా యుస్మృత్తుని వలె, భ్రాంతునివలె నైపోయెను. ఇంక నింట నాఁడువారి బాముల చెప్పనక్కరయే లేదు. వృద్ధ



రమాబాయి కమలను దన చెంతకుఁ దీసికొని "ఏడువకు తల్లీ, మంచి మందు లిప్పించినఁ ద్వరలోనే నిమ్మళించునులె ?" మ్మని యోదార్చుచుండెను. కాని, యామెస్థితి యెట్టు లుండెనో యామెకే తెలియును ! ఆమె కన్నులలో నొక్కబొట్టు నీరైన లేదు. కాని కన్ను లెఱ్ఱబడి వాచి యుండెను. లక్ష్మీబాయి శూన్యాంతఃకరణముతో భర్తృ నిస్తేజ ముఖమువంకఁ గాంచుచు బిచ్చపాటుతో నిలిచి యుండెను. ఆమె కన్నుల నశ్రువులు ప్రవహించు చుండెను. ఇఁకఁ గమలస్థితి వర్ణింపనలవిగాదు ! అప్పాజీపంతున కా తంతి చదువుటకుఁ దోఁచలేదు; తోఁచినను ధైర్య మొదవలేదు. రమాబాయి కుమారుని సమీపించి "అప్పా, నుదుటి వ్రాఁత తప్పింపజాలము కదా ! వ్యర్థముగా మనసున కీ బాధయేల ? దీనిలో నేమున్నదో చదివి చూడుము. ఏమున్న మాత్ర మేమి చేయగలము ? ఎట్లును నీవు బరోడాకు ..."

ఆపైఁ బలుక లేకపోయెను. కంఠము రుద్ధమయ్యెను. అటు పిమ్మటఁ బంతు బహుకష్టముతోఁ జెదరియున్న ధైర్యమును మరల నొక్కటిగఁ జేర్చి కొని ఆ టెలిగ్రామును జదివెను. అంతే; నిశ్చలుఁడై పోయెను; నిస్తేజుడై పోయెను. తలపైఁ బెద్దబండ పడి నట్లయ్యెను. తటాలునఁ గుర్చీలో బడిఁ పోయెను.దుఃఖావేశమున నాతఁ దేడ్చుటకును మరచిపోయెను.

ఈతని యీ భయంకర స్థితిఁగని యందఱును నిజము తెలిసికొనిరి. గృహమంతయు రోదన ధ్వనితో నిండిపోయెను. కమలయే యొకానొక పశువువలె పెనుబొబ్బలు పెట్టి యేడ్వసాగెను. వృద్ధ రమాబాయికీ యుదంతము తెలిసిన వెంటనే యామె పెద్ద పెట్టున నఱవసాగెను ! నోటికి వచ్చినట్లెల్ల వదరసాగెను. ఆకస్మిక భయంకర దుఃఖాహతి నున్మాదినియై పోయెను !

ఇప్పటి యీ వృత్తాంతము వర్ణించుటకు మా లేఖిని ముందుకు సాగ నిరాకరించినది.

అప్పాజీపంతుగారి గృహముపై నేఁడు దుఃఖ మహాపర్వతము. అందఱు నా కొండక్రిందఁ జిక్కికొనిరి. కమల యాకస్మికంగా దుస్సహ దుఃఖ సముద్రమున మునిఁగి పోయెను. ఆమె సౌభాగ్య రవి యస్తంగతుఁడయ్యెను ! దుర్భరవైధవ్య మీ బాలిక కింతలోనె సంప్రాప్తమైనది ! దుర దృష్టము !

* * *

అప్పాజీపంతుగారి యింటిపై నిట్టి మహత్తర దుఃఖ పర్వతము కూలిన యా దినము మనకు హైందవులకుఁ బరమ పవిత్రమైన, మహోత్సవ దాయకమైన నరక చతుర్దశి యని పాఠకులుఁ దెలిసియే యున్నది. దీపావళి పండుగ మన కెంతటి యానందదాయకమైన పండుగైనది మన కందఱకుఁ దెలిసిన విషయమే ! అట్టి యీ యానందోత్సవ దివసమున సైతం కొందఱు వీణా వేణుగానా కర్ణనమునఁ దల్లీనులై యుండ, మఱి కొంద ఱాప్త బంధుజన వియోగమునకై రోదనము సల్పుచుందురు. దైవచిత్రము లిట్టివే !

పునహా నగరమున సకల దిశల యందును నానందమహోత్సవములు తాండవమాడు చుండెను. ఆ నగరమున నివసించుచున్న మన యప్పాజీ పంతు గారియింటఁ గ్రూరుఁడగు కాలుఁ డానాఁడె తన సామ్రాజ్యమును స్థాపించెను !

నాలుగు దినములు గడచినవి. వీరందఱకు దుఃఖా వేగ మించుక తగ్గెను. కాని, పాపం, దీనా నాథయగు కమల యొక్క వదనము దుఃఖ పూర్ణమై, వివర్ణమై, మలినమై యుంటఁ గని యెల్లర డెందమును నీరగుచుండెను ? తమ యొక్కతయగు కూఁతున కింతలో నిట్లు దుస్సహ వైధవ్యము పిట్ట పిడుగుగఁ దలపైఁ బడుట జూచి యే తలిదండ్రుల హృదయములు విదీర్ణములు కాకుండఁగలవు ? డాక్టరు పచరించుటచే వృద్ధ రమాబాయి కించుక నిమ్మళముగ నుండెను. కమల మొదట రెండు మూఁడు దినము లొక్క మెతుకన్నము - అన్న మేల ? ఒక్క గ్రుక్కెఁడు నీరైన — దీసికొనక పోవుటచే మిక్కిలియు నశక్తయై పోయెను ! మాటలాడుటకు నామెకుఁ బ్రాణలేదు. ఆమె యింత వేఱకును నెట్లు జీవించి యున్నదియా యనియు నాశ్చర్యము కలుగక పోలేదు ! ఆ సమయమున డాక్టరు త్ర్యంబకరావు గారు మాత్రం లేకుండిన నిజముగానె యాబాల జీవించియుండదు. అతఁ డీమె యెడల నధిక శ్రద్ధ వహించి యుపచరించుట చేతనె యామె జీవించినది.

అయిదవ దినము తెల్లవారెను. ఉదయ మేడు గంటలుండును. అప్పాజీపంతు తన ప్రాతఃకృత్య ములు నెరవేర్చి దేవదర్శనముఁజేసి యప్పుడే పంచపాళిలో వచ్చి కూర్చుండియుండెను. అతని దృష్టి బయట త్రోవపైఁ బారెను.

ఇంటి ముందర నొక బండి యాఁగెను. అందుండి యిరువదినాలు గిరువదైదేఁడుల యువకుఁ డొకఁడు దిగి చేత నొక చిన్న పెట్టెఁ బట్టుకొని బండివానికి నద్దెయిచ్చి మెల్ల మెల్లఁగ నప్పాజీపంతు నింటిలోనికి వచ్చుచుండెను. అప్పాజీపంతు తన క్షీణనేత్రములను వికసింపఁ జేసి శంకి తాంతఃకరణముతో నేకాగ్రదృష్టులతో నా యువకునిఁ గాంచుచుండెను. అతనిడెందమున ననేకవిధవిచార వికారము లొక్కపెట్టున వ్యాప్త మయ్యెను. అప్పుడాతఁడు భ్రాంతిగొన్న వానివలెఁ జూపట్టెను. ఆ యువకుఁడప్పాజీ పంతును సమీపించి హసన్ముఖుఁడై గౌరవ ప్రేమ పూర్వకముగా నా వృద్ధునకు వంగి నమస్కరించెను. అతని యెదుట నిలిచెను. ఆ యువకుని ననిమేష లోచనములతో నప్పాజీపంతు చూచుచు నిలిచెను. అతని శరీరమున బులక లుదయించెను. తనకేదైన భ్రమ కలిగెనేమో యని యతనికి శంక వొడమెను. ఉన్మత్తునివలె నైపోయెను. యువకుని తెప్పవేయక చూచుచుండ నాతని నోట నాకస్మికముగా "నేను గలఁగనుచుండలేదు కదా ?" యను వాక్యము వెలువడెను.


ఈతని యీ విచిత్రావస్థ, శుష్కశరీరము, వాడి యున్న రూపము, నసంబద్ధ వాక్యములు గని యా యువకుని హృదయమున ననేకశంక లుదయించెను. దేహము వడఁకసాగెను ! అతఁడు కరుణా పూర్ణ స్వరమున "నిదేమిట్లు పలుకుచున్నారు ? మీ యీ—"

అప్పాజీపంతీ వాక్యముఁ బూర్తిసేయ నీయకయె యిట్లనెను: "నీవు నిజముగానె వినాయకరావేనా ? లేక, యీ భయంకర దుంఖాఘాతము వలన నా మతి చలించినందున నాకిట్లు కనబడుచున్నదియా ?" యనెను.

ఈ తుది వాక్యములు విని వినాయకుని హృదయము కరఁగిపోయెను ! భయవిహ్వల స్వరమున నాతఁడు "ఎట్టి దుఃఖా ఘాతము ? నాకేమియుఁ దెలియకున్నదెట్లు? నేనిదే కొంకణము నుండి యిప్పుడే వచ్చుచున్నానే" అనెను. ఇంతలో వేఱొక యాలోచన యతనికిఁ బొడమెను.

"ఇచటఁ గూడ నేదియో భయంకర విషయము జరిగియుండవలయును" అని యతఁడు తనలోఁ దర్కించుకొనెను. క్షణార్థ కాలమున నీ యూహ నిజమని రూఢియయ్యెను. కొంచెము ధైర్యము కలిగెను. అతఁడు శాంతముతో నిట్లులనెను—

"ఇచట జరిగినవన్నియు నా యూహనుబట్టి తెలిసికొంటిని. అదియె నిజమనియుఁ దోఁచు





కళానిధి డి

చున్నది. ఇంటి నుండి బరోడాకు నాకేవిధముగ టెలిగ్రాం వచ్చెనో, ఆ విధముగనె యిటఁగూడ నేదియో కలిగియుండ వచ్చును. నిజమేనా? మీ కిచట టెలిగ్రాం గాని, జాబుగాని వచ్చియుండెనా?"

అప్పాజీపం తిప్పుడించుక శాంతి వహించెను.

"నీ కింటి నుండి యేమని తంత్రీవార్త వచ్చినది?"

"మా యమ్మగారికిఁ జాల జబ్బుగా నున్నదని, నేనిక్కడికి ధనత్రయోదశీ రాత్రికి రావలెనని నిశ్చయించితిని. ఆ ముందటినాఁడె 'అమ్మ భయంకర రోగ పీడితయైయున్నది. తత్‌క్షణము రావలె' నని యమున పేరిట నాకుఁ దంతివచ్చినది. ఆ కారణమునఁ నే నిక్కడకు వచ్చుట మాని కొంకణమునకుఁ బోయితిని అప్పుడు నేను మీకు టెలిగ్రా మంపియుండవలసినదే కాని యమ్మగారి వ్యాధి విషయమై మనసు కలవరపడి యుండుటచే నాకా మాట తోఁచినది కాదు. ఆ వెంటనే సెలవు దీసికొని కొంకణమునకుఁ బోయితిని. అక్కడి నుండి యింటికిఁబోవుటకు రెండు దినములు పట్టును. అమ్మను జూడఁగలుగుదునా లేదా యని మనసు తల్లడిల్లి పోవుచుండెను. ఇల్లుచేరి చూతుఁగదా మా యమ్మ నరకచతుర్దశియగుటచే ఉదయస్నానముచేసి పూజచేసి కొనుచుండెను. అప్పుడు నా కత్యాశ్చర్యమయ్యెను. ఇది యేమి గౌడ బంగాళము ! ఏమియుఁ దెలియదు ! విచారింపఁగా మా యమ్మ రోగగ్రస్తయే కాలేదని తెలియవచ్చెను. ఇంటిలో నుండి యెవ్వరు నాకుఁ దంత్రీవార్త పంపియుండ లేదఁట ! ఈ కార్యమే వివేకశూన్యుఁడో, ఏ ఖలుఁడో చేసియుండవలయునని స్పష్టమైనది. వాని నేవిధముననైన శిక్షింపక మాననని నిశ్చయించితిని. మా యూరికిఁ దంత్రీవార్తా కార్యాలయ మిరువది మైళ్ళ దూరముననున్నది. అచటికి బోయివచ్చుటకు రెండు దినములు పట్టును. అక్కడికిఁ బోవలెనన్న రెండెడ్ల నాటుబండ్లలోనో, లేక నడచియో పోవలెను. అందునకును సమ్మతించితిని. కాని మాయమ్మ నన్ను బయటికిఁ బోనీయదయ్యెను. అదియు సమంజసమే దీర్ఘకాలానంతరము నేనింటికి వచ్చుట, అందునను దీపావళీ మహోత్సవ సమయమున నన్నెట్లుపోనిచ్చును? ధనత్రయోదశీ రాత్రి కిక్కడికి వత్తునని తంతిపంపితిననియు, నటు రాకపోవుటచే మీరందఱు విచారపడుదురనియు, మీకొక తంత్రీవార్తఁ బంపి, యిట్టి టెలిగ్రాము నాకెవ్వరు పంపిరో కనుఁగొనవలయుననియు, మాయమ్మకుఁ జెప్పితిని. ఎంత చెప్పినను వినదు. "రెండు దినములు విచారింతురు ! క్షేమసమాచారముఁ దెలుపుచు నొకజాబుఁ బంపినఁ జాలును !" అన్నది, అందుపై మీ కొక జాబు వ్రాసితిని." అని యనుచునుండఁ దపాలాభటుఁ డొకజాబుఁ దెచ్చి యప్పాజీపంతున కిచ్చెను. వినాయకుఁ డా జాబుఁ గాంచి "యిదియె నే వ్రాసిన" జా బనెను. "నేను జాబు వ్రాసితిని గాని, యది మీకుఁ జేరుటకు మూఁడు నాలుగు దినములగునని నేనెఱుఁగుదును. ఆ జాబు మీకుఁ జేరు

తాజాదనం రోజంతా నిలిచేలా ఉంచండి.





అసలైన తాజాదనం! అదే రోజంతా నిలిచి వుండే తాజాదనం!
మీకు సాధారణ సబ్బులు ఇచ్చేలాంటి కొద్ది సేపట్లో
మాయమైపోయే తాజాదనం కాదు. శరీర దుర్గంధం పోగొట్టి
మిమ్మల్ని రోజంతా హాయిగా వుంచగల తాజాదనం—
అదే కొత్త సింథాల్ మాత్రమే ఇవ్వగల వాగ్దానం.

**సింథాల్‌లో ఇప్పుడు మనమోహక కొత్త పరిమళం
కలదు. దుర్గంధాన్ని పోగొట్టడానికి సింథాల్‌లో గల
ప్రభావవంతమైన శక్తి చర్మ క్రిములను నాశనం చేసి,
మిమ్ములను రోజంతా తాజాగా దుర్గంధ రహితంగా వుంచుతుంది.**

CHAITRA-B-G-330 TEL

కేవలం సింథాల్

మాత్రమే మిమ్మల్ని దినమంతా తాజాగా దుర్గంధరహితంగా ఉంచగలదు.

Godrej ఉత్పాదన



వఱకు నెంత యాతురపడుచుందురో, యని నాకుఁ దోఁచి, మాయమ్మతో నట్లే చెప్పితిని; సమాధాన పరచితిని. ఆ సాయంకాలమె నేను బయలుదేరితిని. ఇప్పుడు వచ్చి చేరితిని. ఆ రెండు దినములలోఁ దంత్రీవార్తాధికారికి జాబులు వ్రాసి, నాకు వచ్చిన టెలిగ్రాములు పంపి, యిట్టి నీచకృత్యము సేసిన దెవ్వరో తెలుపుఁడని కోరియుంటిని. అనుభవము తప్పదందురు కదా ? ఇది నిజమని నాకుఁ దెలియ వచ్చుచున్నది. తంత్రీవార్తాధికారికి టెలిగ్రామిచ్చి నప్పుడే నా క్షేమసమాచారముఁ గూర్చి మీకు నొక టెలిగ్రా మంపవలసియుండెను. నా మనస్సు స్థిరముగ నుండకపోవుటచే నప్పుడు నాకా మాట తోఁచలేదు. నే నంపిన తంతికి బదులు నేను బయలుదేరు వేళకే వచ్చిచేరినది. నాకుఁ జేరిన టెలిగ్రాము యమున పేరున నుండె ననియు, రామూ అనునాతఁడు తెచ్చెననియు, గార్యాలయాధికారి నాకుఁ దెలిపెను. మన యిక్కడి కృష్ణరావునకు రాము అను ప్రాణమిత్రుఁ డొక డుండుట మన మందఱ మెఱుఁగుదుము గదా ! అతఁడు కొంకణమున కేదో పనియుండి పోయి యుండెనని నన్నెఱిఁగిన యొకఁడు నాతోఁ జెప్పెను ఇవియన్నియు యోచింపంగా నీ కృత్య మంతయును నీ నీచుఁడు కృష్ణరావు ప్రోత్సాహ మున రాముఁడు చేసియుండవలయునని తేటపడు చున్నది.

ఈ వృత్తాంత మంతయును జెప్పి, యిచటికత లెఱుఁగు నాతురముతో వినాయకుఁ డప్పాజీ పంతును జూచెను. ఈతఁడు నుడివిన దంతయు విన్న పిదప నప్పాజీగారి హృదయమందలి సంశ యాంధకారము మాయమై పోయెను ? సకలో దంతము సీతఁడు వినాయకునకు వినిపించెను. అప్పుడాతని సంశయము దృఢపడియెను !

కమల నెప్పుడు దర్శింతునా, యని వినాయక రావాతురపడుచుండెను. కాని, ప్రస్తుత మామె యున్న స్థితి గతుల నెఱిఁగి, యిప్పు డాతుర పడిన నామెకు హర్షవాయువు కలుగునేమో యని వెఱచి, క్రమముగ సకల వృత్తాంతములు నామెకుఁ దెలుపవచ్చునని తలఁచెను. అప్పాజీ పంతు తనకు వచ్చిన టెలిగ్రామును దెచ్చుటకై లోని కరిగెను.

లక్ష్మీబాయి వంటయింటఁ గమల కౌషధ మిచ్చుచుండెను. పంతచటి కరిగి "ఇదిగో యిప్పుడింటికి వచ్చిన వారెవరో చూచితివా ? వినాయకుడు – మన వినాయకరావు వచ్చి యున్నాడు. శీఘ్రముగాఁ దేనీరు కాఁచి తెమ్ము. మన వినాయకరావు వచ్చియున్నాడు – వినాయక రావు !"

అని వచించి యప్పాజీపం తచ్చోటువాసి బయటి కరుదెంచెను. ఈతని యానంద పూరిత మగు కంఠస్వరమును, హసన్ముఖమును లక్ష్మీ బాయి యాశ్చర్య చకితలోచనములతో జూచెను. ఆమె స్థితియు విచిత్రముగ నుండెను. అప్పాజీ పంతునకుఁ దొలుత నేవిధముగ సందేహ మొద వెనో యామెకు నావిధముగనే సందియము పొడ మెను ! దుఃఖభరమున నతఁడు భ్రమించియుండ

లేదకదా ! "అనఁగా ?" నని యామె భర్త నడిగెను. కాని, ప్రత్యుత్తర మిచ్చుటకు భర్త యందుండలేదు. చేతనున్న పనినట్లే వదలి యామె బయటికి వచ్చెను ఈమెను గాంచినంత వినాయకరావు నవ్వుచు "అత్తా, నేను స్వర్గస్థుఁడ నైతినని మీరందఱు నతిశయముగ దుఃఖించు చుందురని, మిమ్మోదార్చుటకై యొక్కమారు మిమ్మందఱఁ జూడఁగోరి స్వర్గావరోహణ మొనర్చి వచ్చియున్నాను" అనెను. ఇదేమి చిత్రము ! ఏమి మాయ ? లక్ష్మీబాయి కిడియేమియు, తెలియ లేదు. తెప్పమూయకయే యతనిఁ గాంచుచు నిలిచెను; తడ వీమెను సంశయాందోళనమున ముంచుట తగదని యప్పాజీపంతు యథార్థ మంతయుఁ దెలిపి "ఇదిగో అమ్మతో నీసంగతు లేవియుఁ జెప్పకుమా ! ఈ యానందభారమామెకు మిక్కుటమై మరల భ్రమించి పోవునేమో ! పో, పోమ్మ. శీఘ్రముగా తేనీరు కాచితెమ్మ! చాల నలసియున్నాఁ" డనెను

లక్ష్మీబాయి హృదయ మత్యంతానంద ప్రపుల్ల మయ్యెను. పతి సూచించినట్లు తేనీరు కాచుటకామె వెడలిపోయెను.

వినాయకరావు తంత్రీవార్తాపత్రికను బరీక్షా పూర్వకముగాఁ దిలకించుచుండెను, "దీనిలో మనోహర పంతని వ్రాలున్నది. ఈతఁడెవ్వడో ? నిజమగు వ్యక్తియో లేక కల్పిత వ్యక్తియో తెలియుట లేదు. మా స్నేహితులలో నీ పేరువా రెవరును లేరు కొంకణము నుండి నాకుఁ బంపిన మరునాఁడె మీకీవార్త పంపఁబడియున్నది సరే, దీని జాడయుఁ బూర్తిగానె తెలియఁగలదు ! బరోడా తంత్రీవార్తాధికారి నాకుఁ జిరపరిచితుఁడు! అతనికి వ్రాసినచో సకలము నిజము తెలియఁ గలదు !" అని యనుచునుండ వీరిద్దఱకు "టీ" త్రాగుటకు లోపలనుండి పిలుపు వచ్చెను. వీరిద్దఱు మాట్లాడుచునే తేనీరుఁ గ్రోలుచుండ, లక్ష్మీబాయి కమల గదిలోని కరిగెను. కమల యప్పటి కింకను నిద్దుర మేల్కాని యుండలేదు ఆమె కిటీవల రాత్రులలో నిద్రపట్టుటలేదు. కాని, తెల్లవారుజామునఁబట్టును. ఈ యుదయమెండెక్కు వఱకు మేల్కొనుట లేదు. లక్ష్మీబాయి మెల్లఁగ నామె మంచము చెంత కరిగెను. మెల్లఁగఁ దట్టి లేపెను. వినాయకుని వృత్తాంత మంతయుఁ గొంచెము కొంచెముగా నామెకుఁ దెల్పి వినాయకుఁ డరుదెంచినాఁడనియుఁ దెలిపెను. ఆ యకల్పితానందమున స్వర్గమున కరిగిన తన పతి మరల నరుదెంచుట యను నమృతముకన్న నధిక మధురవార్త విని కమల కేమితోఁచియుండునో, యామె హృదయ స్థితి యెట్లయి యుండునో, యూహించు భారము పాఠకులపై మోపుచున్నాము.

అనంతర మీ యానందవార్తఁ దెలుపుటకై యప్పాజీపంతు త్ర్యంబకరావుగారి గృహమున కరిగెను.

వినాయకుఁ డరుదెంచినకాలమున వృద్ధ రమాబాయి యింట నుండలేదు. కొంతసేపటికి వచ్చెను. త్ర్యంబకరావుగారి శ్రద్ధాభక్తులవలన నామె నెమ్మదిగా నుండెను. నిన్నటి నుండియు యామె లేచి తిరుగుచుండెను. ఆమె వంటయింట నుండెను. లక్ష్మీబాయి కమలను వదలి వంటయింటి కేతెంచెను. ప్రేమాదర్శకస్వరమున నామె మెల్ల మెల్లఁగ నా ముదుసలి మనసున కాయాస మొదవికుండునట్లు సకలము నివేదించెను.

కమల యానందమునకు మేరలేదు. ఆమె రూపమునను మార్పు కనుపట్టెను. ఒక్క క్షణ కాలమునకుఁ బూర్వముండిన ప్రేతకళ మాయమై పోయి యామె ముఖమండలమున నానందారుణ కళలు నెలకొనెను. జలమున, స్థలమున, కాష్ఠమున, పాషాణమున అన్నిటియందును నానందము దృగ్గోచరము కాసాగెను. ఆ వెంటనే యా బాల లేచిపోయి, ప్రాతఃకృత్యములు నెరవేర్చి కచేరి చావడి కరుదెంచెను. అచట వినాయకరావొక్కఁడె వార్తాపత్రికఁ జదువుచుఁ గూర్చుండి యుండెను కమల తన కనుదమ్ములను వికసింపఁ జేసి, యాతురముతో, నాతని జూచుచు నిలుచుండెను. ప్రేమానందములు ప్రబలమై యామె దిఙ్మాత్రయైపోయెను ! నోట మాట వెడలదు ! ఈ వికార మామె శరీరమంతటను గగుర్పాటొదవించెను ; నేత్రకమలములు నాలుగును ముకుళితము లయ్యెను ! కను మూయునంతలో నామె వినాయకుని బాహుపంజరమున బద్ధయై పోయెను !

ఇచట రమాబాయియు నానంద తన్మయయై పోయెను. ఆమె వినాయకుఁ డున్నెడకుఁ బోయి, పరస్పర బాహుపంజర బద్ధులై యుండు నా యిద్దఱ నిట్టే కౌగిఁలించి, ప్రేమానందాశ్రువుల నాయిద్దఱకు మంగళ స్నానముఁ గావించెను.

అప్పాజీపంతున కీదినమె దీపావళీ మహోత్సవమయ్యెను వినాయకుడు బరోడాతంత్రీ వార్తా కార్యాలయాధికారి యగు శ్రీధరపంతున కంపిన తంతి కా మరునాఁడె జవాబువచ్చెను. సవిస్తరముగఁ దంతినొసఁగుట కలవికానందున లేఖయే వ్రాసియుండెను అం దిట్టులుండెను :


"అప్పాజీ పంతులుగారి కొకటివెంట నింకొకటిగాఁ బంపిన రెండు తంత్రీసందేశములుఁ గొని కృష్ణరావు దేశాయి యను గృహస్థుఁడు తానె స్వయముగాఁ దెచ్చి యుండెను. వానిపై 'మనోహరపం' తని వ్రాలుండెను కృష్ణరావు పక్షము దినముల క్రిందట నీయూరునకు వచ్చిన 'శ్రీ సంగీత నాట్యసమాజము' వారితోఁగలిసి వచ్చియుండెను. నాకతనితో బరిచయము లేదు. ముఖపరిచయమే. అన్నియుఁ దిన్నఁగా విచారణ సేయఁగాఁ దెలిసిన విషయము లివియే."

ఈ విషయముఁ జదివి వినాయకున కింక నొకటి జ్ఞప్తికివచ్చెను. ఈ కృష్ణరావు బరోడాకు నటకులతో వచ్చియుండుటజే, నాతఁడు తరచుగాఁ దనకడకు వచ్చుచుండెను. అట్టి సమయములలో నొకనాఁడు మాటలవరుసను "నేను దీపావళీ పండుగ కింటికివచ్చెద" నవియుండెను కావునఁ దానేనాఁడు బయలుదేరినదియు జాడతెలిసి యీ కృష్ణరా వీకృత్సితకృత్య మొనర్చి యున్నాఁడని తేటపడెను ఇది యిట్లని యప్పాజీపంతునకుఁగూడ వినాయకుడు తెలిపెను ! కమల కృష్ణని ప్రేమ నిరాకరించి, ప్రేమభంగ మొదవించియుండి నందున నామెకుఁ దీర్ఘ కకాలవైధవ్య దుఃఖ మొదవించి, యీరీతిని దనసూఁడు తీర్చుకొనెను ! మనస్సమాధానముఁ గావించుకొనెను ! కాని, ఇందున వాని మనసున కెంతటి సమాధాన మొదవి యుండునో దైవమెఱుగును !

పౌరాణిక కృష్ణలీలలు మనమందఱముఁ జదివి యున్నాము. కాని, మన ఈ యాధునిక కృష్ణ లీలలకు, నాలీలకు నెంత భేదమున్నదో యాలోచింపుఁడు !

అప్పాజీ పంతుగారి గృహమున నందఱకు - అందు ముఖ్యముగా గమలకు భీషణాంధకార భరితమైన యమావాస్యనిశవలె దుర్భర దుఃఖమయ కాళరాత్రి సమాప్తిచెంది ఆనందమయ సుప్రభాతమయ్యెను. ఈ సుప్రభాత సమయమునఁ బ్రశాంతమును, తేజోమయమును బాలారుణ సువర్ణకిరణ ప్రసారముల నప్పాజీపంతుగారి కుటుంబము విలసిల్లెను ! ☐

(ఈ కథ 1927 ఫిబ్రవరి భారతిలో మొదటి సారిగా ప్రచురింపబడింది !)



కీ. శే. రేకళిగె మఠం వీరయ్య

మల్లికార్జునపండితుడు కళ్యాణ బసవేశ్వరుడు

మల్లికార్జున పండితుడు ద్రాక్షారామమందలి భీమేశ్వరలింగ దేవాలయ పూజారి కుమారుడు. అతడు శ్రీశైల మల్లికార్జునుని వరప్రభావమున జన్మించిన వరప్రసాద. కనుకనే అతని తల్లిదండ్రులు అతనికి మల్లికార్జున పండితుడను పేరును బెట్టిరి. అతడు వేదవేదాంగాది షట్ శాస్త్రకోవిదుండు. ఉద్దామపండితుడు. మహాజ్ఞాని. లింగదీక్షను బొందిన లింగధారి. వీరమహేశ్వరాచార సంపన్నుడు. ఇట్టి మహనీయుడైయుండియు, తన అంత్యకాలమునందు కళ్యాణ కటకమునకు "పోయి బసవేశ్వరుని" సందర్శించ తలంచెనని, అతని చరిత్ర తెలుపుచున్నది.

బసవేశ్వరుడు, కలియుగమునందు శ్రీపర్వతమే మూలస్థానము"ని, శ్రీశైల ప్రాశస్త్యమును తెలిపెను. ప్రభుదేవుడును త్రికూటమను మహాగిరి కొట్టకొనకెక్కి చూచిన, బట్టబయలును గనవచ్చును చూడమ్మా"యని, అక్కమహాదేవికి "చెన్న మల్లికార్జునునియందు ఐక్యమగుటకు యోగ్యమగు స్థానము శ్రీశైలక్షేత్రమేనని తెలిపెను. అటులనే ఆమె ఆ క్షేత్రమందలి కదళీ వనమునందు లింగైక్యమయ్యెను. స్వయముగా ప్రభుదేవుడును, కళ్యాణమునందలి రక్తపాతమునకు కొంత మొదలు తన భౌతికకాయమును చాలించ తలంచి, శ్రీశైలక్షేత్రమే తాను ఐక్యమగుటకు యోగ్యస్థలమని తలంచి, అచ్చటికేపోయి బయలయ్యెను. సిద్ధరామేశ్వరుండును, బాల్యమునందు, శ్రీశైలక్షేత్రమునకుపోయి పూర్వార్జిత ద్రవ జ్ఞానానుభూతి వలన తన హృదయాంతరాళమునుండి, శ్రీశైలమల్లికార్జునుని, "మల్లయ్యా! మల్లయ్యా!" అనుచు అచంచలభక్తితో, వలచి పిలచి, పలుకకున్న విలపించి తుదకు ప్రాణత్యాగముచేయ తలంచెను. పరమేశ్వరుడు అతని ముగ్ధ భక్తికి మెచ్చి ప్రసన్నుడై అతనికి యోగస్థితిని, ఆ క్షేత్రమునందే ప్రసాదించెను. మహదనుభావి లింగమ్మ(హాథపద అప్పన్న ధర్మపత్నికూడ శ్రీశైలక్షేత్రమునందలి కదళివనమును దేహమందలి కదళితోపోల్చి, పరమార్థ సాధనమునకు ఆ కదళీవనమే ముఖ్యమని తెలిపెను. ఇటులనే అనేక యోగులు, మునులు, సిద్ధులు, అనుభావులు తమ తమ జపయోగ నిష్ఠలవలనను శివసాక్షాత్కారమును ముక్తిని సాధింపగలుగుటకు అనుకూలమైన మహాక్షేత్రమది.

మల్లికార్జున మహాలింగము స్వయంభులింగము. ప్రపంచమందలి ద్వాదశ జ్యోతిర్లింగములలోనిది ప్రసన్నలింగము. మానవజాతికంతకును స్వయముగా స్పర్శించి దర్శించునటులు అనుగ్రహమును ప్రసాదించుచున్న మహాలింగము. ఈ క్షేత్రము నిర్మల నిర్జన ప్రశాంతక్షేత్రము. ఇంతటి మహిమాన్వితమగు మల్లికార్జున మహాలింగ వరప్రసాదయైయుండియు, మల్లికార్జున పండితునకు అంత్యకాలమున, కళ్యాణమునకు ప్రయాణముజేయు కోర్కె గలుగుటకుగల విశేషమేమి?

అందుకు రెండు కారణములు గావచ్చునని నాకు తోచుచున్నది. అప్పుడు కళ్యాణమునందు బసవని అనుభావ ప్రకాశము, త్రిగుణాత్మకమగు దాసోహభక్తి బిజ్జలుని వీరప్రతాపము. రాజ్యలక్ష్మి ప్రసన్నత, వచన సాహిత్యాభివృద్ధి. ఊర్జిత స్థితియందుండెను. బసవన్న వలదన్నను అతని కీర్తివార్తలు, దిగదిగంతములయందు వ్యాపించుచుండెను. ప్రమథగణములు, రుద్రగణము అమరగణములు. పురాతన గణములు, మహాలింగైక్య సంపన్నగణములు మొదలగువారందరును. బసవని "మహామందిరము"నందు, బసవడు అర్పించి, అర్పించు ఆరో గణముల వలనను, అడిగినదిచ్చు బాసను చెల్లించుచుండుటవలనను; సంతుష్టులగుచుండిరి, అనుభవ మంటపమునందలి అనుభావ గోష్ఠులవలన లింగాంగ సామరస్యానుభూతిని పొందుచుండిరి. వేయేల బసవని భక్తి బండారము వలనను, జ్ఞానప్రకాశమువలనను ఆనాటి కళ్యాణము, భువన కైలాసముగా మారియుండెననిన, అతిశయోక్తిగాదు.

ఆ కారణము వలననే, ఇహపరములను సాధించి జన్మను తరించనెంచిన జిజ్ఞాసువులు అనేకులు దేశమునంతటి నలుమూలలనుండి కళ్యాణమునకు ప్రయాణమై వచ్చుచుండిరి. కళ్యాణమునుండి వచ్చుచుండెడి శరణులవలన అమరావతియందున్న మల్లికార్జున పండితుడు బసవని భక్తి దాసోహ ప్రభావమును, అనుభవ మంటపము నందలి అనుభావ గోష్ఠుల వివరములను విని ప్రభావితుండై స్వయముగా బసవని సందర్శించవలయుననియు, అనుభవ మంటపమునందలి అనుభావ గోష్ఠులవలన లాభమును పొందవలయునను కోర్కె అతనికి జనించుట సహజమే! పండితారాధ్యుని గురించి,

> "బసవ కుమారుని పజ్జను నీవు
> వసుధను శివభక్తి వర్ధనార్థము నరుగుము"

అను శివుని యాజ్ఞవలన భూలోకమునందు, శివభక్తి ప్రాబల్యముచేయుటకై యవతరించిన నొక శివగణమే (భృంగి) మల్లికార్జున పండితుడను పురాణ సాహిత్యముగలదు. అటులనే శివగణములలోని ముఖ్యుండగు నంది, భూలోకమునందు బసవడను పేరుతో వీరశైవ మతోద్ధరణమునకై యవతరించినటులు, బసవని గురించియుకూడ నొక పురాణ ప్రశంసగలదు. అందువలన వారిరువురును శివగణములలోనివారు, సన్నిహిత సంబంధముగలవారు, వారి యవతారములగురించిన కారణములుకూడ ఇంచుమించుగా నొక్కతీరునవే యనవచ్చును. శైవ ప్రభేదములలో ఉచ్చమైనది వీరశైవము. అట్టి వీరశైవమును పునరుద్ధరించుటకనియే వీరిరువురు యవతరించిరనవచ్చును.

మల్లికార్జున పండితుడును, బసవేశ్వరునివలనే గురువుచే లింగదీక్షను పొంది లింగధారియై, విభూతి, రుద్రాక్ష, పంచాక్షరి మహామంత్రము, గురులింగజంగమములు పాదోదక ప్రసాదములను అష్టావరణములందు నిష్ఠగలిగి ఇతరులకును బోధించిన శుద్ధ వీరమాహేశ్వరాచారసంపన్నుడైయున్నట్లు, అతని "శివతత్త్వ సారము" నందలి పద్యములవలన తెలియుచున్నది.

బసవేశ్వరుని బోధలయందును, మల్లికార్జున పండితుని బోధనలయందును సామ్యముగలదేగాని, వైరుధ్యములేదు. బసవేశ్వరుడు "శివభక్తులగు వారనందర నొక్కటే;" అనియు, లింగాంగులయందు జాతిననుసరించి పంక్తిభేదము చేయరాదనియు, బోధించెను. "మానవులందరు ఉచ్చ నీచ తారతమ్యము పుట్టుకతో నుండకూడద"నియు, ఆ తారతమ్యము సంస్కారముల ననుసరించియుండవలయు" ననియు, ఆ సంస్కారములను పొందు అర్హత అందరకును గలదనియు, వర్ణభేదముగాని' జాతిభేదముగాని, వయోభేదముగాని, వర్గభేదముగాని అడ్డురాకూడదనియు, ఘంటాపథముగ అతడు తెలిపెను.

మల్లికార్జున పండితుడును, "శివభక్తులంగని, జాత్యాది విచారము విడువవలయు-దృఢభక్తిమెయిన్" అని శివభక్తులగు లింగధారులందు కులభేదము నెంచకూ"డదను, బసవని సమతా వాదమునే సమర్థించెను. బసవని అహింసా వాదము ననుసరించియే, పండితుడును యజ్ఞయాగాది హింసాత్మక కర్మలను శుష్కకర్మ కమార్గములను గర్హించి భక్తిమార్గమే ముక్తికి సాధనమని తెలిపెను. ఇది కర్మలతవలెనున్న జంధెమును నిరాకరించిన బసవని తత్త్వము ననుసరించియే యున్న దనవచ్చును.

ఇట్టి విశిష్టమగు శివభక్తిగలిగి, శుద్ధవీరమాహేశ్వరాచార సంపన్నుడైన మల్లికార్జున పండితుడు "భక్తిమీరి వలపు, బ్రాహ్మంబుతోపొత్తుబాయలేను నేను

బసవలింగా" అని అన్నాడనుట సత్యదూరమనిపించును. అతని తర్వాత వారెవరో అతడు బ్రాహ్మణుండని అనిపించుటకు అతనికి ఆ మాటను అంటగట్టియుందురని తోచుచున్నది.

ఆరాధ్య సాంప్రదాయమునకు, పండితుడు మూలపురుషుడనుటకూడ సరియైనది గాదనిపించును. మల్లికార్జునపండితునికన్న మొదలే ఇద్దరు - శ్రీపతి పండితుడు, శివలెంక మంచన్న పండితుడు - ఆరాధ్య సాంప్రదాయమునకు చెందినవారని తలంచినచో, వారి తర్వాత వచ్చిన మల్లికార్జున పండితుడు, ఆ సాంప్రదాయమునకు మూలపురుషుండెటులగును? అంతేగాక, శ్రీపతి పండితుడు-శివలెంక మంచన పండితుడు, మరియు మల్లికార్జున పండితుడు - ఈ పండిత త్రయులు, వీరశైవగణములలో గణనకెక్కినవారు ...వీరి పేర్లను. మహాశివకవి పాల్కురికి సోమనాథుడు గణసహస్ర నామావళియందు, అమరగణముల శ్రేణియందు గూర్చియున్నాడు. అందును శివలెంక మంచన పండితుడు విశిష్ట శివశరణుడు, వచనకర్త అనుభవమంటపమునందలి అతని వచనములు కన్నడ వచనసాహిత్యమునందు గణనీయములు. అతని ఒక్క వచనము అనువాదమును క్రింద వ్రాయుచున్నాను. ఆ వచనమునందు అతడు తెలిపిన ఇహపరములకు సంబంధించిన అనుభూతి పవిత్ర భక్తి తత్త్వము ఎత్తి కనిపించు చున్నది.

"పరధనమును కోరకుండుటయే వ్రతము
పరవధువును కూడకుండుటయే శీలము
ఎల్ల జీవుల చంపకుండుటయే నేమము
ఇటులాచరించు చుండుటయే నిత్యనేమము
ఇది ఈశాన్యమూర్తి మల్లికార్జున
లింగమునకు సందేహము లేనిభక్తి"

ఇట్టి విశిష్ట శరణులను, వీరశైవేతరులని తలంచి, సవైదిక శివభక్తులు, అవైదికభక్తులు అను భేదమును శివభక్తులలో కలుగజేయుట, తారతమ్యమును జూపుట అసమంజసము, అనుచితము నగుననవచ్చును.

ఆరాధ్యసాంప్రదాయ మెప్పుడు ప్రారంభమైనను, ఎవ్వరిచే ప్రారంభింపబడినను, అది పొంతనము కుదురని, పరస్పర వైరుధ్యము గల ఆచారముల కలయిక అనవచ్చును. ఆరాధ్యులు లింగమును ధరించినను, శిఖనుంచి, యజ్ఞోపవీతమును ధరించి. పంచసూతకములను పాటించుట వారియాచారము-వీరశైవులకవి వర్జనీయములు. వీరశైవులు తాముధరించుకొను ఇష్టలింగమును, శివదారముతో కట్టుకొనిన (లింగపుకాయ) సజ్జకయందుంచి మెడలో వేసుకొనవచ్చును. లేక లింగ వస్త్రమునందు కట్టి కుడిరెట్టకుగాని, లేక శిరమునకుగాని కట్టుకొనవచ్చును. లేదా మెడలో వేసుకొనవచ్చును, ఆరాధ్య సాంప్రదాయమువారి కట్టు వస్త్రమునందు కట్టుకొనరాదు. వీరశైవులు ధరించు ఇష్టలింగముపై నల్లనికాంతిని (సజ్జక్షారమును) లేపించి దాదాపు అర్ధగోళాకారగాము చేయుదురు. అందు వలన వారికి తమ దృష్టిని ఇష్టలింగమునందు కేంద్రీకరించుటకు అనుకూలముగానుండును. దృష్టియోగమునకు సాధనముగా నుండును. ఆరాధ్య సాంప్రదాయమువారు కాంతిని లేపించని శిలా విగ్రహమును పూజింతురు అందుచే వారికి, ఆలింగము దృష్టియోగసాధనమునకనుకూలముగానుండదు. శివయోగ సాధనయందు అంతరాయమును కలిగించును. వీరశైవులు ప్రసాదతత్త్వమననుసరించి, లింగార్పితముగాని పదార్థమును భుజించరు. లింగార్పితప్రసాదమును మిగులనియ్యరు. 'వీరశైవేతరులు, భోజనపదార్థములను విడిచి వృధాచేయుదురు. ఇది ప్రసాదతత్త్వమునకు విరుద్ధము.

వీరశైవులు గురులింగజంగమములను ఏకమూర్తిగా భావింతురు. అనగా గురువు, లింగము, జంగమములు మూడును సమానమని వారిసిద్ధాంతము. అందును గురుజంగమములు ముఖ్యమని వారి భావము. అనగా భక్తుడు ఇష్టలింగపూజయందున్నప్పుడు గురుజంగమములు అరుదెంచిన ఆ లింగ పూజను ఆపి,గురుజంగమములను రావించి, ఉపచరించి, ఆర్చించి, తమ లింగపూజనేమమును పూర్తిచేసుకొనవలయునని వీరశైవుల నియమము. ఆరాధ్య సాంప్రదాయమువారు అట్లుచేయరు.

ఇట్టి సన్నివేశము బసవేశ్వరుని జీవితమునందును, పండితుని జీవితమునందున గలిగినది. ఇద్దరును పై నియమముననుసరించియే ప్రవర్తించినారు. అల్లమప్రభువు సిద్ధరామయ్యను చేపట్టి, అతని హఠయోగమందలి. ఉగ్రశక్తిని శాంతింపజేసి, శివయోగమును తెలిపి కల్యాణమునందలి బసవాది భక్తుల అనుభావములను చూపించుటకని బసవని మహామందిరమునకు పిలుచుకొని వచ్చును. ఆ సమయమున బసవేశ్వరుడు కరస్థలమందలి ఇష్టలింగమునందు దృష్టిని నిలిపి శివధ్యానమగ్నచిత్తుండై యుండును. బసవేశ్వరుడు వారి రాక తెలియగానే ఇష్టలింగ నిష్ఠయందున్న తాను స్వయముగా వారి కెదురేగి స్వాగతముచెప్పి, పిలుచుకొనివచ్చుటకుమారుగా అప్పన్నను పంపును, అప్పుడుచెన్నబసవన్న.

అంగము పైలింగము గల వారినందరిని
సంగమ నాధుండని నమ్మిన నమ్మకము
వచ్చిన శరణులనిలువు నరయకున్న
ఖచ్చితముగా తప్పెను చూచితివా, గురువే!
సంగమనాధుండు సాంగముగ ఇంటికివచ్చిన
దిగ్గున లేచి ఎదురేగి నమస్కరించవలయు చూడయ్యా!
కూడల చెన్న సంగయ్య శరణులు
ప్రభుదేవుడు, సిద్ధరామయ దేవుడు
వాకిట నిలుచున్నది కన్నులకు తెలియకున్న
ఆత్మకు తెలియ వలదా, సంగన బసవన్నా"

అని హెచ్చరించును "ద్వారముముందట స్వయంలింగమగు, ప్రభుదేవుడు వేచియుండగ, అతనిని విస్మరించుట తప్పగున"ని, చెన్నబసవన్న బసవన్నకు-తెలిపెను. అప్పుడు బసవన్న దిగ్గున లేచి ప్రభుదేవునకు సాష్టాంగ ప్రణామమాచరించి క్షమాపణ వేడెను.

ప్రభువు

"కులట కొందరిని కూడెనని
నిందించు వారుందరు వింటివా.
కులకాంత తన పతినిగాక
మరొకరి ముఖమును జూచిన
దానిని ఛండాతయనునులోకమెల్ల,
కీర్తివార్తలకై భక్తిని జేయుభక్తుడు
తప్పిన అది గణనకురాదు.


సజ్జన సద్భక్తుండవై కొంత తప్పిన
అది సైరింపరానిది వింటివా ?
మాగు హేశ్వర లింగమందు
ఆదికిని ఆదినుండినీవే
భక్తుండవైయున్నందున నీ తప్పువలన, మనస్సు
నొచ్చెను చూచితివా, సంగన బసవన్నా !"

అనుచు, బసవేశ్వరునకు, ఆచారవిధిని తెలిపెను. అప్పుడు ద్వారము ముందల వేచియున్న గురుజంగమములను లోపలికి వేంచేయుండని, విన్నవించి, అర్ఘ్యపాద్యాదుల నిచ్చి అర్చించి, వానిలింగార్చనవెంబడి తనలింగార్చన నేమమును బసవన్న, పూర్తిగావించుకొనెను.

ఇదే ప్రకారముగా, పౌరండ్ల సూరసానమ్మయను భక్తురాలు. మరియు బలిదేవి వేమనారాధ్యుడు, మరికొందరు జంగమములు మల్లికార్జున పండితుని చూడ వచ్చినప్పుడును, అతడు శివపూజామగ్నుడై యుండెను. ఆ వచ్చిన జంగమములను లింగస్వరూపులేయను భావముతో అతడు తన శివపూజను ఆపి, వారిని సత్కరించి, వారితోసహా తన శివపూజనియమమును కూడ పూర్తి చేసుకొనెను. ఇది "ఏకమూర్తి త్రయోర్భాగం, గురులింగంతు జంగమం"అను వీరశైవుల సూత్రమునకు ప్రతీకము, అంతేగాక, "శరణసతి-లింగపతి" అను సూత్రప్రకారము వీరశైవులు అన్యదేవతార్చనములు జేయరు. అవి వారికి వర్జితములు స్థావరలింగపూజకన్న ఇష్టలింగపూజయేవారికి ప్రాముఖ్యము, ప్రాధాన్యము, ఆరాధ్యసాంప్రదాయమునందు ఇట్టి ఆచారములు కనిపించవు. ఆరాధ్యసాంప్రదాయమునందును, వీరశైవుల ఆచారములందును ఇట్టి వైరుధ్యములు ఇంకను కనుపించును. కనుక వీర మాహేశ్వరాచార సంపన్నుండగు మల్లికార్జున పండితుని ఆరాధ్య సాంప్రదాయమునకు ప్రవర్తకుండనుట పొసగదని నా భావము.

బసవేశ్వరుడును, పండితారాధ్యుడును కైలాసమునందలి శివగణములలోని ముఖ్యులు, మర్త్యలోకమున వీరశైవమత ప్రాశస్త్యమునుచాటి, ఆ మతము నభివృద్ధిచేయుటకై యవతరించిన, అమరగణములు, వారిరువురిని వరుసగా, లింగాయత మత ప్రవర్తకుండనియు, ఆరాధ్యసాంప్రదాయ ప్రారంభకుడనియు అనుట భ్రమయే యగునని నా భావము. వారిరువురు ప్రత్యక్షముగా ఒకరి నొకరు చూచియుండకున్నను, ఆధ్యాత్మికముగా వారిరువురు పరస్పరముగా సంబంధము కలిగియుండిరనియే అనవచ్చును కనుకనే, పండితుడు.

"వల్లభ నీ యాజ్ఞ వచ్చిన పనులు



సెల్లబెట్టితి భక్తి చేవదలిర్ప
వాసనతో బసవనయు నీగర్భ
వాసంబుఁ జొచ్చె దేవా పర్వతేంద్రా"

అనుచు, బసవేశ్వరుడు వచ్చిన పని పూర్తియైనందున, అతడు నీయందు ఐక్యమయ్యెననుచు, తానును వచ్చిన పని పూర్తియయ్యెనని తలంచి, తన భౌతికకాయమును చాలింతునని పర్వతేంద్రునకు తెలుపుచు బయలయ్యెనని, అతని చరిత్ర తెలుపుచున్నది. కనుక వీరిరువురును కూడ వీరశైవ మతోద్ధారకులు, అనుయాయులు అనుటయే యుచితము.

ఈ సందర్భమున మల్లికార్జున పండితుడు తెలిపిన శివభక్తి పై తనవలపు, యజ్ఞయాగాది కామ్యకర్మల నిరసనము, వర్ణ విభేద నిర్మూలనము, పంచసూతక వర్జితములు మొదలగుకొన్ని సిద్ధాంతములను అతని "శివతత్త్వ సారము"నుండి (పద్యములను) ఉటంకించుట అసమంజసముగాదని తలంచెద.

"ఒండేమి భక్తిసంగతి
జండాలుండైన భూతిశాసనధరుఁడై
యుండిన బూజ్యుండె యతనికి
ఒండసఁ గాజనదు భక్తి యోగమున శివా." (119)

"విను పరుసవేది సోకిన
యినుము క్రియన్నిన్ను గొలిచియెవ్వండైనన్
ద్రినయన యుత్తముఁడనఁబడు
పోనఁదగ శివభక్తుఁడగ్ర పూజ్యుండగుటన్." (120)

"అవి చారంబున నెప్పుడు
శివశాసన పూజనంబు సేయఁగ వలయున్
శివభక్తుఁగని జాత్యా
దివిచారము విడువ వలయు-దృఢభక్తి మెయిన్ (121

"జాత్యాది సూతకంబులు
హత్యాది సమస్త పాతకాదులు శివ నీ
భృత్యుల బొందునే జలములు
నిత్యస్థితి బొందనేర్చునే జలజములన్." (128)

"శ్వపచుండైనను, శివ భ
క్తిపరుండగునేని నతఁడర్విజ వర్యుండా
శ్వపచునకు గీడు శివ భ
క్తిపరాఙ్ముఖుఁడైనయట్టి ద్విజుడు మహేశా." (194

"నీ నిజభక్తుఁడంత్యజుఁ
డైనఁబవిత్రుండు పూజకర్హుడు జగతిన్
'లేన సహసంవసెత్తోని
గానప్రియ శృతులు మ్రోయుఁగాన కపర్ది" (131

బసవేశ్వరుని వచనములయందు ఇట్టి తత్త్వములను బోధించు వచనములనేకములు గలవు. మల్లికార్జునుని పద్యములందు ఆ వచనములందలి భావసామ్యమేకాక, అనేక పద్యములందు శబ్దసామ్యములుకూడ కలవు. అందుచే వారిరువురు ఒకే పనిగురించి వచ్చిన ఏకాభిప్రాయులనియే తెలియును. వారు వేరువేరు సాంప్రదాయముల అనుయాయులనుట పొసగదని నా భావము.

[శివ భక్తాగ్రేసరలు, చివరివరకు శైవసాహిత్యాభివృద్ధి గురించి శ్రమించిన, శివైక్యులు శ్రీ నిడదవోలు వెంకటరావుగారి స్మారక నిమిత్తము, "భారతి" సంపాదకులు శివశ్రీ శివలెంక రాధాకృష్ణగారు, శివైక్యుల పేరుతో నొక స్మరణ సంచికను వెలువరింపవలచినారని తెలిసినందున, శివైక్యులు 1963 లో పరిష్కరించి ప్రకటించిన, మల్లికార్జున పండితుని "శివతత్త్వ సారము"నాధారముగాగొని వ్రాసిన ఈ వ్యాసమును, వెంకటరావుగారి స్మరణసంచికయందు ప్రకటించి గౌరవించినందులకు వారికి నా కృతజ్ఞతాభివందనములను తెలియజేయుచున్నాను.] □

విషాదనయనం

శ్రీ నందినిసిధారెడ్డి

మృత్యువు జీవితానికి దగ్గరగా జరుగుతుంది
ఎప్పుడెప్పుడో నువ్ మాట్లాడిన మాటలన్నీ పూలకిమల్లే
ఇప్పటికీ స్వచ్ఛంగానే ఉంటాయి

నల్లటి తార్నాకా రోడ్డు విశాలమై మన అడుగుల అలజడికోసం
ఎదుర్చూస్తూనే ఉంటుంది

ఇరానీ హోటళ్లూ ఇరుగ్గా నా హాస్టల్ గదీ
నీ మాటల సందడికోసం మనసు పడుతూనే ఉంటాయి

అర్జెంటుపనిమీద నువ్వెక్కడ పిలుస్తావోనని అప్పుడప్పుడూ
అక్కడక్కడా

ఆటోలు చెవులు రిక్కిస్తూనే ఉంటాయి
మృత్యువు జీవితానికి దగ్గరగా జరుగుతుంది
నువ్వెక్కిన ఆటో వెనకాలే నంగనాచిలా దొంగప్రయాణం
చేస్తుంది

క్యాంపస్‌లో రెపరెపలాడుతున్న నా మొగమాటాన్ని తప్పించి
బలవంతంగా నా జేబులో నువ్వుంచిన ఋణం మెరుస్తూనేవుంది
మన జ్ఞాపకంగా నా దగ్గరుండాల్సిన 'మైనా'
ఇవాళ ఎవడి చేతిలోనో విలవిల్లాడుతుంది
నువు ఎంతో జాగ్రత్తగా కట్టుకుంటున్న ఇల్లు మధ్యలోనే
ఆగిపోతుంది

తల్లీ తండ్రీ లేక యిద్దరు పిల్లలూ
దారుణంగా వీధిలోకి నెట్టివేయబడతారు
ఆకాశం ఒళ్లు తెగినట్టు భోరున వర్షిస్తుంది
నాచుట్టూ మెదక్ వీధులన్నీ శోకనదులై వేళ్లాడుతుంటాయి

కసిగా
నగరానికి దూరంగా విసిరేయబడ్డ నాకు
కనెక్షన్ తెగిపోయి
వీర్రాజుగారి ఉత్తరం దుఃఖిస్తేతప్ప విషాదమేఘం వాలిందని
తెలియదు

మృత్యువు నీ జీవితానికే ఎసరు పెట్టిందని ఏంతమాత్రం
తెలియదు

కడుపు విప్పడానికీ ఒక్క స్నేహితుడూ ఉండడిక్కడ
హృదయం పరవడానికీ ఒక్కంగుళం జాగా ఉండదిక్కడ
విచారమూ వర్షమూ కలిసి నా ఒంటరితనాన్ని కుళ్ళబొడుస్తాయి
అక్షరమో కాగితమ్ముక్కో విషాదాన్ని కొంచెం కొంచెమైనా
అద్దుతాయి

మృత్యువు క్రూరంగా జీవితాన్ని కబళిస్తుందనటానికి
సాక్ష్యం నువ్వే

కురిసినవాన చినుకుల మధ్య
గుంటలో పేరిన బురదనీటిమీద
జ్ఞాపకాలు బుడగల్లాపుట్టి ఆరిపోతుంటాయి
రెప్పలకీ కన్నీళ్ళకీ మధ్య నల్లటితెర పల్చబడి
స్మృతులు అల్లుకుంటాయి

[వట్టికోట అళ్వారుస్వామి మీద పరిశోధన చేసిన మిత్రుడూ, ఆత్మీయుడూ శ్రీ కె. వి. యస్. రాజు ఇటీవల ఆటో ప్రమాదంలో మరణించాడని శివాజి తెలిపినప్పుడు

****

జీవనగాంధర్వం

శ్రీ భువనగిరి నాగరాజు

ఎందుకింతగా రోదిస్తావ్?
ఎందుకిలా క్షోభిస్తావ్?
ఎండిన ఎదను తడిచేస్తు
మండే గుండెను ఓదార్చుతుంది–

అశ్రుసుధ–
వృధాచేయకు.
వికసించే పూవును
నేలరాల్చడం ఒక ఆట.

మ్రోగుతున్న తీవెను
తెంచడం విధికి ఒక పాట.
వీచేగాలి తరక
వెదురుపొద
ఎదురైందని తిరోగమిస్తుందా?
దూసుకుపోతుంది
మురళిలా రవళిస్తుంది!
గలగల సాగే సెలయేరు
గండశిల కౌగిలిస్తే ఆగుతుందా?

విషాహిలా ఎగిసిపడుతుంది–పరుగుతీస్తుంది!

జీవితం–
వెలుగుచీకట్ల విషాదహేల
సుఖదుఃఖాల పాంథశాల
జిలుగు తెరలు తొలగించిచూడు–
జీవన గాంధర్వంలో
హసనం ఒక మహారాగం!
రోదనం ఒక ప్రాణస్వరం!!

శ్రీ చీమకుర్తి శేషగిరిరావు

తెలుగు శాసనాలలోని కొన్ని పద గ్రంథులు

ప్రాఙ్నన్నయ యుగానికి చెందిన తెలుగుభాషా వికసన రీతిని తెలిసికొనడానికి, అప్పటి శాసనాలే ముఖ్యాధారాలు. ఆశాసనాలలో వాడిన పదాలనేకాలు నన్నయ కాలమునాటికే పండితలోకపు వాడుకనుండి తొలగిపోయినవి. ముఖ్యముగా దేశిపదముల విషయంలో ఈ అనాదరణ ఎక్కువగా కన్పడుతుంది. సంస్కృత పదాలపై మోజు ఎక్కువగుటే ఇందుకు ఒక కారణంగా మనము భావించవచ్చును. ఇందువలననే నన్నయకాలము మొదలుగ మనకు ఉపలబ్ధమగుచున్న తెలుగు సాహిత్యంలో ఆ పూర్వపు శాసనశబ్దాలలో ఎక్కువ భాగము కానరాకున్నవి. సాహిత్యంలో చోరలేకున్నను, అట్టి పదాలలో కొన్ని నన్నయకు తరువాత కూడ రెండు మూడు శతాబ్దాల వరకు శాసనాలలో మాత్రము తమ అస్తిత్వాన్ని కాపాడుకొనుచు మనుగడనుసాగించగలిగినవి కాలక్రమేణ ఈశబ్దములు పాతవడిపోయి, సరియగు అర్ధములు తెలియరాని దుస్థితికి లోనై భాషనుండియే లుప్తములైనవి: ఇందువలననే ఆంధ్రభాషా భూషణము మొదలుగ వెలువడిన తెలుగుపద్య నిఘంటువులలో వానికి ఆదరణ శూన్యమైనది. ఆధునిక యుగమున అకారాది పదక్రమమున వెలువడిన తెలుగు నిఘంటువులందుసైతము, పూర్వకాలపు శాసన శబ్దాలలో ఒకటి రెండు తప్ప, తక్కినవానికి స్థానమే లభించినది కాదు.

తెలుగుదేశమున ప్రాచీన శాసనముల పఠన పరిష్కరణలు 19వ శతాబ్దపు పూర్వార్ధమున కర్నల్ కాలిన్ మకంజీగారి గుమాస్తాలగు కావలి వెంకట బొర్రయ్య మొదలగువారితో మొదలైనవి తదాదిగ ఆ కృషి సాగుచునే ఉన్నది. పాతవడి, వాడుకలోలేని ప్రాచీన శాసన శబ్దముల అర్ధమును వివరించుటకై తమ శక్తికొలది ఆయా పండితులు యత్నముచేసినది యదార్ధమే అయినను ఇప్పటికిని అనేక పదాలు కొరుకుడు పడకుండ ఉన్నవి. అర్ధకల్పన సరిగా జరుగక ఇట్టి పదాలకు, ఏదియో ఒక తీరున ఒక 'అర్ధమును' ఊహించి శాసనాలను వివరించుట వలన, కొన్ని పట్టులందు విపరీతార్థములును ఏర్పడినవి. ఇట్టి పులిమి పూతవలన శాసనముల భావమే మరుగువడుటయు కొన్ని ఘట్టములందు జరిగినవి. దేశిపదముల విషయమున మాత్రమేగాదు; కొన్ని తత్సమాదుల విషయమునకూడ ఇట్టి అకార్యమే సంఘటిల్లినది.

తెలుగుదేశపు శాసనములందలి శబ్దములకు, అకారాదిగా అనుక్రమణికా రీతిలో అర్ధవివరణచేయు నిఘంటువులను వెలువరించుటకును తెలుగున ఈ నడుమ కొంత కృషి సాగినది. అందు తొలుతగ పేర్కొనదగినది కుందూరి ఈశ్వరదత్తుగారి 'శాశన శబ్దకోశము' (శా. శ. కో.) ఇక రెండవది డా॥ బూదరాజు రాధాకృష్ణగారు సమకూర్చిన 'ప్రాచీన శాసనాలు' (ప్రా.శా.) వానిలో రెండవదానియందు క్రి, శ. 1100 వరకు తెలుగుదేశమున అటనట వెలువడిన శాసనములందలి కొన్ని భాగాలను తెలుగు భాషా వికసన రీతిని వివరించు సంకల్పముతో ఒక క్రమమును అనుసరించి డా॥ రాధాకృష్ణగారు అందుచేర్చి, దానికి అనుబంధముగ ఒక పదకోశమును జతపరచిరి; ఆయా శాసనభాగములందలి కొన్ని క్లిష్ట పదాలను ఈ అనుబంధమున అకారాదిలో అమర్చి, వానికి అర్ధ వివరణలన్న వ్యుత్పత్త్యర్థములను గురించిన సంక్షిప్త సమాచారములను తెలియజేయుట అట జరిగినది. కొన్ని పదముల అర్థ నిర్ణయమున దత్తుగారి ప్రా. శ, కో. నుంచి బూద రాజువారి ప్రా. శా. విభేదించు చున్నది. ఇది ఎటులున్నను ఈ ఇరువురు సంకలన కర్తలును తమకు పూర్వులగు శాసనపరిష్కర్తలలో తమకు నచ్చినవారి అభిప్రాయములకు అద్దము పట్టితిరేగాని, ఆయా శబ్దములకు ఈయబడిన అర్థముల ఔచిత్య, అనౌచిత్యముల విషయములపై చర్చించినవారుకారు. అందువలన పూర్వము నుండియు అర్థము గాకుండ నుండిన పద గ్రంథులు విడివడకుండ అట్టులే నిలచిపోయియున్నవి.

ఈ పరిస్థితిలో ప్రాచీన శాసనములందలి పద గ్రంథములను సరిగా అర్థము చేసికొనుటకై తగు కృషి తప్పక జరుగవలసి ఉన్నది. ఆ కృషిలో అంతర్భాగముగ, ఈ దిగువన కొన్ని పదాల అర్థ నిర్ణయ చర్చ సాగినది. ప్రస్తుతమునకు ఇది అయిదు పదములకు మాత్రమే పర్యాప్తము.

1. అడ్లుపట్టు (అడ్లపట్టు అళ్లపట్టు)

తెలుగుదేశపు శాసనములలో తెలియవచ్చినంతవరకు, ప్రాచీనతయందు రేనాటి చోళుల శాసనముల తరువాత లెక్కకు వచ్చెడి తూర్పు చాళుక్యుల శాసనములలో తొలుతటినుండియు ఎడ నెడ ఈ పదము కానవచ్చు చున్నది. దీనికి పై శాసనశబ్ద నిఘంటువులు ఈ దిగువ అర్థములను ఇచ్చినవి.

అడ్లపట్టు : అడ్లు, అళ్ళు, కోద్రవము, సస్యవిశేషము, కొంత కొలమానమైన అళ్ల విత్తనములుగా జల్లదగినంత భూమి. ఈ భూపరిమాణ విశేషము, బీజావాపక్షేత్రము. (ప్రా. శ. కో.)

అడ్లు : ఒక రకం ధాన్యం, అళ్లు, అరిగలు. ఎ కైన్డ్ ఆఫ్ గ్రెయిన్ ఈట్న్ బై ది పూర్. (ప్రా. శా.)

పై వానిలో రెండవదానిలో 'అడ్లపట్టు' అనే పదము వేరుగ ఈయబడకున్నను 'అడ్లు' అనే పదపు అర్ధ వివరణలో మాత్రము తొలుతటి దానితో ఏకీభవించు చున్నది. అందువలన 'అడ్లపట్టు' అనే దానికి అర్థము. విషయమున పై రెండింటి మధ్య అంగీకారము ఉన్నటుల విస్పష్టము. ఒక పుట్టి అడ్లపట్టు అనగా వీరి భావమున 'ఒక పుట్టి అళ్ళను విత్తుటకు సరిపోవు భూమి' అని అర్థము.

ఈ అర్థము వివిధ శాసనములలో, ఔచిత్యానికి, ప్రపంచానుభవానికి సరికుదిరే రీతిలో అతుకుచున్నదా-అనే విషయాన్ని గ్రహించుటకు ఈ క్రింది శాసన పాఠాలు వుపకరించగలవు.

I ...విత్పత్తి ఉత్తరంబున పులొంబున దెఱువు పడుమారికోటన్ ఎఱుంబొది పుట్ను అళ్లపట్టు యస్. ఐ. ఐ. 6 584—విప్పర్ల శాసనం (క్రి.శ. 641)

II. ....పాణ్డురంగు పరమ మహేశ్వరుణ్ణు ఆదిత్య బటరనికి ఇచ్చిన భూమి ఎనుబొది వుడ్ల అడ్లుపట్టునేల దమ్మ పురంబున....ఇ. ఐ. 19 47.
అద్దంకి శాసనము—(క్రి. శ. 848)

III. ....కణ్డ్రిదాడ దెఱువులోన....దెంభయి పుట్లు అడ్లవట్టు విలచి అమరేశ్వరమున...(యస్. ఐ. ఐ. 4 1281)

IV. ....తోంటపట్టు పు∧న∧ం....(యస్ ఐ. ఐ. 6 1112)

V. ....తొమ్మిది ముట్టు లాడ్లపట్టు (యస్. ఐ. ఐ. 6 115.)

VI. అఱుపుట్లు జలక్షేత్రము యస్. ఐ. ఐ. 6 786

VII. ....నతగద్యాన లిచ్చిరి. అడ్లపట్టు నూఱు గద్యానంబులుగొని....
పన్నసగా గారవవరిచి ఇచ్చిరి....(యస్. ఐ. ఐ. 6 114)

పై మొదటి శాసనంలో 'ఎణుంబొది పుట్లు అఢ్లపట్టు'అనేదానికి'ఎనుబది పుట్ల ఆరిక విత్తనాలను చల్లుటకు సరిపోయె వైశాల్యముగల భూమి' అని శాసనపరిష్కర్తలు అర్థం కల్పించారు. (ఎణుంబొది అనునది ఎనుబదికి పర్యాయపదమని భ్రమించుట ఇందు వేరొక పొరపాటు. దీనిని తరువాత చర్చించుదము.) అటులే పైవానిలో మూడవ శాసనంలో డెబ్బదిపుట్ల అరికవిత్తనాలు అనే అర్థంకూడ వారే ఆమోదించారు. ఈ అర్థం ఎంతగా అనర్థకమో వారు ఆలోచించినటుల కన్పట్టదు. ఎనుబది పుట్లు అరిక విత్తనాలను చల్లుటకు శాసనములో పేర్కొనబడిన విప్పర్తి గ్రామమునందలి భూమి అంతయు సరిపోగలదా? ఇక పంట విషయము— గింజకు ఏబది గింజలు పండునని లెక్కించినను, ఆ కాలమున విప్పర్తి గ్రామము నందలి ఒక పొలములోనే 4000 (నాలుగువేల) పుట్లు ఆరికలు పండెడివన్న మాట. మనము ఈనాడు గొప్పగా భావించుకొనుచున్న హరిత విప్లవమున సైతము ఇట్టి పంట కన విన రానిదనుట, వ్యవసాయముతో ఏ కొలదిగనో పరిచయమున్న ప్రతివానికిని తెలియును.

'అళ్ళు' అనగా 'అరికలు' అనియు, 'పుట్లు' అనునది 'అఢ్ల'కు విశేషణమనియు భావించుటతో ఈ అనర్థభావన కలిగినది.

ఇకపై వానిలో అయిదవ శాసన భాగమున'తొమ్మిది మట్టులాఢ్లపట్లు'అను చోట అట్టి శాసన పరిష్కర్తలే తొమ్మిది నివర్తనముల భూమి అని సరిపుచ్చుకొనవలసి వచ్చినది. ఇచ్చట 'మట్టు' అనునది 'పట్టు' అనుకొని వైశాల్యమును తెలుపు విశేషణముగ మాత్రమే గ్రహింపబడినది. ఇక ఆరవదానియందు 'ఆఱుపుట్లు జంక్షేత్రము' అను చోట సైతము 'ఆఱుపుట్లు' క్షేత్రవైశాల్యమును తెలుపు పదముగ మాత్రమే అన్వయింపబడినది. ఇట్టి సందర్భంలో 'అఢ్లపట్టు' లోని 'పట్టు' నకు విశేషణముగ వ్యవహరించునది 'పుట్లు' అనియు, అరికల కొలతతో దానికి ఎట్టి సంబంధమును లేదనియు భావించుటయే సముచితము. 'పుట్లు' అను విశేషణము లేకుండనే 'అఢ్లపట్టు' అను పదము కనబడుచున్నదనుటకు పైవానిలో ఏడవ శాసనభాగమే ప్రమాణము. 'అఢ్లపట్టు'ను పన్నసగా గౌరవపరచి ఇచ్చిరి అని అందు చెప్పబడుటవలన 'అఢ్లపట్టు' అనునది 'విత్తుపట్టు' 'సస్యక్షేత్రము' లకు పర్యాయ పదమేగాని. అరికలతో ఏవిధముగను ముడిపడియుండ దనుట సుస్పష్టము.

అటుల భావింపక, శాసన పరిష్కర్తలు చెప్పినటుల కొన్ని పుట్ల ఆరిక విత్తనములను చల్లు భూమిగ దానిని పరిగ్రహించినచో ఈ క్రింది విషయములను మనము అంగీకరింపవలసి యుండును.

1. తూర్పు చాళుక్యుల కాలమున అరికపంటయె తీరాంధ్రమున చాల ఆదరణను పొంది ఉండినది. కందుకూరు మొదలుగ గోదావరి వరకు ఆ పంటనే అందరును ఆదరించెడివారు.

2. భూముల వైశాల్యములను అందు చల్లెడు విత్తనములరాశి కొలతను పట్టి పుట్లలో నిర్ణయించెడివారు.

3. అరిక క్షేత్రములను కొని, రాజులు దానములు ఇచ్చెడివారు.

4. ఈనాటి హరిత విప్లవమును మించిన సస్యవిప్లవము ఆనాడు సాధింపబడినది.

పై నాలుగును హేతువాదమునకు నిలువవు. 'అరికలు' చాల క్షుద్ర ధాన్యములుగ ఆనాడు పరిగణింప బడెడివి. చాళుక్యరాజు ఆదరణమున మహాభారతమును తెనుగున రూపొందింప బూనిన నన్నయ భట్టారకుడు:

కం. ఉఱవగు నారుగ పంటలు
గౌఱియల పాడియును దఱచగుం, బురుషులకుం
దెఱవల చుట్టము లయ్యెద,
రెఱచియ భుజియింతు రర్థినెల్ల జనంబుల్ (భార. అర. 4. 295)

అని ధర్మక్షయమగు కాలమును వర్ణించెను. ఇందలి 'ఆరుగ' అనునది 'అరిక'కు పర్యాయనామము. ఇట్టి క్షుద్ర ధాన్యముపండు భూమిని విలిచి. బ్రాహ్మణులకును, దేవాలయములకును, ఆనాటి ధర్మనిరతి కలిగిన ప్రభువులు దానముచేసియుండు రనుట విశ్వసింపదగని విషయము. అదియెగాదు; 'అఢ్లు'గాని 'అళ్లు'గాని, 'అరిక' పదమునకు బహువచన రూపమున ఆనాటి సాహిత్యమున ఎచటను కన్పట్టదు. హంసవింశతి రచయిత (క్రీ. శ. 1650)యు 'జడకొఱ్ఱ కొఱ్ఱలు చామలు వెల చామ 'కుట్టారికారికె' అని అన్నాడే (4 అ. 127) కాని 'అళ్లు' అనురూపమును ఈయలేదు. అందువలన 'ఆరిగ'కు బహువచనరూపముగ 'అళ్ళు అను పదము 18వ శతాబ్ది తరువాతనే వాడుకలోనికి వచ్చిన దనుట యదార్థము.

ఇక భూములవైశాల్యమును చాళుక్యులకాలమున, భూమియందు చల్లెడు విత్తనముల రాశిపరిమాణమును బట్టి నిర్ణయించుట జరిగెడిదనుటకును నిదర్శనములు 'ఏవియు కానరావు. 'పుట్టి' అనుపదము ధాన్యముల ఘన (రాశి) పరిమాణమునకును, భూముల వైశాల్యపరిమాణమునకును విభిన్నార్థములలో వాడబడినటుల మాత్రమే తెలియవచ్చును (ఇంగ్లండును 'పౌను' అనుపదము బరువునకును, నాణెమునకును, విభిన్నార్థములలో వాడబడినటులనే ఇదియు జరిగియుండును.) చాళుక్యయుగపు కట్టకడపటి సంవత్సరములలో బ్రతికి యుండిన పావులూరి మల్లన తన 'సారసంగ్రహగణితము'న

క. మానుగ నిడుపు వెడల్పును
గ్గా నొక్కొకకోల కుంట, కదియంగం బుట్టం
దే నూఱుకుంట, లిరువది
యెనొక తూమెడు తదర్థ మిరసనంబరగున్

క. కానూలు మొదలుగ జిన్నము
మానుగంగోలయును గుంటమానము మఱి భూ
మానము ధాన్యముతోడ స
మానముగా వ్యవహరింత్రు మవానంధ్రజనుల్

(సంజ్ఞాధికారము-కూట ప్రమాణసూత్రము) పై పద్యములలో 'ఆంధ్రజనుల్' అనుట గమనింపదగినది. యథార్థమున, మహావీరాచార్యుని 'గణిత సార సంగ్రహము' నకు అనువాదము'గనే సంభావింపదగినది మల్లనరచితమగు సార సంగ్రహగణితము కాని సంస్కృతమూలమున మహావీరాచార్యుడు భూమ్యాది మానములను మగధదేశపు సంప్రదాయమును అనుసరించి వ్రాయగా, ఆంధ్రరచయిత సంస్కృతమూలమున పాటింపక, తానాంధ్రదేశపు సంప్రదాయములను అనుసరించి భూమ్యాది మానములను చెప్పితిననెను. ఇట పుట్టికి గల రెండు విధముల అర్థములను తేటపరచెను. కాని భూమికొలతకు విత్తనముల చల్లుటతో సంబంధము ఉన్నటుల పేర్కొనినదేకాదు. అందువలన విత్తనముల చల్లికను బట్టి ఆంధ్రదేశమున వైశాల్యనిర్ణయము జరిగెడిదనుటకు ఆధారమే కానరాదు.

వీని అన్నింటిని అనుసరించి చూడగా 'అఢ్లపట్టు' అనుదానిలో 'అఢ్ల'కు ఆరికెలతో సంబంధము ఏదియు లేదనియు 'ధాన్యము' అనుదానికి పర్యాయపదమే. 'అఢ్లు అనియు' అందువలన 'అఢ్లపట్టు' అనునదియు విత్తుపట్టు, ధాన్యక్షేత్రములతో సమానార్థకమనియు స్పష్టమగుచున్నది. అనగా ఆ భూమి పంటభూమి యనియు చెలిక, బీడు, తోట కాదనియు, ఇల్లుపట్టును కాదనియు స్పష్టముచేయుటకే ఆనాడు 'అఢ్లపట్టు 'అనుపదము ఉపయోగింపబడినది. ఈ దృష్టితో అన్వయించినపుడు తొలుతటి చాళుక్యశాసనములన్నియు చక్కగ అర్థవంతములగుచున్నవి. అప్పుడు ఆ పదమునకు విశేషణముగా నున్న 'పుట్లు' మల్లన నుడివిన భూవైశాల్యమానముగ మాత్రమే లెక్కకువచ్చును. కాని కాలక్రమేణ 'అఢ్లు' అనునది మెట్ట ధాన్యములకు మాత్రమే వాడబడి, వడ్లు అందుండి ప్రత్యేకతను పొందినవి. నేటికిని ఆంధ్రదేశమున వాడుకలోనున్న 'అఢ్లకొకవాన, వడ్లకు వేరొకవానా ?' అనెడు సామెత ఇట్టి కాలముననే రూపుగొనియుండును. తరువాత 18వ శతాబ్దపు దరిదాపులలో ఆ పదము 'అరికెలు' అను అర్థమును పొందియుండును. ఇట్టి అర్థ విహ్వాయము సంస్కృతమున "ధాన్య" అను పదమునకును సంఘటిల్లినది. తొలుత

సామాన్యధాన్యవాచకముగ వైదిక కాలమున వాడుకలో ఉండిన ఆ పదము సుశ్రుతుని కాలము (క్రీ.శకము ఆరంభము)న శాలి, షష్ఠిక, వ్రీహి-అను పేరులుగల వరివంగడములకు మాత్రమే వర్తించినది. కదమధాన్యములను "కుధాన్యము" అని సుశ్రుతుడు వ్యవహరించెను. క్రీ. శ. 4వ శతాబ్దపు దరిదాపులవాడగు అమరసింహుడు తన 'నామలింగాను శాసనము'న కొతిమెర్లకే 'ధాన్యమ్' అను పదము వర్తించుననెను. ఆ వాడుక నేటికిని ఉత్తరహిందూస్థానమున నిలిచియుండుట వలననే హిందీలో కొతిమెర్లను 'దనియా' అని వ్యవహరించుట పరిపాటియైనది, వారిని అనుసరించి యేతెలుగువారును కొతిమెర్లను 'ధనియాలు' అని వ్యవహరించు చున్నారు. కాని మధ్య యుగములందు సంస్కృతమున 'ధాన్య' పదమునకు విస్తృతార్థము లభించి, దానాది సమయములందు వడ్లకు మాత్రమేగాక, కందులు నూవులు మొదలగువానికిని సామాన్యవాచకముగ 'నవధాన్య' అను రూపమును వాడుక కల్గినది. ఈనాడు 'ధాన్యము' అను పదమును వడ్లకుమాత్రమే వర్తింప జేయుట తెలుగుదేశమున కొన్ని ప్రాంతములందు కానవచ్చుచున్నది. ఈ విధముగనే 'అడ్లు' అను పదముసైతము తొలుత ధాన్యసామాన్యవాచకముగ ఉండి. కాలక్రమేణ పలుమార్పులను పొందినది. తొలుత 'అడ్లు' అను పదము వడ్లకుసైతము వాడుకలో ఉండినదనుటకు 'ప్రాలు'అను పదమును మనము నిదర్శనముగ గ్రహింపవచ్చును. 'అడ్లు' అనుపదమునకు ఒక ఉపసర్గను చేర్చుట వలన ఈ పదము రూపొంది దంచిన వడ్లు (బియ్యము) అను అర్థమును ఆర్జించినది.

ఇక ఒక అభ్యంతరమును మనము ఎదుర్కొనవలసియున్నది. నిర్దిష్టసంఖ్యగల పుట్లవిత్తనములను చల్లుటకు కావలసిన భూమి అను అర్థమును తాము చెప్పుటకు ఆధారముగ ఆ శాసనపరిష్కర్తలు చాళుక్యులకాలపు కొన్ని తామ్రశాసనములందు కినగు ఈ క్రింది పదములను ఉల్లేఖించుచున్నారు.

దశఖారి కోద్రవ బీజావాపక్షేత్ర మాదాయ (39 ఇఐ. వా. 18, 25)

దశఖండికి కోద్రవ బీజావాపక్షేత్రమ్ వింశతి ఖండికి వ్రీహి బీజా పరిమాణ క్షేత్రమ్	ఈ రెండిటిని దత్తుగారు పేర్కొనిరి; కాని శాసనముల సంఖ్యా వివరములను ఈయలేదు.

పైవానిని గురించి చర్చించుటకు ముందు ఒక విషయమును పేర్కొనవలసియున్నది. తెలుగుదేశపు శాసన పరిష్కర్తలు తామ్రశాసనములను చదువునపుడు కొన్ని సమస్యలను ఎదుర్కొనిరనుట, వారి రచనలను అనుసరించి చూడ సుస్పష్టము. కొన్ని తామ్రశాసనములు అనుకొనినంతప్రాచీనములు కావనియు, అందు కొన్ని దానప్రతి గ్రహీతల సంతతివారిచే తిరుగవ్రాయబడినవనియు, అట్లు తిరిగి వ్రాయుటలో పొసగని రీతిలో తేదీలు వగైరాలను మార్చుటయు జరిగినదనియు వేద్యమైనది. ఇందులకు ఒక ఉదాహరణము పెంచుకలదిన్నె శాసనము. నాచన సోముని ప్రతిగ్రహీతగ పేర్కొనిన ఆ శాసనమున తేది ఏ విధముగను సరికుదరక, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు దానిని తన వాదమునకు అనుకూలముగ సవరించుటకు యత్నించినను, అది సరికుదిరినదికాదు. ఇట్టివే అనేక శాసనములు పండితులచే కల్పితములుగ నిరసింపబడినవి. అట్టి కోవకు చెందినవే పైన సూచితములగు తామ్రశాసనములు కావచ్చును.తమ పెద్దలకు ఇచ్చిన భూములవిస్తీర్ణమును విస్తారముగ పెంచుటకై కొందరు ఆ శాసనములలో సంస్కృత పదములను అటుల చేర్చియుండవచ్చును. ఒకవేళ కల్పితములు గాకపోయినచో, వానిని సరియగు రీతిలో అన్వయించి చెప్పుట పండితుల బాధ్యత ఇట్టి అర్థసాధన పండిత సంప్రదాయము 'గంగాయాం ఘోషః' అనినపుడు 'గంగలో గొల్లపల్లె' అని ఏ పండితుడును అర్థము చెప్పడు. అట్టులే 'చెరువు క్రింది భూమి' అన్నపుడు 'చెరువులోతట్టు దిగువన ఉన్నభూమి' అనిగాని, 'చెరువునకు దిగువదిక్కున దూరముగా ఉన్న భూమి' అనిగాని ఏ పండితుడును తలంచడు, 'చెరువు నీటివలన సాగగు భూమి' అని మాత్రమే అర్థమిచ్చును. ఈ విధముగనే అనర్థమునకు తావీయని రీతిలో సంగతమగునట్లుగ పైవానికి అర్థములను కల్పింపవచ్చును. అది ఈ క్రింది విధముగ సాధ్యము.

'కోద్రవ' అను పదమునకు నిజమగు అర్థము ఇప్పటికి మనకు తెలియదు. కొర్రలు, ఆరికలు మెట్టవడ్లు అనువానిలో ఏదియైనను అది కావచ్చును. ఇది ఎటులున్నను అడ్లు అనుదానికి మెట్టధాన్యములు అను వాడుక ఉండిన కాలమునకు చెందిన వానినిగ పై శాసన భాగములను మనము గ్రహింపవచ్చును. అపుడు 'కోద్రవ బీజావాప' అనగా మెట్టధాన్యములను విత్తి పండించుటకు అనువైన అను అర్థము పొసగును. అపుడు 'దశఖాం కోద్రవ బీజావాపక్షేత్రమ్' అనగా మెట్టపంట పండెడుభూమి 'పది పుట్లు' అని అర్థము ఏర్పడును. ఇక కట్ట కడపటిదానిలో (వ్రీహిబీజా వరి విత్తులు) పరిమాణక్షేత్రమ్=పట్టునేల అను అర్థములు సరికుదురును అపుడు వింశతిఖండిక వ్రీహిబీజా పరిమాణక్షేత్రమ్=విత్తుపట్టునేల ఇరువది పుట్లు (వరిపంటభూమి ఇరువది పుట్లు) అను అర్థము ఏర్పడును.

సారాంశమున 'అడ్లపట్టు' నకు 'పంటభూమి' అని అర్థమును ఇచ్చుటయే సముచితమనుట సుస్పష్టము.

2. ఇనుప యెడ్లు (ఇన్పయెడ్ల, ఈనుపయెడ్లు)

శాసన పరిష్కర్తలలో ప్రతియొకనికి ఒక్కొకతీరుగ అర్థస్ఫురణను కల్గించి, నేటికిని కొరుకుడువడని పదమిది. దీనికి 'శాసనశబ్ద' నిఘంటువులు ఇచ్చిన అర్థములు ఈ దిగువ ఈయబడినవి.

ఇనుపయెడ్లు : ఆడుమేకలు లేక గొఱ్ఱెలు....(ప్రా. శ. కో.)

ఇనుప.నల్లటి. బ్లాకు ఎడ్జ్ - ఫామ్ ఆఫ్ ఇనుము బ్లాక్ ఐరన్ ఎ వేరియంట్ ఆఫ్ ఎనుము. ఎ షి బఫెలో ఆక్కుర్స్ యాజ్ యాన్ యాట్రిబ్యూట్ ఆఫ్ ఎడ్లు.

ఎడ్లు:- ది వర్డ్ మీన్స్ మాన్ ఆక్స్ ఓన్లీ వేర్ యాజ్ ఇన్ ది ఇన్‌స్క్రిప్షనల్ డైలెక్ట్ ఇట్ ఈజ్ ఎ కామన్ టరమ్ ఫర్ బోత్ కౌస్ అండ్ ఆక్సెన్ అండ్ ఆల్‌సో బఫెలోస్ ఆఫ్ బోత్ సెక్సెస్. దిస్ సిట్యుయేషన్ ఈజ్ పర్‌హాప్స్ ద్యూ టు ది ప్రిసీడింగ్ ఎట్రిబ్యూట్ ఇనుప. (ఇన్ప) ఎడ్జ్-ఫామ్ ఆఫ్ ఇనుమ్ము (వుచ్ ఈజ్ ఎ వేరియంట్ ఆఫ్ ఎనుము ఎ బ్లాక్ కౌ ఆర్ షి బఫెలో.)

ఈ శబ్దము సూర్యరాయాంధ్ర నిఘంటువునను స్థానమార్జించినది, అచట దీనికి ఇచ్చిన అర్థమును, వ్యుత్పత్తియు, ఆధారమగు శాసన భాగపాఠమును ఈ దిగువ ఈయబడినవి.

ఇనుప (న్ప) యెడ్లు - ఈన్ప యెడ్లు. వి. బ.

(త. ఈన్-ఈను, ఆడు-మేక; గొఱ్ఱె-వ్యు. ఈనునట్టిమేక; గొఱ్ఱె-అనగా ఆడుమేక; ఆడు గొఱ్ఱె) మేకలు ? గొఱ్ఱెలు ?

(ఈన్పయెడ్లు అనునదే ప్రథమ రూపమని తోచుచున్నది. ఇది ప్రాచీన శాసనములందు మాత్రమే కాన్పించుచున్నది.)

స్వస్తి సమస్త ప్రశస్తి సహితం శ్రీమన్మహామండలేశ్వర కోట కేతరాజులు శకవర్షములు 1104గు నేంటి మాఘ శు 10 గురువారము నందమకు ధర్మార్థముగా శ్రీమద్బుద్ధదేవరకు నఖండవర్తిన్ దీప-ములు రెంటికినై ఇచ్చిన ఇన్పఎడ్లు 110. వీనిలోన దామక అమరెటో యుండు ఎంభదేను గొటియలం జేకొని ఆ చంద్రార్కముగాం దనపుత్రులును పౌత్రికమున నిత్యమానెండు సేసి నేయిం వోయంగలవారిదు (ఇ.ఐ.6, 180 అమరావతి శాసనము)

ఈ విధముగ ఈ పదము కొందరి దృష్టిలో గొఱ్ఱెలు-మేకలనును, కొందరి దృష్టిలో ఎనుములు-ఆవులు -గొఱ్ఱెలు -మేకలకును సమానార్థకమైనది. ఇక ఈ పదపు అర్థమును గురించి ఆంధ్రపత్రిక ఉగాది సంచిక (క్రోధన)లో చర్చించిన మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, ఈ క్రిందివిధముగ తమ నిర్ణయమును తెలిపిరి.

"నూతనముగ ప్రకటింపబడిన నాలుగవ దక్షిణ హిందూదేశ శాసన సంపుటము నందలి ఒకానొక శాసనమును బట్టి ఈ పదము యొక్క అర్థము ఇపుడు విస్పష్టమగు చున్నది. ఆ శాసనమున కొంత సంస్కృతమునను,

కొంత దేశభాషయగు ఆంధ్రమునను వ్రాయబడినది. సంస్కృత భాషా భాగమున ఈ శ్లోకముకలదు : 'మల్లయ క్షితిలక్ష్మీశో దత్వావంచశతం గవాం...! తెలుగు భాగమున ఈ క్రింది వాక్యములు కలవు : ప్రోలియ బోయని వసమున విడ్చిన ఇనుపయెడ్లు 50. నిత్యమాన !

ఈపై సందర్భములను బట్టి ఇనుపయెడ్లు గోవులు (ఆవులు) అనుట నిశ్చయము ఈ విధముగ శర్మగారు ఇనుపయెడ్లు ఆవులే యని నిశ్చితార్థముగ తేల్చిరి. కాని లో అర్థములో 'ఎదియు" ఇనుపయెడ్లు అనువానిని సంపూర్ణముగ సుసంగత రీతిలో వివరించలేకపోయినదనుట ఈ క్రింది శాసన భాగముల పర్యాలోచనములవలన స్పష్టము కాగలదు

....అయ్తిబోల కాటని వసమునం బెట్టిన మొదవులు 50 నావబోల ముప్పని వసమునం బెట్టిన మొదవులు 50 బెరసి ఇనుపయెడ్లు 100ణ్ణికి....

ఎస్ ఐ.ఐ. 6. 1169_క్రీ. శ, 1182)

...గొఱియలు నూఱుజేకొని పుత్రాను పుత్రిక మా చంద్రార్కముగు రెండు మానికేల నేయి వోయాగలవారు... ఈ నూరు గొరియలు ఇనుపయెడ్లయి ఎల్ల కాలము ఉణ్ణగలయది · (ఎపిగ్రాఫిగా ఆంధ్రి 50 4 వల్లాల శాసనము క్రీ శ. 1098) పై రెండు శాసనభాగాలలో తొలుతటిని శర్మగారి వాదమునకు బలము చేకూర్చుచున్నది. రెండవది తక్కినవారికి అనుకూలముగ ఉన్నది. అయితే ఈ రెండవదానిలోనే 'ఇనుపయెడ్లు' అనుదాని మౌలికార్థము సూచింపబడినది. ఇచ్చినవి ఆవులుగానిండు, గొఱ్ఱెలుకానిండు, దేవాలయమునకు ఈయబడిన తరువాత అవి 'ఇనుప యెడ్లు'గా పరిగణనను పొందెడివని అందువలన తెలియనగుచున్నది. అనగా 'ఇనుపయెడ్లు' అనునది దేవస్వపు పశువులు అనుదాని పర్యాయపదమని స్పష్టమగుచున్నది. ఇక దీని వ్యుత్పత్తిని పరిశీలింతము.

సంస్కృత నిఘంటువులందు మాత్రమే కానగుచు, సంస్కృత సాహిత్యమునగాని, తక్కువిధముల సంస్కృత సారస్వతమునగాని ఈనాడు ఎచటను కానరాని కొన్ని పదములు ఉన్నవి. వానిలోనిదే 'హిరణ్యవ' పదము. ఆప్టే నిఘంటువును, మానియర్ విలియమ్స్ నిఘంటువును ఈ పదము నిఘంటువులందు మాత్రమే కననగుచున్నదనిరి. దాని అర్థము 'దేవస్వము' లేదా 'ధర్మాస్వము' అనియు వారే తెలియజేసిరి. సంస్కృత సారస్వతమున దీని వాడుక లుప్తమైనను. బౌద్ధశాసనములందు, అందును ఆంధ్రదేశమున, కనీసమొకచోటనైన ఇది వాడబడెననుటకు భట్టిప్రోలునందలి కరండ శాసనమొకటి నిదర్శనముగ ఉన్నది. అందలి ఒక శాసనమున ఈ క్రింది పంక్తులు కననగుచున్నవి.

1. గొఠీ
2. హిరణవ ఘవ
3. (వు)గాలకో
4. విసకో థోరసిసి
5. సమణో ఓవలో

పైదానిలో రెండవ పంక్తి యందలి 'హిరణవ ఘవ' అనుదానికి, ఆ శాసనములు పరిష్కరించిన బర్గెస్ పండితుడు 'హిరణ్యవ్యాఘ్రపాద' అను సంస్కృత రూపమును కల్పించెను. తరువాతి కాలమున ఆ శాసనమును చర్చించినవారును, ఆ పండితునే అనుసరించిరి.'హిరణవ' అనునది'హిరణ్యవ'అను సంస్కృత భాషాపదపు ప్రాకృత రూపమని ఆ పండితుడు గుర్తింపలేక పోయెను. 'హిరణ్యవ'అను పదము సంస్కృతమున కలదనుటయు ఆయని గుర్తించియుండడు. అందువలననే కడుదీర్ఘమై ఎచటను వినరాని 'హిరణ్యవ్యాఘ్రపాద' అనుపేరును సంస్కృతపు ఛాయగ కల్పించెను. 'హిరణవఘవ' అనునది 'హిరణ్యవ గృహ' అను సంస్కృత సమాసమునకు ప్రాకృతరూపము 'గృహ' అనుపదమునకు వైదిక కాలమున 'ఉపస్థాయకుడు' స్హాహాయ్యకుడు అను అర్థములు మాత్రమే ఉండెను. [గృహా_యాన్ అసిస్టెంట్ సర్వెంటు ఆర్. వి. ఎక్స్ 119, 13, మోనీర్] ఈ అర్థమే విస్తృతమై పాలకుడు, రక్షకుడు అను అర్థములకు వసతి కల్పించినది.

ఇందువలన 'హిరణవఘవ' అనగా దేవస్వపాలకుడు లేదా ధర్మస్వరక్షకుడు అను అర్థమే ఏర్పడుచున్నది. 'హిరణవఘవ (వు)గాలకో అనగా ధర్మస్వరక్షకుడగు ఉద్గారకుడు అను అర్థము ఇందు సుస్పష్టము. ఆ శాసనముననే 5వ పంక్తిలో సమణకో ఓదలో (శ్రమణకుడగు ఔదలుడు అని కలదు. ఇందువలన ఆయాపేరులతో పాటుగ ఆయా వ్యక్తుల సాంఘికప్రతిపత్తియు కొన్ని[illegible] తెలియజేయబడెననుట సుస్పష్టము.

బౌద్ధమతము దాదాపువేయి సంవత్సరములు ఆంధ్రదేశమున తనమనుగడను సాగించినది. ఆ కాలమున వారు వివిధప్రాకృతములతో దేశభాషకు పరిచితి, కలిగించిరి. ఆ పరిచితి వలన ప్రాకృత పదములు ఎన్నియో, రూపవికృతినొందిదేశభాషయందుతావు కల్పించు కొన్నవి. అట్టి వానిలోనిదే 'ఇనుప' అను రూపమును పొందిన 'హిరణవ' పదము,

ఇక 'ఎడ్లు' అనుదాని విషయమున వివరణము అంతగ ఆవశ్యకము కాదు. ప్రాచీన శాసనములందు 'ఎడ్లు' అనునది 'పశు' సామాన్యవాచకముగ వర్తించినదనుట శాసన పరిష్కర్తలు అందరును అంగీకరించిన విషయము. అందువలన 'ఇనుపఎడ్లు' అనుదాని యర్థము 'దేవస్వపు పశువులు' అనుట సుస్పష్టార్థము.

3. ఎరికల్ (ఎరిగల్)

తెలుగు భాషా శాసనములందు, లభించినవానిలో నెల్ల, ప్రాచీనతమముగ సంభావితమగు, కలమళ్ల శాసనమున కన్పట్టిన ఈ పదము, తరువాతి కాలపు రేనాటి చోళుల శాసనములలో కొన్నింట సైతము కన్పడుచున్నది. దీనికి ఈయబడిన అర్థములు.

ఎరికల్...వ్యక్తినామం ఎ వేరియంట్ ఆఫ్ ఎరిగల్,

ది టైటిల్ ఆఫ్ రేనాటిచోళ కింగ్ (ప్రా. శా.)

ఈ నిఘంటురచయిత వ్యక్తినామం అనేదానికి రేనాటి చోళరాజుల (ఎర్రగుడిపాడు, కలమళ్ల, మాలెపాడు) శాసనాలను ఆధారములుగ చూపించిరి. ఒక

చోళరాజు యొక్క బిరుదము అనుదానికి మాత్రము, ఆధారమును చూపించలేదు.

ఇక ప్రా. శ. కో. రచయిత ఈ పదమునే ఈయలేదు. తన కోశమున వ్యక్తినామములకు తావును ఆయన కల్పించలేదు. కావున 'ఎరికల్' అనునది వ్యక్తినామముగనే ఆయన గ్రహించియుండుననుట సుస్పష్టము.

ఇంతేకాదు కొందరు ప్రముఖ చరిత్రక పరిశోధకులను తెలుగున ప్రథమ శాసనమును ఇచ్చినవాడు 'ఎరికల్ ముత్తురాజు' అను రేనాటి చోళరాజనియే తెలిపిరి. అందువలన దీనిని ఒకవ్యక్తి నామముగనే వారును పరిగ్రహించియుందురు.

ఇక ఈ పదపు మౌలికార్థమును కనుగొనుటకు ఈ క్రింది శాసనములు పరిశీలనార్హములు.

1. ఎరికల్ము (తు) రాజు ధనంజయున్తు రేనాణ్డేలన్...(కలమళ్ల శాసనము క్రీ. శ. 575 ప్రాంతము.

2. స్వస్తిశ్రీ చోళమహారాజుల్లేళన్ ఎరికల్ దుగరాజుల్ ఇచ్చిన పన్నస ...(ఇందుకూరు శాసనము...క్రీ. శ. 7వ శతాబ్ది)

3. నొళుమహారాజున్తు ఏళ ఎరిగల్తుగ రాజున్తు ఇచ్చిన పన్నాస.... (ఉరుటూరు శాసనము క్రీ. శ. 7వ శతాబ్ది)

4. స్వస్తిశ్రీ ఎరికల్ముత్తురాజుల్లకుడ్డిఇళ్లు ... (ఎర్రగుడిపాడు శాసనం (క్రీ. శ. 7వ శతాబ్ది)

5. స్వస్తిశ్రీ ఎరికల్ ముతురాజు పుణ్యకుమాన్తు(తిప్పలూరు శాసనము.... (క్రీ. శ. 7వ శతాబ్ది)

ఇక పై శాసనములను వివరించుటకు ప్రాతిపదికగ రేనాటి చోళరాజులను గురించి కొన్ని విషయములను ఇట చెప్పవలసియున్నది. రేనాటిచోళుల శిలాశాసనములలో దేనియందును ఆ రాజుల వంశాను క్రమణిక ఈయబడలేదు. లబ్ధములైన నాలుగు తామ్ర శాసనములలోను రెండింటి ఒక విధపు వంశావళియు తక్కిన రెండింటి వేరువిధపు వంశావళియు ఈయబడినది. ఈ వంశావళులు, చోళరాజులలోని రెండు రాజవంశములను తెలుపుచున్నవని పండితుల అభిప్రాయము. ఆ వంశావళులిచ్చిన రాజుల నామములలో ధనంజయుడు, పుణ్యకుమారుడు మొదలగు సంస్కృత పదములును, ఎలఉకొళ, ఎతెయమ్మ, కొకిలి – అను సంస్కృతేతర పదములు మాత్రమే కలవు. 'ఎరిక(గ)ల్' అను పదము ఎచటను కన్పట్టదు. అందువలన చోళరాజులలో 'ఎరికల్ ముత్తురాజు' అనువాడు ఎవడును లేడనుట సుస్పష్టము.

పైన ఈయబడిన శాసనములలో తొలుతటిదానియందు ధనంజయుడును, కడపటిదానియందు పుణ్యకుమారుడును మనకు కన్పట్టుచున్నారు. అందువలన ఆ పేర్లుగల రాజులు ఇచ్చిన శాసనములు ఇవి అనుట సువిదితము. ఇక ఆ పేరులకు ముందుగ ఈయబడిన 'ఎరికల్'-'ముత్తురాజుల్' – అను పదములు ఆ యా రాజనామములకు విశేషణములుగ మాత్రమే ప్రయోగింపబడెననుట తేటతెల్లము.

రేనాటి చోళులనాటి తెలుగు పదములు ఎన్నియో కాలక్రమమున వాడుక నుండి అంతరించినవి. సంస్కృత పదములకు మారుగ సమానార్థకములగు తెలుగు పదములను ఆ కాలపువారు ఎక్కువగ అభిమానించెడివారు. బహుళ పక్షమును 'చీకు' అనియు, శుక్లపక్షమును 'పెంపు' అనియు వారు వ్యవహరించిరి. అట్లులే 'మహారాజు' అను పదమునకు సమానార్థముగ 'ముత్తురాజు' పదమును ఆనాటివారలు వాడుకలోనికి తెచ్చిరి. ఈ పదమునకుగాని, ధనంజయాది పదములకుగాని చివరయందు కన్పట్టు బహువచన ప్రత్యయమును గౌరవసూచక మాత్రమే. 'ఎరికల్' అనునదియు ఇట్టిదే. 'ఎరిక' అను పదమునకు గౌరవ సూచకముగ బహువచన ప్రత్యయమును చేర్పగా ఏర్పడినదే 'ఎరికల్'. 'ఎరిక' అను పదమునకు సందర్భమును పట్టి చూడ 'శ్రీయుత/శ్రీమాన్' అను అర్థమే సరిపడుచున్నది. దీనికి అట్టి అర్థమును పదవ్యుత్పత్తిని అనుసరించియు సాధింపవచ్చును.

ఈ పదము 'ఎలిక' అను దానివంటిది. 'ఎలు' అను ధాతువునకు తగు రీతిలో 'క' ప్రత్యయమును చేర్చుట వలన "ఏలిక" అను పదము రూపొంది 'ఏలునట్టివాడు' అను అర్థము ఏర్పడినది. 'ఎరిక' యాదు 'ఎరి'యు 'ఏలు' వంటిదే, 'ఎరి' అను ధాతువు మనకు 'ఎరియు' అను క్రియ యందు కన్పట్టుచున్నది. దీనికి 'మూడు' ప్రజ్వరిల్లు .... మొదలగు అర్థములను నిఘంటువులు ఇచ్చినవి. అందువలన 'ఎరి' అను దానిని 'శోభ'కు లేక 'శ్రీ'కి పర్యాయపదముగ క్రీ. శ. 6వ శతాబ్దిలోని తెలుగు పండితులు స్వీకరించి, 'శ్రీమత్' అను దానికి సమానార్థకముగ 'ఎరిక'ను రూపొందించియుందురు.

పండితార్థమిది : ఎరికల్ముత్తురాజు అను పేరుగల రేనాటి చోళరాజు లేనే లేడు. 'ఎరిక' అను దానికి 'శ్రీమత్' అనియే అర్థము. అందువలన 'ఎరికల్ ముత్తురాజుల్' అనుదానికి 'శ్రీమన్మహారాజుల్' అను అర్థము మాత్రమే సరికుదురును.

రేనాటి చోళుల తక్కిన కొన్ని శాసనములలో 'ఎరికల్ దుగరాజుల్' అనియు వచ్చును. పైన ఉదహరింపబడిన శాసనములలో రెండవదియు, మూడవదియు ఇట్టివియే. ఇచటకూడ 'ఎరిక'కు పై అర్థమే సరికుదురుననుట వేరుగ చెప్పవలసిన అవసరము లేదు.

4. పన్నస (పన్నాస, పన్నవిస, పనస)

అతి ప్రాచీనములగు రేనాటిచోళుల శాసనములు మొదలుగ 11వ శతాబ్ది శాసనములవరకు ఎడనెడ కానవచ్చుచున్నది ఈపదము. ఈ క్రిందరీతిగ ఈపదపు అర్థ చర్చ సాగినది.

పన్నస : (క. పణ్ణియ; త పణ్ణై) వరిపండు పొలము. "ఏ పాడీ ఫీల్డు"
(శా. శ. కో.)

పన్నస : పన్ను చెల్లింపనక్కరలేని భూమి.

ది వర్డ్ ఈజ్ నాట్ లిస్టెడ్ ఇన్ తెలుగు డిక్షనరీస్ ట్రెడిషనల్ స్కాలర్స్ డిరైవ్ ఇట్ ఫ్రమ్ ప్రాకృత్. పన్నాస-సంస్కృతం పంచాశత్(ఫిఫ్టీ) అండ్ ఎక్కౌంట్ ఫర్ ఇట్స్ మీనింగ్ యాజ్ "లాండ్ మెజరింగ్ ఫిఫ్టీ యూనిట్స్" బట్ దిస్ మీనింగ్ ఈజ్ అన్‌టెనబుల్ ఇన్ ది కాన్‌టెస్ట్ అఫ్ ఇట్స్ అక్కరెన్స్ ఈజ్ ది మెటీరియల్, ఎమ్. సోమశేఖరశర్మ.... డిరైవ్స్ ది వర్డ్ ఫ్రమ్ ద్రవిడియన్ సోర్సెస్... .... బట్ సమ్ ఆఫ్ ది వేరియన్ట్స్ అక్కరింగ్ ఈజ్ ది ఇన్‌స్క్రిప్షన్స్ అర్ కన్‌ఫ్యూసింగ్ అండ్ దైర్ ఫోనెటిక్ షేప్స్ అర్ అన్-ద్రవిడయన్ సమ్ టైమ్స్ (ప్రా.శా)

ప్రా. శా. రచయిత, ఈ పదము నిఘంటువులకు ఎక్కలేదన్నారు. అది పొరపాటు. సూర్యరాయాంధ్ర నిఘంటువున దీనికి స్థానము కల్పింపబడి సోమశేఖర శర్మగారి అభిప్రాయమును అనుసరించి ఈ క్రింది విధముగ అర్థము ఈయబడినది.

పన్నస వి. (క. పణ్ణియ త. పణ్ణై – వరిపండు పొలము)
పొలము, క్షేత్రము.

పై అర్థములు సరికుదురునేమో ఇక పరిశీలింతము. అందులకై తొలుతగ పరిశీలింప దగినది ఎర్రగుడిపాడు శాసనము. అందలి చివర నాలుగు పంక్తులు ఈ దిగువన ఈయబడినవి,

కొట్టంబున పా
లకు కుణ్డికాళ్ళ
క ఇచ్చిన పన్నస
ఇరవది యాది నా–
ల్కు మఱున్తుల్లు నేల

(18వ పేజీ తరువాయి)

నిడదవోలు వారు సుదీర్ఘ పరిశోధనానుభవముతో వెల్లడించిన కొన్ని అభిప్రాయములు కార్యరూపము ధరించవలసియున్నది అవేవనగా -

[1] ప్రాచీన కావ్యములను సాధు పాఠములతో ముద్రించుట.

"తెలుగు భాషకొక సమగ్రమును, స్వప్రమాణము నగు నిఘంటువు నిర్మించుటకు గాని - పదకోశములు, సూచికలు ప్రవర్తిల్ల చేయుటకు గాని, సాధు పాఠములతో సమ్యక్పరిశీలితములై, పరిష్కృతములైన ప్రాచీనాంధ్ర కావ్యములే మూలాధారములని యందరు నేకగ్రీవముగా నంగీకరించిన విషయము ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రకటించిన "నన్నయ పద ప్రయోగకోశము" "నన్నెచోడ పద ప్రయోగ సూచిక" - అను నీ రెండు గ్రంథములపై వచ్చిన విమర్శలను సావధానముగా చూచినచో, ప్రాచీన కావ్యములకు స్వప్రామాణికమగు పాఠ నిర్ణయము లేక పోయినచో, నవి ఎట్టి యవ్యవస్థకు పాల్పడునో సంస్కారము గల చదువరు లెల్ల గ్రహింపగలరు. అప్రామాణిక పాఠములతో గూడిన అచ్చుపుస్తకము లాధారముగా గొనుటచేత, ఆ గ్రంథ ముద్రణ ఎంత అనర్థకముగా పరిణమించినదో కూడ పై విమర్శనలో నిరూపితమైనది ఆ రెండు కోశములును పునర్ముద్రణము కావలసినవియే యని యంచు తీర్మానింప బడినది." - శృంగార నైషధము ... పాఠభేదములు అను వ్యాసము నుండి [భారతి నవంబరు 1968 సంచి]

నన్నయ నన్నెచోడ పదకోశములే కాక, అంత కంటె ఎక్కువ లోపభూయిష్ఠముగా శ్రీనాథ పద కోశము తయారగుటకు శ్రీనాథుని కృతులు పెక్కు అపపాఠములతో ముద్రింప బడుటయే కారణము [చూ :- నా శ్రీనాథ పద ప్రయోగకోశ సమీక్ష - భారతి సెప్టెంబరు 1969] ఈ వ్యాసమును చదివిన శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు - "అంత శ్రద్ధతో, అంత నిశిత పరిశీలనముతో ప్రాచీన కావ్యములను ఒరసి చూచినవారు నాకు ఇంకొరు లేరనియే తోచినది ఇది ముఖస్తుతి కాదు; నిజమైన మాట -" అని తమ ఆమోదమును తెలిపినారు

[2] తెలుగు కావ్యములలో ప్రయుక్తములయిన సంస్కృతశబ్ద జాలమును సేకరించి తెలుగు నిఘంటు నిర్మాణము చేయుట

"తెనుగు భాషలో, సంస్కృత పదములు నాల్గింటిలో మూడు పాళ్లున్నవి. అందును పూర్వ కవులు విశేషముగా సంస్కృతము నుపయోగించిన వారే. తెనుగున నధికముగా గన్పట్టు నీ సంస్కృత పదములను సూర్యరాయాంధ్ర నిఘంటు కారులు, తెనుగు గ్రంథముల నుండి సంగ్రహింపక, సంస్కృత నిఘంటువుల నుండి యథామాత్రకముగా గ్రహించిరి గ్రహించిన వానికి ప్రయోగములు లేవు ఈ పద్ధతి ననుసరించిన మన నిఘంటువులు తత్సమ నిఘంటువు లనిపించు కొనునేగాని తెనుగు నిఘంటువులు కాజాలవు [శ ర. అను బంధము - పీఠిక]

పయి నిడదవోలు వారి విధానము శ్లాఘా పాత్రముగా నున్నదని 1960 - 1932 సంవత్సర ముల మధ్య ప్రకటించిన నిఘంటు పరామర్శ వ్యాసములలో తెలిపియున్నారు.

[3] పాల్కురికి సోమనాథాదుల కృతులకు పద కోశములు తయారుచేయించుట

"పాల్కురికి సోమనాథుని కృతులకే కాదు - పల్నాటి వీర చరిత్ర, కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక ...... కదిరీపతి శుక సప్తతి, అయ్యల రాజు నారాయణామాత్యుని హంస వింశతి సవరము చిన నారాయణ కవి కువల యాశ్వ చరిత్ర, పైడిమఱ్ఱి వేంకటకవి చంద్రాంగద చరిత్ర, గణప వరపు వేంకట కవి, ప్రబంధ రాజ వేంకటేశ్వర విజయ విలాసము మున్నగు వానికి పదకోశాల త్యావశ్యముగా కావలెను -" మాండలిక వృత్తి పద కోశము [భారతి - 1970 ఏప్రెల్ సంచిక]

నిడదవోలు వారి పై ఆశయములు భావి కాలమున నెరవేరునని ఆశించ వలసియున్నది

నిడదవోలు వారి భాషాసేవ పయి పరిశోధన వ్యాస రచనకు యువకులను ప్రోత్సహించ వలసిన ఆవశ్యకత కలదు విశ్వ విద్యాలయములు విశేషించి మదరాసు విశ్వ విద్యాలయము దీనికి పూనుకొనుట సముచితము.

కీ శే. నిడదవోలు వారికి ఇవే నా స్మృత్యంజలి. ●

పైదానిలో ఇచ్చిన 'పన్నస' ఇరువదినాలుగు మఱుతుర్ల నేల అని స్పష్టముగ ఉన్నది. 'పన్నస' అనుదానికి క్షేత్రము అను అర్థమే ఉన్నయెడల 'నేల' అని చివరన పేర్కొనుట జరుగదు. కావున 'పన్నస' అనుదానికి పొలము లేదా 'వరి పంటనేల' అను అర్థాలు సరికుదురవు. ఇంతేకాదు రేనాటి చోళుల శాసనాలలో కొన్నింట 'ఇచ్చినదత్తి' (మాలెపాడు శాసనము) అనియు కొన్నిటి 'ఇచ్చిన పన్నస అనియు ఒకే అర్థమున వాడబడినవి. అందువలన 'పన్నస' అనుగాదత్తి (దానముగా ఈయబడినది) మాత్రమే కాగలదు.

ఇక ద్రావిడభాషాపదముగ ఇది కన్పట్టదని చెప్పిన ప్రొ. శా. రచయిత 'పన్నులేని భూమి' అను అర్థమును ఇచ్చుటకు కారణమునుగాని వ్యుత్పత్తినిగాని సూచింపలేదు. 'పన్ను' అను పదము [illegible], అన్ టాక్సు అను అర్థములలో తొలి తటి శాసనములందు ఎచటను కన్పట్టదు. అదియును గాక 'పన్నాస' [illegible] + అస,=పన్నుపై ఆశయే అగునుగాని పన్నులేదనుట పొసగదు.కావున పన్నసకు దత్తము అను అర్థము కలుగుటకు కారణము వేరుగ ఉండియుండును. ఆ కార ణమును తెలిసికొనుటకు దేశచరిత్రయు భాషాచరిత్రయు మనకు కొంత సాయపడ గలవు.

ఆంధ్రదేశమున పాళీప్రభృతి ప్రాకృతభాషలు దాదాపువేయి సంవత్సర ములు ఆదరణతో మనినవి. ఇట్టి ప్రాకృతములను గురించి కొంత పరిశీలనను సాగించిన శ్రీ, శే. మేడేపల్లి వెంకటరమణాచార్యులవారు పాళిలో మాత్రమే కానవచ్చు కొన్నిపదములు ఆ యర్థములలో సంస్కృతమున కానరాకున్నవని చెప్పుచు కొన్ని పదములను లక్ష్యములుగ వాని అర్థములతో పాటుగ తెలిపిరి. అందులో కొన్ని, పర్ణాకార=కానుక; సంగనికా-సభ; పంసర్గ=పద్మము; ప్రణీత= మధురమైన; కథికా : సంభాషణము.

పై పదములలో 'పర్ణాకార' అనునది కానుకకు సమానార్థకముగ ఈయబడి నది. దీనికి కారణమును మనము ఇప్పుడు ఊహించగాలము. బహుశః ఏదైన వస్తువును ఇతరులకు ఉచితముగ ఇచ్చినపుడు ప్రాచీనకాలమున ఆకులలో పెట్టి ఇచ్చుట ఉండెడిదని భావించుటకు అవకాశము కలదు. వనములు విరివిగ ఉండి ఆకులు అతిసులభముగా లభ్యములగుటయే ఇందులకు కారణము కావచ్చును. ఈ సంప్రదాయపు అవశేషమే నేడు తెలుగు దేశమున పల్లెలందు 'పొత్తర్లు' అను దాని యందు నిలిచియున్నది. బ్రాహ్మణులకు పుణ్యతిథులందు ఇచ్చు దానములకు 'పొత్తర్ల' అను వాడుక పత్త్రి (ఆకు) అను దానినుండి రూపొందిన 'ప్రత్రాళియే పొత్తర్లుగ మారియుండును.

పై దానినే ఇంకొక విధముగ కూడ అర్థము చేసికొనుటకును అవకాశము కలదు 'పర్ణ' అను పదమునకు సంస్కృతమున తమలపాకు అను అర్థమును కలదు. 'పర్ణ' పదమే ప్రాకృతమున పన్నగామారి హిందీలో పాన్'గా పరిణమించి నది. దానమిచ్చునపుడు తాంబూలమొసగుట తెలుగుదేశమున ఒక ఆచారముగ తొలుతటి నుండియు ఉన్నది! మధ్యయుగములందు ఇదియే'తాంబూలప్రవణము'అను పేరున ఆదరింపబడినటుల శాసనమువలన విస్పష్టము. ఈ కాలమున సైతము ఒక కానుకను, తాంబూలములో పెట్టిగాని, లేదా తాంబూలముతోగాని ఇచ్చుట సర్వత్ర పరిపాటిగ ఉన్నది. ఇట్టి ఆచారమే పన్నస లేదా పన్నవిస అను పదము రూపొం దుటకు కారణమై ఉండవచ్చును.

కాని 'పర్ణాకార' అను పదమునుండి 'పన్నస రూపొందుటకు అవకాశము లేదు. బహుశః 'పర్ణాకార' అను పదమునకు సమానార్థకముగ వేరొక పదము తరు వాతి కాలమున రూపుగొని, దానినుండియే 'పన్నవిస' 'పన్నస' ఏర్పడియుండును. అట్టి అవాంతరరూపపు పదము 'పర్ణావిష' అని భావించుటకు ఉపపత్తి ఉన్నది. ఇందుండియే ప్రాకృతరూపమగు 'పన్నవిస' తొలుతఏర్పడి, క్రమముగ పన్నాస పన్నస, వంటి రూపములను పొందియుండును.

'పర్ణావిష్టయే' ఆ తొలుతటి పదమని అనుటకు వేరొక కారణమును కలదు సంస్కృతమున 'వీటి' అనుపదము విడియమునకు సమానార్థకముగ వాడుక యందున్నది. పెద్దనామాత్యుడు వీటి గంధ స్థగితేతర పరిమళమై, మగువ పొలుపు దెలుపునొక్క మారుతమొలసెన్ అని అ. వాడుట తెలుగు పాఠకులు ఎరిగినదే. కాని 'వీటి'కి వ్యుత్పత్తిని మాత్రము ఏ సంస్కృత నిఘంటువును సమకూర్చినది కాదు. 'పాన్ బీడా' అను హిందీ శబ్దమున బీడాయును తెలుగుదేశపు విడియము విడెములును ఈ వీటికి మారురూపములే 'పర్ణావిష్ఠ' రూపమే కొన్నిప్రాకృతము లందు 'పన్నవిస'గను, కొన్నిట 'పన్నవిట్ట'గను మార్పొందియుండును. రెండవదాని

నుండియే వీటీ, బీడా, విడియము, విడెము అనునవి ఏర్పడెనని భావించుట సమంజసము. ప్రాకృతమునుండి రూపొందిన 'వీటి' పదము, పశ్చాద్గమనమువలన సంస్కృత భాషలో స్థానమును ఆర్జించియుండును.

పై చర్చయొక్క సారాంశమిది. భారతదేశమున దానముతో 'పర్ణము' ముడివడియుండుట తొలుతనుండియు కలదు. 'పర్ణావిష్ట' యొక్క ప్రాకృతరూపము నుండియే పన్నవిస 'పన్నస' 'పనాస' పదములు ఏర్పడినవి. దానమీయబడినది. అని మాత్రమే ఆ పదములలో ప్రతిదానికిని అర్థము.

5. శ్రాహి (శ్రహి)

దాదాపుగ క్రి. శ. పదవ శతాబ్దాము మొదలుగ, అటనట కొన్ని తెలుగు శాసనములందు కాననగుచున్నది ఈ పదము. దీని అర్థనిర్ణయమున పండితులలో ఏకాభిప్రాయము కన్పట్టదనుట ఈ దిగువ ఉల్లేఖనముల వలన తెలియనగును.

శ్ర. హి : పవిత్రమైన రాంగ్ ఫర్ శ్రాహి (ప్రా. శా.)

శ్రాహి : శుభమైన, పవిత్రమైన. ది వర్డ్ జనరల్లీ అక్కర్స్ బిఫోర్ ది నేమ్ ఆఫ్ ది ఆస్పిసియస్ డే ఆన్ వుచ్ ఎ రాయల్ గ్రాంట్ వజ్ మేడ్...ఇట్స్ వారియంట్ శ్రీహి అక్కర్స్ ఇన్ వన్ ఇన్‌స్క్రిప్షన్ (ప్రా. శా.)

శ్రహి : పంద్రెండు నెలల కాలము. సంవత్సరము (శా. శ. కో.)

శ్రాహి : సంవత్సరము, పంద్రెండు నెలల కాలము (శా. శ. కో)

పై అర్థములలో ఏదియును సరికుదుర జాలదనుట ఈ క్రింది శాసన భాగముల పరిశీలన వలన తెలియ వచ్చును.

1. స్వస్తి సర్వ లోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజుల ప్రవర్థమాన విజయ రాజ్య సంవత్సర 12 శ్రాహి విష్ణు సంక్రాంతి నిమిత్యంబున...

   రాజమండ్రి శాసనం ఎ. ఆర్. నెం. 400/1932-33)

2. స్వస్తి సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజుల ప్రవర్ధమాన విజయ రాజ్య సంవత్సరంబులు (మూ) డగు శ్రాహి గంగ్గం గొణ్డ చోడవలనాంటి ప్రోలు...(సర్వవరం శాసనము. యస్. ఐ. ఐ. 6 12.)

3. శకవర్ష 1008 శ్రీ మచ్చాళుక్య విక్రమ సంవత్సరంబులు 5 గు శ్రాహి శ్రీ యమేశ్వర మహాదేవరకు...

   (దాక్షారామ శాసనం. యస్. ఐ. ఐ. 4 1317.)

4. స్వస్తి సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజుల ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబులు 37 గు శ్రహి సకవర్షంబులు 1019 గు నేంట్టి.


పై వానిని పరిశీలించినపుడు, శ్రాహి (శ్రహి) అను పదము తొలుతటిదానియందు పుణ్యతిథికి ముందునను, రెండవ దానియందు దేశ భాగమునకు ముందుగను, మూడవ దానియందు ఒక దేవనామమునకు ముందునను, నాలుగవ దానియందు శకవర్షంబులకు ముందుగను కుదిరియున్నది. కాని అన్నింట పరిపాలన సంవత్సరపు సంఖ్య తరువాతనే ఈయబడినది. అందువలన ప్రా. శా. రచయిత చెప్పినటుల 'పవిత్రమైన. అను అర్థముగాని శా. శ. కో. తెల్పిన 'సంవత్సరము' అను అర్ధముగాని సరికుదరవు. పరిపాలన సంవత్సరములు అని సంఖ్య తెలిపి 'శ్రాహి' అనుట వలన ఆ పదము సంవత్సరమును తెలుపజాలదనుట సుస్పష్టము. 'శ్రాహిసక వర్షంబులు' అనగా పవిత్ర శకవర్షములు అనుట అర్ధరహితముగదా కావున "శ్రాహి" అను దానికి వేరుగ అర్ధమును అన్వేషించవలసి యున్నది. ఈ పదము సంస్కృత, దేశ భాషలలో దేనికిని చెందనిది. కాని సందర్భమునుబట్టి "జరుగుచుండగా", అను అర్థమును మాత్రము స్ఫురింపజేయుచున్నది. ఒక రాజు యొక్క పరిపాలన కాలపు విజయరాజ్య వత్సర సంఖ్యను తెలిపి, "శ్రాహి" అని దానికి కలిపినపుడు, ఆ సంవత్సరము అప్పటికి గడచిపోలేదనియు, అది వర్తమాన (జరుగుచున్న) సంవత్సరమనియు దాని అర్ధము.

ఇక ఈ పదము అన్యదేశ్యమనుటలో సంశయమునకు తావులేదు. ఒక శాసనమున "శ్రీహి" అను రూపము ఉండుటవలన సంస్కృతమని అనుకొనుట పెద్ద పొరపాటు. ఆ పదము "శ్రాహి"కి తప్పు రూపమే కావచ్చును; బహుశః లేఖకుని పొరపాటు అయి ఉండవచ్చును. అన్య దేశముల విషయమున ఇట్టివి తఱచుగ జరుగును. యథార్థమున "శ్రీహి" అను సంస్కృత నామవాచకముగాని. విశేషణముగాని లేదుగదా! ఉన్నది శ్రీః అనునదియే. అది "శ్రీహి" కానేరదు.

ముస్లిముల పరిపాలన దేశమున మొదలగుటకు పూర్వమే భారతదేశము నందు ప్రాచీన పహ్లవ, శక, అభీరాదుల పరిచయమువలన అన్యభాషాపదములు - ముఖ్యముగ రాజ బిరుదములందును, రాజకీయ వ్యవహారములందును - వాడుకను ఆర్జించినవి. అందు కొన్ని సంస్కృత పదములతో సమ్మిశ్రితములైనవి, (ఉ. సాహసాంక); "బహుపరాక్" వంటి కొన్ని పదములు కొంత రూపవికృతితో నిలిచినవి అట్టివానిలో "శ్రాహి"యు ఒకటి. గుజరాతు చాళుక్యులద్వారా, తక్కిన చాళుక్య రాజ వంశములకు ఇది సంక్రమించినది. వీరి శాసనములన్నింట ఈపదమునకు జరుగుచున్న (వర్తమాన)-అను అర్థమే సరికుదురుచున్నది. పారశీక భాషయందలి "షురుహ్" పదముతో దీనికి సంబంధమేదియైన కలదనుట ఇంకను విచారింపవగినది. కాని దీనికి "పవిత్రమైన"గాని "సంవత్సరము"గాని సమానార్థకములు కావనియు, వర్తమానాబ్దమనుటయే సుసంగతమనియు నిశ్చితము.

తొలుతనే చెప్పినటుల ఇప్పటికి అయిదు పదముల చర్చయు, వాని అర్థ నిర్ణయమును జరిగినవి. కాని ఇట్టి పదగ్రంథములు దాదాపు రెండు వందలకు పైగా శాసనములందుకలవు. వానికి సరియగు అర్థనిర్ణయము జరుగవలసియున్నది. తెలుగునకు ప్రస్తుతమున్న భాషాశాస్త్ర దీపము చాలా చిన్నది. మినుకు మినుకు మను దాని మసక వెలుగున అర్థసాధన సాధ్యముకానిపని. ఒక జాతియొక్క భాషాశాస్త్రగతి. దానిని గుర్తించక రూపొందించిన భాషాశాస్త్రము వీటిమీదివ్రాత సరియగు భాషాశాస్త్రము రూపొందిననాడు ఇట్టి పదగ్రంథులు సుపరిష్కృతములు కాగలవు,

చివర నొకమాట. ఈ వ్యాసమున ఉదహరింపబడిన శాసన భాగములలో పెక్కింటిని నాకు సంపాదించి యిచ్చిన వారు నా ప్రియమిత్రులు డా. పుచ్చా వాసుదేవపరబ్రహ్మశాస్త్రిగారు. [మాజీ డిప్యూటి డైరెక్టరు (ఎపిగ్రఫి; డిపార్టుమెంట్ ఆఫ్ ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్ ఆంధ్రప్రదేశ్]. వారితో సాగించిన చర్చలును నాకు ఎంతగానో ఉపకరించినవి. ఈ విధముగ నాకు వారు అందజేసిన సహాయ్యము అమూల్యము. ఏనాటికిని నేను మరువరానిది. □



శ్రీ బులుసు వేంకటరమణయ్య

మరపురాని జ్ఞాపకాలు

కీర్తిశేషులు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారిని గురించి వారి ప్రతిభా పాండిత్యాలను ఉగ్గడిస్తూ ప్రముఖ విద్వాంసులు తెలియజేస్తున్నందున- ఆ విషయాన్ని విడిచిపెట్టి ఆయనతోటి పరిచయాన్ని పురస్కరించుకొని యీ చిన్న వ్యాసం వ్రాస్తున్నాను.

అరవై ఏండ్లకు పైగా ఆయన పరిచయం నాకున్నది. 1922లో నేను బాల్యంలోనే విద్యాభ్యాసానికి విజయనగరం చేరుకున్నాను. తర్వాత కొద్దికాలంలోనే ఆయనతోడి పరిచయం కలిగింది. ఆయన బి.ఎ. ప్యాసయి విజయనగరం ఇంపీరియల్ బ్యాంకి (నేటి స్టేట్ బ్యాంకి)లో పని చేస్తూ ఉండేవారు. నాకుగల సాహిత్యాభిలాషవల్ల ఆ పరిచయం క్రమంగా వృద్ధి పొందినది. 1929-30లలో నేను విజయనగరం ఘోర్డ్ సంస్కృత లైబ్రరిలో ఏడాదిపాటు పని చేసినప్పుడు అమూల్యాలైన ప్రాచ్య, పాశ్చాత్య గ్రంథాలను గురించి ఇద్దరం చర్చించేవాళ్లం. మాతోపాటు మిత్రులు శ్రీ ఇ. ఎ. వి. రాఘవాచార్యగారు- విజయనగరం పార్కులోని వెన్లక్ లైబ్రరీ లైబ్రేరియన్ కూడా ఉండేవారు. సాయంత్రం ముగ్గురం ఆ లైబ్రరీ హాలులో, కూర్చుని వాఙ్మయం గురించి మాట్లాడుకునేవారం. అప్పుడు శ్రీ వేంకటరావుగారి ప్రతిభా పాండిత్యాలు, జ్ఞాపక శక్తి నాకు ఆశ్చర్యాన్ని కలిగించేవి. మొదట్లో ఆయన "నిడుదవోలు వేంకట రమణ" అనే పేరుతో "భారతి"కి వ్యాసాలు పంపేవారు. ఆ పేరు ఎప్పుడు మార్చుకున్నదీ నాకు జ్ఞప్తి లేదు. విజయనగరంలో ఉన్నప్పుడు ఆయన వల్ల పెక్కు విషయాలు తెలుసుకున్నాను. నాపై ఆయనకు మంచి అభిప్రాయం ఏర్పడినది.

శ్రీ వేంకటరావుగారి జనకులు సుందరంపంతులుగారు సాహితీ ప్రియులు. విద్వాంసులు, విమర్శకులు. పెక్కు తెలుగు మద్రితా ముద్రిత గ్రంథాలను సేకరించి, అమూల్యమైన సొంత లైబ్రరిని నెలకొల్పారు. తండ్రిగారి ప్రోత్సాహమే వీరి సాహిత్య కృషికి దోహదం చేసింది. బ్యాంకి ఉద్యోగిగా ఉండడం ఆయనకు ఇష్టం లేదు. తప్పని సరిగా ఆ పని చేస్తున్నా దృష్టి ఎప్పుడూ భాషా వాఙ్మయాలపైనే ఉండేది.

నేను మద్రాసులో స్థిరపడేటప్పటికి వేంకటరావుగారికి కాకినాడ బదిలీ అయింది. అది వారి జీవితంలో గొప్ప మార్పు తెచ్చింది. ఆంధ్ర సాహిత్యాభిమానులూ, భాషా వాఙ్మయ పోషకులూ అయిన పీఠికా పురాధిపతుల ఆశ్రయం ఆయనకు లభించింది. తత్ఫలితంగా వేంకటరావుగారు బ్యాంకి ఉద్యోగానికి స్వస్తి చెప్పడం, కాకినాడ పి.ఆర్. కాలేజిలో ఆంధ్రోపన్యాసక పదవిని స్వీకరించడం జరిగి, వారి సాహితీ కృషి నిరంతరాయంగా కొనసాగడానికి అవకాశం ఏర్పడింది. తర్వాత కొద్దికాలంలోనే ఆయన మద్రాసు యూని వర్సిటీ ఎం.ఏ. పరీక్షకు హాజరై అందులో ఉత్తములుగా ఉత్తీర్ణులయినారు. తర్వాత కొలది ఏండ్లలోనే వేంకటరావుగారి మకాం మద్రాసు నగరానికి మారినది.

సర్ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు మద్రాసు యూనివర్సిటీ వైస్ ఛాన్సలరుగా ఉన్నప్పుడు 1930లో అనుకుంటాను- యూనివర్సిటీ అనుబంధ సంస్థగా- ఓరియంటల్ రిసెర్చి ఇన్స్టిట్యూటు స్థాపించబడినది. అందలి తెలుగు శాఖలో కోరాడ రామకృష్ణయ్యగారు సీనియర్ లెక్చరరు. వారికి జూనియర్‌గా ప్రసిద్ధులైన ప్రాచ్యవిద్యా నిష్ణాతులు నియమింపబడేవారు. ఆ స్థానాన్ని ఆక్రమించిన ప్రథములు సుప్రసిద్ధాంధ్ర వ్యాకరణ పారీణులు వజ్ఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారు. శాస్త్రిగారు ఆ పదవిని విడిచి, ఆంధ్ర విశ్వ విద్యాలయానికి వెళ్లిన తర్వాత ఆ స్థానం శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారికి లభించింది. శాస్త్రిగారి అకాల మరణం వల్ల ఖాళీ అయిన ఆ స్థానం శ్రీ వేంకటరావుగారికి లభించి, వారి భాషా వాఙ్మయ పరిశోధనకు ఇతోధికంగా గొప్ప అవకాశం లభించినది. తన్మూలంగా ఆయన అమూల్యమైన కవి చరిత్రలను, వాఙ్మయ చరిత్రలను రచించి విశ్వ విద్యాలయం ద్వారా ప్రకటించారు. శ్రీ రామకృష్ణయ్యగారు రిటైరయిన తర్వాత వీరే తెలుగు శాఖకు అధిపతులైనారు. వీరి హయాంలోనే యూనివర్సిటీలో తెలుగు-ఎం.ఏ. తరగతులు ప్రారంభించబడినవి.

శ్రీ వేంకటరావుగారికి మద్రాసులోని ప్రసిద్ధ సాహితీ సంస్థలతో సంబంధం ఏర్పడినది. సాహిత్యాభిమానులగు పెద్దలకు ఆయన అంటే ఎంతో గౌరవం. ఆంధ్రపత్రికాధిపతులగు శ్రీ శివలెంక శంభుప్రసాదుగారి ఆదరాభిమానాలు చూరగొన్న వీరు పెక్కు అమూల్య వ్యాసాలు భారతిలో ప్రకటించారు. వీరి వచన వాఙ్మయ చరిత్రను శంభుప్రసాద్‌గారే తమ ముద్రణాలయంలో ముద్రించి యిచ్చారు. వావిళ్ల సంస్థ యజమానులు, స్వంతదారులు అయిన వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారు వీరి చేత చాలా గ్రంథాలను పరిష్కరింపజేశారు. పీఠికలు వ్రాయించారు. వేంకటరావుగారి మూలంగానే శ్రీ శాస్త్రిగారికి నా పయి గౌరవాభిమానాలు పెంపొంది నా సాహిత్య కృషికి దోహదం కలిగించాయి. నా అభిషేక నాటకానికి వీరు అమూల్యమైన పీఠిక రచించారు. వీరి మూలంగానే నాకు డాక్టర్ గిడుగు వేంకట సీతాపతిగారి పరిచయం కలిగి, క్రమంగా ఆయనకు నాపై ఎక్కువ గౌరవం ఏర్పడింది. నా ప్రార్థనపైనే వేంకటరావుగారు ఆనంద ప్రెస్‌వారు ప్రకటించిన వసు చరిత్రకు అమూల్యమైన పీఠికను రచించి, ముద్రణాలయాధిపతులు శ్రీ బి. మాధవరావుగారి ప్రశంసలనందుకొన్నారు. ఆయనయే వీరి 'ఉదాహరణ వాఙ్మయ చరిత్ర'ను తొలిసారి తమ ముద్రణాలయంలో ముద్రించారు.

ఈయన చాలా విద్యా సంస్థలలో ఉపన్యాసాలిచ్చేవారు. పొన్నేరి మొదలైన స్థలాలలో జరిగిన సభలలో వీరు ఉపన్యసించినప్పుడు నన్ను అధ్యక్షస్థానంలో కూర్చోబెట్టేవారు. అది నా అదృష్టమే అని అనుకొనేవాడను. ఆయనకు నాయెడగల అభిమానం అట్టిది!

ఈయన నిష్కల్మష హృదయులు. ఏ విషయాన్నయినా మనస్సులో దాచి ఉంచుకోలేక వెల్లడి చేసేవారు అది కొందరికి అనిష్టంగా ఉండేది. చరిత్ర, వాఙ్మయ విషయాలలో అభిప్రాయ భేదాలు కలిగినప్పుడు ఎదుటి వారిని ముఖం ముందే విమర్శించేవారు. ఏమాత్రం వెనుదీసేవారు కారు.

వీరికి "కళాప్రపూర్ణ" బిరుదం రావడంలో కొంత ఆలస్యం కావడానికి వీరి అనాసక్తిభావం కొంత వరకూ కారణమై ఉండవచ్చును. ఎవరు ఏమి చెప్పినా నమ్మడం, తర్వాత యదార్థం తెలుసుకుని చింతించడం కూడా కొన్ని సందర్భాలలో జరిగేది.

పదవీ విరమణ చేసి, హైదరాబాదుకు వీరు వెళ్లిపోయిన పిదప శ్రీ వేంకటరావుగారిని కలిసికొనే అవకాశం లేకపోయింది. నేను హైదరాబాదుకు వెళ్ళినప్పుడు మాత్రం తప్పక వీరి గృహానికి వెళ్లి, వీరితో మాటలాడి తృప్తి పొందడం మాత్రం జరిగేది. వీరి జ్యేష్ఠ కుమారులూ, సాహితీ వేత్తలూ, సహృదయులూ అయిన శివసుందరేశ్వరరావుగారు మాత్రం వీరిని గురించి అప్పుడప్పుడు తెలుపుతూ ఉండేవారు.

శ్రీ వేంకటరావుగారి **వంటి** సహృదయులూ, సాహితీ వేత్తలూ మన దేశంలో చాలా సకృత్తుగా కానవస్తారు.

ఆయన పవిత్రాత్మకు నా జోహార్లు. □

టెలిగ్రాం

మూలం: శ్రీమతి నందినీ శతపథి
తెలుగుసేత: బసంగి శ్రీరాములు

ట్రింగ్...ట్రింగ్. ప్రతిరోజు మ్రోగినట్లుగానే, సైకిలు గంట మ్రోగింది. ఆ శబ్దం వినబడగానే వసారా వైపామె పరుగెత్తింది. ప్రవేశ ద్వారం దగ్గర ఆగి "ఏమిటది" అని అడిగింది.

టెలిగ్రాం తెచ్చిన తపాలా జవాను చికాకుపడ్డా, ఆమె మౌనంగా నిలబడింది. చివరకు జవాను "నాన్నగారి కొక టెలిగ్రాం వుందని, వారికి చెప్పమ్మా" అని బ్రతిమలాడా డామెను. అతని గొంతు వినగానే సూరబాబు బయటకు వచ్చాడు. తండ్రితో ఆమె యింట్లోకి వెళ్తూ అడిగింది – "ఏమిటది, నాన్నా?"

తండ్రి మౌనం వహించాడు. కొంత సేపు పిమ్మట "మన మిారోజు వెళ్ళాల్సి వుంది" అన్నాడు. ఆ అమ్మాయికి పధ్నాలుగు లేక పదిహేను సంవత్సరాల వయస్సుంటుంది. చూడడానికి అందంగా వుంటుంది. అందానికి తగిన పేరూ వుంది – జ్యోత్స్న. నఖశిఖ పర్యంతం ఆమె శరీరంలో ఏ లోటూ చూపించడం చాల కష్టం.

కాని మనిషికి వుండాల్సిన అతిముఖ్యమైన లక్షణం ఆమెలో లేదు. చిన్నతనంలో భయంకర వ్యాధికి గురైన ఆమె, తన జ్ఞాపక శక్తిని కోల్పోయింది. ఆమె దేనినీ అర్థం చేసుకోలేదు. దేనిని గూర్చి ఆలోచించనూ లేదు "మామిా, నేనీ రోజు వంట చేస్తా, నీ వెళ్ళి విశ్రాంతి తీసుకో" అనేది. అక్క ఆమె వైపు కోపంగా చూసి – "తెలివి తక్కువ పిల్లా, నీవేమి వండుతావు? బయటకు పో!" అని కేక లేసేది

నవ్వుతూ ఆమె వెనుకకు వెళ్ళేది. కోపం, నిర్లక్ష్యం అంటే ఏమిటో ఆమె కర్థమయ్యేవి కావు. తండ్రి దగ్గర కెళ్ళి అనేది – "నాన్నా, పెద్దక్క కట్టుకున్న లాంటి చీర నాకూ కావాలి. అక్క తన పౌడరును నన్ను వాడనివ్వదు. నాకూ ఒక పౌడరు డబ్బా కొనిపెట్టు నాన్నా"

ఆమెను సంతోష పెట్టడానికి తండ్రి నవ్వేవాడు. ఆమె కోరికను కాదనకపోయినా, అనవసరంగా సొమ్ము ఖర్చు పెట్టేవాడు కాదు. రెండవసారి వాటి గురించి ఆమె ఎప్పుడూ పట్టుబట్ట లేదు. చెప్పిన విషయాన్ని వెంటనే ఆమె మరచిపోయేది.



తల్లి చాల బాధ పడేది. పాప మీపిల్ల ఏం చేస్తుంది? ఏ పని చెయ్యలేదు. ఇంటికి వచ్చిన ఉత్తరాల నందుకోవడం, బయట నుండి ఎవరైనా పిలిస్తే, తలుపు తీయడం వంటి పనుల నామెకు తండ్రి పురమాయించాడు.

జ్యోత్స్నకు ఈ పనులు చేయడంలో చాలా ఆనందం కలిగేది. ఎవరి గొంతు వినబడినా, సైకిలు గంట మ్రోగినా, బయటకు పరుగెత్తేది. ఆకలి, దాహం కూడ మరిచేది. "చూడు, చిన్నపిల్లలా, ఎలా పరిగెడుతోందో" అంటూ హాస్యం చేసే వారామెను, అన్నలూ, అక్కలూ. ఎవరి విమర్శలను ఆమె పట్టించుకొనేది కాదు.

* * * * *

సూరబాబును బదిలీ చేస్తున్న ఉత్తర్వు – తక్షణమే క్రొత్త స్థలంలో చేరాలని టెలిగ్రాం ఉత్తర్వు – అందింది. కాని భార్య, అతనితో ఎలా వెళ్ళగలదు? ఆమెకు జబ్బుగా వుంది. చివరకు, తనతో పెద్ద కొడుకును, ఇద్దరు కూతుళ్ళను తీసుకెళ్ళడానికి నిర్ణయించాడు. భార్యతో రెండవ కొడుకును, పెద్ద కూతురును వుంచడానికి నిశ్చయించాడు. జ్యోత్స్న వాళ్ళ నాన్నతో వెళ్ళడమెవరికీ యిష్టం లేదు. ఆమె వెళ్ళిందంటే అతని కెన్నో యిబ్బందులు కలుగజేస్తుంది. ఏమి చెప్పినా వినదు, అర్థం చేసుకోదు. చూసిన దేనినైనా అనుకరించడంలో పట్టుబడుతుంది. ఏ యింటి నుంచైనా సన్నాయి వినబడితే చాలు "నాకు పెళ్ళి యిప్పుడే చేసెయ్యాలి" అంటుంది వెంటనే.

ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు జరిగాయి. సామాన్లు కట్టబడ్డాయి. మౌనంగా దీనినంతా జ్యోత్స్న గమనించింది. ఇంటి ముందుకు వచ్చి కారాగింది. కారులో ప్రయాణించవలసిన వాళ్ళు ఎక్కగానే ఒక టైరు గట్టిగా పట్టుకొని కారు వెనుకగా జ్యోత్స్న బోర్లాపడి వుండడం వాళ్ళు గమనించారు.

ప్రతి ఒక్కరు ఆశ్చర్యపోయారు. చాలా సేపు బ్రతిమలాడిన తరువాత టైరు విడిచి పెట్టినా, తండ్రితో వెళ్తానని పట్టుబట్టిందామె. చాలా చర్చ జరిగిన తరువాత, జ్యోత్స్నను తీసుకెళ్ళడానికే నిశ్చయమైంది.

చాలా ఆనందంతో, కారులో జ్యోత్స్న ప్రవేశించింది. తలుపు దగ్గర తల్లి నిలబడి వుంది. ఆమె బుగ్గల మీదుగా కన్నీరు దొర్లుతోంది. పెద్ద కొడుకును పిలిచి, అతనితో అనునయంగా యిలా చెప్పింది – "నిజానికి జ్యోత్స్న చాలా దురదృష్టవంతురాలు. దయ వుంచి ఆమెను నిర్లక్ష్యం చేయవద్దు. ఆమెను కొట్టినట్లయిన, ఏమి జరుగుతుందో నీకు తెలియదు." కారు బయలుదేరింది.

రైలు బండిని చూసి, దానిలో కూర్చొని ప్రయాణించడం జ్యోత్స్నకు చాలా సంతోషాన్నిచ్చింది. రైల్వే స్టేషనులో 'రసగుల్లా' తినినప్పుడు, ఆమె పొందిన ఆనందానికి అవధులు లేవు.

"టెలిగ్రాం వచ్చిందండి" – ఎర్ర సైకిలు దిగి తపాలా జవాను కేక వేసాడు. జ్యోత్స్న వచ్చి టెలిగ్రాం అందుకొని ఇంట్లోకి పరుగెత్తింది. "నాన్నా, నాన్నా! మరొక టెలిగ్రాం వచ్చింది. మళ్ళీ రైలు బండిలో ఎంచక్కా వెళ్తాంగదూ!" అంది.

సూరబాబు నివ్వెరపోయాడు. మరొక టెలిగ్రాం వచ్చిందేంటి? తండ్రి ఆవేదనను అర్థం చేసుకోలేక పోయిందామె. నాన్న ఎందుకంత బాధ పడుతున్నాడు? రైలు బండిలో మళ్ళీ వెళ్ళాల్సి వుంటుంది. రైలు ప్రయాణం ఆమె ఎలా గుర్తు పెట్టుకొందో తెలియదు. "మీ అమ్మకు జబ్బు తీవ్రంగా వుంది, నేనీరోజే యింటి కెళ్ళాలి" అని పెద్దకొడుకుతో సూరబాబు చెప్పాడు.

మళ్ళీ సామాన్లు సర్దబడ్డాయి. తల్లి జబ్బును గూర్చి విన్న జ్యోత్స్న నివ్వెరబోయింది. ఆమె ఏడ్చింది. కాని మరుక్షణమే ఆ విషయాన్ని మరచిపోయి, మరేదో పనిలో నిమగ్నమైంది.

టెలిగ్రాం అర్థం తెలిసిపోయిందామెకి – అంటే రైలులో ప్రయాణం చెయ్యడమన్న మాట. అందువలన, ఈ పర్యాయం కూడ రైలు బండిలో సరదాగా వెళ్ళొచ్చని చాలా సంబరపడి పోయిందామె.

తనతో ఆమెను తీసుకెళ్ళడానికి సూరబాబు యిష్టపడలేదు. భార్య జబ్బుతో వుండడమనే కష్టం, జ్యోత్స్నను కూడ తీసుకొని వెళ్తే, రెట్టింపవుతుంది.

దగ్గరలోనే తన భార్య చెల్లెలు వుంటున్నది. జ్యోత్స్న నామె యింట్లో విడిచి వెళ్ళాలనుకున్నాడు. కాని ఆమెను ఒంటరిగా విడిచి పెట్టడం కూడ కష్టమే. చివరకు జ్యోత్స్నతో పాటు అందరు పిల్లలను వాళ్ళ పిన్ని గారింట్లో వుంచడానికి నిర్ణయమైంది. గుర్రపు బండి ఎక్కి సూరబాబు కూర్చున్నాడు. జ్యోత్స్న పిన్ని కూతురు, నిని, ఆమెను గుర్రపు బండి బయలుదేరే వరకు, వేరే పనిలో నిమగ్నమయేలా చేసింది. తండ్రి దగ్గరగా ఆమె వుంటే, అతనా స్థలాన్ని విడిచి వెళ్ళలేడని అందరికీ తెలుసు. తర్వాత కొద్ది సేపటికి జ్యోత్స్న యింట్లోకి వెళ్ళగానే, తన తండ్రి లేకపోవడాన్ని గమనించింది.

వెంటనే యింటి నుండి బయటకు వచ్చింది. దూరంగా వెళ్తున్న గుర్రపు బండిలో తన తండ్రి కూర్చొని వుండడం గమనించింది. క్షణమైనా ఆలోచించకుండ, ఆమె పరుగెత్తుతూ, గుర్రపు బండిని అనుసరింప సాగింది. ఆమెకు రైలు ప్రయాణం గుర్తు వచ్చింది.

ఇంట్లో అందరూ గాభరా పడ్డారు. ప్రతి ఒక్కరు ఆమెను తిరిగి రమ్మని కేకలు వేసి పిలిచారు. కాని ఆమె ఎవరి మాటను పట్టించుకోలేదు. వెంటనే ఆమెను అనుసరిస్తూ ఆమె అన్నయ్య వెళ్ళాడు.

జ్యోత్స్న పరుగెత్తి, పరుగెత్తి, చివరకు రైల్వేస్టేషను చేరుకుంది. కాని అప్పటికే రైలు కూత పెట్టి బయలుదేరుతోంది. ఆమె దానిని సహించలేకపోయింది. రైలు పెట్టెకు దగ్గరగా పరుగెత్తింది.

రైలులో ప్రయాణించడానికి, ఎంత ప్రమాదకరమైనా, దాటరాని అడ్డంటూ, ఆమెకు లేదు. పరుగెత్తి వెళ్ళి ఆమెను పట్టుకోవాలని, వాళ్ళన్నయ్య ప్రయత్నించాడు. కాని వాళ్ళింటి దగ్గర బయలుదేరేటప్పుడు తల్లి చెప్పిన విషయం గుర్తు వచ్చింది. నిస్సహాయంగా ఆమెను, మరల పిలుస్తూ కేకలు పెట్ట సాగాడు. రైలు పెట్టె మెట్ల నెక్కడానికి జ్యోత్స్న ప్రయత్నించింది. కాని పాదాలు జారిపడిపోయిందామె.

ఆమెను రక్షించడానికి, ఆమె అన్నయ్య ప్రయత్నించాడు. కాని అప్పటికే ఇంజను బయలుదేరి పోయినందున, జ్యోత్స్న మృదువైన దేహంపై రైలు చక్రాలు దొర్లుకుంటూ పోయాయి. □

ఉదయ రాగం!

మైత్రేయ

సరి_సరిగమ కేది సరి
ఇది_చెలరేగిన హృదయ ఝరి
తరుణారుణ మోహన
ప్రణయ రాగలహరి__
శ్వాసల రాగాన
హృదయాల లయ పైన
చిరునవ్వు చరణాలు పాడితే,
పూవుల భావాలు
నవ్వుల నాదాలు
జత గూడి సంగీతమై సాగితే.
అది యిది ఏదో మదిగదిలోన కురిసిన
వలపుల తొలకరి__
తూరుపు తీరాల
సంధ్యా సింధూరాల
జీవితమే ఒక ఉదయ రాగం
ఆకాశమార్గాల
హరివిల్లు స్వప్నాల
బతుకంతా రంగుల గీతం
శ్రుతులై పవనాలు పరిమళ భావాలు విరిసిన
విరుల సిరి__

కలగూరగంప

కీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారికి కొందరు ప్రముఖుల ఉత్తరాలు

[ఒక మహనుభావునికి కొందరు మహామహులు వ్రాసిన లేఖలకు నకళ్లు యివి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారు, సురవరం ప్రతాపరెడ్డి జీవితం— రచనలు మీద పదేళ్లక్రితం పోటీరచనలు ఆహ్వానించారు. ఎంతో విషయం సేకరించాను. కానీ అది వారు నిర్ణయించిన పేజీలలో యిమడలేదు. తీరా రచన పూర్తయ్యాక ఆంధ్ర— తెలంగాణా గలాటాలవల్ల, రిజిష్టరు పోష్టులు తీసికోవడానికి పోస్టలు డిపార్టుమెంటు వారు నిరాకరించడం వల్ల నా రచన అసలు పోటీకే వెళ్లలేదు. అదింకా అచ్చు కానూలేదు— నేను ఆప్రయత్నం చేయనూ లేదు. కానీ నేను సేకరించిన విషయాలు పదిమందికి తెలియజేయాలనే వుద్దేశంతో, అందులో ఒక భాగంగా యీ లేఖలనకళ్లు యధాతధంగా వ్రాస్తున్నాను. ఇవింకా ఎక్కడా అచ్చు కాలేదు. అసలిలాంటివి వున్నాయని చాలమందికి తెలియదు. పరిశోధకుల పాలిట కల్పవృక్షాలవి.

ఈ లేఖలు వ్రాసిన వారిలోకొందరు ముఖ్యులు విశ్వనాథ సత్యనారాయణ, మల్లంపల్లి సోమశేఖరశర్మ, వావిలాల గోపాలకృష్ణయ్య, జనమంచి రామకృష్ణ, డా. పి. వి. రమణయ్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, చలమచర్ల రంగాచార్యులు, కొడవటిగంటి కుటుంబరావు, తిరుమల రామచంద్ర, శివశంకరశాస్త్రి, వగైరా.

భారతకోకిల సరోజిని నాయుడు సంతకంతో ఒక లేఖ వుంది. అడివి బాపిరాజువి ఒకటి రెండూ వున్నాయి. డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్వహస్తంతో గోలకొండ పత్రికకు వ్రాసిన సందేశం ఒకటి వుంది.

లేఖలు విజ్ఞాన ఖనిజాలు. చారిత్రక భాండాగారాలు. గోలకొండ పత్రిక అనాటి నిజాం పాలనకు పక్కలో బల్లెం. దానికి సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి. ఆయన అపర సరస్వతీ అవతారం. ఆ స్థాయికి తగ్గట్టు, ఆ కాలం నాటి రాజకీయ సాంఘిక పరిస్థితులను ప్రతిబింబిస్తూ వ్రాయబడిన ఆ లేఖల విలువలు పాఠకులే గ్రహించగలరు. ప్రత్యేకంగా నేను పొగడవలసిన అవసరం లేదు.

నేను సేకరించిన లేఖల కాలం - 1924 నుంచి 1953 వరకు - అనగా దాదాపు ఆయన కాలం చేసేవరకు వ్యాపితమయినది అవి ఎలా అందిస్తే బాగుంటుందో అని ఆలోచించి, చివరకు కాలక్రమమే మంచిదని నిర్ణయించాను. కావున తొలినాటి లేఖలు తొలుతనే వస్తాయి. మలినాటివి చివరలో వస్తాయి. తేదీలు తేల్చ లేనివి గూడ చివరనే. పరిశోధకులు యీ సంపదను పదిలపరచుకోగలరు.

— గోపీకృష్ణ

1

(దామోదర రెడ్డి ప్రతాపరెడ్డి బాల్యస్నేహితుడు. క్యాంబ్రిడ్జిలో చదివే విద్యార్థి. ప్రతాపరెడ్డి తన పేరు మార్చుకోకమునుపు పాపన్నగా వ్యవహరింపబడేవాడు. దామోదర రెడ్డి ఆంగ్లలేఖకు అనువాదమిది.)

క్యాంబ్రిడ్జి,
30 జనవరి 1924.

మైడియర్ పాపన్న,

చాల కాలం తరువాత నీలేఖ అందు కొన్నందుకు సంతోషం. బహుశా యింతకాలం వరకు నీవు నిద్రపోయి వుండవచ్చు. కాకినాడ కాంగ్రెసు సభలలో మేలుకొన్నావేమో ? నాకు సన్నిహితమయిన నీస్పందన వింటూ వుండే ఆ సభలు నిన్ను ఆకర్షించినట్టున్నాయి. హిందూదేశం నుంచి వచ్చిన కొన్ని వార్తాపత్రికలు నాదగ్గరున్నాయి. దయాళువయిన ఒక స్నేహితుడు దయార్ద్ర హృదయంతో వాటిని నాకు పంపాడు. ఈ వారం నీకు పత్రికలలోని కొన్ని పేజీలు పంపుతాను అవి నీకు కొంత ఆసక్తిని కలిగించవచ్చునని విశ్వసిస్తాను.

ఏ పార్టీ అయినా అధికారానికి రానీ ! ఇండియా, ఆ రాస్కెల్స్ నుంచి ఏదీ ఆశించేది లేదు (ఏమీ పొందలేదు) - తన కష్టం, తన ఓర్పులతో తప్ప. ఇవి (ఈ పార్టీలు) మనకేమయినా ఒరగబెడతాయని నీవనుకోవద్దు. నీవు చేయగలిగిన పని చేయ్. అంతేగానీ యీ పార్టీల మీద క్షణకాలం కూడ ఆధారపడవద్దు. లేబర్ పార్టీ కూడ అంతే. అది హిందూదేశ మిత్రుడనుకొందామనుకొండి అందులో వుండేది కూడ ఆంగ్లేయులే లేబర్ పార్టీ లీడరు - ప్రస్తుత (ఇంగ్లాండు) ప్రధాన మంత్రి చేసిన హెచ్చరిక నీవు పత్రికలలో చదివేవుంటావ్. మరింకేమయినా ఆశించేది వుందా ? మన ప్రయత్నాలే మనల్ని కాపాడుతాయి. వారి శ్రద్ధ, ఆదాయం - మన అజ్ఞానం, బానిసత్వం. మరి వాళ్లు నీకు స్వేచ్ఛనిస్తారని ఎలా వూహిస్తావు.

ఒక జర్మనీ అడ్రసు అడిగావు. క్షంతవ్యున్ని. రాయలేకపోయాను. జర్మనీ యిప్పుడు పెద్ద వుపద్రవంలోవుంది. ఇంకా ఏదీ స్థిమితపడలేదు. బెర్లిన్‌లో ప్రాచీన (ప్రాశ్చ) గ్రంథాలు దొరికే పుస్తకాలంగడి మంచిది ఏదీలేదు. లీప్‌జిగ్‌లో మాత్రం సంస్కృత పుస్తకాలంగడి ముద్రణాలయమూ వున్నాయి. ఆ దేశం దరిద్రంలో వుంది గాబట్టి అదికూడ సరిగా పనిచేయడంలేదని వినబడినాను. అనివార్య కారణాల వల్ల నేను అక్కడికి పోలేక పోయాను. ఆ అడ్రసుకూడా వ్రాయలేకపోయాను. లండనులో పెద్ద అంగడిఉంది. నీకు అవసరమయిన పుస్తకాలేవో వ్రాస్తే, అక్కడ విచారించి తెలియజేయగలను. అందువల్ల నాకుకలిగే శ్రమ ఏమిలేదు. సంతోషంగా చేస్తాను. నీకోసం. ఈ సంగతి మీచిన్నాయనకు చెప్పు. నన్ను కూడా గుర్తు చేయ్.

నేనింకా 9 టెర్ములు గడపాలిక్కడ. నేనింకా రెండవ టర్మ్ మధ్యలో వున్నాను. సంవత్సరానికి 3టర్ములు. ఇక్కడ పరీక్షలు సులభంగా వుంటాయేమోనని అనుకొంటున్నావేమో ? నాప్రాణాలు తోడేస్తున్నాయి. మనం అనుకోనేట్టు ఇండియాలో కంటే సులభంగా ఏమీలేవు . ఏదో పరీక్షలని పెట్టి డిగ్రీలు యిచ్చే విశ్వవిద్యాలయాలు ఏవయినా వున్నాయేమోగానీ, క్యాంబ్రిడ్జి, ఆక్స్‌ఫోర్డు, లండను విశ్వవిద్యాలయాలు మాత్రం సామాన్యమయినవి కావు. వాటిల్లో చేయవలసిన పని ఎక్కువ. నేను కూడ ఇండియాలో ఒక యూనివర్సిటీలో వున్నవాన్నే గదా. అక్కడ యూనివర్సిటీల విలువేమిటో నాకు తెలుసు. నిక్కచ్చిగా అలా చెబుతున్నందుకు క్షమించు.

మన విశ్వవిద్యాలయాలు వీటితో పోలిస్తే - ఫార్స్. మనం విద్యార్థులను ఫెయిల్ చేయడం గొప్పనుకొంటాము. అంతేగానీ, విద్యార్థులకు నిజమయిన విజ్ఞానాన్ని ప్రసాదించాలనుకోము. ఈ విశ్వవిద్యాలయాల వుద్దేశం స్వతంత్ర భావాలు కలిగించడమే. కొన్ని కారణాలవల్ల యిక్కడి ప్రజలంటే నాకు అసహ్యం. అయినా వారి దగ్గర నేర్చుకోవలసిన విషయాలున్నాయి. అక్కడ మనం అజ్ఞానంలో వున్నాం. అగాధాలలో పడుతున్నాం. నిష్పక్షపాతంగా ఏమాత్రం అతిశయోక్తి లేకుండా నీకిది వ్రాస్తున్నాను. మనదంతా బట్టీపెట్టేపద్ధతి.

ఇంకా నేను వ్రాయవలసింది ఏమీలేదు. ఏం వ్రాయాలో గూడ తెలియదు. ప్రత్యేకంగా నీవు తెలుసుకోవలసిందేమయినా ఉందా ? రాజకీయాలు పత్రికలలోనే ఉన్నాయికదా ?

మార్చి 15కు యీ టెర్మ్ ముగుస్తుంది. మూడవ టెర్మ్ ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు. తరువాత అక్టోబరు 13 వరకు వేసవి సెలవులు.

వేసవి సెలవుల్లో ఇండ్లికి రావచ్చు. ఈ దఫా మొత్తం తిరగాలి. గతసంవత్సరం ఎక్కువ కాలం ఒకచోటనే గడిపాను.

జర్మనీలో ఒకటి రెండుచోట్లు చూశాను. హాలండులో కొన్ని ముఖ్య ప్రదేశాలు చూశాను. ఈసారి చాలినంత డబ్బుంటే ఫ్రాన్సు, బెల్జియం, స్విట్జర్‌లాండు, యింకా వీలయితే ఆస్ట్రియా, ముస్సోలినీ ఇటలీకొంత, తరువాత క్రిస్మస్ పండుగకు ఐర్లండు యివన్నీ పూర్తిచేస్తాను.

వెంటనే జాబు వ్రాయి. ఎదురు చూస్తుంటాను.

మీ విశ్వాసపాత్రుడు

తొందరకు క్షమించు

దామోదర రెడ్డి

2

75 ఆక్స్‌ఫర్డ్ రోడ్డు,
21 ఫిబ్రవరి '24

మైడియర్ పాపన్న,

ఇలా గొకుతున్నందుకు క్షమించు. నేను తొందరలో వున్నాను. మెయిల్ ఇంకి అందుకోవాలి. ఒక ఉపన్యాసంకు హాజరవ్వాలి. 30 నిముషాల వ్యవధివుంది. వెళ్ళవలసిన దూరం 1½ మైలు. ఇందు వెంట కొన్ని వార్తా పత్రికల కటింగులు పంపుతున్నాను. నీకు పనికొస్తాయేమోనని. పనికిరాకుంటే చెత్తబుట్ట ఉండనేవుంది, గదా! ఇందులో నీకు ముఖ్యమయినవి ఏవయినావుంటే పంపడానికి నాకు సంతోషమే. అది ఎల్. ఎల్. బి. లేక బి. ఎల్. ఏదయినా కానీ, ఈసారి నీవు పాసవుతావని నా విశ్వాసం. అదంతానాకు అర్థమగా వ్రాయి. మరు తపాలుకే అలస్యం వద్దు.

మునలబ్బాయ్! నేనిక్కడ హాయిగా వున్నాను. ఒకప్పుడు నా ఫోటో అడిగావుకదూ! కొందికాలంలోనే పంపుతానులే. నా దగ్గిర యిప్పుడు లేదు కాబట్టి మాసంలోగా రాదు. ముందుగా నేను స్టూడియోకు వెళ్లాలిగదా! ఇలా అర్థాంతరంగా జాబు అల్లి బిల్లిగా వ్రాసి పడవేసినందుకు క్షంతవ్యున్ని. మరి మన అమీన్ సాహెబ్ (బి. నారాయణ రెడ్డి) ఎలాగున్నాడు? నన్ను గుర్తువెయ్. నేరస్థుంయెడ కొంతదయతో వుండమను. వెంటనే జాబు వ్రాయ్.

మీ ప్రేమాస్పదుడు,
దామోదర రెడ్డి

ఈ పై లేఖకూడ ఆంగ్లాను వాదమే. ఈ దామోదర రెడ్డిని గురించి ప్రతాప రెడ్డి రెండవ కుమారుడు శ్రీహరిశ్చంద్రారెడ్డి కొంత వివరంగా చెప్పాడు. అయినా మరిచిపోయినాను ఎక్కడో వ్రాసిపెట్టి వుంటాను. ఇక్కడ యింతకంటె ఎక్కువగా అవసరం లేదుగాబట్టి అన్వేషణాప్రయత్నం చేయలేదు. అయినా సురవరం ప్రతాప రెడ్డిగారు యాయనను గురించి వ్రాసిన యీ క్రింది పద్యం కొంత సమాచారం చెప్పగలదు.

మోదముగల్గె కొంతయిట పూర్వపు స్నేహితుడైన యట్టి దా
మోదర రెడ్డి గారలహముందమ మున్న (?) ను బాయకుండ న
త్యాదర వృత్తిలోమెలగ, అంగజు మామవు నీవు గాక మ
ర్యాదకు లోపమందు హృదయంబును రాయిగ చేసి వైచితే॥

ఈ దామోదర రెడ్డి లేఖలు యింతటితో ఆఖరు. ఇక మీదట కానరావు.

3

పి. ఆదినారాయణ శాస్త్రి
ప్రొప్రయిటరు
ఆర్యభారతి ప్రెస్ & ఆఫీసు

7 అర్మిగంగన్ స్ట్రీట్
వాషర్‌మేన్‌పేట
మెడ్రాస్ 19-3-1928

టు శ్రీయుతులు సురవరము ప్రతాపరెడ్డిగారు,
సంపాదకులు, గోలకొండ పత్రిక,
త్రూపు బజారు, హైదరాబాదు (దక్కన్)

ఆర్యులకు— అనేక నమస్కారములు.

తాము 8-3-28 వ తేదీన ఆంధ్రపత్రికా కార్యాలయమువారి అడ్రెస్సుతో నాకు రాయించిన ఉత్తరమును, వారు పంపగా యిప్పుడే చూచితిని. తమకు నేను ఈ విధముగా శ్రమకలిగించినవాడనైనందులకు చాల చింత నొందుచున్నాడను. అది వఱలో నాకు నా గ్రంథమును వి. పి.గా పంపుమని వ్రాసినట్లును నేను జవాబు నీయనట్లును వ్రాయించినారు. ఆ యుత్తరమును గూర్చి నాకేమియును తెలియదు. నా ముద్రించిన గ్రంథములు ప్రకృతము లభింపవు. మఱల ముద్రింప జాలను కారణము ద్రవ్యాభావము. కావున నిందులకును మన్నింప గోరెదను.

సోమ భూపాలుని గ్రంథమును నేను బ్ర॥ శ్రీ॥ మానవల్లి రామకృష్ణ కవి. ఎం. ఎ. గారి యొద్దనుండి పుచ్చుకొని కాపీ చేసికొన్నాను. మూల గ్రంథమును మరల వారికి ఇచ్చివైచినాను. ఇక నేను వ్రాసికొన్న వ్రాతప్రతి మాత్రమే కాకుండా కతక సూత్రములు మున్నగు మరికొన్ని వ్రాతప్రతులు సైతము దొరతనమువారు నాపై కేసుతెచ్చిన రోజులలో స్వాధీన పరచికొన్నారు. తర్వాతవారు కేసునుపసంహరించి కొన్న పిమ్మట (అనగా ఇప్పుడు కాత్యాయని సూత్రములపై ప్రభుత్వ నిషేధమేమియు లేదు) నా వ్రాత ప్రతులను[తిరిగి]ఇచ్చితిమని నామకార్థము వర్తించిరి. కాని అవి అన్నియు దిక్కులేకుండ పడ వేయుటచేత నానారీతుల భ్రష్టములై చివికి పోయినవి. పిమ్మట శేషించిన వానిని నా స్వగ్రామములో ఉంచినాను. ప్రస్తుతము నా యొద్ద ఆ తాలూకు ఏ ప్రతియునుగాని, ఏ మాత్రము గ్రంథ భాగముగాని ఇక్కడ హాజరుగాలేవు, కనుక ఈ విషయమును తమచిత్తమునకు తేగోరుచు మన్నింప వేడుకొను చున్నాను.

గద్వాలయందు లేక వనపర్తి ఆస్థానమునందు 4-5 ప్రతులు సోమ భూపాలుని గ్రంథముల ప్రతులున్నవి. శ్రీ॥ రా॥ కృ॥ కవిగారు చెప్పినారు. కవిగారు

ఇప్పుడు రాజమండ్రిలో గవర్నమెంటు ట్రైనింగు స్కూలులో ప్రొఫెసరుగా నున్నారు. వారికి తాము వ్రాసినను లేదా స్వయముగా తామే వారిని దర్శించినను (స్వయముగా దర్శించినచో త్వరగా కార్యసిద్ధి యగును.) వారు సరళహృదయులు కాబట్టి తమకు ఆ గ్రంథము నొసంగ గలరని నా విశ్వాసము.

రామకృష్ణ కవిగారినిగూర్చి లోకము ఈర్ష్యాళువు గనుక పరి పరి విధముల చెప్ప వచ్చును. కాని నా యెరిగినంత మట్టుకు ఆయన సరళ హృదయముగల సారస్వతా రాధకుడు. తప్పక తోడ్పడు స్వభావము కలవాడు.

చిత్తగింపుడు

పం॥ అ॥ శాస్త్రి

4

శేషాద్రి రమణ కవులు,

శతావధానులు

దానటోధకర్యస్థానము

హనుమకొండ

ఆర్యా! వందనములు

తమజాబు చేరినది. మీరు ప్రకటింపబోవు దశమవార్షిక సంచిక వాఙ్మయ సేవకమూల్యమగు ఉపకరణము కాగలదు. నేను వ్రాయు శాసనవ్యాసమునకు గొంతవ్యవధి అవసరము. తొలుత క్రొత్తశాసనము వెదకికొన వలయును. తరువాత విమర్శనము వ్రాయవలెను. ఐనను ప్రమత్తుడను గాక త్వరలో ముగించుటకు నేటినుండియే ప్రయత్నించు చుంటిని.

శుకసప్తతి తొలుత కాకినాడ సరస్వతి పత్రికవారు ముద్రించిరి. వావిళ్లవారు నేటివరకు ముద్రింపలేదని నా తలంపు. ఒక సంవత్సరమునకు ముందు ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికవారు శుకసప్తతి కృత్యాది వారి సాహిత్య పరిషత్పత్రికలో ప్రచురించిరి. నేను చదివి యుంటిని. తాము ఆ ప్రాత పత్రికల దీసినచో వివరములు తెలియును. మీ యొద్ద ఇంకా విశేషించి పద్యములు గలవా? చూడుడు. వెనుక గద్వాల సంస్థానమునుండి శుకసప్తతి మీరు గడించితిరి గదా? ఈ రెండు ప్రతులతో శుద్ధ ప్రతి వ్రాసిన బాగుండును. కాకినాడ ముద్రిత ప్రతిలో మూడు అశ్వాసములు పూర్తిగను, నాలుగవ అశ్వాసములో 9, 10 ఉపకథలు మాత్రము కలవు. మీయొద్ద కలపత్రికలో ఎక్కువ భాగమున్నచో దెలిపినచో మీ సంతోషమున భాగము పంచు కొందును.

వావిళ్ళవారితో కొన్ని కారణములచే సంబంధము తెగినది. అంతకుముందు వారి ప్రతి సంస్కరింపవచ్చునని మీతో జెప్పియుంటిని. ఒక వావిళ్ళ ప్రతి దీసికొని మీకడగల ప్రతితోబోల్చి విశేష పాఠములు విశేషభాగములు మూరు వ్రాసి యుంచుకొందము. తరువాత ప్రచురణమునుగూర్చి యోచింతుము. ఈ కార్యము మీరు చేసినసరి. లేదా నేను చేయుటకు సిద్ధముగా నున్నాను. తరువాతిపని సులభము. ఇది అవశ్యము కాదగినపని.

శాసనములు తీయుపద్ధతి.

శాసనము తొలుత గడుగవలెను. ఆరిన పిదప ఆ శిలపై సామాన్యమగు మందముగల తెల్లకాగితము నీళ్ళలో కొంచెము ముంచి అంచును నీరు కారునట్లు విదలించి తీసి జాతిపయి (వర్ణములుగల భాగముపై)వలచి బ్రష్షుతో జాగరూకతగా కొట్టినచో జాతిపయిని గల గుంటలయందును పై భాగమునందును కాగితము అంటుకొనును. లేవకుండ తడిచేసి అంటించుచుండవలెను. బ్రష్షుతో కొట్టినపిదప కాగితము తేమగ మందకయున్న స్పంజితో కాగితము తడుపుచుండవలెను. తరువాత కిరసనాయిలు మసితోగాని ఇంకొక రీతిగాగాని చేసిన సిరాతో వ్రాతపయి రాచి జాతిపయి మరల కొట్టిన కాగితముపయిన అద్దినచో ఇంప్రెషన్ వచ్చును. మీరు పోవుచోట శాసనములు ఎక్కువ యున్నవా? ఉన్నచో ఒకమాఱు నేను వచ్చితీసి చూపెద. లేదా పయిపద్ధతి ప్రకారముగా కాపీలు తీయుటయే అచరణమునందున్న పద్ధతి.

సంస్కృత గ్రంథపట్టిక కొఱకు నాపేరు సూచించి యుండుటకు కృతజ్ఞుడనేకాని వ్యవధి తక్కువగల నే నెందుకేని పనికివత్తునా? అయినను నా ధర్మము నెరవేర్తును. రాచకొండ ప్రయాణము ఏమయినది? సాగు సూచనలు కలవేని తెలుపుడు. లేదా ఒక యాత్ర అలంపూరునకేని పెట్టింపుడు. ఎప్పుడు నాలుగు గోడల మధ్య జీవితము చాల నిస్సారముగా గడుపుట కష్టముగానున్నది. జవాబు వ్రాయింపుడు.

చిత్తగింపుడు

దా॥ వేంకట రమణాచార్యులు

****

భారతికి రాసేవారికి మనవి!

- ★ భారతికి రాసేవారు కాగితానికి ఒక వైపునే పూర్తి తెలుగు లిపిలో నే రాయాలి. పూర్తి చిరునామా అవసరం.
- ★ రచనలని ప్రచురించటానికి స్వీకరిస్తే ఆ విషయం మేమే తెలియపరుస్తాము.
- ★ ప్రచురణకి స్వీకరించబడని రచనలని తిప్పి పంపాలని కోరుకొనే వారు తగినన్ని తపాలా బిళ్ళలు అంటించిన పూర్తి చిరునామా రాసిన కవరుని జత చేయవలసి ఉంటుంది. ఇలా కవరుని జత పరచని పక్షంలో రచనలని తిప్పి పంపటానికి కుదరదు. ఈ విషయంపై ఉత్తర ప్రత్యుత్తరాలకి అస్కారం లేదు.
- ★ శాసనాల గురించి వ్యాసాలు రాసే వారు తమ వ్యాసాలతో పాటు వాటికి సంబంధించిన ఛాయా చిత్రాలని కూడా జతపరచి పంపవలసి ఉంటుంది.
- ★ ప్రచురణకి స్వీకరించిన రచనలని మూడు, నాలుగు నెలలలోపు వీలునిబట్టి ప్రచురించడం జరుగుతుంది ఈలోగా ఉత్తరాలు రాస్తే ప్రయోజనం ఉండదు.
- ★ రచనలు పడ్డ భారతి ప్రతులని ఆయా రచయిత్రులకి రచయితలకి పంపడం తప్పనిసరిగా జరుగుతుంది. ప్రతులు అందలేదనీ మళ్ళీ పంపవలసిందని రాసేవారు ఈ అంశాన్ని గమనించగలరు.

–సంపాదకుడు

సిద్ధాంత వ్యాసముల పోటీ 1986

'నాచన సోమన – ఎఱ్ఱనల హరివంశ రచనము – తులనాత్మక పరిశీలన' అనే అంశం మీద అరటావు సైజులో 150 పేజీలకు మించని సిద్ధాంత వ్యాసాలను ఆహ్వానిస్తున్నాము ఉత్తమ వ్యాసానికి మూడు వేల రూపాయలు నగదు బహుమతి లభిస్తుంది పోటీదారులు మూడు వ్రాతప్రతులను కార్యదర్శి పేర క్రింది చిరునామాకు 31-1-1986 లోగా చేరేట్టు రిజిష్టరు పోస్టులో పంపగోరుతాము.

ధారా రామనాథశాస్త్రి

కార్యదర్శి

మామిడిపాలెం,

ఒంగోలు –523002

గ్రంథవిమర్శలు

పల్లె పొలిమేరల్లోకి (కవితాసంపుటి)

[గులాబీల మల్లారెడ్డి, వెల : రు. 5-00 లు, ప్రతులకు 1) గంగాధర్ (అడ్వకేటు) జగిత్యాల, 2) కృష్ణ (అడ్వకేటు) జగిత్యాల, 3) ఎడిటర్ మనుగడ; ఆఫీస్‌రోడ్, హుస్నాబాద్, 505 467 4) గులాబీల మల్లారెడ్డి, (అడ్వకేటు) లింగారెడ్డి భవన్, వావిలాలపల్లి. కరీంనగర్.]

"మానవుడు అనంతంగా దోపిడీ చేయబడుతూనే ఉన్నాడు. దోపిడీ నశించాలి. మనుషులందరూ స్వతంత్రులై ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమానత పొందాలని ఎన్నో కలలతో. ఆశలతో స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాము. కాని జరిగింది ఏమిటి? సమానత్వం వచ్చిందా? రూల్ ఆఫ్ లా దేశంలో పాటించ బడుతుందా? దేశంలో పోలీసులు, కోర్టులు ఆలోచన సరళి నడవడి ఏవిధంగా ఉంది? అని తోటి మనుష్యుల్ని ఆలోచింప చేయాలని ఈ కవితా సంపుటిని ప్రచు రిస్తున్నాను" అని తన మాటలో తన బాటను గురించి చెప్పాడు కవి. నిజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణా రైతాంగ పోరాటకాలంలో యూనియన్ పోలీసులచేత తీవ్రంగా హింసకుగురై, ఆ హింసయొక్క గుర్తుల్ని జీవితాంతం అనుభవించి అస్తమించిన తన తండ్రికి ఈ సంపుటిని అంకితమిచ్చి పితృఋణం తీర్చుకున్నారు ఈ కవి. నేనెవరో తెలుసా అనే ఖండికలో మానవత్వాన్ని ఈ కవి ఊహించిన తీరు కవితాశక్తికి నిదర్శనంగా ఉంది.

"సహనం గుడ్డకట్టినవాణ్ణి
శాంతి శాలువ కప్పుకొన్నవాణ్ణి
పూల పరిమళాన్ని నేను
పాల తెలుపును నేను
ఇంతకీ నాపేరు చెప్పనేలేదు
గౌతముడు నా రూపమే
జీసస్ నా ప్రతిరూపమే
గాంధీ నా వారసుడే
పేరు మానవత్వం ఊరు విశాలత్వం."

తెలంగాణాచేదు అనుభవాలే ఈయన కవిత్వానికి ఎక్కువశక్తి నిచ్చాయి అక్కడ జరిగిన దోపిడీలు, పోలీసులదౌర్జన్యాలు, పటేలులు, పట్వారీలు సాగించిన జులుం ఇవన్నీ ఈ కవికి ఇతివృత్తాలయ్యాయి. నడవడి అనే ఖండికలో పోలీసుల అకృత్యాలను ఈయన దృశ్యీకరించారు.

మనుషుల రక్తనాళాలు తెగిపడుతున్నవి
కండరాలు కీమాగా కొట్టబడుతున్నవి
ఎముకలు నుజ్జుగా మారుచున్నవి
ఒళ్ళు బొగ్గురాళ్ళ బీడుగా మారుతుంది
మనిషే బతికున్నశవంగా మారాదనివార్త
అయితేనేమి ఆ కామ్రేడు నడవడి
భావితరాల వాళ్ళకి రహదారి
మరి పోలీసుల నడవడి
యమదూతల పరవడిలో"

మల్లారెడ్డిగారి భావుకత పురోగమనశీలమైనది. వచన కవిత్వం రాసేటప్పుడు వచనాన్ని ముక్కలుగా పేర్చడంకవిత్వ బలహీనతకు తార్కాణం. వాక్యం కవితామయం కానప్పుడు వచనంగా చదవటానికైనా పేలవంగా ఉంటుంది. ఈయనలో ఈ బలహీనత ఎక్కువచోట్ల కనబడుతుంది. వాక్య నిర్మాణం ఒక్కొక్కప్పుడు భ్రష్ట గ్రాంధికంలోకి మారుతూ ఉండటం శబ్దంమీద కవికున్న అనధికారత్వాన్ని చాటుతుంది. మల్లారెడ్డిగారు ఈ లోపాలను సవరించుకొని మంచి వచన కవితా సంకలనాలు రాస్తారని ఆశ.

టి. ఎల్. కాంతారావు

పిఠాపుర సంస్థానము కవి పండిత పోషణ

[రచయిత్రి : డాక్టర్ సి. కమలా అనార్కలి. ప్రతులకు : రచయిత్రి పేర : పి. వి. ఆర్. ట్రస్ట్, డిగ్రీ కాలేజి కాకినాడ — అని వ్రాసేది. మూల్యం 60 రూ॥లు.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారి పి. హెచ్. డి. పట్ట పరీక్షకు సమ ర్పింపబడిన సిద్ధాంతవ్యాసము. నాలుగువందల ఏభైతొమ్మిది పుటల డెమ్మీసైజు గ్రంధరూపం ధరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థికసహాయం పొందింది.

పిఠాపుర నామ నిర్వచనం ఆద్యంతాలకు సంబంధించి సప్రమాణంగా ఉంది. పాదగయగా విఖ్యాతమైన పిఠాపురానికి ఇంకొక గొప్పతనం ఉంది. యోగి

శ్వరుడు దత్తాత్రేయుడు ఒక బ్రాహ్మణదంపతులకు జన్మించాడు'-శ్రీగురుచరిత్ర...

విద్వత్కవిగాయక పోషణలో పేరుపొందిన ఆంధ్రసంస్థానాలలో ఆనాడు అన్ని సంస్థాయిలో చెప్పదగినవే. కాలక్రమాన విజయనగరం, తరువాత పిఠాపురం గణనీయములూ, మననీయములున్నూ, మాననీయములున్నూ.

ఈ గ్రంథం ఆధునిక రచయితలకుకూడా అవశ్యం పఠనీయం. కళాశాలల్లో ఏవేవో చరిత్రలు చెప్తున్నట్టు వింటూవుంటాము. వాటికన్న ఇచట సంస్థానాల చరిత్రలు పాఠ్యగ్రంథాలుగా నిర్ణయిస్తే నేటి పట్టాదారులకు స్వదేశగౌరవం [illegible] తుందని నా అభిప్రాయం.

ఈ గ్రంథములో శ్రీ గంగాధర రామారావుగారు, సూర్యారావు బహద్దరు వారు విద్యామూర్తులుగ విద్యోపాసకుల మిత్రులుగా పోషకులుగా దర్శనమిస్తారు. వారిలోకూడా సూర్యారావు బహద్దరువారు అశేషమైన యశస్సు సంపాదించుకున్న మహానుభావుడు. ఆ యిద్దరూ ఆంధ్రజాతికి ఆరాధ్యపురుషులయిన తీరు కమలా అనార్కలి రచనలో ప్రత్యక్షరంలోనూ ప్రత్యక్షమౌతూఉంది. నిజానికి ఆ యిద్దరు ప్రభువులూ విద్యావతారపురుషులా! అని అనిపించి ఔననిపించిన ఉత్తమ స్థాయి రచనచేసి కమలా అనార్కలి చరితార్థురాలయింది. ఈనాడు సూర్యారావు బహద్దరు వారుంటే రచయిత్రికి సువర్ణపట్టం ఇచ్చి సత్కరించేవారు.

ఈ గ్రంథములో విశేషించి చెప్పవలసేది ఆయా కవుల గ్రంథాలను అంత లోతుగా పరిశీలించి చెప్పడం మెచ్చదగినదే. అలాగే గుణదోషాలను వివరించడంలో రచయిత్రి వైదగ్ధ్యం నిరూపితమయింది.

కొందరు కవులనుగూర్చి చెప్పడంలో ముందువెనుకలుగా చెప్పడం వక్త తొందరపాటయి ఉంటుంది.

కృష్ణశాస్త్రిగారు 'ఆకాశవాణి' విజయవాడ కేంద్రములో ఉద్యోగికాదని హైదరాబాదు కేంద్రములో అని అనుకుంటాను.



ఇలాటి నలుసులకేమిగా [illegible] ఇంగా, కూలంకషంగా, విస్తృతవిషయంగా, వ్రాసిన కమలా అనార్కలి సాహితీ పరిశ్రమ సకల జనాదరణీయం అని నా ఉద్దేశం.

ఈ గ్రంథ ముద్రణకి ఆర్థిక సహాయంచేసిన ఆంధ్రప్రభుత్వం ఉత్తమోత్తమ మైన పనిచేసిందని [illegible]దిస్తున్నాను.

యామిజాల పద్మనాభస్వామి

ప్రబంధ పరమేశ్వరుడు-ఎఱ్ఱన మహాకవి

డాక్టర్ ఆకొండి విశ్వనాథం, క్రౌన్‌పుటలు 64. వెల రూ. 6/- ప్రతులకు శ్రీమతి ఆకొండి అమరజ్యోతి బి.ఏ., వ్యవస్థాపక కార్యదర్శి విశ్వభారతి 'శ్రీరమణ నిలయం. సీతారామపురం, హిల్ కాలనీ, ఒంగోలు-523 001.

కవిత్రయములో నన్నయ తిక్కనల గూర్చి జరిగినంత పరిశోధన ఎఱ్ఱన గూర్చి జరగలేదనిపిస్తుంది. ఆ మహాకవి రచించిన గ్రంథాలుకొన్ని అలభ్యాలు కావటం దొరికిన అరణ్యపర్వాదులను నన్నయ తిక్కనల ప్రతిభా విశేషాలతో పోల్చి అల్పంగా భావించడం దీనికి కారణం కావచ్చు. ఇప్పటికైనా విశ్వనాథంగారి లాంటి సాహితీ మర్మజ్ఞులు ఎఱ్ఱనపేరున ఒక పీఠాన్ని స్థాపించి, పరిశోధనకు కృషిచేయటం ముదావహం. అట్టి కృషిలో ఒకభాగమే ఈ పుస్తక ప్రచురణ.

ఈ చిన్ని పుస్తకంలో నాలుగు భాగాలున్నాయి. మొదటిది ఎఱ్ఱన మహాకవి జీవిత సంగ్రహం. ఎఱ్ఱన తాతగారి తాతబోతననుంచి (1120 ప్రాంతం) ఒక కథా క్రమంగా చరిత్రాధారాలను లంకెపెడుతూ నడిపించినతీరు రచయిత ప్రజ్ఞకు ఒక గీటురాయి.

రెండోది పుస్తకనామధేయంగూర్చి సాగినచర్చ. ఎఱ్ఱన రచించిన గ్రంథాలలో తొలిది రామాయణమనీ తరువాత క్రమంగా హరివంశం, అరణ్య పర్వశేషం, నృసింహ పురాణం అనీ రచయిత అభిప్రాయం. అలాగే శంభుదాసని బిరుదాన్ని 'శివపదాబ్జ సంతతధ్యానసక్త చిత్తుఁడ' నేది పర్యాయపదంగా ఈయన భావించారు. ప్రబంధమంటే పూర్వాపరసంగతి (వెనుకముందులకలయిక) అని భారవి వ్యాఖ్యాన కర్త (కిరాతార్జునీయం-11స-46శ్లో) నిర్ణయించాడు. కాబట్టి పూర్వముగు భారతానికి పరముగు హరివంశం రచించి, పూర్వాపరసంగతి కల్పించి ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరుడయాడనే ఆకొండివారి వాదం యుక్తియుక్తంగా ఉన్నా పరిశీలనార్హం.

మూడోభాగంలో ఎఱ్ఱన జన్మస్థలంగా చెప్పబడుతున్న 'గుడ్లూరు' (ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకా) పుణ్యక్షేత్ర మహిమనుగూర్చి వివరిస్తూ వ్యాప్తిలో ఉన్నస్థల పురాణాలను పేర్కొన్నారువీరు. అక్కడి నీలకంఠేశ్వర, చెన్నకేశవాది ఆలయ విశేషాలను తెలిపి నేటి శిధిలావస్థకు బాధపడ్డారు.

చిట్టచివరిభాగం ఎఱ్ఱన పీఠావిర్భావానికి విశ్వనాథంగారు పడినశ్రమ, సాధించిన విజయం తెలియజెప్పేది.

ఈ పుస్తకం అటుక్షేత్రభక్తులకూ, ఇటు పరిశోధనా తత్పరులకు 'ఇన్‌ఫర్మేషన్'గా తీర్చిదిద్దబడడం విశేషం దీనికి ఎందరో కళాప్రపూర్ణులు అందించిన శుభాశీస్సులే నిదర్శనం.


డాక్టర్ విశ్వనాథంగారు ఇంకా ఇలాంటి పరిశోధన గ్రంథాలు వెలువరించాలనీ దానికి పీఠం ఒకవేదిక కావాలనీ ఆశిస్తున్నాను.


శివలెంక ప్రకాశరావు

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd, by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phone: 75667 & 61247.

చూపులకు సొగసైనది.
పనితనంలో సాటిలేనిది.

మౌలిమెక్స్
కెన్‌మోర్
మిక్సర్-కమ్-గ్రైండర్





ఇదే మీరెంతోకాలంగా ఎదురుచూస్తున్న అన్ని మంచి లక్షణాలతో ఉన్న మిక్సర్-కమ్-గ్రైండర్.

- రుబ్బటానికి, చిలకటానికి, ముక్కలు తరగటానికి పొడిచెయ్యటానికి అనువైన నాలుగు బ్లేడ్‌లు.
- సొంపైన ఎ.బి.ఎస్. ఆకృతి - కలకాలం మన్నేది.
- మూడు స్పీడ్‌లు గల స్విచ్.
- జీవితాంతపు సర్వీసుతో పాటు, 18 నెలల గ్యారంటీగల హెవీడ్యూటీ మోటార్ కలది.
- మీరు కావాలనుకుంటే జ్యూసర్ కోసం మరో అదనపు అమరిక.

మార్కెట్ చేయువారు :-

బౌలాకీ ట్రేడింగ్ కంపెనీ (ప్రై) లి.,

నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాద్ - 500 001 ఫోన్: 2[illegible]3206.

ఆంధ్రప్రదేశ్‌లోని
ముఖ్య
గృహోపకరణముల
డీలర్లందరి వద్ద
లభించును.

TARA/BTC/40/85/TEL.


అమృతాంజన్‌కే
తెలుసు
ఒంటి నొప్పులు
మరియు
బెణుకుల బాధ
మృదువైన మూలపదార్థము వల్ల
ఉపయోగించుట సులభము
క్రొత్త కార్కు అమరిక వల్ల
మందు శక్తికి రక్షణ
AMRUTANJAN
Pain Balm
AMRUTANJAN
PAIN BALM
AMRUTANJAN LTD
1984 ఒలింపిక్స్ క్రీడలలో
పాల్గొన్న భారత క్రీడాకారులకు
అధికారపూర్వకంగా పెయిన్ బామ్
సరఫరా చేసినవారు.
అమృతాంజన్
ఏ ఇతర బాధలు కల్గించని
శీఘ్ర నివారిణిని నమ్మండి
OBM 8777 TG